www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

నవ దంపతులను మింగేసిన రోడ్డు ప్రమాదం

కాళ్ల పారాణి కూడా ఆరకముందే మృత్యువాత

వరుడి తల్లిదండ్రులు, డ్రైవర్ అక్కడికక్కడే మృతి 3

ఫిబ్రవరి 29న వివాహం.. తర్వాత శ్రీవారి దర్శనానికి

తిరిగి వస్తుండగా ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

వధువు మినహా మృతులంతా తెలంగాణ వాసులే

డ్రైవర్ నిద్రమత్తు, అతి వేగమే కారణం: పోలీసులు



ఆళ్లగడ్డ వద్ద లారీని వెనుక నుంచి ఢీకొని నుజ్జునుజ్జయిన కారు

గురువారం | 7-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 322 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి రా. 1.21 తదుపరి త్రయోదశి; నక్షత్రం: ఉత్తరాషాఢ మ. 1.04 తదుపరి శ్రవణం; వర్జ్యం: సా. 4.40-6.06; దుర్ముహూర్తం: ఉ. 10.29-11.16; అమృతఘడియలు: ఉ.7.09-8.37; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.33; సూర్యాస్తమయం: 6.20 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జనసేన సీట్లు ఖరారు!

చంద్రబాబుతో పవన్ భేటీ.. గంటన్నర పాటు చర్చలు

విశాఖలో 4, తూర్పున 5, పశ్చిమలో 6, కృష్ణాలో 2

శ్రీకాకుళం, విజయనగరం, గుంటూరుల్లో ఒక్కోటి

ప్రకాశం, అనంత, చిత్తూరు, కడపల్లో కూడా..

పెందుర్తి, అమలాపురంపై కొనసాగుతున్న కసరత్తు

టీడీపీ ఆశావహులను పిలిపించి మాట్లాడుతున్న అచ్చెన్న

జనసేన అభ్యర్థులను గెలిపించాలని వినతి

అభ్యర్థుల ప్రకటనకు జనసేనాని సన్నాహాలు 11



పవన్‌ను తన నివాసంలోకి తోడ్కొని వెళ్తున్న చంద్రబాబు

‘పొత్తు’ పొడుపు!

బీజేపీ పిలుపుతో నేడు ఢిల్లీకి బాబు

అవసరమైతే రేపూ అక్కడే.. ఒకట్రెండు రోజుల్లోనే సీట్ల సర్దుబాటు

పవన్‌కూ పిలుపు.. తన అవసరం ఇప్పుడు లేదని భావిస్తున్న సేనాని?

బీజేపీ గెలవగలిగే సీట్లే ఇవ్వాలని బాబుకు టీడీపీ నేతల సూచన

నరసాపురం, తిరుపతి, అరకు ఎంపీ స్థానాలు ఇద్దామని ప్రతిపాదన

రాజమండ్రి, ఏలూరు, రాజంపేట సహా 5 సీట్లు కోరుతున్న బీజేపీ

11 అసెంబ్లీ స్థానాలు కూడా.. బాబుతో అవగాహన

కుదిరితే రేపో, ఎల్లుండో అభ్యర్థుల ఖరారు?

ఎన్డీయేలో టీడీపీ చేరిక కూడా.. హస్తినలో

ఏపీ బీజేపీ నేతలతో నడ్డా, అమిత్ షా చర్చలు

అమరావతి/న్యూఢిల్లీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ.. బీజేపీ మధ్య పొత్తు ఖరారైనట్లే! టీడీపీ, జనసేన కూటమిలోకి కమలం పార్టీ కూడా చేరనుంది. సీట్ల సర్దుబాటుపై చర్చించే నిమిత్తం టీడీపీ అధినేత చంద్రబాబును గురువారం ఢిల్లీ రావాలని బీజేపీ కేంద్ర నాయకత్వం ఆహ్వానించింది. పార్టీ నేతలు బుధవారం ఆయనకు ఫోన్ చేసి మాట్లాడినట్లు తెలిసింది. గురువారం ఆయన ఢిల్లీ వెళ్తున్నట్లు టీడీపీ వర్గాలు ధ్రువీకరించాయి. బీజేపీ పెద్దల పిలుపుతో ఆయన హస్తిన

మిగతా 11వ పేజీలో...

మైలవరం వసంతకే!

ఉమతో అచ్చెన్న చర్చలు 11

పి.గన్నవరం నుంచి వైదొలగిన మహాసేన రాజేశ్

ఎచ్చెర్లలో కళాకు వర్గపోరు.. గంటాకు చీపురుపల్లే!

కోవూరులో వేమిరెడ్డి సతీమణి ప్రశాంతి

టీడీపీ అభ్యర్థుల కసరత్తులో కీలక పరిణామాలు

విచిత్రాల విజన్!

‘విశాఖ’ పేరుతో జగన్ విన్యాసాలు

పదేళ్లలో 1.05 లక్షల కోట్లు ఖర్చు పెడతారట

అందులో 90 శాతం పాత ప్రాజెక్టులే!

అత్యధికం కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులే

ఇప్పటికే పూర్తయినవీ ‘విజన్’ ఖాతాలోనే

హెచ్‌పీసీఎల్ విస్తరణ, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులూ సొంతం చేసుకున్న జగన్

ఇనార్బిట్, భోగాపురం ఎయిర్‌పోర్టు, అదానీ డేటాసెంటర్‌కూ తన కలర్

జగనన్న కాలనీలు, టీడీపీ కట్టిన టిడ్కో ఇళ్లు కూడా ‘విజన్’లో భాగమే

రావాలి.. రాకపోతే కారణం చెప్పాలి!

అధికారుల నుంచి ఫోన్ల మీద ఫోన్లు

అంత చేసినా రాని పారిశ్రామికవేత్తలు

స్వయంగా హాజరైంది అతికొద్ది మందే

ఏయూ ప్రొఫెసర్ల హాజరుకు హుకుం

సూట్లు వేసుకుని తరలొచ్చిన అధ్యాపకులు

సచివాలయ సిబ్బందికీ డెలిగేట్ పాస్‌లు



మంగళవారం ర్యాడిసన్ హోటల్ ముందు డెలిగేట్ పాస్‌తో నిల్చున్న సచివాలయ సిబ్బంది

మాటలు తప్ప చేతలు ఎరుగని...
కూల్చడమే తప్ప కట్టడం తెలియని...

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ‘విజన్ విశాఖ’ పేరుతో మంగళవారం నిర్వహించిన సదస్సు మొత్తం జగన్నాటకమే అని విస్పష్టంగా రుజువైంది. సదస్సుకు సూటూబూటుతో వచ్చిన వారిలో అత్యధికులు పారిశ్రామికవేత్తలే కాదు. వాళ్లనూ వీళ్లను తెచ్చి కూర్చోబెట్టారు. ఇక... 1.05 లక్షల కోట్లతో జగన్ ప్రకటించిన ‘విజన్ విశాఖ’లో 90 శాతం ఎప్పుడో మొదలైన, పనులు జరుగుతున్న, ఎప్పుడో ప్రతిపాదించిన ప్రాజెక్టులే! వీటినే ‘విజన్’ అంటూ ఊదరగొట్టారు.

(విశాఖపట్నం - ఆంధ్రజ్యోతి)

‘విజన్’ అంటే భవిష్యత్ ప్రణాళిక! భవిష్యత్తును మార్చే వ్యూహం! కానీ.. జగన్ తీరే వేరు! ‘విజన్ విశాఖ’ పేరుతో ఆయన చిత్ర విచిత్ర విన్యాసాలు చేశారు. 40 నిమిషాల జగన్ ప్రసంగం, ఆపైన మరో 50 నిమిషాలు పవర్‌పాయింట్ ప్రజంటేషన్.. మొత్తంగా గంటన్నరలోనే ఈ సదస్సుకు తెర దించారు! విశాఖ నగరాభివృద్ధిపై చిత్తశుద్ధితో జరగాల్సిన చర్చను ఒక ప్రహసనంగా మార్చేశారు. పదేళ్లలో 1.05 లక్షల కోట్లు ఖర్చుపెట్టి విశాఖను అభివృద్ధి చేస్తామని జగన్ గొప్పగా ప్రకటించారు. అందులో 90 శాతం పాత ప్రాజెక్టులే . అందులోనూ అత్యధికం కేంద్ర ప్రభుత్వానికి చెందినవి! విశాఖపట్నం-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పనులు గత దశాబ్దకాలంగా జరుగుతున్నాయి. వాటిని కూడా సీఎం తన విజన్‌లో చేర్చేశారు. ఎప్పుడో టీడీపీ హయాంలోనే భూసేకరణ జరిగి, శంకుస్థాపన చేసుకున్న భోగాపురం విమానాశ్రయాన్ని కూడా

మిగతా 2వ పేజీలో...

తాకట్టుపై తడబాటు

సచివాలయం ‘అప్పు’పై సీఆర్డీఏ వింత సమాధానాలు

రూ.385 కోట్ల ప్రస్తావనే లేదు

ఎలా వచ్చాయో చెప్పని వైనం

ఐదేళ్లలో ప్రభుత్వం 4,207 కోట్లు ఇచ్చిందంటూ నోట్ 2



రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో హైదరాబాదీ మృతి 2

రష్యా సైన్యంలో సహాయకుడిగా చేరిన అఫ్సాన్ మృత్యువాత



ఐదేళ్లకే ఒకటో తరగతిలోకి!

ఆరేళ్లు నిండాలన్న కేంద్రం సూచన పక్కకు

పాత విధానమే కొనసాగుతుంది: మంత్రి బొత్స

పాఠశాలల గ్రాంట్లు విడుదల చేస్తామని హామీ

ఒంటిపూట బడులపై త్వరలో నిర్ణయం 11

ఉపాధ్యాయ సంఘాలతో చర్చల్లో మంత్రి



కోల్‌కతాలో నదీగర్భ మెట్రో రైల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

నదీ గర్భంలో
మెట్రో పరుగు

కోల్‌కతాలో నీటి అడుగున మెట్రో రైలు మార్గాన్ని జాతికి అంకితం చేసిన ప్రధాని

దేశంలోనే ఇలాంటిది తొలిసారి

కార్యక్రమానికి మమత దుమ్మా

కోల్‌కతా, మార్చి 6: దేశంలోనే తొలి నదీగర్భ సొరంగ మెట్రోరైలు మార్గాన్ని ప్రధాని మోదీ జాతికి అంకితం చేశారు. కోల్‌కతాలో హుగ్లీ నది అడుగున నిర్మించిన మెట్రో రైలు మార్గాన్ని బుధవారం ప్రారంభించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి ఎస్‌ప్లనేడ్ నుంచి హౌరా వరకు.. తిరిగి అక్కడి నుంచి ఎస్‌ప్లనేడ్‌కు మెట్రో రైలులో ప్రయాణించారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

మిగతా 2వ పేజీలో...

సందేశ్‌ఖాలీతో టీఎంసీ ఖాళీ!

ఈ తుఫాను బెంగాల్ అంతటా ఆవరిస్తుంది

నారీశక్తితో ఆ పార్టీ పతనం ఖాయం: ప్రధాని

అన్నదాతలతో ఎన్నికల ఆటలు!

పంటల బీమా పరిహారం ఎగ్గొట్టే ఎత్తుగడ

జూన్‌లో ఇస్తామంటూ ఓట్ల కోసం ఊరింపులు

1800 కోట్లకు ఎసరు పెట్టిన వైసీపీ ప్రభుత్వం

ఏడాదైనా 2022-23 వడ్డీ రాయితీ 450 కోట్లు

ఇవ్వకుండా జగన్ ‘రైతు సర్కారు’ వేధింపులు

33%లోపు పంట నష్టానికి సబ్సిడీ ఊసెత్తని వైనం

నిండా ముంచేశారని రైతన్నల ఆవేదన

33%పైన నష్టానికి సబ్సిడీ నిధులు విడుదల 12

ధాన్యంపై దగా

రైతులకు రూ.800 కోట్ల బకాయిలు

21 రోజుల్లో సొమ్ము చెల్లిస్తామని చెప్పి మోసం

మూడు నెలలుగా పైసా విదల్చని జగన్ సర్కారు

మద్దతు ధరకు ఆశపడి నిండా మునిగిన అన్నదాత

మోసం గురూ!

వెలిగొండ నీళ్లకు మళ్లీ ముహూర్తం!

జూన్, జూలైలో శ్రీశైలానికి వరదొస్తే ఇస్తారట.. గెలిచొచ్చి తానే విడుదల చేస్తానన్న జగన్

నీళ్లు ఇవ్వకుండానే ప్రాజెక్టు జాతికి అంకితం.. సభలో దళిత మంత్రి సురేశ్‌కు అవమానం

రెడ్డి వర్గీయుల కోసం కుర్చీలోంచి లేపేసిన వైనం.. రాజకీయ వేదికలా ప్రభుత్వ కార్యక్రమం



ఆ యువనేతే ఏ1?

తిరుపతిలో రెవెన్యూ అధికారి, పోలీసాఫీసరూ ఓట్ల దొంగలే

సహకరించిన సహకార చైర్మన్

ఆయన ఇంటే ఎపిక్ కార్డుల డౌన్‌లోడ్

కంప్యూటరు స్వాధీనం.. డేటా విశ్లేషణ!

కార్పొరేషన్‌లో పనిచేసిన అధికారి సోదరుడిపైనా నజర్ 2

షెడ్యూల్ వస్తే దర్యాప్తులో వేగం..

యువనేతకు కష్టాలే!.. పోటీకి అనర్హత చాన్స్

బొక్కుడులో గజకేసరి

అమ్మో ఎమ్మెల్యే



అప్పనంగా దోచేస్తున్న ఎమ్మెల్యే.. భూములు సెటిల్మెంట్‌కు వస్తే స్వాహానే

ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఆయన రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. సోదరుడు రాష్ట్ర స్థాయిలో కీలక పదవిలో ఉన్నారు. అయితే స్థానికంగా సెటిల్మెంట్లు, దందాలు చేయడంలో ఎమ్మెల్యే పేరే ఎక్కువగా వినిపిస్తుంటుంది. నియోజకవర్గంలో అన్ని వ్యవస్థలను తన కంట్రోల్‌లో పెట్టుకున్నారు. చీమ చిటుక్కుమన్నా ఆయనకు తెలియాల్సిందే.

సదరు నాయకుడు అక్రమార్జనకు నియోజకవర్గంలో అందుబాటులో ఉన్న ఏ ఆదాయ వనరునూ వదలరు. భూముల ‘వ్యవహారాల’ను సెటిల్మెంట్ చేయడంలో దిట్ట. ఇష్టారాజ్యంగా కొండలు తవ్వేస్తున్నారు. ఆయన కనుసన్నల్లో అడ్డగోలుగా ఇసుక తరలిస్తున్నారు. అవినీతి సంపాదనతో కోట్లు వెనకేసుకున్నారు. ఎన్నో అక్రమాలకు పాల్పడుతున్నా ఈ నేతకు మరోసారి టికెట్ ఖాయమైంది.

చౌకధరకు వందల ఎకరాలు సొంతం

బినామీల పేర్లతో రిజిస్ట్రేషన్లు

ప్రభుత్వ సొమ్ముతో పక్కనే రోడ్డు వేయించి భూముల ధరలు పెరిగేలా ఎత్తుగడ

ఇసుక, క్వారీ మాఫియాకు అండ

కాంట్రాక్టర్లు కమీషన్ ఇస్తేనే పనులు

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

గతంలో ప్రభుత్వ శాఖలో పనిచేసేవారు. సోదరుడి ప్రోద్బలంతో రాజకీయాల్లోకి వచ్చారు. రెండుసార్లు స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచారు. ఆ తర్వాత శాసనసభకు ఎన్నికయ్యారు. రాజకీయాల్లోనే కాదు అక్రమ సంపాదనలోనూ క్రమంగా ఎదిగారు. సెటిల్మెంట్లు చేయడంలో ఆయనకు సిద్ధహస్తుడిగా పేరుంది. వివాదాస్పద భూముల వ్యవహారాలైతే ఆయనకు పండుగే. బినామీల పేరిట వందలాది ఎకరాలు సొంతం చేసుకున్నారు. దేవదాయ శాఖతో వివాదంలో

మిగతా 12వ పేజీలో...

జమ చేశామన్న సొమ్మేదీ?

మా ఖాతాలో జమ కాలేదే?

కోర్టుకూ అబద్ధాలా.. ప్రభుత్వ తీరుపై హైకోర్టు విస్మయం

రూ.30 కోట్లు జమ చేసినట్టు ఎలా చెప్పారు?


ఏజీ చెప్పిన వివరాలను మేము నమ్ముతాం

దీనిపై ఎలాంటి వ్యాఖ్యలూ చేయదల్చుకోలేదు

కేంద్రం వాటా రూ.45 కోట్లకు రాష్ట్ర వాటా కలిపి

వారం రోజుల్లోగా మా ఖాతాలో జమ చేయండి

హైకోర్టు ఆదేశం.. విచారణ 13కి వాయిదా



అమరావతి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కోర్టు భవనాల నిర్మాణం, మౌలిక సదుపాయాల కోసం జమ చేయాల్సిన రూ.30 కోట్ల సొమ్ము ఎక్కడని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. గత విచారణ సందర్భంగా సొమ్ము జమచేశామని చెప్పారని... ఇప్పటికీ సొమ్ము తమ ఖాతాలోకి చేరలేదని వ్యాఖ్యానించింది. అసత్యాలు చెప్పడంపై విస్మయం వ్యక్తం చేసింది. అడ్వకేట్ జనరల్ చెప్పిన వివరాలన్నింటినీ

మిగతా 12వ పేజీలో...

ఆ యువనేతే ఏ1!

- తిరుపతిలో రెవెన్యూ అధికారి, పోలీసాఫీసరూ ఓట్ల దొంగలే
- పోటీకి అనర్హుడిగా ప్రకటించేందుకూ అవకాశం!

తిరుపతి (నేరవిభాగం), మార్చి 6: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల నాటి ఓటరు కార్డుల అక్రమ డౌన్‌లోడ్ వ్యవహారం కేసులో తిరుపతికి చెందిన అధికార పార్టీ యువనేత ప్రధాన నిందితుడు కానున్నారా? పోలీసు వర్గాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి అవునన్న సమాధానమే వస్తోంది. అప్పట్లో తిరుపతిలో పనిచేసిన రెవెన్యూ అధికారి, తిరుమల కొండపై నుంచి అధికార పార్టీకి అనుకూలంగా చక్రం తిప్పిన పోలీసు అధికారి కూడా బుక్ అయినట్టేనని ఈ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఓటరు కార్డుల డౌన్‌లోడ్ వ్యవహారంలో ప్రాథమికంగా ఇప్పటిదాకా 12-13మందిని కీలక నిందితులుగా దర్యాప్తు బృందం గుర్తించినట్టు సమాచారం. ఎన్నికల షెడ్యూలు వెలువడితే పోలీసు దర్యాప్తు తీరు మారుతుందనే ప్రచారం జరుగుతోంది. కేసు కనుక బలంగా నిలిస్తే ప్రధాన నిందితుడిగా దర్యాప్తు బృందం భావిస్తున్న యువనేత వచ్చే ఎన్నికల్లో పోటీ చేయకుండా కొంతకాలం నిషేధానికి గురయ్యే అవకాశాలున్నాయనే చర్చ నడుస్తోంది. తిరుపతి లోక్ సభ స్థానానికి 2021లో జరిగిన ఉప ఎన్నికలో నకిలీ ఓటరు కార్డులు ఉపయోగించి అధికార పార్టీ నేతలు దొంగ ఓట్లు వేయించారని అందిన ఫిర్యాదులపై ఎన్నికల కమిషన్ (ఈసీ) విచారణకు ఆదేశించింది. సుమారు 36 వేల ఓటరు కార్డులను కమిషన్ వెబ్‌సైట్ నుంచి ఎలాంటి క్లెయిమ్‌లు లేకుండా డౌన్‌లోడ్ చేసినట్టు వెల్లడైంది. తీవ్రంగా పరిగణించిన ఈసీ...నాటి మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, తిరుపతి అర్బన్ తహసీల్దారు, ఆ మండల ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ల సస్పెన్షన్‌కు ఆదేశించింది. ఈ క్రమంలో గత జనవరి 7న అప్పటి మున్సిపల్ కమిషనర్ హరిత...తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈఆర్వో నెట్ నుంచి ఓటరు కార్డులు డౌన్‌లోడ్ కావడానికి కారకులెవరో తేల్చాలని కోరారు. దీనిపై ఇప్పటివరకూ జరిగిన దర్యాప్తులో తిరుపతిలో అధికార పార్టీకి చెందిన ముఖ్య యువనేత సూత్రధారిగా గుర్తించినట్టు సమాచారం. ఆయన పాత్రను నిర్ధారించుకునేందుకు సాంకేతిక కోణంలో దర్యాప్తు సాగించాల్సి ఉందని చెబుతున్నారు. ఏయే కంప్యూటర్ల నుంచీ ఎపిక్ కార్డులు డౌన్‌లోడ్ అయ్యాయో తేల్చడానికి ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ నుంచీ వివరాలు రాబట్టాల్సి ఉంది. అలాగైతే కార్డులు డౌన్‌లోడ్ చేసిన కంప్యూటర్ల ఐపీ అడ్రస్ తెలుస్తుంది. దాన్నిబట్టి ఆ కంప్యూటర్లను గుర్తించి స్వాధీనం చేసుకోవడానికి, హార్డ్ డిస్క్ ద్వారా డేటా సేకరించడానికి అవకాశముంటుంది. ఆ కంప్యూటర్లను ఉపయోగించిన వారిని కూడా గుర్తించి నిందితులుగా చేర్చడానికి వీలుంటుంది. ఈ ప్రక్రియ కోసం పోలీసు అధికారులు ఈసీకి లేఖ రాసినట్టు సమాచారం.

1000 నుంచి 1200 కార్డుల డౌన్‌లోడ్

అధికార పార్టీకి చెందిన ఓ సహకార సంస్థ ఛైర్మన్ ఇంట్లోనే ఓటరు కార్డుల డౌన్‌లోడ్ తతంగం కొంతమేరకు జరిగినట్టు తెలిసింది. సుమారు వెయ్యి నుంచి 1200 కార్డులు డౌన్‌లోడ్ చేసినట్టు గుర్తించిన దర్యాప్తు బృందం...ఆ ఛైర్మన్ నుంచి సంబంధిత కంప్యూటర్ సిస్టమ్‌ను స్వాధీనం చేసుకుని అందులోని డేటాను విశ్లేషిస్తున్నట్టు సమాచారం. ఓటరు కార్డులు డౌన్‌లోడ్ చేశాక వాటితో నకిలీ కార్డులు తయారుచేసిన వ్యవహారంలో తిరుపతి కార్పొరేషన్‌లో పనిచేసిన ఓ ముఖ్య అధికారి సోదరుడి పాత్రపై తిరుపతి రాజకీయ, పోలీసు వర్గాల్లో విస్తృత ప్రచారం సాగుతోంది. అయితే ఆశ్చర్యకరంగా ఈ కోణంలో పోలీసు దర్యాప్తు జరగడం లేదని సమాచారం. సదరు అధికారి సోదరుడు యువనేతకు అత్యంత సన్నిహితుడని, స్వయంగా కాంట్రాక్టరుగా ఉంటూ, కాంట్రాక్టు వ్యవహారాల్లో యువనేత వాటాల వ్యవహారాలు చక్కబెడుతూ ఉంటారనే పేరుంది. నకిలీ ఓటరు కార్డుల కోసం యువనేత వెంట చెన్నైకు పలు పర్యాయాలు వెళ్లి వచ్చారని, తిరుపతికే చెందిన ఓ సాఫ్ట్‌వేర్ టెకీని కూడా తీసుకెళ్లినట్టు సమాచారం. ఇపుడు కాకున్నా భవిష్యత్తులో కేసు దర్యాప్తులో ఇతని పాత్ర నిర్ధారణ కావడం ఖాయమని కూడా ప్రచారం జరుగుతోంది.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో హైదరాబాదీ మృతి

హైదరాబాద్ సిటీ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ఇరుక్కుపోయిన హైదరాబాద్ యువకుడు మహ్మద్ అఫ్సాన్(30) మరణించాడు. దళారుల మాయమాటలు నమ్మిన అఫ్సాన్ రష్యా సైన్యంలో సహాయకుడిగా చేరాడు. ఉక్రెయిన్ సరిహద్దులో రష్యా సైన్యంతో కలిసి పని చేస్తూ ప్రాణాలు కోల్పోయాడు. నాంపల్లిలోని బజార్‌ఘాట్ ప్రాంతానికి చెందిన అఫ్సాన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అఫ్సాన్ మరణించాడని, అతని మృతదేహాన్ని స్వదేశానికి పంపేందుకు ప్రయత్నిస్తున్నామని మాస్కోలోని భారత రాయబార కార్యాలయం బుధవారం ప్రకటించింది. అఫ్సాన్ కుటుంబసభ్యులతో మాట్లాడామని పేర్కొంది. కానీ, అఫ్సాన్ ఎలా మరణించాడో వెల్లడించలేదు. దీంతో రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ఇరుక్కుపోయి ప్రాణాలు కోల్పోయిన భారతీయుల సంఖ్య రెండుకు చేరింది. గుజరాత్‌కు చెందిన హమిల్(23) వారం రోజుల క్రితం ప్రాణాలు కోల్పోయాడు. అఫ్సాన్ మరణంపై రాయబార కార్యాలయం నుంచి తమకు ఫోన్ వచ్చిందని అతని సోదరుడు ఇమ్రాన్ సాహిల్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. మృతదేహాన్ని స్వదేశానికి రప్పించేందుకు సాయం చేయాలని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని కోరామన్నారు.

కెఫేలో బాంబు సూత్రధారి ఆచూకీ తెలిపితే రూ.10 లక్షల నజరానా

- ఎన్ఐఏ ప్రకటన

బెంగళూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు రామేశ్వరం కెఫేలో బాంబు పేలుడు సూత్రధారి ఆచూకీ తెలిపితే రూ.10 లక్షల నగదు బహుమతి ఇస్తామని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ప్రకటించింది. ఈ మేరకు బుధవారం అనుమానితుడి ఫొటోను ఎన్ఐఏ 'ఎక్స్'లో షేర్ చేసింది. సూత్రధారి గురించి తెలిపిన వారి వివరాలు రహస్యంగా ఉంచుతామని పేర్కొంది. మార్చి 1న నగరంలోని రామేశ్వరం కెఫేలో టైమర్‌తో కూడిన బాంబు పేలుడులో 10 మంది గాయపడిన విషయం తెలిసిందే. 30-35 ఏళ్ల వ్యక్తి టిఫిన్‌కు టోకెన్ తీసుకుని వాష్‌బేసిన్ వద్ద బ్యాగును వదిలి వెళ్లిన కాసేపటికి పేలుడు సంభవించింది. కేసు నమోదు చేసిన ఎన్ఐఏ అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.


అనుమానితుడు

టీకా వీరుడు!



- 217 సార్లు కొవిడ్ వ్యాక్సిన్ వేయించుకున్న జర్మన్ వృద్ధుడు
- అయినా ఆయన రోగనిరోధక వ్యవస్థ భేష్: పరిశోధకులు

మ్యూనిక్, మార్చి 6: కరోనా భయంతో చాలా మంది రెండు డోసులు టీకా వేయించుకున్నారు! భయం ఎక్కువైనవారు మూడో డోసు టీకా కూడా తీసుకున్నారు! కానీ.. జర్మనీకి చెందిన 62 ఏళ్ల వృద్ధుడు 29 నెలల వ్యవధిలో ఏకంగా 217 సార్లు కరోనా టీకా వేయించుకున్నాడు. ఆయన గురించి స్థానిక పేపర్లలో వచ్చిన వార్తలను చూసి జర్మనీ, ఆస్ట్రియా పరిశోధకులు కొందరు ఆశ్చర్యపోయారు.అది నిజమో కాదో తెల్చుకునేందుకు దర్యాప్తు చేయగా.. 9 నెలల వ్యవధిలో ఆయన 130సార్లు వేయించుకున్నట్టు రికార్డుల్లో నమోదైంది. తాను నిజంగానే 217సార్లు వ్యక్తిగత కారణాలతో వ్యాక్సిన్ వేయించుకున్నానని ఆయన చెబుతున్నాడు. ఇన్నిసార్లు టీకా వేయించుకున్న ఆయన రోగనిరోధక వ్యవస్థపై పరిశోధకులు పరిశీలన చేశారు. ఆయన ఆరోగ్యం, రోగనిరోధక వ్యవస్థ భేషుగ్గా ఉండడం చూసి ఆశ్చర్యపోయారు. ఆయన శరీరం కరోనా మహమ్మారికి మరింత మెరుగ్గా యాంటీబాడీలను ఉత్పత్తి చేస్తుండడం చూసి నివ్వెరపోయారు. ఎందుకంటే.. టీకా అంటే ఒక వైరస్‌లోని కొంతభాగాన్ని శరీరంలోకి పంపించి, రోగనిరోధక వ్యవస్థను అప్రమత్తం చేయ డం. తద్వారా ఆ వైరస్ ఎప్పుడైనా మనకు సోకితే.. అప్పటికే దాన్ని గుర్తించి సిద్ధంగా ఉన్న మన ఇమ్యూనిటీ ఆ వైరస్‌పై దాడి చేసి చంపేస్తుంది. కానీ అదే టీకాను పదేపదే వేస్తే రోగనిరోధక వ్యవస్థలోని టి-సెల్స్ అలసిపోతా యి. ఫలితంగా.. నిజమైన వైరస్ మన శరీరంలోకి ప్రవేశించినప్పుడు దాన్ని ఎదుర్కోవడానికి అవసరమైన 'ప్రో-ఇన్‌ఫ్లమేటరీ మెసెంజర్ సబ్‌స్టాన్సెస్'ను చాలా తక్కువగా ఉత్పత్తి చేస్తాయి. దీంతో వైరస్‌ను ఎదుర్కోలేక రోగనిరోధకవ్యవస్థ చేతులెత్తేస్తుంది. కానీ.. జర్మన్ వృద్ధుడి విషయంలో ఇందుకు విరుద్ధంగా జరుగుతోందని, మూడు డోసులు వేయించుకున్నవారి కంటే కూడా ఎక్కువగా ఆయన శరీరంలో కరోనాకు యాంటీబాడీలు ఉత్పత్తి అవుతున్నాయని పరిశోధకులు గుర్తించారు. ఆయన్ను పరీక్షించే క్రమంలో వారే మరోసారి టీకా వేసి మరీ ఆయన శరీరంలో టి-సెల్స్ స్థాయిలను పరిశీలించగా.. ఆ టీకాలకు సదరు వృద్ధుడి శరీరం భేషుగ్గా స్పందిస్తున్నట్టు తేలింది.



సందేశ్‌ఖాలీతో టీఎంసీ ఖాళీ!

- ఈ తుఫాను బెంగాల్ అంతటా ఆవరిస్తుంది
- నారీశక్తితో ఆ పార్టీ పతనం ఖాయం: ప్రధాని

బారాసాత్, మార్చి 6: నారీశక్తితో బెంగాల్లోని మమతా బెనర్జీ సారథ్యంలోని పాలక టీఎంసీ పతనం ఖాయమని ప్రధాని మోదీ అన్నారు. నదీతీర ద్వీపం సందేశ్‌ఖాలీలో ఆ పార్టీ నేతల అఘాయిత్యాలు రాష్ట్రంలో, దేశంలో మహిళలను ఆగ్రహోదగ్రులను చేసిందని.. బెంగాల్‌వ్యాప్తంగా వరించిన ఈ తుఫాను ధాటికి టీఎంసీ అంతరిస్తుందని స్పష్టం చేశారు. బుధవారం ఆయన కోల్‌కతాలో హుగ్లీ నదీగర్భంలో నిర్మించిన మెట్రో రైలును జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బారాసాత్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా మమత సర్కారు తీరుపై విరుచుకుపడ్డారు. సందేశ్‌ఖాలీలో మహిళలపై అఘాయిత్యాలు సిగ్గుచేటన్నారు. అక్కడి మహిళలపై టీఎంసీ నేత షాజహాన్ షేక్, ఆయన అనుచరుల లైంగిక వేధింపులు, భూకబ్జాలను ప్రస్తావిస్తూ.. బాధిత మహిళల పక్షాన నిలవకుండా నేరగాళ్లకే మమత సర్కారు దన్నుగా ఉందని ధ్వజమెత్తారు. మహిళల రక్షణ కంటే బుజ్జగింపు రాజకీయాలకే ప్రాధాన్యమిస్తోందన్నారు. 'టీఎంసీ నేతలు పేద దళిత, గిరిజన మహిళలు, సోదరీమణులపై అత్యాచారాలు సాగిస్తున్నారు. ఇది చూసి బెంగాల్, భారత మహిళలు రగిలిపోతున్నారు. ఈ తుఫాను బెంగాల్ మొత్తం ఆవరించి టీఎంసీని భూస్థాపితం చేస్తుంది' అని హెచ్చరించారు. ఒకప్పుడు మహిళల సాధికారతకు బెంగాల్ దిక్సూచిగా నిలిచిందని.. ఇప్పుడు టీఎంసీ పాలనలో మహిళలపై ఘోర అత్యాచారాలు జరుగుతున్నాయి. సందేశ్‌ఖాలీలో జరిగిన ఘటనలు సమాజాన్ని తలదించుకునేలా చేస్తున్నాయి. కానీ మహిళల దుఃఖం టీఎంసీ ప్రభుత్వానికి పట్టదు. పైగా నేరగాళ్లను కాపాడుతోంది. కోర్టులు జోక్యం చేసుకున్నా.. నిందితుల అరెస్టును అడ్డుకుంటోంది. అందుకే మొదట కలకత్తా హైకోర్టులో, తర్వాత సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బలు తగిలాయి' అని చెప్పారు. మహిళల రక్షణకు కేంద్రం హెల్ప్‌లైన్ ప్రారంభించిందని.. అత్యాచార నేరాలకు మరణశిక్ష విధించే సెక్షన్లు తీసుకొచ్చిందని గుర్తుచేశారు. ఈ హెల్ప్‌లైన్ బెంగాల్లో అమలు కాకుండా మమత సర్కారు అడ్డుకుందన్నారు. ఇలాంటి మహిళా వ్యతిరేకత ప్రభుత్వం మహిళలకు ఎప్పటికీ న్యాయం చేయదని స్పష్టం చేశారు. బెంగాల్‌కు టీఎంసీ గ్రహణం పట్టిందన్నారు. ప్రజలు విపక్ష 'ఇండియా' కూటమిని తిరస్కరించి బీజేపీకి ఓటువేయాలని పిలుపిచ్చారు. తనకు కుటుంబం లేదని ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ చేసిన వ్యాఖ్యలను మోదీ మరోసారి ప్రస్తావించారు. 140 కోట్ల మంది భారతీయులు తన కుటుంబమేన్నారు. 'ఎన్డీఏ వరుసగా మూడోసారి కూడా అధికారంలోకి రావడం ఖాయమని గ్రహించి.. నాపై వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారు. కుటుంబ రాజకీయాలు, బంధుప్రీతికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నాననే దూషిస్తున్నారు' అని తెలిపారు. బెంగాల్ అభివృద్ధికి తన ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని.. కోల్‌కతా మెట్రో ప్రారంభోత్సవమే దీనికి నిదర్శనమని తెలిపారు.


మెట్రో రైలు ప్రారంభించి.. అందులో ప్రయాణిస్తున్న మోదీ

బాధిత మహిళలతో భేటీ

బారాసాత్ పరిధిలోని సందేశ్‌ఖాలీలో షాజహాన్, ఆయన అనుచరుల దురాగతాలకు బలైన ఐదుగురు బాధిత మహిళలతో మోదీ ఈ సందర్భంగా సమావేశమయ్యారు. వారిని దుర్గామాతలుగా అభివర్ణించారు. వారికి న్యాయం జరిగేలా చేస్తామని, రక్షణ కల్పిస్తామని హామీఇచ్చారు. 'మా బాధలను ఓ తండ్రి లా ఆయన ఓపిగ్గా విన్నారు. మా పేర్లు, మా ఊళ్ల పేర్లు అడిగారు. ఆందోళన చెందవద్దని.. నేరగాళ్లపై మా పోరాటాన్ని గౌరవిస్తున్నానని ఆయన చెప్పారు' అని ఓ మహిళ ఆ తర్వాత మీడియాకు తెలిపారు.

నదీ గర్భంలో మెట్రో పరుగు

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు. తూర్పు-పశ్చిమ కారిడార్‌లో భాగంగా 4.8 కిలోమీటర్ల పొడవున ఈ రైలు సొరంగ మార్గాన్ని రూ.4,960 కోట్లతో నిర్మించినట్టు అధికారులు తెలిపారు. ఈ మెట్రో కారిడార్ పనులను 2009లో ప్రారంభించారు. ఈ రైలు మార్గం మొత్తం పొడవు 16.6 కిలోమీటర్లు. అందులో సుమారు 10.8 కిలోమీటర్లు భూగర్భంలోనే ఉంటుంది. మిగిలిన మార్గాన్ని భూఉపరితలంపై నిర్మించారు. ఈ మార్గంలో 6 మెట్రో స్టేషన్లు ఉండగా, అందులో మూడు భూగర్భంలోనే ఉన్నాయి. దేశంలోనే అత్యంత లోతైన మెట్రో స్టేషన్ కూడా దీనిలోనే ఉంది. భూమికి సుమారు 32 మీటర్ల అడుగున హౌరా మెట్రో స్టేషన్‌ను నిర్మించారు. నది అడుగున 520 మీటర్ల దూరం ప్రయాణానికి 45 సెకన్లు మాత్రమే పడుతుంది. ఈ మెట్రో రైళ్లలో అత్యాధునిక ఏటీవో(ఆటోమేటిక్ ట్రైన్ ఆపరేషన్) వ్యవస్థను ఏర్పాటుచేశారు. తొలి రెండు కిలోమీటర్ల దూరానికి రూ.5 చార్జీ నిర్ణయించారు. గరిష్ఠ చార్జీ రూ.50. కాగా.. ఎస్ప్లనేడ్ మెట్రో స్టేషన్ నుంచి బెంగాల్‌లోని మరికొన్ని రైల్వే ప్రాజెక్టులను, దేశంలోని వివిధ నగరాల్లోని మెట్రో ప్రాజెక్టులను కూడా ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులన్నిటి విలువ సుమారు రూ.15,400 కోట్లు.

ఇస్రో.. టార్గెట్ 25

- చంద్రుడిపై మరిన్ని ప్రయోగాలు
- జాబిల్లిపైకి భారత వ్యోమగామిని పంపే లక్ష్యం
- ఇస్రో ఛైర్మన్ సోమనాథ్

విజయవాడ కల్చరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష ప్రయోగ సంస్థ (ఇస్రో) చేపట్టాల్సిన ప్రయోగాలకు సంబంధించి 25 ఏళ్ల కాలానికి దార్శనిక పత్రాన్ని రూపొందించామని ఆ సంస్థ ఛైర్మన్ ఎస్ సోమనాథ్ వెల్లడించారు. చంద్రుడిపై మరిన్ని ప్రయోగాలు చేయాలని, జాబిల్లిపైకి భారత వ్యోమగామిని పంపాలని ఈ పత్రంలో పొందుపరిచామని చెప్పారు. దీంతో పాటు శుక్రుడు, అంగారకుడుపై కూడా ప్రయోగాలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో బుధవారం సాయంత్రం జరిగిన డాక్టర్ పిన్నమనేని, సీతాదేవి ఫౌండేషన్ 30వ వార్షికోత్సవంలో సోమనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు డాక్టర్ పిన్నమనేని, సీతాదేవి ఫౌండేషన్ పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చంద్రయాన్-3 విజయం వెనుక కొన్ని తరాల కృషి ఉందని.. ఆ ఫలితాన్ని తాము అనుభవిస్తున్నామని వెల్లడించారు. ఇస్రోలో అనేక మంది గొప్ప శాస్త్రవేత్తలు పనిచేశారని, వాళ్లే తనకు గురువులు, మార్గదర్శకులు అని చెప్పారు. ఇస్రోలో తాను తొలుత ఎస్ఎల్వీ, ఆ తర్వాత పీఎస్ఎల్వీ, ఎల్ఎస్ఎం ప్రాజెక్టుల్లో పనిచేశానని, ఈ మూడు ప్రాజెక్టుల్లో కలిగిన అవగాహన, స్ఫూర్తి, కృషి చంద్రయాన్-3 విజయవంతం కావడానికి కారణమయ్యాయని చెప్పారు.చంద్రుడిపై నీటి జాడలను ప్రపంచంలో తొలిసారిగా కనుగొన్నది మనమేనని స్పష్టం చేశారు. తాను ఎల్వీఎం-3 ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఉన్నప్పుడు రాకెట్‌ను డిజైన్ చేశానని చెప్పారు.

తాకట్టుపై తడబాటు

సచివాలయం 'అప్పు' వ్యవహారంపై సీఆర్డీఏ వింత సమాధానాలు

- రూ.385 కోట్ల ప్రస్తావనే లేదు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఓ సినిమాలో రాజకీయ నేత పాత్రధారి అన్నింటికీ 'ఖండిస్తున్నాం' అని ఒకే మాట చెబుతారు. అంతేకానీ ప్రశ్నలకు సమాధానాలు మాత్రం చెప్పరు. ఇప్పుడు సీఆర్డీఏ తీరు కూడా అచ్చం అలాగే ఉంది. రాష్ట్ర సచివాలయం తాకట్టు వ్యవహారం విషయంలో ఇలాగే వ్యవహరిస్తోంది. రాష్ట్ర సచివాలయాన్ని తాకట్టు పెట్టి ప్రభుత్వం రూ.370 కోట్లు అప్పు తీసుకున్నట్టు 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. సీఆర్డీఏ పీడీ ఖాతా నుంచి రూ.385 కోట్లు మాయమైనట్టు మరో కథనం ప్రచురించింది. సీఆర్డీఏ పీడీ ఖాతా నుంచి మాయమైన రూ.385 కోట్లు, సచివాలయం తాకట్టు పెట్టగా వచ్చిన ఆ రూ.370 కోట్లు ఒక్కటేనా అన్న సందేహం వ్యక్తం చేసింది. దీనికి సీఆర్డీఏ నుంచి సమాధానం లేదు. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'తాకట్టు కనికట్టు' కథనాన్ని ఖండిస్తున్నామని నోట్ విడుదల చేసిన సీఆర్డీఏ.. 'ఆంధ్రజ్యోతి' ఎత్తిచూపిన ఒక్క ప్రశ్నకు కూడా సమాధానం చెప్పలేదు. రూ.385 కోట్లు ఎలా వచ్చాయన్న దానికి నేరుగా సమాధానం చెప్పలేదు. గత ఐదేళ్లలో ప్రభుత్వం రూ.4,207 కోట్లు ఇచ్చిందని, ఖర్చు పెట్టకుండా మిగిలిపోయిన సొమ్మును వెనక్కి తీసుకుందని వెల్లడించింది. సీఆర్డీఏ నోట్ ద్వారా ఇచ్చిన వివరణలో జవాబులు దొరక్కపోగా మరిన్ని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రభుత్వం నిధులిస్తే సీఆర్డీఏ ఖర్చు పెట్టకముందే, ప్రభుత్వమే ఎందుకు వెనక్కి తీసేసుకుంది? సాధారణంగా ఆర్థిక సంవత్సరం చివరి రోజుల్లో మాత్రమే ఇలా ఖాతాల్లో ఖర్చుకాకుండా మిగిలిన డబ్బును ప్రభుత్వం ల్యాప్స్ చేస్తుంది. కానీ, సీఆర్డీఏ ఖాతాలోని డబ్బులు ఆర్థిక సంవత్సరం పూర్తి కాకముందే ఎందుకు మాయమయ్యాయో? అంతేకాదు ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు లభించడం లేదు.

మళ్లీ ఎందుకడిగారో?

పీడీ ఖాతాల్లో మిగిలిపోయిన డబ్బును మాత్రమే నిబంధనల ప్రకారం ప్రభుత్వం తీసుకోవడం నిజమైతే.. అన్ని శాఖల్లోనూ ఇది అత్యంత సర్వసాధారణమైతే.. 'మాకు తెలియకుండా, మేము ఎలాంటి బిల్లులు పెట్టకుండానే రూ.385 కోట్లు పోయాయి. తిరిగి జమ చేయండి' అని సీఆర్డీఏ ప్రభుత్వానికి ఎందుకు లేఖ రాసినట్టు? సీఆర్డీఏ ఖర్చు పెట్టని డబ్బునే కదా ప్రభుత్వం తీసుకుంది. అలాంటప్పుడు జమ చేయమని మళ్లీ ఎందుకు అడిగారు? ప్రభుత్వం వేల కోట్ల డబ్బులిస్తున్నా వాటిని ఎందుకు ఖర్చు పెట్టడం లేదు? మిగిలిపోయిన డబ్బును నిబంధనల ప్రకారమే ప్రభుత్వం తీసుకుంటుంటే తిరిగి ఎస్క్రో ఖాతాలోకి వేయమని ఎందుకు అడుగుతున్నారు? సీఆర్డీఏకు నిధులు మిగులుతుంటే, బడ్జెట్ నుంచి అదనంగా రూ.438 కోట్లు కేటాయించాలని ఎందుకు అడిగారు?



అమరావతి రైతులకు కౌలు ఏదీ?

సీఆర్డీఏకు నిధులు మిగిలి, తిరిగి ప్రభుత్వానికే అప్పు ఇస్తున్న పరిస్థితులు నిజంగా ఉంటే.. అమరావతి రైతులకు 2023 మే నెలలో ఇవ్వాల్సిన కౌలు ఇంకా ఎందుకు వేయలేదు?

రేటింగ్ ఎందుకు తగ్గిందో?

సీఆర్డీఏకు నిజంగా నిధులు మిగులుతుంటే, సీఆర్‌డీఏ బాండ్లకు సంబంధించి క్రెడిట్ రేటింగ్ ఎందుకు తగ్గుతోంది? డీఎస్ఆర్ఏ, బీఎస్ఏల్లో వడ్డీ చెల్లింపులకు సరిపడా డబ్బు లేదని, ఇన్వెస్టర్లకు ఇది నష్టదాయకమంటూ ప్రముఖ సంస్థ క్రిసిల్, మరో సంస్థ అక్యూట్ రేటింగ్ తగ్గిస్తే.. సీఆర్డీఏ ఎందుకు స్పందించలేదు? 'మా దగ్గర డబ్బులున్నాయి. మిగిలిపోతున్నాయి' అని క్రిసిల్‌కి, అక్యూట్‌కి ఎందుకు చూపించలేకపోయారు?

ఖర్చు పెట్టని డబ్బును ప్రభుత్వం కుదిస్తుంది: సీఆర్డీఏ

ఏపీసీఆర్డీఏ అప్పులు, వడ్డీల చెల్లింపులకు, ఇతర ఖర్చులకు ప్రభుత్వం సహాయక గ్రాంటు ఇస్తోందని ఆ సంస్థ పేర్కొంది. ఐదేళ్లలో రూ.4,207 కోట్లు ప్రభుత్వం ఇచ్చిందని వెల్లడించింది. ప్రభుత్వం విడుదల చేసిన నిధులలో ఖర్చు కాకుండా మిగిలిన సొమ్మును నిబంధనల మేరకు కుదిస్తుంటుందని తెలిపింది. ఇలా తగ్గించిన మొత్తాలను తిరిగి ఇవ్వడం కోసం ప్రతి ఏటా ప్రభుత్వ శాఖలు కోరుతుంటాయని పేర్కొంది. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన 'తాకట్టు కనికట్టు' వార్తను ఖండిస్తున్నామని సీఆర్డీఏ బుధవారం నోట్ విడుదల చేసింది.

అప్పులు ఎందుకు కట్టలేదు?

అప్పులు కట్టాలంటూ 2023 ఫిబ్రవరిలో బ్యాంకు అధికారులు విజయవాడలోని సీఆర్డీఏ కార్యాలయంలో తిష్ఠ వేస్తే... సీఆర్‌డీఏ ఉన్నతాధికారులు ఆ చాయలకు కూడా రాకుండా మొహం చాటేశారెందుకు?

ఒక్కోదానిపై ఒకోలా

'తాకట్టులో సచివాలయం' వార్త అవాస్తమంటూ ఇచ్చిన నోట్‌లో అకౌంట్స్ డైరెక్టర్ వివరణ ఇచ్చినట్టుగా రాశారు. కానీ దానిపై స్టాంపు వేసి, గ్రీన్ ఇంక్‌తో సంతకం చేయలేదు. 'తాకట్టు కనికట్టు' వార్తను ఖండిస్తున్నామంటూ ఇచ్చిన నోట్‌లో మాత్రం స్టాంపు వేసి, గ్రీన్ ఇంక్‌తో సంతకం చేసి మరీ ఇచ్చారు.

ఆ బిల్లుల సంగతేంటి?

సీఆర్డీఏ పరిధిలో పనిచేసిన కాంట్రాక్టర్లు, వెండర్ల బిల్లులు దాదాపు రూ.5,500 కోట్ల వరకు పెండింగ్ ఉన్నాయి. జగన్ అధికారంలోకి వచ్చిన రెండో ఏడాది ఈ బిల్లులన్నింటినీ ల్యాప్స్ చేశారు. ఇంతవరకు తిరిగి సిస్టమ్‌లోకి తీసుకురాలేదు. మిగిలిపోతున్న డబ్బులతో ఈ బిల్లులు ఎందుకు చెల్లించడం లేదు? సీఆర్డీఏ దగ్గర మిగులు నిధులు ఉంటే టీడీపీ హయాంలోనే 90 శాతం పూర్తయిన ఐఏఎస్, ఐపీఎస్ క్వార్టర్లు, 75 శాతం పూర్తయిన ఉద్యోగుల క్వార్టర్లను ఎందుకు పూర్తి చేయలేదు? ఆ ప్రాజెక్టుకు ఎన్పీఏ అయ్యేంత దుస్థితి ఎందుకు కల్పించారు? ఇప్పుడు ఆ క్వార్టర్లు పూర్తి కావాలంటే రూ.1100 కోట్లు అవసరం. 'రూ.560 కోట్లు మా డబ్బే ఉంది. ఇంకో రూ.438 కోట్లు ఎస్బీఐలోని సీఆర్డీఏ ఎస్క్రో ఖాతాలో వేయండి' అని ప్రభుత్వాన్ని ఎందుకు అడుగుతున్నారు?

విచిత్రాల 'విజన్'!

(మొదటి పేజీ తరువాయి)

'విజన్' కిందే చేర్చారు. విశాఖపట్నం పోర్టు సబ్బవరం నుంచి షీలానగర్ వరకు, షీలానగర్ నుంచి పోర్టు వరకు సాగరమాల కింద కేంద్రం రూ.1550 కోట్లతో నిర్మిస్తున్న రహదారి పనులకూ విజన్ రంగు పులిమారు. ఎన్టీపీసీ సంస్థ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్ట్‌కు రూ.20,225 కోట్లు వెచ్చిస్తుండగా, అది కూడా తన పనితనమే అని జగన్ బిల్డప్ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలకు చెందిన హెచ్‌పీసీఎల్ విస్తరణ, రాంబిల్లి ప్రాజెక్టులను కూడా తన ఖాతాలో వేసుకున్నారు. ఇవన్నీ ఇప్పటికే ప్రారంభమై పూర్తయ్యే దశలో ఉన్నాయి.

వీఎంఆర్‌డీఏ నుంచి రూ.394 కోట్ల ప్రాజెక్టులు

వీఎంఆర్‌డీఏ అధికారులు చెప్పి చెప్పి నోరు నొప్పి పెట్టి వదిలేసిన ప్రాజెక్టులను ఇప్పుడు సీఎం జగన్ తన 'విజన్ విశాఖ'లో ప్రకటించడం గమనార్హం. సిరిపురంలో మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ భవనాన్ని రూ.87.5 కోట్లతో నాలుగేళ్లుగా నిర్మిస్తున్నారు. దానిని భవిష్యత్తు ప్రణాళికలో చూపించారు. హిస్టరీ పార్కుకు అధికారంలోకి వచ్చిన కొత్తలో రూ.108 కోట్లతో ఆయనే శంకుస్థాపన చేశారు. ఇప్పటిదాకా దాని డీపీఆర్ తయారు కాలేదు. కైలాసగిరిపై ప్లానిటోరియం అని ప్రకటించి చాలా కాలమైంది. కొత్తగా కన్వెన్షన్ సెంటర్‌కు రూ.220కోట్లతో నోటిఫికేషన్ ఇచ్చారు. ఇది ఒక్కఅడుగు కూడా ముందుకు పడలేదు. ఈ రెండింటినీ ఇప్పుడు 'విజన్'లో చూపించారు.

జగనన్న కాలనీలు అందులోనే...

పేదలకు ఇచ్చిన జగనన్న కాలనీలు, టిడ్కో ఇళ్లు, మధ్య తరగతి ప్రజలకు స్మార్ట్ టౌన్‌షిప్స్... అన్నీ విజన్‌లో చూపించారు. వాటి విలువ రూ.4,039 కోట్లుగా పేర్కొన్నారు. విశాఖపట్నం పోర్టు వద్ద లీజుకు తీసుకున్న భూమిలో ఏర్పాటవుతున్న ఇనార్బిట్ మాల్‌ను కూడా తమ ఖాతాలో వేసుకొని... దానికి రూ.750 కోట్లు వ్యయంగా చూపించారు. గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్ పేరుతో రూ.500 కోట్లు చూపించారు. అది ఎక్కడో ఎవరికీ తెలియదు. గత నాలుగేళ్లుగా చెబుతున్నట్లుగానే... నగరంలో 12 ఫ్లైఓవర్లకు రూ.1,233 కోట్లు ఖర్చు చేయనున్నట్టు వెల్లడించారు.

బతిమాలి... బెదిరించి...

విశాఖకు ఏదో చేశామని, చేస్తామని ఎన్నికల ముందు చెప్పుకోవడానికే 'విజన్ విశాఖ' సదస్సు ఏర్పాటు చేశారు. దీనికి పారిశ్రామిక వేత్తలను తీసుకొచ్చే బాధ్యతను జిల్లా యంత్రాంగానికి అప్పగించారు. దీంతో... సోమవారమే ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి, 'మంగళవారం తప్పకుండా రండి' అని కోరారు. ఇక... కలెక్టర్ కార్యాలయం నుంచి పారిశ్రామికవేత్తలకు ఫోన్లు చేశారు. ఒకొక్కరికి మూడేసి కాల్స్ వెళ్లాయి. ఏపీఐఐసీకి చెందిన అధికారులు కూడా వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్‌లు పెట్టారు. 'పాస్‌లు సిద్ధంగా ఉంచుతాం. తప్పకుండా వస్తారు కదా! కన్‌ఫర్మ్ చేయండి' అని పదేపదే కోరారు. చాలామంది తాము రావడం లేదని చెప్పగా... 'ఎందుకు? ఏమిటి?' అని ప్రశ్నించారు. కొందరు ఆరోగ్యం బాగా లేదని, కొందరు ఊళ్లో లేమని చెప్పారు. మరికొందరు... 'కారణం ఎందుకు చెప్పాలి?' అని ఎదురు ప్రశ్నించారు. తాము ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వాలని, అందుకే కారణాలు అడుగుతున్నామని ఫోన్లు చేసిన సిబ్బంది వాపోయారు.

ఇంత చేసినా అరకొరే...

ర్యాడిసన్ హోటల్‌లో జరిగిన 'విజన్' సదస్సుకు అతికొద్దిమంది పారిశ్రామిక వేత్తలు మాత్రమే స్వయంగా సదస్సుకు హాజరయ్యారు. చాలామంది తమ కార్యాలయ సిబ్బందిని, సంస్థ పీఆర్వోలను తమ ప్రతినిధులుగా పంపించారు. పారిశ్రామికవేత్తల నుంచి తగిన స్పందన రాకపోవడంతో అధికారులు హడలెత్తిపోయారు. 'హాలు నిండినది' అనిపించుకునేందుకు నానా తంటాలు పడ్డారు. 'సూట్లు వేసుకుని సీఎం ప్రోగ్రామ్‌కు వెళ్లండి' అని ఉన్నతాధికారులు ఆదేశించడంతో ఆంధ్రా యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్లు పెద్దసంఖ్యలో సూటూ బూటు వేసుకుని ర్యాడిసన్ హోటల్‌కు విచ్చేశారు. కేటరింగ్‌లు నడిపేవారిని, పర్యాటకులకు కార్లు అద్దెకు ఇచ్చేవారిని, రియల్ ఎస్టేట్‌లో ప్లాట్లు విక్రయించే వారిని కూడా 'పారిశ్రామికవేత్తలు'గా పరిగణించి సీట్లలో కూర్చోబెట్టారు. అయినా హాలు నిండకపోవడంతో... వార్డు సచివాలయ సిబ్బందికి కబురు పంపారు. మధురవాడ సచివాలయ సిబ్బంది హోటల్ బయటే ఉండి... పాస్‌లు అందించి లోపలికి పంపించారు. ఒక స్వీట్ దుకాణం యజమానికి, మరో ఫంక్షన్ హాల్ యజమానికి పాస్‌లు జారీ చేసి సదస్సుకు అనుమతించడం కనిపించింది. వారిని గుర్తుపట్టిన కొందరు 'వారు పారిశ్రామికవేత్తలా?' అని ఆశ్చర్యపోయారు. 'ఎన్నికల తర్వాత విశాఖకు వచ్చేస్తా. ఇక్కడే ప్రమాణ స్వీకారం చేస్తా' అని జగన్ ప్రకటించినప్పుడు ఎవరూ పెద్దగా స్పందించలేదు. అతి తక్కువ మంది మాత్రమే చప్పట్లు కొట్టారు. సదస్సు ముగిసిన తర్వాత 'ఈయన విశాఖకు వచ్చి చేసేదేమిటో' అని చాలామంది గొణుక్కుంటూ వెళ్లిపోయారు.



కోడికత్తి టవర్స్

విశాఖలో నిర్మిస్తామంటూ ముఖ్యమంత్రి జగన్ చెప్పిన 'ఐకానిక్ సచివాలయం' గ్రాఫిక్ ఒకవైపు! రెండు 'కోడి కత్తులను' కలిపిన ఫొటో మరోవైపు! జగన్ చెబుతున్న ఐకానిక్ సచివాలయానికి 'కోడికత్తి టవర్' అని పేరు పెట్టి సోషల్ మీడియాలో తెగ తిప్పేస్తున్నారు.



శివలింగాన్ని పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి

పల్నాడులో సహస్ర లింగం

విజయవాడ కల్చరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చేజర్ల కపోతేశ్వరాలయ ప్రాంగణంలో సున్నపురాతిపై చెక్కిన తొలి సహస్ర లింగాన్ని గుర్తించారు. ఈ విషయాన్ని పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. దేశంలో తొలి సహస్ర లింగం ఇదేనని వివరించారు. ఆరడుగుల ఎత్తుతో పల్నాడు సున్నపురాతిపై చెక్కిన శివలింగంపై 25 నిలువు వరుసలు ఉన్నాయి. ఒక్కో వరుసలో 40 చిన్న శివలింగాల చొప్పున 1000 శివలింగాలు ఉన్నాయి. అసలు శివలింగంతో కలిపితే 1001 శివలింగాలు ఉన్నాయి. దీన్ని ఏకోత్తర సహస్ర లింగం అంటారని శివనాగిరెడ్డి వివరించారు.

నవ దంపతులను మింగేసిన రోడ్డు ప్రమాదం



నవదంపతులు బాలకిరణ్, కావ్యశ్రీ

కాళ్ల పారాణి కూడా ఆరకముందే మృత్యువాత

- వరుడి తల్లిదండ్రులు, డ్రైవర్ అక్కడికక్కడే మృతి
- ఫిబ్రవరి 29న వివాహం.. తర్వాత శ్రీవారి దర్శనానికి
- తిరిగి వస్తుండగా ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు
- వధువు మినహా మృతులంతా తెలంగాణ వాసులే
- డ్రైవర్ నిద్రమత్తు, అతి వేగమే కారణం: పోలీసులు







లారీని కారు ఢీకొన్న దృశ్యం, డ్రైవర్ అశోక్, వరుడి తల్లిదండ్రులు రవీందర్, లక్ష్మి(ఫైల్)

ఆళ్లగడ్డ, మార్చి 6: కాళ్ల పారాణి ఆర లేదు. ఇళ్లకు కట్టిన తోరణాల కళ వాడ లేదు. వివాహ వేడుక సంబరాల సంతోషం నుంచి ఆ కుటుంబం బయటకురానేలేదు. అప్పటి వరకు ఆటపాటలతో సంతోషంగా ఉన్న వారి ఇంట పెను విషాదం చోటుచేసుకుంది. కారు డ్రైవరు నిద్రమత్తు, అతివేగం కారణంగా నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో నవదంపతులు సహా మరో ముగ్గురు సంఘటనా స్థలంలోనే దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో నలుగురిని తెలంగాణ వాసులుగా పోలీసులు గుర్తించారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ సమీపంలోని నల్లగట్ల గ్రామం వద్ద 40వ నెంబర్ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున లారీని ఓ కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో నవదంపతులు బాలకిరణ్(30), కావ్యశ్రీ(28), వరుడి తల్లిదండ్రులు మంత్రి రవీందర్(55), లక్ష్మి(49) సహా డ్రైవర్ అశోక్(23) అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో ముగ్గురు సికింద్రాబాదు ఈస్ట్ వెంకటాపురానికి చెందిన వారుకాగా, డ్రైవర్ అశోక్ నాగర్‌కర్నూలు వాసి. మంత్రి రవీందర్, లక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు బాలకిరణ్‌కు గత నెల ఫిబ్రవరి 29న గుంటూరు జిల్లా తెనాలికి చెందిన గోవర్ధనరావు, నాగ వరలక్ష్మి దంపతుల పెద్ద కుమార్తె కావ్యశ్రీతో వివాహం జరిగింది. వివాహం అనంతరం తిరుమల శ్రీవారి దర్శనార్థం మంగళవారం తెనాలి నుంచి తిరుపతికి వెళ్లారు. అక్కడ స్వామివారి దర్శనం చేసుకుని మారుతీ సుజుకి కారులో అదే రోజు రాత్రి 11:30 గంటలకు తిరుపతిలో బయలు దేరారు. వీరి కారు నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం నల్లగట్ల గ్రామం వద్ద ప్రమాదవశాత్తు ఆగి ఉన్న లారీని బుధవారం తెల్లవారుజామున 5:30 గంటలకు వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నవదంపతులు బాలకిరణ్, కావ్యశ్రీ, వరుడి తల్లిదండ్రులు రవీందర్, లక్ష్మి, డ్రైవరు అశోక్ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంతనాయక్, పోలీసు సిబ్బంది, హైవే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను ఆళ్లగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు రవీందర్ కుమారుడు ఉదయ్‌కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉండటం, కారును అతివేగంగా నడుపుతుండడమే ప్రమాదానికి కారణం కావొచ్చని ప్రాథమికంగా నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరాక

సికింద్రాబాద్ ఈస్ట్ వెంకటాపురంలో కిరాణా షాపు నిర్వహిస్తూ జీవనం చేస్తున్న మంత్రి రవీందర్, లక్ష్మి దంపతులకు ముగ్గురు సంతానం. వీరిలో పెద్దకుమారుడు బాలకిరణ్‌కు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చింది. అతనికి తెనాలిలో టైలర్‌గా పని చేస్తున్న గోవర్ధనరావు, నాగ వరలక్ష్మి దంపతుల పెద్దకుమార్తె కావ్యశ్రీతో ఫిబ్రవరి 29న ఘనంగా వివాహం జరిపించారు. ఘటన సమాచారం తెలుసుకున్న వధువు తల్లిదండ్రులు ఆసుపత్రికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఏపీ సెట్ దరఖాస్తు గడువు పెంపు

విశాఖపట్నం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు ఏప్రిల్ 28వ తేదీన నిర్వహించే ఏపీ సెట్-2024కు దరఖాస్తు గడువును ఈ నెల 14వ తేదీ వరకు పొడిగించినట్టు ఏపీ సెట్ మెంబర్ సెక్రటరీ ప్రొఫెసర్ జీఎంజే రాజు తెలిపారు. విద్యార్థులు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. రూ.2 వేల అపరాధ రుసుముతో మార్చి 25 వరకు, రూ.5 వేల అపరాధ రుసుముతో ఏప్రిల్ ఐదో తేదీ వరకు దరఖాస్తుకు అవకాశముందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

మంత్రి ఎస్కార్ట్ వాహనం ఢీకొని ఒకరి మృతి

- ప్రమాదంలో మరొకరికి తీవ్రగాయాలు
- పట్టించుకోకుండా వెళ్లిపోయిన ఆదిమూలపు సురేష్
- మృతుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ గ్రామస్థుల రాస్తారోకో



ప్రమాదానికి కారణమైన మంత్రి సురేష్ ఎస్కార్ట్ వాహనం



ధ్వంసమైన ఆటో



మృతుడు ఇజ్రాయేల్

త్రిపురాంతకం, మార్చి 6: మంత్రి ఆదిమూలపు సురేష్ కాన్వాయ్‌లోని ఎస్కార్ట్ వాహనం ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం కేశినేనిపల్లి సమీపంలో ఎన్‌హెచ్-544డీపై బుధవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. త్రిపురాంతకానికి చెందిన షేక్ మీరావలి దోర్నాలలోని తన బంధువుల ఇంటికి వెళుతూ తన స్నేహితుడైన రాజుపాలెంకు చెందిన నార్నెపాటి ఇజ్రాయేల్‌ను వెంట తీసుకెళ్లారు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో కేశినేనిపల్లి వద్ద వారు ప్రయాణిస్తున్న ఆటోను విజయవాడ నుంచి మార్కాపురం వస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్ కాన్వాయ్‌లోని ఎస్కార్ట్ వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇజ్రాయేల్(21) అక్కడికక్కడే మృతిచెందాడు. మీరావలికి తీవ్రగాయాలయ్యాయి. ఆటో పూర్తిగా ధ్వంసమైంది. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ప్రమాదస్థలానికి చేరుకుని మృతదేహాన్ని వై.పాలెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తీవ్ర గాయాలైన మీరావలిని మార్కాపురం వైద్యశాలకు, అనంతరం మెరుగైన వైద్యం కోసం బంధువులు ఒంగోలుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. కాగా ప్రమాదంలో మృతిచెందిన ఇజ్రాయేల్ కూలి పనికి వెళితేనే కుటుంబ పోషణ జరిగే పరిస్థితి. చేతికందొచ్చిన కొడుకు రోడ్డుప్రమాదంలో మృతిచెందడంతో అతని తల్లిదండ్రులకు ఆసరా కరువైంది. మరోవైపు.. కాన్వాయ్‌లోని వాహనం ఢీకొని ఒకరు మృతిచెంది, మరొకరు తీవ్రగాయాల పాలైనా మంత్రి సురేష్ ఆగకుండా, కనీసం పరామర్శించకుండా వెళ్లిపోవడం పట్ల తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా.. ఇజ్రాయేల్ కుటుంబానికి న్యాయం చేయాలంటూ బుధవారం రాత్రి రాజుపాలెం గ్రామస్థులు హైవేపై మృతదేహంతో రాస్తారోకో చేపట్టారు.



కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ శేషసాయి, జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ కె.మన్మథరావు, జస్టిస్ బీఎస్ భానుమతి, జస్టిస్ జ్యోతిర్మయి తదితరులు

మహిళా గౌరవంతోనే పురోగతి

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి

అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మహిళలను గౌరవించే సంస్థలు, వ్యవస్థలు మాత్రమే పురోగమిస్తాయని ఏపీ న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వహక అధ్యక్షులు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పని ప్రదేశాలలో మహిళల హక్కులపై రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఏపీ హైకోర్టు ఆవరణలోని న్యాయవాదులు సంఘం హాలులో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జస్టిస్ ఏవీ శేషసాయి హాజరై ప్రసంగించారు. ఇటీవల అన్ని రంగాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతోందన్నారు. వారికి రక్షణ కల్పించడం ద్వారా మరింత పురోగాభివృద్ధి సాధించవచ్చన్నారు. పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పిస్తూ చట్టాలు వచ్చాయన్నారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ కె.మన్మథరావు, జస్టిస్ బీఎస్ భానుమతి, జస్టిస్ జ్యోతిర్మయి మాట్లాడుతూ.. న్యాయవ్యవస్థలో ఇటీవల మహిళల పాత్ర పెరిగిందన్నారు. లక్ష్యాలు నిర్దేశించుకొని మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జానకిరామిరెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.నాగిరెడ్డి, న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి మజ్జి బబిత, హైకోర్టు న్యాయసేవా సంఘం కార్యదర్శి జి.మాలతి, న్యాయసేవాధికార సంస్థ పరిపాలనాధికారి హెచ్.అమరరంగేశ్వరరావు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీలో జగన్ గాలి తగ్గింది

కాంగ్రెస్‌కు లీడర్లు లేరు, కేడర్ లేదు: చింతా మోహన్

న్యూఢిల్లీ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఏపీలో సీఎం జగన్ గాలి తగ్గిందని కాంగ్రెస్ నేత చింతా మోహన్ అన్నారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఢిల్లీ ఏపీభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మోహన్ మాట్లాడుతూ.. కరువు వల్ల రాయలసీమలో రాళ్లు, తొండలు పెట్టిన గుడ్లు తప్ప మరేమీ లేవన్నారు. రాయలసీమ సమస్యల పరిష్కారానికి తిరుపతిని రాజధానిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. తిరుపతిలో లక్ష ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయని, కండలేరు, సోమశిల వల్ల రాజధానికి అవసరమైన నీళ్లు ఉన్నాయన్నారు. కాంగ్రెస్‌కు ఓటేయాలని ప్రజలు అనుకుంటున్నా తమ పార్టీకి లీడర్లు లేరని, కేడర్ లేదని చింతా మోహన్ అన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఎన్నికల ఫలితాలు వెలువడిన దాదాపు నెలరోజులకు పాకిస్థాన్‌లో ఏర్పడిన కొత్త ప్రభుత్వాన్ని చూసినవారికి ఇంతకీ అక్కడ ఏం మారిందన్న అనుమానం కలిగేవుంటుంది. గతంలో ఇమ్రాన్ ఖాన్‌ను గద్దెదించేసి, ఎన్నికలు జరిగేంతవరకూ దేశాన్ని ఏడాదిన్నరపాటు ఏలినవారే ఇప్పుడు మళ్ళీ అధికారంలోకి వచ్చి కూర్చున్నారు. నవాజ్‌షరీఫ్ పార్టీ, భుట్టోల పార్టీ రోజుల తరబడి చర్చోపచర్చలు జరిపి, ఎట్టకేలకు ఒక అవగాహనకు రావడంతో అధికశాతం ప్రజలు కోరుకున్న ఇమ్రాన్ ఖాన్ పార్టీని అధికారానికి దూరం పెట్టడంలో సైన్యం పైచేయి సాధించింది. గతంలో తాను ప్రతిష్ఠించిన ప్రభుత్వమే మళ్ళీ అధికారంలోకి వచ్చినందున ఇకమీదట కూడా తెరవెనుకనుంచి సైన్యమే చక్రం తిప్పుతుందని అర్థం.

ప్రధాని కావాలనుకున్న నవాజ్ షరీఫ్ మళ్ళీ తన సోదరుడినే అధికారంలో కూచోబెట్టి తాను పక్కకు తప్పుకున్నారు. కేంద్రంలో ఈ రెండుపార్టీలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే, పంజాబ్‌కు నవాజ్ షరీఫ్ కుమార్తె ముఖ్యమంత్రి, సింధ్‌లో పీపీపీ, ఇమ్రాన్‌ఖాన్ పార్టీనుంచి స్వతంత్రులుగా గెలిచివచ్చినవారు ఖైబర్‌ఫక్తుంక్వా ప్రావిన్సులో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇమ్రాన్ సన్నిహితుడి స్థానంలో బెనజీర్ భుట్టో భర్త ఆసిఫ్ అలీ జర్దారీ దేశాధ్యక్షుడు కాబోతూండటం, ఇమ్రాన్ విషయంలో సానుకూలంగా ఉండే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రిటైర్‌కావడం వంటివి అధికారపక్షానికి, సైన్యానికి శుభ పరిణామాలు. అధికారంనుంచి దించడం, మళ్ళీ రాకుండా అడ్డుకోవడమన్న లక్ష్యాలు నెరవేరినంత మాత్రాన ఇమ్రాన్ విషయంలో సైన్యం ఇకముందు ఉదాసీనంగా వ్యవహరించే అవకాశమైతే లేదు. సైన్యం మీద ఆయన చేసిన పోరాటం అసామాన్యమైనది. దాని మద్దతు లేకుండా రాజకీయక్షేత్రంలో నెగ్గుకు రావడం కష్టమన్న భావనను ఆయన తుడిపేశారు. ప్రజల్లో సైన్యం పరువు ప్రతిష్ఠలను దిగజార్చారు. ఎన్నికల ప్రక్రియ యావత్తూ ఎంత లోపభూయిష్ఠంగా జరిగినా, ఎన్నికలకు ముందు, తరువాత ఆయనకు వ్యతిరేకంగా

పాకిస్థాన్‌లో మారని దృశ్యం

ఎన్ని నిర్ణయాలు జరిగినా, ప్రజల్లో ఆయనకు విశేష ఆదరణ ఉన్నదని ఫలితాలు రుజువుచేశాయి. సైనికస్థావరాలపై ఆయన పార్టీ కార్యకర్తలు, అభిమానులు గత ఏడాది మేనెలలో చేసిన దాడులను చూపుతూ ఆయనను దేశవ్యతిరేకిగా చిత్రీకరించే ప్రయత్నాలు కూడా విఫలమైనాయి. సైన్యానికి వ్యతిరేకంగా వీధుల్లో నిలబడి పోరాడుతున్న యోధుడిగా ఇమ్రాన్‌ను ప్రజలు అభిమానించారు, ఆదరించారు. సైన్యంతో చేతులు కలిపిన పార్టీలకు ప్రజామోదంతో పాటు, విశ్వసనీయత కూడా లేదని ఈ ఫలితాలు తేల్చేసినందువల్లనే, ఇమ్రాన్ కంటే ముందు సైన్యంమీద వీరంగం వేసి, ఇప్పుడు సాగిలబడి, అధికారంలోకి రావాలనుకున్న నవాజ్ షరీఫ్ ప్రధాని కాకుండా జాగ్రత్తపడ్డారు, సైన్యానికి నమ్మినబంటులాగా వ్యవహరించే సోదరుడిని కూచోబెట్టారు.

వివిధ కారణాలతో కొత్తప్రభుత్వం ఎక్కువకాలం నిలబడదన్న వాదనలను అటుంచితే, ప్రస్తుతానికి సైన్యం తాను అనుకున్నది సాధించగలిగింది. కొత్త ప్రభుత్వానికి ఆర్థికం నుంచి అంతర్జాతీయ సంబంధాల వరకూ చాలా సమస్యలు పోగుబడివున్నాయి. అఫ్ఘానిస్థాన్‌నుంచి ఉగ్రవాదం ముప్పు, ఇరాన్‌తో దెబ్బతిన్న దౌత్యసంబంధాల సమస్య ఉండనే ఉన్నాయి. భారీగా అప్పులు ఇచ్చిన ఐఎంఎఫ్‌ను మెప్పించాలంటే ప్రభుత్వరంగ సంస్థలను అమ్మివేయాలి, ప్రజలను మరింతగా పీల్చిపిప్పిచేయాలి. నవాజ్ షరీఫ్ మళ్ళీ అధికారంలోకి వస్తే భారతదేశంతో పాకిస్థాన్ వ్యవహారశైలిలో మార్పువస్తుందని చాలా విశ్లేషణలు జరిగాయి. గతంలో మోదీ–నవాజ్ బంధం, ఉగ్రవాదులను ప్రోత్సహిస్తూ దేశాన్ని సైన్యం ప్రమాదంలో పడవేస్తున్నదంటూ షరీఫ్ చేసిన వ్యాఖ్యలు తెలిసినవే. 2019లో పుల్వామాదాడి, దానికి ప్రతీకారంగా భారత్ జరిపిన బాలాకోట్ దాడులతో ఉభయదేశాల సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని మోదీ రద్దుచేయడంతో వాతావరణం మరింత గట్టిపడింది. కశ్మీరీలను పాలస్తీనియన్లతో పోల్చడం సహా షాబాజ్ షరీఫ్ ప్రభుత్వం అంతర్జాతీయ వేదికలమీద భారత్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతూనే ఉంది. ఇకపై కూడా సైన్యం మనోగతానికి భిన్నంగా వ్యవహరించగలిగే శక్తి ప్రభుత్వానికి ఉండదు కనుక, ఇరుదేశాల సంబంధాల్లో చెప్పుకోగదగ్గ మార్పువచ్చే అవకాశాలైతే లేవు. గతంలో కంటే మరింత అస్థిరమైన పరిస్థితుల్లో, అనేకానేక సమస్యల్లో పాకిస్థాన్ ఉన్నది కనుక దాని వైఖరి ఇంకొంత బిగుసుకుపోయే అవకాశాలే మెండు. భారతదేశం ఎప్పటిలాగానే సరిహద్దు ఉగ్రవాదం నుంచి అంతర్జాతీయవేదికలమీద పోరాటం వరకూ దానితో వ్యవహరిస్తూ పోవాల్సిందే.

మనుగడకే గురిపెడుతున్న మానసిక యుద్ధం

ఊదరగొట్టుట అనే ప్రాపగాండాకు అనుబంధ ఫలితాలు అనే సైడ్ ఎఫెక్ట్ కూడా ఉంటాయి. జనంలో భయభక్తులను పెంచుకోవడానికి నాయకుడు ఇంద్రుడు చంద్రుడు వీరుడు శూరుడు అని ప్రచారం చేస్తారు. అట్లా చేయగా చేయగా, నిజమే కాబోలు అని ప్రతినాయకుడు అనుకుంటాడు, అంతేకాదు, నిజంగా తాను అరివీర భయంకరుణ్ణేమో అని ప్రచార నాయకుడు కూడా నమ్మడం మొదలుపెడతాడు. ఇతరుల మీద కమ్మే మాయపొర ఎంతో కొంత తమని కూడా మత్తులో ముంచుతుంది.

నరేంద్రమోదీ, ఆయన పార్టీ వారు సామాన్యులు కాదు. ఉత్సాహం, వ్యూహం, ముందుజాగ్రత్త అన్నీ తగుపాళ్లలో ఉన్న మేధాబృందం వారికి ఉన్నది. తమ లక్ష్యసాధన గురించి జాగరూకత ఎంత ఉన్నప్పటికీ, రేపు కూడా తమదే అధికారం, పరమాధికారం అన్న బేఖాతరుదర్పం కూడా వారిలో తరచు పొడుచుకు వస్తోంది. పొగరుగా కనిపించే ఆ ధీమా కూడా వారి చేతిలో ఒక రాజకీయ పాచికే!

మొన్న ఆదివారం నాడు కేంద్ర కేబినెట్ సమావేశం జరిగింది. సాధారణ ఎన్నికలకు ముందు అదే చివరి సమావేశం. మంత్రులు ఎన్నికల ప్రచారాల్లో ఎట్లా ఉండాలి, ఏమేమి జనాలకు చెప్పాలి వంటి సుద్దులు ప్రధానమంత్రి తన సహచరులకు చెప్పారు. అది సరే. మరోసారి అధికారంలోకి వచ్చాక మొదటి వందరోజుల కాలంలో ఏమి చేయాలో మోదీ చర్చించారట. తన ప్రభుత్వమే వస్తుందని, తాను ప్రధాని అవుతానని అనుకోవడం ఓకే. సంభావ్యత అధికంగా ఉన్న విషయం అది. కానీ, ఈ మంత్రివర్గమే ఉండకపోవచ్చు కదా? అయినా, ప్రస్తుతం ఇంత హడావిడి నడుస్తుండగా, నూతన ప్రభుత్వమూ నూరురోజులూ అన్న మేధోమథన కార్యక్రమం ఎందుకు? వికసిత భారతాన్ని సాధించాలనే లక్ష్యం ప్రధాన మంత్రిని ఆత్రుత పెడుతోంది అనుకుందాం, అందుకు సమయం సందర్భం చూసుకోనక్కరలేదా? నిజంగా, ఆ అంశం గురించి చర్చించడంలో పెద్ద విశేషం ఏమీ లేదు. అట్లా చర్చించినట్టు బయటకు చెప్పుకోవడంలోనే అసలు కిటుకు ఉన్నది. విశ్వసనీయవర్గాల ద్వారా బయటకు పొక్కిన ఆ రహస్యం ద్వారా ప్రతిపక్షాలు ఏమి అనుకోవాలంటే, మోదీ గారు గెలవడమే కాదు, మరో హయాం పాలన కూడా ఆరంభించారు, భవిష్యత్తు వర్తమానంలోకి చొచ్చుకు వచ్చేసింది, అని. ఇక ప్రజలు ఏమి అనుకోవాలంటే, చూశారా, మోదీ ఎప్పుడూ దేశ వికాసం కోసమే ఆలోచిస్తారు, ఆయన ప్రత్యర్థులే రాజకీయాలు చేస్తున్నారు, అని.

ప్రతిపక్షాల మీద మానసికయుద్ధంలో మోదీ బ్రహ్మాస్త్ర ప్రయోగం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌తోనే మొదలయింది. సాధారణంగా, ఇటువంటి బడ్జెట్‌లు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రూపొందుతాయి. చాలాసార్లు, ప్రభుత్వాలకు తామే మళ్లీ గెలుస్తామన్న నమ్మకం నూటికి నూరుపాళ్లు ఉండదు. అందుకని, ఎన్నికల ప్రయోజనాల కోసం బడ్జెట్‌లో యథేచ్ఛగా వరాలు, వాగ్దానాలు గుప్పిస్తారు. తాము తిరిగి అధికారంలోకి వస్తే అవన్నీ అమలుచేస్తామన్న వాగ్దానం ఆ బడ్జెట్ ఇస్తుంది. కానీ, మోదీ ప్రభుత్వం 2024 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ఏ మాత్రం 'జనాకర్షణ' లేని విధంగా రూపొందించింది. తామే తిరిగి అధికారంలోకి వస్తామని అనుకుంటున్నారు కాబట్టి, అమలు చేయగలమా లేదా అన్న విచికిత్స వారి మీద పని చేసింది. ప్రజల ఆధ్యాత్మికతను సంతృప్తిపరచడం ద్వారా ఎన్నికలను గెలవబోతున్నప్పుడు, భౌతిక అవసరాల గురించిన పెద్ద పట్టింపు అవసరం లేదన్న నిశ్చింతా వారికి ఉంది. తరువాతి పదవీకాలం కూడా తమదే అని అధికారపక్షం తమ ప్రత్యర్థులకు తేల్చిచెప్పింది. మీకేమీ తాయిలాలు ఇవ్వకపోయినా సరే, మీరు మమ్మల్ని గెలిపించడం కంటె మరేమీ చేయలేరు అని కూడా ప్రజలకు చెప్పింది.



ఉత్సాహంతో పరుగులు తీస్తున్న బీజేపీని ప్రమాదరహితం చేసుకోవాలంటే, బీఆర్ఎస్ ఉనికి కూడా కొనసాగేట్టు కాంగ్రెస్ ప్రయత్నించాలి. బీజేపీకి మళ్లే బీఆర్ఎస్ ఓట్లను కొంతమేరకైనా నిరోధించగలగాలి. అట్లా కాక, తన గురిని బీఆర్ఎస్ మీద మాత్రమే సంధిస్తే, బీజేపీకి అదనపు బలం సమకూరుతుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి రాష్ట్రంలో కూడా బలం పెరిగితే పర్యవసానాలు ఏమిటో రాష్ట్ర కాంగ్రెస్‌కు తెలియవా?

మైండ్ గేమ్స్‌లో మైమరపు పనికిరాదు. ఆత్మరక్షణలో ఆదమరపూ కూడదు.

తెలంగాణలో కూడా అదే మానసిక యుద్ధ తంత్రం నడుస్తున్నది. లోక్‌సభ ఎన్నికల తరువాత బీఆర్ఎస్ అంతరించిపోతుందని బీజేపీ అంటుంది. ఆరునెలల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పడిపోతుందని బీఆర్ఎస్ అంటుంది. బీజేపీ బీఆర్ఎస్ కలిసే ఉన్నాయని అసెంబ్లీ ఎన్నికల నాటి పాతపాటే కాంగ్రెస్ పాడుతుంది. ఎన్నికల ప్రచారానికి ఏవో వివాదాంశాలు అవసరం అవుతాయి. కానీ, తెలంగాణలో ఉన్న ప్రస్తుత వాతావరణం, ప్రభుత్వాల, పార్టీల మనుగడలనే చర్చలోకి తెచ్చింది. జాతీయ రాజకీయ సమరంలో తలపడుతున్న రెండు జాతీయపార్టీలు, మొన్నటిదాకా పదేళ్ల అధికారంలో, మరో పదమూడేళ్ల ఉద్యమంలో ఉన్న ప్రాంతీయపార్టీ, తమ తమ శక్తియుక్తులన్నిటినీ ఉపయోగించి, ఎన్నికల గండాన్ని దాటడానికి ప్రయత్నిస్తున్నాయి.

నిజానికి, ఈ ఎన్నికలు బీజేపీకి గండం కావు. ఈ ఎన్నికల ఫలితాల వల్ల కొత్తగా ఏ నష్టమూ పొందనిది బీజేపీ ఒక్కటే. ప్రస్తుతం ఉన్న స్థానాలను నిలుపుకున్నా చాలు. కాంగ్రెస్ అనుకూలత నేపథ్యంలో కూడా తన బలాన్ని కాపాడుకున్నట్టు అవుతుంది. అదనంగా స్థానాలు గెలుచుకుంటే, పురోగమిస్తున్నట్టు లెక్క. సగానికి పైగా గెలిస్తే, ఆపైన తిరుగుండదు. ఉన్న సీట్లకు తగ్గితే కూడా, అర్థం చేసుకోదగ్గ పరిణామమే తప్ప, పెద్ద పతనం కాదు. కాబట్టి, బీజేపీ ఒక సౌకర్యవంతమైన స్థితినుంచి పోరాటంలోకి దిగుతోంది. దాని ప్రయత్నం అంతా మెరుగుదల కోసమే. ఆ మెరుగుదల వస్తే, రాష్ట్ర రాజకీయాలను కూడా మలుపుతిప్పగలిగిన పరిణామాలకు అవకాశం ఉంది.

కాంగ్రెస్, బీఆర్ఎస్ పరిస్థితి అట్లా లేదు. వాటికి జీవన్మరణ సమస్య. అసెంబ్లీ విజయానికి తగినట్టు, అంతకు మించి విజయాలు రాకపోతే, రేవంత్ రెడ్డికి అధిష్ఠానం దగ్గర రేటింగ్ తగ్గవచ్చు, లేదా, ఇంటిపోరు అధికం కావచ్చు. తమకు మంచి గెలుపు రావడం ఒక్కటే సరిపోదు, బీఆర్ఎస్‌కు అనూహ్యమైన విజయాలు ఏమీ రావు కానీ, బీజేపీకి అదనపు బలం సమకూరకూడదు. కాంగ్రెస్ పది గెలిచి, తక్కినవి బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం దక్కించుకుంటే ఓకె. అట్లా కాకపోతే, అదనపు గెలుపులతో బీజేపీలోకి వలసలు పెరిగిపోతాయి. కొందరు నిబద్ధులు ఉన్న మాట నిజమే కానీ, బీఆర్ఎస్ శాసనసభ్యులు అనేకులు తమకు ఉన్నచోట భవిష్యత్తు లేదన్న చింతలో పడిపోయారు. వారికి సహజంగానే బీజేపీ ఒక ఆకర్షణీయ గమ్యంగా కనిపిస్తుంది. ఇక అప్పుడు, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎందుకు అనుమతించాలన్న తాత్విక ప్రశ్న బీజేపీ ఢిల్లీ పెద్దలలో తలెత్తవచ్చు.

బీఆర్ఎస్‌ది ప్రస్తుతానికి దయనీయ పరిస్థితే. లోక్‌సభ ఎన్నికలలో ప్రచారాంశమే లేని పార్టీ ఇది. కాంగ్రెస్‌కు ఓటు వేయడానికి అయినా, బీజేపీకి వేయడానికి అయినా ఓటరుకు తగిన కారణాలున్నాయి. మరి బీఆర్ఎస్ ఎంపీలు ఢిల్లీకి పోయి ఏమి సాధిస్తారు? అట్లాగని, ఎన్నికలను వదులుకోలేరు. మొన్నటి ఎన్నికలలో బలం చూపిన చోట్ల అయినా, ఎంపీలను గెలిపించుకోవాలి. లేకపోతే, ఎమ్మెల్యేల బలగాన్ని నిలుపుకోవడం కష్టం. కానీ, గత పదేళ్ల దాని పరిపాలనా కాలాన్నే కాంగ్రెస్ వివాదాస్పదం చేస్తున్నది. ఇంకా నాలుగున్నరేండ్ల కాలం ఎడారిలాగా కనబడుతుంటే, పార్టీ మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. కాంగ్రెస్ నుంచి, బీజేపీ నుంచి కూడా బీఆర్ఎస్ వేట ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది.



■ కె. శ్రీనివాస్

సందర్భం

బీజేపీ మీద కాకుండా, రేవంత్ రెడ్డి తన అస్త్రాలన్నిటినీ బీఆర్ఎస్ మీద ఎందుకు గురిపెడుతున్నట్టు? బీఆర్ఎస్ లక్ష్యం కూడా రేవంత్ మాత్రమే ఎందుకు అవుతున్నారు? బీఆర్ఎస్ నుంచి సిద్ధంగా ఉన్న వలసలను కాంగ్రెస్ ఎందుకు ఆపుతున్నది? అదనపు బలాన్ని సమకూర్చుకుని, ఆత్మవిశ్వాసంతో లోక్‌సభ ఎన్నికలకు వెళ్లకుండా, దిగువశ్రేణి నేతల వలసలతోనే ఎందుకు తృప్తి చెందుతున్నట్టు? ఎన్నికల తరువాత బలం పెంచుకుందామనుకుంటున్నారేమో కానీ, అప్పటికి బీఆర్ఎస్ శిబిరంలో ఎవరైనా మిగులుతారా? ప్రధానమంత్రి పర్యటనలో రేవంత్ వ్యవహరించిన తీరు కాంగ్రెస్‌కు లాభమా? నష్టమా? తెలంగాణ అస్తిత్వ స్పృహ రేవంత్‌లో కనిపించడం లేదన్న విమర్శ బీఆర్ఎస్ తిరిగి ఉద్యమ ఉద్వేగాలను ఆశ్రయించనున్నట్టు సూచిస్తోందా? మోదీ చెప్పిన సర్జికల్ స్ట్రయిక్ అంతరార్థమేమిటి? ఇంతకీ, లోక్‌సభ ఎన్నికలలో తెలంగాణలో ప్రధాన పోటీ ఏ రెండు పార్టీల మధ్య? ఇవన్నీ తెలంగాణ రాజకీయ రంగాన్ని కుదిపివేస్తున్న ప్రశ్నలు.

ప్రజల ఆధ్యాత్మికతను సంతృప్తిపరచడం ద్వారా ఎన్నికలను గెలవబోతున్నప్పుడు, భౌతిక అవసరాల గురించిన పెద్ద పట్టింపు అవసరం లేదన్న నిశ్చింతా బీజేపీ వారికి ఉంది. తరువాతి పదవీకాలం కూడా తమదే అని జాతీయ అధికారపక్షం తమ ప్రత్యర్థులకు తేల్చిచెప్పింది. మీకేమీ తాయిలాలు ఇవ్వకపోయినా సరే, మీరు మమ్మల్ని గెలిపించడం కంటె మరేమీ చేయలేరు అని కూడా ప్రజలకు చెప్పింది.

తమ పార్టీ మిగులుతుందా లేదా అన్న ఆందోళనలో ఒక పార్టీ, తమ ప్రభుత్వానికి గండం ఉందేమోనన్న భయంలో మరో పార్టీ సతమతమవుతున్నాయి. ఆ కలవరాన్ని మరింతగా పెంచిపోషిస్తూ బీజేపీ తమాషా చూస్తున్నది. ప్రతిపక్షాల మధ్య ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీల్చి, పబ్బం గడుపుకోవాలని కేసీఆర్ ప్రయత్నించారు. అందుకే పనిగట్టుకుని బీజేపీ బలం పెంచి, ఆ బలానికి తానే భయపడే స్థితికి వచ్చారు. స్వయంగా బీజేపీయే తనను తాను తగ్గించుకుని, యుద్ధంనుంచి తప్పుకున్నది కాబట్టి, కాంగ్రెస్‌కు లాభం కలిగింది. ఉత్సాహంతో పరుగులు తీస్తున్న బీజేపీని ప్రమాదరహితం చేసుకోవాలంటే, బీఆర్ఎస్ ఉనికి కూడా కొనసాగేట్టు కాంగ్రెస్ ప్రయత్నించాలి. బీజేపీకి మళ్లే బీఆర్ఎస్ ఓట్లను కొంతమేరకైనా నిరోధించగలగాలి. అట్లా కాక, తన గురిని బీఆర్ఎస్ మీద మాత్రమే సంధిస్తే, బీజేపీకి అదనపు బలం సమకూరుతుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి రాష్ట్రంలో కూడా బలం పెరిగితే పర్యవసానాలు ఏమిటో రాష్ట్ర కాంగ్రెస్‌కు తెలియవా?

మైండ్ గేమ్స్‌లో మైమరపు పనికిరాదు. ఆత్మరక్షణలో ఆదమరపూ కూడదు.

పౌరహక్కుల సంఘం 50 ఏళ్ళ ముగింపు సభలు

1970వ దశకం తొలినాళ్ళల్లో శ్రీకాకుళం రైతాంగ పోరాటాలపై ఆనాటి జలగం వెంగళరావు ప్రభుత్వం అమలు చేసిన క్రూర నిర్బంధానికి వ్యతిరేకంగా విప్లవ రాజకీయ అభిమానులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు కలసి తెలుగునాట ఒక హక్కుల ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఆ కృషిలో భాగంగా 1973 డిసెంబరు 28న గుంటూరులో ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (ఆంధ్ర ప్రదేశ్ సివిల్ లిబర్టీస్ కమిటీ - ఏపీసీఎల్‌సీ) ఆవిర్భవించింది. ఆ తరువాత 1974 మార్చి 2న హైదరాబాద్‌లో శ్రీశ్రీ అధ్యక్షుడుగా పత్తిపాటి వెంకటేశ్వర్లు ప్రధాన కార్యదర్శిగా ఒక నిర్మాణ రూపాన్ని సంతరించుకున్నది. సంస్థ ఆవిర్భవించిన తొలినాళ్లలో రాజ్యహింసకు వ్యతిరేకంగా మాత్రమే పనిచేసినా తనదంతర కాలంలో కార్యరంగాన్ని విస్తృతపరచుకుని సమాజంలో వివిధ ఆధిపత్య వ్యవస్థల మూలంగా జరుగుతున్న హక్కుల ఉల్లంఘనలకు వ్యతిరేకంగా పోరాడే సంస్థగా ఎదిగింది. అణచివేత ఏ రూపంలో ఉన్నా దాన్ని వ్యతిరేకించే పౌరహక్కుల సంఘం ఏ ఒక్క రాజకీయ సిద్ధాంతానికి నిబద్ధం కాకుండా విశాలమైన ప్రజాతంత్ర విలువల ప్రాతిపదికన స్వతంత్ర అవగాహనను, అస్తిత్వాన్ని కాపాడుకుంటూ ప్రజాతంత్ర ప్రవంతిలో బాధిత ప్రజల పక్షాన గళాన్ని వినిపిస్తున్నది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తరువాత ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం (ఏపీసీఎల్‌సీ), పౌర హక్కుల సంఘంగా పేరు మార్చుకొని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర కమిటీలుగా ఏర్పడి, రెండు తెలుగు రాష్ట్రాల్లో తన కార్యాచరణను కొనసాగిస్తున్నది.

పౌరహక్కుల సంఘం 50 వసంతాల ముగింపు సభలు మార్చి 9, 10 తేదీలలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్‌లో జరుగుతాయి. తొలిరోజు మొదటి సెషన్ ఉదయం 10.30 నుండి 1.30 గం.ల వరకు జరుగుతుంది. మాడభూషి శ్రీధర్ ఆహ్వానం పలుకుతారు, ప్రొ. హరగోపాల్ ప్రారంభోపన్యాసం చేస్తారు. అనంతరం 'నిర్బంధ చట్టాలు – న్యాయ వ్యవస్థ' అంశంపై జస్టిస్ సుదర్శన్ రెడ్డి, 'దేశవ్యాప్త హక్కుల పరిస్థితి'పై హర్షమందర్ ప్రసంగిస్తారు. రెండవ సెషన్‌లో 'మతం – రాజ్యాంగం – పౌరహక్కులు' అంశంపై అర్ఫాఖానుం షేర్వానీ (వైర్), 'పత్రికా స్వేచ్ఛ – నిర్బంధం' అంశంపై కె.శ్రీనివాస్ (ఆంధ్రజ్యోతి), 'విద్య– కాషాయికరణ' అంశంపై ప్రొ. మధు ప్రసాద్ (ఢిల్లీ యూనివర్శిటీ) ప్రసంగిస్తారు. మలిరోజు కార్యక్రమంలో 'పౌరహక్కుల సంఘం 50 వసంతాల పయనం' అంశంపై క్రాంతి చైతన్య, 'ఆదివాసీ చట్టాలు – సాయుధీకరణ' అంశంపై ప్రొ. నందినీ సుందర్, 'కాషాయీ కరణ – దళితులపై దాడులు' అంశంపై ప్రొ. సత్యపాల్ (ఆంధ్ర యూనివర్శిటీ) ప్రసంగిస్తారు. రెండవ సెషన్‌లో 'కార్పోరేటీకరణ – ఆదివాసీ మహిళలపై ప్రభావం' అంశంపై ప్రొ. మాధురి, 'కార్పోరేటీకరణ – కార్మిక హక్కుల విధ్వంసం' అంశంపై పి. ప్రసాద్ (ఐఎఫ్‌టియు), 'కార్పోరేటీకరణ – రైతాంగ హక్కుల విధ్వంసం' అంశంపై కన్నెగంటి రవి ప్రసంగిస్తారు.

– వేడంగి చిట్టిబాబు, చిలుకా చంద్రశేఖర్
(అధ్యక్ష కార్యదర్శులు, ఆంధ్రప్రదేశ్)

– ప్రొ. గడ్డం లక్ష్మణ్, నక్కా నారాయణరావు
(అధ్యక్ష కార్యదర్శులు, తెలంగాణ)

రాష్ట్ర భవిష్యత్తు నిర్ణేతలు ఓటర్లే!

భారతదేశంలో ప్రజాస్వామ్య మూల స్తంభాలలో ఎన్నికల ప్రక్రియ ఒకటి. దీని ద్వారానే ప్రజలు తమ పాలకులను ఎంచుకుంటారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు మరింత కీలకంగా మారిపోయాయి. రాబోయే అసెంబ్లీ ఎన్నికలు ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్య సజీవత్వాన్ని, ప్రజల శక్తిని మరోసారి రుజువు చేయబోతున్నాయి. రాష్ట్రంలో వివిధ పార్టీలు తమ ప్రచార స్ట్రాటజీలను అమలుపరచడంలో నిమగ్నమయ్యాయి. ఓటర్లను ఆకర్షించే వివిధ హామీలను ప్రకటిస్తున్నాయి. ఓటర్లు కేవలం హామీలను మాత్రమే గమనించకుండా, పార్టీల గత పాలనా రికార్డులను, అభ్యర్థుల నైతికత, ప్రజాసేవా దృక్పథం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాలి. రాజకీయ ప్రతిపాదనలు, వాగ్దానాల మీద ప్రజలు అవగాహన కలిగివుండాలి. అలాగే వాటి అమలు సాధ్యాసాధ్యాలు, ఆర్థిక ప్రభావాలను కూడా గ్రహించాలి.


భారత రాజ్యాంగం ప్రకారం, ఎన్నికలు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకం. ఓటు హక్కు ప్రజలకు ఒక గొప్ప బాధ్యతను ఇస్తుంది. ప్రతి ఓటరు తన ఓటు హక్కును వివేకంగా, జాగ్రత్తగా వాడుకోవాలి. ఇది మన రాజకీయ వ్యవస్థను మరింత బలపరచడంలో కీలకమవుతుంది. ఓటర్లు సమాజంలో తమకు ఉన్న సమస్యలు, అవసరాలు, ఆశయాలను గ్రహించుకుని, ఆ దిశగా పని చేసే అభ్యర్థులకు తమ మద్దతును ఇవ్వాలి. రాజకీయ పార్టీల అభ్యర్థులు కూడా ఓటర్ల నుండి రాబోయే అభిప్రాయాలు, అవసరాలను గుర్తించి, వాటిని తమ ప్రచారాలలో ముఖ్యమైన అంశాలుగా చేర్చుకొని, ప్రజాసేవ, అభివృద్ధిపై దృష్టి సారించాలి.

రాజకీయ పార్టీల మధ్య పోటీ ప్రజాస్వామ్యంలో సహజం. అయితే, ఈ పోటీ సానుకూల మార్పులకు దోహదపడాలి. నెగెటివ్ ప్రచారాలు, వ్యక్తిగత దాడులు నుంచి దూరంగా ఉండాలి. ఓటర్లు అలాంటి ప్రచారాలను గుర్తించి, ఖండించాలి. అదే సమయంలో ప్రజాసేవ, సమాజ అభివృద్ధి, సామాజిక న్యాయం వంటి అంశాలపై దృష్టి పెట్టే అభ్యర్థులను ఎన్నుకోవడం ద్వారా, ప్రజలు తమ హక్కులను సరైన మార్గంలో ఉపయోగించాలి. ఓటర్లు తమ ఓటుతో నిర్ణయించే మార్గం రాష్ట్ర అభివృద్ధిని, స్థిరత్వాన్ని, సమృద్ధిని నిర్ణయిస్తుంది.

– ఓరుగంటి సుబ్బారావు
నేషనల్ వర్కింగ్ ఛైర్మన్, ట్రైబల్ డెవలప్‌మెంట్ మిషన్

విశాఖ ఉక్కు ఊపిరి తీస్తున్న ప్రభుత్వం

'విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు' నినాదంతో పోరాడి సాధించుకొన్న ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. కొన్నాళ్లుగా మౌనంగా వున్నా మళ్ళీ ఇప్పుడు ఉక్కు పరిశ్రమ స్థలాలు అమ్మకం వ్యవహారాన్ని వేగవంతం చేసినట్లు సమాచారం. విశాఖ ఉక్కు పరిశ్రమ 32 మంది ప్రాణాల బలిదానంతో ఏర్పడింది. ప్రాణాలు పణంగా పెట్టి కార్మికులు ఉత్పత్తి పెంచారు. దీనిని కాపాడుకోవడానికి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సుదీర్ఘ పోరాటం చేస్తోంది. దీనికి కొన్ని రాజకీయ పార్టీలు, రాష్ట్ర ప్రజలు, వివిధ సంఘాలు, సంస్థలు మద్దతు పలుకుతున్నాయి. కానీ అధికార వైసీపీ మాత్రం కపట నాటకాలాడుతుంది. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు స్వంత గనులు ఎందుకివ్వరని ఏనాడు పార్లమెంట్‌లో వైసీపీ ప్రశ్నించలేదు. విశాఖ ఉక్కును ప్రైవేటుపరం కాకుండా అడ్డుకోవాలన్న చిత్తశుద్ధి రాష్ట్ర ప్రభుత్వానికి లేదు.



కేంద్ర నిర్ణయం కార్యరూపం దాల్చితే ఉత్తరాంధ్ర అభివృద్ధి ఎండమావి కానుంది. విశాఖ ఉక్కు పరిశ్రమ నష్టాలకు కేంద్రం చూపుతున్న కారణం సరైనది కాదు. ఉక్కు పరిశ్రమకు అవసరమైన ఇనుప ఖనిజాన్ని కేటాయించకుండా నష్టాల వంకతో బలిపీఠమెక్కిస్తున్నారు. జగన్ ప్రభుత్వ అసమర్థత, మెతక వైఖరి కారణంగా, సరైన రీతిలో కేంద్రంపై ఒత్తిడి తేలేక పోతోంది. దీంతో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై కేంద్రం వెనక్కు తగ్గడం లేదు. పరిశ్రమకు ప్రత్యేకంగా గనులు కేటాయించి, ఆర్థిక భరోసా కల్పించి కష్టాల నుంచి కాపాడవచ్చు. సెయిల్‌లో విలీనం చెయ్యడం మరో పరిష్కారం అని తెలిసినా, కేంద్రం ఆ పని చెయ్యడం లేదు. ప్రత్యామ్నాయ మార్గాలు వున్నా ప్రైవేటీకరణకే మొగ్గు చూపుతూ విశాఖ ఉక్కుకు ఊపిరి తీస్తున్నారు. విశాఖ నగరం మధ్యలో అత్యంత విలువైన స్థలాలను ప్లాట్లుగా విభజించి రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ బ్రోచర్లు విడుదల చేసింది. స్టీలు ప్లాంట్ ఏర్పాటుకు రైతుల నుంచి భూసేకరణ చేసిన 19,670 ఎకరాలపై పూర్తి హక్కులు రాష్ట్రపతికి ఉంటాయి. ప్లాంటులో పూర్తి సామర్థ్యం మేరకు ఉక్కు ఉత్పత్తి చెయ్యకుండా ఆస్తులను అమ్మకానికి పెట్టడం బాధ్యతా రాహిత్యం. 25 మంది ఎంపీలను గెలిపిస్తే కేంద్రం మెడలు వంచుతామంటూ ఎన్నికల ముందు బీరాలు పలికిన జగన్ ఉక్కు పరిశ్రమ విషయంలో మాత్రం కేంద్రంపై ఒక్కసారైనా ఒత్తిడి తీసుకురాలేదు. కేంద్రాన్ని గట్టిగా ప్రశ్నించడానికి సొంత అవసరాలు, కేసులు అడ్డొచ్చాయనుకుంటే. కనీసం రాష్ట్ర ప్రభుత్వమైనా సాయం చెయ్యవచ్చు.

ఛత్తీస్‌గఢ్‌లోని నగర్‌నార్ స్టీల్ ప్లాంట్‌ని, తమిళనాడులో సేలం స్టెయిన్‌లెస్ స్టీలు కర్మాగారాన్ని, పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్ ఎల్లాయ్ స్టీల్ కర్మాగారాన్ని, మోక్షగుండం విశ్వేశ్వరయ్య భద్రావతి ఉక్కు కర్మాగారాన్ని మూసివేయడం, అమ్మేయడం చేస్తామంటే ఆయా రాష్ట్రాల పాలక, ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించడంతో ఆ నిర్ణయాలను అమలు చేయలేదు.

గతంలో రెండుసార్లు విశాఖ ఉక్కు గడ్డు పరిస్థితి ఎదుర్కొన్నప్పుడు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం, ఎంపీలు అన్ని పార్టీల నేతలతో, కార్మిక సంఘాలతో కలిసి అఖిలపక్షంగా అప్పటి ప్రధానులను కలిసి విశాఖ ఉక్కును ఆదుకున్నది. ఇప్పుడు కూడా జగన్ ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మడానికి వీలులేదని కేంద్రంపై గట్టి ఒత్తిడి చేస్తే కేంద్రం ఎన్నికల ముందు వెనక్కి తగ్గవచ్చు. కానీ ప్రస్తుతం జరుగుతున్న తీరు పరిశీలిస్తే, విశాఖ ఉక్కు అమ్మకంలో కేంద్ర ప్రభుత్వం కంటే రాష్ట్ర ప్రభుత్వమే ఎక్కువ ఉత్సాహం చూపుతున్నట్లు అర్థమవుతుంది. ఉక్కు ఫ్యాక్టరీ ఆధీనంలో వున్న భూములలో నుంచి ఏడు వేల ఎకరాలను ప్లాట్లుగా అభివృద్ధి చేసి అమ్మేస్తే సమస్య పరిష్కారం అవుతుందని చిట్కా చెప్పింది జగన్‌రెడ్డే. స్టీలు అండ్ కోల్ పార్లమెంటరీ కమిటీలో ప్రస్తుతం ఇద్దరు వైసీపీ ఎంపీలున్నా ఇప్పటివరకు ప్లాంటును సందర్శించలేదు సరికదా? ముడిసరకు సరఫరాలో అడ్డంకులపైనా పరిష్కారానికి చొరవ చూపలేదు.

ఆర్థిక సంక్షోభంలో అల్లాడుతున్న విశాఖ ఉక్కుకు రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలోనైనా కనీస సాయం చేయడానికి ముందుకు రావడం లేదు. ప్లాంట్‌కు నెలకు రూ.500 కోట్లు చొప్పున రూ.2 వేల కోట్లు ఆర్థిక సాయం అందించి, ప్రభుత్వ పథకాలకు అవసరమైన ఉక్కు తీసుకోండి అంటూ ప్లాంటు అధికార, కార్మిక సంఘాలు విన్నవించాయి. స్టీలు కొనుగోలుకు జిల్లా స్థాయి పరిశ్రమల శాఖ అధికారిని నియమించి నివేదిక ఇవ్వాలని కంటి తుడుపుగా ఆదేశాలిచ్చి సరిపెట్టారు. పలు ఎన్నికల్లో విశాఖ ఉక్కు ఉద్యమాన్ని వైసీపీ నాయకులు ప్రచారాస్త్రంగా ఉపయోగించుకున్నారు. మళ్లీ ఎన్నికల ముందు ఉత్తరాంధ్ర వెనుకబాటు తనం పేరుతో హడావుడి ఆరంభించారు.

■ నీరుకొండ ప్రసాద్

కులాల కుంపట్లు రాజేస్తున్నారు!

కులాలు, ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవడం ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య. వంగవీటి రంగా హత్యకు చంద్రబాబును బాధ్యుడిని చేస్తూ, అందుకు ఆయనను వర్గ శత్రువుగా భావిస్తున్నారని కుప్పం బహిరంగసభలో జగన్‌రెడ్డి మాట్లాడారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ప్రభుత్వ కార్యక్రమంలో ఇలాంటివి మాట్లాడకూడదనే ఇంగితజ్ఞానం కూడా ఆయనకు లేదు. నిరాధారమైన ఇలాంటి ఆరోపణలు ఎలా చేస్తారు? హత్య జరిగి ఎంతకాలం అయింది? ముఖ్యమంత్రి స్థాయిలో వ్యక్తి కేవలం రాజకీయ లబ్ధి కోసం ఒక సామాజిక వర్గాన్ని రెచ్చగొట్టి రెండు కులాల మధ్య చిచ్చుపెట్టడానికే ఇంతగా దిగజారారు.

1988లో తన రాజకీయ అవసరాల కోసం వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుట్రపూరితంగా రంగా హత్యను రాజకీయ అస్త్రంగా వాడారు. ఇద్దరు వ్యక్తులు, రెండు ముఠాల మధ్య జరిగిన ఘర్షణలు రెండు కులాలకు ఆపాదించి విధ్వంసం సృష్టించారు. వేలకోట్ల రూపాయల ప్రజల ఆస్తులను తగలేశారు. ఆనాడు తండ్రి సృష్టించిన కులాల కుంపట్లు ఆరిపోకుండా జగన్‌రెడ్డి రాజేస్తున్నారు. తెలుగుదేశం పార్టీయే రంగాను హత్య చేయించి ఉంటే రంగా భార్య కుమారుడు వంగవీటి రాధ ఇద్దరూ తెలుగుదేశం పార్టీలో ఉండేవారా? రాధా సైతం నా తండ్రి హత్యకు, తెలుగుదేశం పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. దేవినేని నెహ్రూ కుమారుడు అవినాష్‌ను పక్కన పెట్టుకుని రంగా హత్య గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది. ఈ హత్య కేసులో ప్రధాన నిందితుడిగా పేర్కొంటూ దేవినేని నెహ్రూపై అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు.

వివిధ కులాలు, ప్రాంతాల మధ్య విభేదాలు, విద్వేషాలు, ఘర్షణలు చెలరేగినప్పుడు బాధ్యత కలిగిన పౌరులు వాటిని నివారిస్తారు. కానీ జగన్‌రెడ్డి అందుకు భిన్నంగా రాష్ట్రాన్ని తగులబెట్టి చలి కాచుకుంటున్నారు. ఎన్నికల్లో లబ్ధి కోసం రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం ఎవరికీ మంచిది కాదు. రాజకీయాల్లో హుందాగా వ్యవహరించాలి.



కాపులపై నిజంగా ప్రేమ ఉంటే కాపు కార్పొరేషన్‌కు నిధులు ఎందుకు కేటాయించలేదు? చంద్రబాబు కాపులకు ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించారు. కానీ జగన్మోహన్ రెడ్డి వాటిని కొనసాగించకుండా నాటకాలు ఆడారు. నిజాలను చెరిపివేసి అబద్ధాలను వండివారుస్తూ ఎదురుదాడి చేయడం జగన్‌రెడ్డికే చెల్లుతోంది. రంగా హత్యకేసు గుర్తుకువచ్చినప్పుడు... సొంత బాబాయి వివేకానందరెడ్డి హత్య కేసు ఎందుకు గుర్తుకు రావడంలేదు? వివేకా రక్త చరిత్రకు ఐదేళ్లు నిండాయి. మొదట గుండెపోటు.. కాదు చంద్రబాబే హత్య చేశారని ప్రచారం చేశారు. ఇప్పుడు వివేకానందరెడ్డి కుమార్తె సునీత తమ తండ్రి హంతకులను కోర్టు బోనులో నిలబెట్టేందుకు పోరాడుతూ ఉంటే వారిని జగన్‌రెడ్డి కాపాడుతున్నారు. వివేకానందరెడ్డి హత్య కుట్రలో ఎవరెవరు భాగస్వాములో రాష్ట్ర ప్రజానీకానికి అర్థమైంది. వివేకానందరెడ్డి హత్య, కోడికత్తిలాగానే ఇప్పుడు వంగవీటి రంగా హత్యను తెరపైకి తీసుకువస్తున్నారు. తెలుగుదేశం-జనసేన పొత్తు నేపథ్యంలో ఆయనను ఓటమి భయం వెంటాడుతోంది. జగన్‌రెడ్డి అవలంబిస్తున్న అప్రజాస్వామిక విధానాలకు తోడు కాపు సామాజికవర్గం చూపుతున్న వ్యతిరేకతతో ఆయనలో అభద్రతాభావం మొదలైంది.

ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమం ఏదైనా ఒకే స్క్రిప్ట్‌ను వల్లెవేస్తున్నారు. దుష్టచతుష్టయం అంటూ కొన్ని పత్రికలపైనా, ఛానల్స్‌పైనా, చంద్రబాబు, పవన్ కల్యాణ్‌పై పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారు. క్విడ్‌ప్రోకోకు పుట్టిన తన మీడియా ఉండగా, తనకు పత్రికా, టీవీ లేవంటూ నిస్సిగ్గుగా మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారు. పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రజల దృష్టి మరల్చడానికి జగన్‌రెడ్డి రోజుకో కొత్త వేషం వేస్తున్నారు. క్యాస్ట్ వార్ కాదు.. క్లాస్ వార్ అని; పేదలు, పెత్తందార్లకు మధ్య యుద్ధం అని; విశ్వసనీయతకు బ్రాండ్ అంబాసిడర్ అని; 99 శాతం హామీలు అమలుచేశానంటూ ప్రతి సభలోనూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారు. రోజుకు 4 కోట్లు పెట్టి రెండు హెలికాప్టర్లలో తిరిగేవారు పేదవారు ఎలా అవుతారు? 99 శాతం కాదు.. 9 శాతం హామీలు కూడా పూర్తి చేయలేదు. వారంలో సీపీఎస్ రద్దు చేస్తామన్నారు, పోలవరం పూర్తిచేస్తామన్నారు, మద్యపాన నిషేధం అమలుచేస్తేనే ఓట్లు అడుగుతామన్నారు, మరి మద్యాన్ని నిషేధించకుండా ఓట్లడిగే నైతిక హక్కు జగన్‌రెడ్డికి ఉందా? బహిరంగ సభల్లోనే కాదు.. పార్టీ సమావేశాల్లో కూడా అవే మాయమాటలు చెబుతున్నారు.

విశాఖ బీచ్‌లో రూ.1.60 కోట్లతో నిర్మించిన ఫ్లోటింగ్ బ్రిడ్జి ప్రారంభం రోజే తెగిపోయింది. ఆ సంఘటన జరిగిన 24 గంటలు గడవక ముందే కుప్పం బ్రాంచ్ కెనాల్ నీటి విడుదల ఎంతో నవ్వులపాలైంది. సర్కస్ కంపెనీని తలపిస్తూ డ్రామా సెట్టింగ్స్ తరహాలో గేట్లు పెట్టడం దగ్గర నుంచి కృత్రిమంగా నీటిని విడుదల చేసే వరకు అన్ని మయసభ సీన్లను గుర్తుకు తెస్తున్నాయి. పూర్తికాని కాలువ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రావడం, పూజారులు పూజలు చేయడం.. ఇవన్నీ కూడా రక్తి కట్టకపోగా అభాసుపాలయ్యాయి. అన్నమయ్య ప్రాజెక్టు గేట్లు, పులిచింతల గేట్లు, పోలవరం డయాఫ్రం వాల్ కొట్టుకుపోయి చాలాకాలం అయింది. అవి కనీసం మరమ్మతులకు కూడా నోచుకోలేదు. ఇప్పుడు కోట్లు ఖర్చుపెట్టి హెలికాప్టర్లలో ప్రయాణిస్తూ సభల్లో ప్రసంగిస్తున్నారు. దీనికంటే తాడేపల్లి ప్యాలెస్‌లోనే నీటిపారుదల ప్రాజెక్టు సెట్టింగ్ వేసి బటన్ నొక్కి ప్రారంభోత్సవం చేసి ఉంటే ఖర్చులన్నా తగ్గేవి. ఆ ఖర్చులతో గేట్లన్నా వచ్చేవి.

జగన్‌రెడ్డి చేస్తున్న మోసాలు, వేస్తున్న వేషాలను ప్రజలు గమనిస్తున్నారు. సాధారణ పౌరులు మాట్లాడటం వేరు.. బాధ్యత కలిగిన ముఖ్యమంత్రి మాట్లాడటం వేరు. రాష్ట్ర పరువు ప్రతిష్ఠ పోయేలా మాటలు, చేష్టలు, ప్రారంభోత్సవాలు చూస్తుంటే సిగ్గుతో తలదించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక ముఖ్యమంత్రి ఇంత బాధ్యతారాహిత్యంగా మాట్లాడిన దాఖలాలు దేశంలో ఎక్కడా లేవు. వివిధ కులాలు, ప్రాంతాల మధ్య విభేదాలు, విద్వేషాలు, ఘర్షణలు చెలరేగినప్పుడు బాధ్యత కలిగిన పౌరులు వాటిని నివారిస్తారు. కానీ జగన్‌రెడ్డి అందుకు భిన్నంగా రాష్ట్రాన్ని తగులబెట్టి చలి కాచుకుంటున్నారు. రాష్ట్రంలో ఘర్షణలు జరిగి, అల్లర్లు చెలరేగితే అభివృద్ధికి విఘాతం కలుగుతుంది. ఎన్నికల్లో లబ్ధి కోసం ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం ఎవరికీ మంచిది కాదు. రాజకీయాల్లో హుందాగా వ్యవహరించాలి. భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా ఉండాలి. అధర్మం నాలుగు కాళ్లపై నడుస్తోంది. కాబట్టి ప్రజలు ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. సమాజంలో హింసను, అశాంతిని ప్రేరేపించే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి.

• మన్నవ సుబ్బారావు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com







పురస్కారం

డాక్టర్ పిన్నమనేని, సీతాదేవి ఫౌండేషన్ 30వ వార్షికోత్సవం సందర్భంగా ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్‌కు ఫౌండేషన్ పురస్కారాన్ని ప్రదానం చేశారు. మొగల్రాజపురంలోని సిద్దార్థ ఆడిటోరియంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో సోమనాథ్ ప్రసంగం ఆద్యంతం ఆసక్తిగా సాగింది.

శోభాయమానం



మహాశివరాత్రిని పురస్కరించుకుని యనమలకుదురు శివాలయాన్ని విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. శుక్రవారం నాటి వేడుకలకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాలకు భారీ ఎత్తున ప్రభలను సిద్ధం చేస్తున్నారు.

మళ్లీ మొదటికి..!

విజయవాడ రూరల్‌లో మళ్లీ రెచ్చిపోతున్న వైసీపీ నేతలు

కొత్తూరు తాడేపల్లిలో భారీగా అక్రమ మైనింగ్

* అర్ధరాత్రి సమయంలో గుట్టుచప్పుడు కాకుండా తవ్వకాలు
* కలెక్టర్ పరిశీలించి వెళ్లిన రెండు వారాలకే..
* వెలగలేరులో రంగంలోకి దిగిన మైనింగ్ బ్రదర్స్
* అక్రమార్కులపై చర్యలకు కలెక్టర్ సిఫార్సు

సీఎంవో అండతో బరితెగిస్తున్న వైసీపీ నేతలు



అక్రమంగా అర్ధరాత్రి లారీల్లో తరలిస్తున్న గ్రావెల్

విజయవాడ రూరల్ మండలంలో వైసీపీ మైనింగ్ మాఫియా మళ్లీ రెచ్చిపోతోంది. ఎన్నికల కోడ్ వచ్చేలోపు గ్రావెల్‌ను ఇష్టానుసారంగా తవ్వేస్తోంది. కలెక్టర్ వచ్చి, పరిశీలించి అక్రమ క్వారీలను మూసివేసేలా ఆదేశాలిచ్చినా ఏమాత్రం భయం లేకుండా.. రెండు వారాలకే మళ్లీ పనులు చేపట్టారు. 'కలెక్టర్ వస్తే ఏంటి? సీపీ ఏం చర్యలు తీసుకుంటారు? మాకు సీఎంవోలోనే పలుకుబడి ఉంది' అంటూ మళ్లీ అక్రమ క్వారీయింగ్‌కు తెరలేపారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ రూరల్ మండలంలో విధ్వంసక రంగా కొనసాగుతున్న మైనింగ్ మాఫియాకు ఎవరూ అడ్డుకట్ట వేయలేకపోయారని తేలిపోయింది. చట్టాలంటే కొంచెం కూడా భయం లేని వైసీపీ మైనింగ్ మాఫియా ఎన్నికల వేళ మరింత పేట్రేగిపోతోంది. ఎన్నికల కోడ్ వస్తే ఆటలు సాగవేమోనన్న ఉద్దేశంతో రెచ్చిపోతోంది. నైనవరానికి చెందిన వైసీపీ నాయకులు కొత్తూరు తాడేపల్లిలో అక్రమ మైనింగ్ ప్రారంభించాడు. తాడేపల్లిలోని సర్వే నెంబర్ 260 దగ్గర్లోని కొండ సమీపంలో తాను కొన్న అసైన్డ్ భూముల్లో రాత్రికి రాత్రి అక్రమ మైనింగ్ కార్యకలాపాలను ప్రారంభించాడు. సర్పంచ్‌గా ఓడిపోయినా, రాష్ట్రంలో ఉన్నది తమ పార్టీయే కాబట్టి ఇప్పటికే విచ్చలవిడిగా అక్రమ క్వారీయింగ్ చేపట్టాడు. ఇవి చాలవన్నట్టు ఇటీవల కాలంలో పెద్ద సంఖ్యలో అసైన్డ్ భూములు కొన్నాడు. ఇవన్నీ కూడా కొండ పోరంబోకు భూములు. గ్రావెల్ నిక్షేపాలు కలిగినవి. ఎన్నికల నోటిఫికేషన్ నేపథ్యంలో హడావిడిగా ఈ భూములు కొన్నారు. నోటిఫికేషన్ వస్తే ఇబ్బందులు తలెత్తుతాయన్న ఉద్దేశంతో ఈ కాస్త గ్యాప్‌లోనే గ్రావెల్‌ను తరలించుకుపోవాలన్న ఎత్తుగడతో అర్ధరాత్రి సమయాన్ని ఎంచుకున్నారు. సమీప పొలాల్లో దాచిన ఎక్స్‌కవేటర్లను రాత్రి 11 గంటలకు బయటకు తీస్తున్నారు. 11.30 గంటలకల్లా లారీలన్నీ గ్రావెల్ కోసం క్యూ కడుతున్నాయి. వెంటనే ఎక్స్‌కవేటర్లతో గ్రావెల్‌ను తవ్వి లారీల్లో నింపుతున్నారు. చెక్ పోస్టులు ఏర్పాటు చేసిన మార్గం మీదుగానే లారీలు రాత్రుళ్లు ప్రయాణిస్తున్నాయి.

వెలగలేరు చేరిన మైనింగ్ బ్రదర్స్

వెలగలేరులో అక్రమ మైనింగ్ మళ్లీ ప్రారంభమైంది. మైనింగ్ బ్రదర్స్‌గా పేరొందిన ఇద్దరు నేతలు మొన్నటి వరకు వైసీపీ నేతలు. అధికార పార్టీని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా తవ్వేశారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)కి ఇచ్చిన ఫిర్యాదులో వీరిద్దరి గురించి ప్రస్తావించారు. అప్పటికే కొత్తూరు తాడేపల్లిలో తవ్వకాలు పూర్తి చేశారు. ఎన్‌జీటీ ఆదేశాల మేరకు అప్పట్లో విజయవాడ సబ్ కలెక్టర్ తనిఖీలకు వస్తుండటంతో.. వాహనాలు ముందుకు కదలకుండా రోడ్డును తవ్వించిన ఘనులు కూడా వీరే. దీనిపై ఎన్‌జీటీ తీవ్రంగా స్పందించింది. మైనింగ్ బ్రదర్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించింది. తాజాగా మళ్లీ ఈ బ్రదర్స్ రెచ్చిపోతున్నారు. ఎన్నికల కోడ్ వచ్చేలోప తవ్వేయాలని చూస్తున్నారు.

చర్యలు తీసుకోవాలి

ఫిర్యాదులు వచ్చినపుడు మైనింగ్ అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటే ఇలాంటి ఘటనలు పునరావృతం కావు. చర్యలు తీసుకోవాలని ఎన్‌జీటీ ఆదేశాలు జారీ చేసినా అధికారులు ఆ దిశగా ముందడుగు వేయట్లేదు. దీంతో అక్రమార్కులు బరి తెగిస్తున్నారు. ఎన్‌జీటీ ఆదేశాల ప్రకారం అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఇటీవలే కలెక్టర్ దిల్లీరావు, పోలీసు కమిషనర్ కాంతిరాణాకు లేఖ రాశారు.

కలెక్టర్ ఆదేశాలిచ్చినా..

అక్రమ మైనింగ్ చేస్తున్న వైసీపీ నాయకుడిపై కలెక్టర్ దిల్లీరావుకు స్పందనలో అనేక ఫిర్యాదులు వచ్చాయి. మెండెం జమలయ్య అనే స్థానికుడు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 244 ప్రభుత్వ అసైన్డ్ భూమిలో దాదాపు 80 అడుగుల లోతున తవ్వేయటాన్ని పేర్కొన్నారు. దీనిపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఫిర్యాదు వచ్చిన అనంతరం కొద్దిరోజులకు కలెక్టర్ అక్రమ క్వారీయింగ్ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. అక్రమ క్వారీయింగ్‌ను చూసి కలెక్టర్, జేసీలు ఆశ్చర్యపోయారు. అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని, మళ్లీ తనకు ఒక్క ఫిర్యాదు వచ్చినా కఠిన చర్యలు తీసుకుంటానని చెప్పి రెవెన్యూ అధికారులను హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాలను కూడా రెవెన్యూ, మైనింగ్ వ్యవస్థలు తేలిగ్గా తీసుకున్నాయి. మళ్లీ రాత్రిపూట వందలాది లారీల్లో అక్రమ క్వారీయింగ్‌తో గ్రావెల్‌ను తరలించుకుపోతున్నా పట్టించుకోవటం లేదు. స్థానికులు మైనింగ్ అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోవటం లేదు.

అధికారుల స్వామిభక్తి..!

ఎమ్మెల్యే పదవి ఊడినా వంశీ సేవలో అధికారులు

బస్టాండ్ ప్రారంభోత్సవంలో విమర్శలు.. అయినా బ్యాంకు ప్రారంభోత్సవంలోనూ..

గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌పై అధికారులు స్వామిభక్తి చాటుతూ భజన చేస్తుండటంపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. మంగళవారం హనుమాన్ జంక్షన్ బస్టాండ్ ప్రారంభోత్సవంలో మొదలైన ఈ భక్తి బుధవారం గన్నవరం, హనుమాన్ జంక్షన్లలో జరిగిన పలు ప్రారంభోత్సవాల్లోనూ కొనసాగింది. అధికారులు పెద్ద ఎత్తున ఆయన భజనలో తరిస్తున్నా ఆయన మాత్రం ఆయా కార్యక్రమాలకు ముఖం చాటేస్తున్నారు.

హనుమాన్ జంక్షన్, మార్చి 6 : గన్నవరంలోని వ్యవసాయ మార్కెటింగ్ యార్డులో నూతనంగా నిర్మించిన గిడ్డంగులను బుధవారం వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ శిలాఫలంపై వంశీని ఎమ్మెల్యేగా సంబోధించడంపై విపక్షాలు, నియోజకవర్గ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారిక ప్రారంభోత్సవాల్లో ప్రొటోకాల్‌ను తుంగలో తొక్కుతున్న అధికారులపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని విపక్షాలు చెబుతున్నాయి. ఫిబ్రవరి 26నే ఎమ్మెల్యే హోదా కోల్పోయిన వంశీని ఇంకా ఎమ్మెల్యేగా సంబో. దిస్తూ, ప్రొటోకాల్ పాటిస్తూ ఆహ్వానం పలకడం ప్రజలను తప్పుదారి పట్టించడమేనని వారు విమర్శిస్తున్నారు. మంగళవారం హనుమాన్ జంక్షన్‌లో ఆర్టీసీ బస్టాండ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి అధికారులు భారీ ఎత్తున స్వాగత సన్నాహాలు చేశారు. అయినా వంశీ గైర్హాజరయ్యారు. ఆయన అనుచరులు, అధి కార పార్టీకి చెందిన మండల, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు కూడా రాలేదు. బుధవారం కేడీసీసీ బ్యాంకు నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి కూడా ఆయన హాజరు కాలేదు. కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి నాయకత్వంలో నూతన భవనాన్ని లాంఛనంగా ప్రారంభించారు. శిలాఫలకంపై ఎమ్మెల్యేగా వంశీమోహన్ పేరును పేర్కొ న్నారు. సీఎం జగన్, కేడీసీసీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి ఫొటోల మధ్య వంశీ ఫొటో కూడా అతికించి స్వాగతం పలకడం చర్చనీయాంశంగా మారింది.



బ్యాంక్ భవనం ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే వంశీ అంటూ ఫొటోతో శిలాఫలకం

వంశీ ఎక్కడ?

మంగళవారం బస్టాండ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మొహం చాటేసిన వంశీ అనుచరులు, మండల స్థాయి ప్రజాప్రతినిధులు.. బుధవారం బ్యాంకు భవన ప్రారంభోత్సవానికి హాజరుకావడం గమనార్హం. అయితే, వంశీ మాత్రం ఈ కార్యక్రమాలకు రాలేదు. అయితే, మండల స్థాయిలో ఏదైనా అధికార పార్టీ కార్యక్రమాలు నిర్వహించాల్సి వచ్చినపుడు ఎమ్మెల్యే వంశీమోహన్ హాజరవుతున్నారంటూ వైసీపీ నేతలు ప్రచారం చేస్తూ సభలకు జనాన్ని సమీకరించడం పరిపాటి. రెండు నెలల క్రితం బాపులపాడు గ్రామంలోని రెండో లేఅవుట్‌లో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులకు పొజిషన్ చూపించే కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరవుతున్నారని నమ్మించి జనాన్ని సమీకరించారు. కానీ, వంశీ రాలేదు. గతనెలలో డ్వాక్రా మహిళలకు రుణమాఫీ సొమ్ము విడుదల చేసిన సందర్భంగా భారీ ఎత్తున సభ నిర్వహించారు. ఆరోజు కూడా వంశీ వస్తున్నారని ప్రచారం చేశారు. ఆరోజు కూడా ఆయన హాజరు కాలేదు. కొంతకాలంగా పలు కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న వంశీమోహన్ ఏమైపోయారన్న చర్చ నియోజకవర్గంలో నడుస్తోంది.

దీక్ష భగ్నం



విద్యార్థులకు సంబంధించిన రూ.2,750 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని కోరుతూ టీడీపీ జిల్లా కార్యాలయంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలారు నాగశ్రావణ్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షను పోలీసులు బుధవారం రాత్రి భగ్నం చేశారు.

- 6లో..

అంతా రహస్యంపై ఆందోళన

తప్పును కవర్ చేసేందుకు ప్రయత్నాలు

* 'దిశ' వన్‌స్టాప్ సెంటర్ పోస్టుల భర్తీలో కవరింగ్‌లు
* కోర్టుకు వెళ్లే ఆలోచనలో అభ్యర్థులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : దిశ వన్‌స్టాప్ సెంటర్‌లో సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ (సీఏ) పోస్టు భర్తీపై వివాదం కొనసాగుతోంది. తమకు న్యాయం చేయకపోతే కోర్టును ఆశ్రయించాలని అభ్యర్థులు ఆలోచిస్తున్నారు. ఈ వివాదానికి కారణమైన మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు మాత్రం ఉలిక్కి పడ్డారు. ఈ వివాదం నుంచి గట్టెక్కటానికి కొత్త వాదనలు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

కవర్ చేసే ప్రయత్నాలు

గుంటూరు దిశ వన్‌స్టాప్ సెంటర్‌లో పనిచేస్తున్న కేసు వర్కర్‌ను ఎన్టీఆర్ జిల్లాలో సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ పోస్టుకు ఎంపిక చేయటం, ఆమె స్థానికత్వంపై అసలు వివాదం రేగింది. కానీ, ఆమె స్థానికురాలేనన్న కొత్త ప్రచారాన్ని తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. పుట్టినిల్లు గుంటూరు జిల్లా అయితే, మెట్టినిల్లు ఎన్టీఆర్ జిల్లా కాబట్టి.. స్థానికత ఆపాదించే ప్రయత్నం చేస్తున్నారు. ఉద్యోగ నియామకాలకు స్థానికత అంటే.. అదే జిల్లాలో పుట్టి ఉండాలని, నాలుగు నుంచి పదో తరగతి వరకు చదివి ఉండాలన్న సంగతి తెలియంది కాదు. ఇవి పరిశీలించకుండా గుంటూరులో పనిచేసే కేసు వర్కర్‌కు విజయవాడలో ఏ విధంగా పోస్టింగ్ కల్పిస్తారన్నది మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి సమాధానం చెప్పాలి. అర్హులుగా ధ్రువీకరించని వారి వివరాలను ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో పెట్టామని ప్రచారం చేస్తున్నారు. ఎన్ఐసీ వెబ్‌సైట్ అంటే జిల్లా పోర్టల్. అందులో ఎక్కడా కనిపించలేదు. పోనీ, వెబ్‌సైట్ నుంచి తొలగిస్తే కనీసం ఆర్ఎఫ్‌లో అయినా కనిపించాలి. లేదంటే వెబ్‌సైట్‌లో పెట్టలేదని తెలుస్తుంది. పారదర్శకత అంటే ప్రొవిజనల్ లిస్ట్ మొత్తాన్ని ఆన్‌లైన్‌లో పెట్టాలి. పోస్టుకు దరఖాస్తు చేసిన వారి వివరాలు సీరియల్ నెంబర్ సహా అప్లికేషన్ నెంబర్, అభ్యర్థి పేరు, కులం, స్థానికత, అనుభవం, విద్యార్హతలు-మార్కులు, అనుభవం వంటివి ప్రదర్శించాలి. ప్రొవిజనల్ లిస్టును ఎక్కడా పొందుపరచలేదు. వీటిపై గ్రీవెన్స్ అడగాలి. ఫైనల్ మెరిట్ లిస్టును డిస్‌ప్లే చేయాలి. ఈ సందర్భంలో కూడా పైన చెప్పుకొన్న అప్లికేషన్ నెంబర్, అభ్యర్థి పేరు, కులం, స్థానికత, అనుభవం, విద్యార్హతలు-మార్కులు, అనుభవం వంటివి ప్రదర్శించాలి. ఇలా చేస్తేనే పారదర్శకత పాటించినట్టు అవుతుంది. ఇవేమీ చేయకుండా అన్ని అర్హతలు కలిగిన వారినే ఎంపిక చేశామని ప్రకటిస్తే సరిపోదన్న సంగతి మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు గుర్తించాలి. ఈ వ్యవహారంపై మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి జి.ఉమాదేవి బుధవారం స్పందించారు. అర్హతల ప్రకారం, విద్యానుభవాలు, స్థానికతలను దృష్టిలో ఉంచుకుని అభ్యర్థిని ఎంపిక చేశామని చెప్పారు. కాగా, జిల్లా కలెక్టర్ దీనిపై థర్డ్‌పార్టీతో సమగ్ర విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది.

మనోళ్లే.. అనుమతులిచ్చేయండి



రవాణాలో ఏటీసీల ఏర్పాటులో అధికారుల ఆత్రుత

* అధికార పార్టీ టెండరుదారులకు మార్గంసుగమం
* నిబంధనలు తోసిపుచ్చి హడావుడిగా అనుమతులు
* టెండర్లలో పాల్గొన్న చెవిరెడ్డి బంధువులు, కడప కాంట్రాక్టర్లు
* ఎన్నికల కోడ్ రానుండటంతో వేగంగా పావులు

తలలు పట్టుకుంటున్న అధికారులు

వాహనాల ఫిట్‌నెస్ టెస్టుల నిర్వహణను ప్రైవేట్ చేతుల్లో పెట్టేందుకు తహతహలాడుతున్న రవాణా శాఖ ఇందుకోసం నిబంధనలను కాలరాసేందుకు కూడా వెనుకాడటం లేదు. ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్ల (ఏటీసీ) పేరుతో ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు రెండు జిల్లాల్లో టెండర్లు పిలిచిన రవాణా శాఖ వాటికి సంబంధించి యుద్ధప్రాతిపదికన టెండర్లు ఖరారు చేయాల్సిందిగా అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈనెల 12లోపు ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేట్ సంస్థలకు ఏటీసీలను కట్టబెట్టేందుకు చర్యలు చేపడుతున్నారు. అయితే, దీని వెనుక రాజకీయ కోణం కూడా ఉందనే చర్చ జరుగుతోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వాహనాల ఫిట్‌నెస్ టెస్టుల నిర్వహణను ప్రైవేట్ చేతుల్లో పెట్టేందుకు ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్ల (ఏటీసీ)ను రవాణా శాఖ తెరపైకి తెచ్చింది. ఈ ప్రక్రియ మొత్తానికి కొన్ని మార్గదర్శకాలతో కూడిన నిబంధనలను పొందుపరిచింది. అయితే, టెండర్లలో అధికార పార్టీకి చెందిన నేతలు పాల్గొన్నందున వారికోసం ఆ నిబంధనలను తుంగలో తొక్కడం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. సాధారణంగా ఏటీసీలను నిర్వహించే సంస్థలు తమ సొంత స్థలాల్లో, సొంత ఎక్విప్‌మెంట్‌ను ఏర్పాటు చేసుకోవాలి. దీనికోసం రవాణా శాఖ ఆర్ఎఫ్‌పీలోనే అనేక నిబంధనలు పొందుపరిచింది. వీటిని పాటిస్తే కాలాతీతమవుతుంది. ఈలోపు ఎన్నికల కోడ్ వస్తుంది. ఈ నేపథ్యంలో నిబంధనల ప్రకారం.. స్థలాలు, ఇతరత్రా వంటివి లేకపోయినా చూసీచూడనట్టుగా అనుమతులు ఇచ్చేయమని ఉన్నతాధికారులు మౌఖికంగా ఆదేశాలు జారీ చేశారు. అధికారికంగా ఆదేశిస్తే అడ్డంగా ఇరుక్కుపోతామన్న ఉద్దేశంతో ఉన్నతాధికారులు జిల్లా అధికారులను బలిచేసేందుకు సిద్ధమయ్యారు. ఒకవేళ ఉన్నతాధికారుల ఒత్తిడికి తలొగ్గితే.. ప్రభుత్వం మారాక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తోందని జిల్లా అధికారులు తర్జనభర్జన పడుతున్నారు.

అధికార పార్టీ నేతల బంధువులకు..

ఏటీసీల ఏర్పాటుకు పిలిచిన టెండర్లలో అధికార పార్టీకి చెందిన నేతల బంధువులు ఉన్నారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి చెవిరెడ్డి భాస్కరరెడ్డి బంధువుల పేరుతో ఒకరు టెండరు వేశారు. చెవిరెడ్డి మునిరెడ్డి రోసమ్మ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఈ టెండరు పడింది. హరిత్‌రెడ్డి అనే వ్యక్తిని డైరెక్టర్‌గా పేర్కొన్నారు. మరో టెండర్ బీవీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్. ఇది కూడా అధికార పార్టీకి బాగా కావాల్సిన సంస్థ. కడపలో పలు రోడ్డు ప్రాజెక్టులను ఈ సంస్థ చేపట్టింది. వీరికోసం అధికార పార్టీ పెద్దల ఒత్తిడితో రవాణా శాఖ ఉన్నతాధికారులు జిల్లా అధికారులపై మౌఖిక ఆదేశాలతో టెండర్లను ఖరారు చేయాల్సిందిగా ఒత్తిడి తెస్తున్నారు. దీంతో టెండర్లను ఖరారు చేసేందుకు జిల్లా అధికారులు సిద్ధమవుతున్నారు.

నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలపైనా బాదుడు

ఇప్పటివరకు రవాణా వాహనాలైన లారీలు, ట్యాక్సీలు, క్యాబ్‌లు, వ్యాన్‌లు, ట్రాలీలు, ట్యాంకర్లు, జేసీబీలు.. ఇలాంటి వాహనాలకే ఫిట్‌నెస్ టెస్టులు చేసేవారు. తాజాగా ప్రవేశపెడుతున్న ఏటీసీ వ్యవస్థలో రవాణాయేతర వాహనాలైన ద్విచక్ర వాహనాలు, సొంతంగా ఉపయోగించే కార్ల వినియోగదారులు కూడా తమ వాహనాలకు ఫిట్‌నెస్ టెస్టులు చేయించాల్సి ఉంటుంది. ఏటీసీ నిర్వహిస్తున్న సంస్థలకు కూడా అదనంగా ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది.

వాహన్ డేటా బేస్ యాక్సెస్‌కు పగ్గాలా..?

దేశవ్యాప్తంగా వాహనాల డేటా బేస్‌ను నిల్వచేసే వాహన్ డేటా బేస్‌ను కూడా యాక్సెస్ చేసే అధికారం ప్రైవేట్ సంస్థలకు ఉంటుంది. ఇప్పటికే వాహన డేటా బేస్‌ను కొంతమంది పక్కదారి పట్టించారు. దీనిని బట్టి ప్రైవేట్ సంస్థలకు డేటా బేస్ యాక్సెస్ ఇవ్వటం సురక్షితం కాదని అర్థమవుతుంది.

వాహనదారులపై బాదుడు ఇలా..

15 ఏళ్లలోపు శ్రేణిలో ద్విచక్ర వాహనాలకు మాన్యువల్ విధానంలో రూ.200, ఆటోమేటెడ్ టెస్టింగ్ అయితే రూ.400, మూడు చక్రాల వాహనాలకు మాన్యువల్ రూ.400, ఆటోమేటిక్ టెస్టింగ్ రూ.600, లైట్ మోటార్ వెహికల్ (ఎల్ఎంవీ) మాన్యువల్‌గా రూ.400, ఆటోమేటిక్ టెస్టింగ్ ద్వారా రూ. 600, మీడియం మోటార్ వెహికల్ (ఎంఎంవీ), హెవీ మోటార్ వెహికల్ (హెచ్ఎంవీ) మాన్యువల్ రూ.600, ఆటోమేటిక్ రూ.1,000 చొప్పున వసూలు చేస్తారు. అదే 15 ఏళ్లు దాటిన వాహనాల శ్రేణికి సంబంధించి చూస్తే టూవీలర్లకు మాన్యువల్ రూ.400, ఆటోమేటిక్ టెస్ట్ రూ.500, త్రీ వీలర్స్‌కు మాన్యువల్ రూ.800, ఆటోమేటిక్ టెస్ట్ రూ.1,000, ఎల్ఎంవీలకు మాన్యువల్ రూ.800, ఆటోమేటిక్ టెస్ట్ రూ.1,000, ఎంఎంవీలకు మాన్యువల్ రూ.800, ఆటోమేటిక్ టెస్ట్ రూ.1,300, హెచ్ఎంవీలకు రూ.1,500 వసూలు చేయనున్నారు. రవాణాయేతర వాహనాలకు కూడా ఇదే విధానంలో ఫీజులు వసూలు చేయనున్నారు.



ముస్తాబైన సంగమేశ్వరస్వామి ఆలయం, సంగమేశ్వరస్వామి(ఇన్‌సెట్‌లో)

నేటి నుంచి సంగమేశ్వరుని బ్రహ్మోత్సవాలు

నాగాయలంక, మార్చి 6 : సంగమేశ్వరం గ్రామంలో గంగాపార్వతీ సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఈవో సీహెచ్‌ సుధాకర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగులతో ముస్తాబు చేసి, చలువ పందిళ్లు వేశారు. 7వ తేదీ ఉదయం 9 గంటలకు స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరణ, సాయంత్రం 6 గంటలకు వినాయక పూజ, పుణ్యాహవచనం, అంకురారోహణ, ధ్వజారోహణ, యాగశాల ప్రవేశం, బలిహారణ, 8వ తేదీ ఉదయం 4.30 గంటలకు మహాశివరాత్రి సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, సాయంత్రం 6 గంటలకు జగాజ్యోతి, 7 గంటలకు స్వామివారి ఎదుర్కోలు ఉత్సవం, 8 గంటలకు స్వామివారి దివ్య కళ్యాణ మహోత్సవం, లింగోద్భవ కాలంలో 108 కేజీల విభూదితో అభిషేకాలు, 9వ తేదీ రాత్రి 9 గంటలకు స్వామివారి రథోత్సవం, 10వ తేదీన ఉదయం 9 గంటలకు వసంతోత్సవం, 10 గంటలకు పురవీధులలో ఊరేగింపు, సముద్ర విహారం, రాత్రి 10 గంటలకు పవళింపు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు.



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న రాష్ట్ర ఉపాధి మండలి సభ్యులు

ఎన్టీఆర్‌ జిల్లాలో ఉపాధి పనుల పరిశీలన

కృష్ణలంక, మార్చి 6 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఇజీఎస్‌) పనుల అమలు తీరును బుధవారం రాష్ట్ర ఉపాధి మండలి సభ్యులు పరిశీలించారు. విజయవాడ రూరల్‌, ఇబ్రహీంపట్నం మండలాల్లో వర్క్‌సైట్‌లను సందర్శించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాన్ని సాధించిన అధికారులు, సిబ్బందిని ప్రశంసించారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అధ్యక్షతన స్థానిక సంస్థలు, సొసైటీలు, ఇతర సంస్థల నుంచి తొమ్మిది మంది సభ్యులతో ఏపీఎస్‌ఈజీసీ ఏర్పాటైంది. ఎన్టీఆర్‌ జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం ఈ బృందం పర్యటించింది. క్షేత్రస్థాయి పర్యటనలో విజయవాడ సమీపంలోని నున్నలో నిర్మించిన ఫాంపాండ్‌ను పరిశీలించారు. అనంతరం జూపూడిలోని సాలిడ్‌ వేస్ట్‌ ప్రాసెసింగ్‌ సెంటర్‌ను సందర్శించారు. ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనుల వివరాలను బృందం సభ్యులు డ్వామా ప్రాజెక్ట్‌ డైరెక్టర్‌ జె.సునీతను అడిగి తెలుసుకొన్నారు. నున్న సర్పంచ్‌ కె.సరళ, ఉప సర్పంచ్‌ కె.బ్రహ్మానందరెడ్డి, పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ, ఎంజీఎన్‌ఆర్‌ఇజీఎస్‌ కన్సల్టెంట్‌ కె.శ్రీనివాస్‌, తదితరులు వున్నారు.

ఎన్నికల సమగ్ర సమాచారం చేరవేతలో..

సమన్వయంతో పనిచేయాలి

▸ సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్‌

కృష్ణలంక, మార్చి 6 : త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరవేయడంలో ఎన్నికల అధికారుల సూచనల మేరకు సమన్వయంతో పనిచేయాలని సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్‌ టి.విజయకుమార్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. సాధారణ ఎన్నికల సందర్భంగా మీడియా సెంటర్‌, మీడియా సర్టిఫికేట్‌ మోనిటరింగ్‌ కమిటీ (ఎంసీఎంసీ) మీడియా మోనిటరింగ్‌ కమిటీ (ఎంఎంసీ) సోషల్‌ మీడియా మోనిటరింగ్‌ కమిటీలు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు విజయకుమార్‌రెడ్డి గురువారం డీఐపీఆర్వో కార్యాలయాన్ని సందర్శించి త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై సమీక్షించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్‌ నియోజకవర్గం నుంచి ఏ అభ్యర్థి ఎంత మెజార్టీతో గెలుపొందింది.. సమీప ప్రత్యర్థి ఓట్లు తదితర వివరాలతో సమాచారాన్ని ప్రత్యేక బోర్డుల ద్వారా ప్రదర్శించాలని సూచించారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లా ఎన్నికల అధికారి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్‌ అండ్‌ మోనిటరింగ్‌ కమిటీ (ఎంసీఎంసీ), మీడియా సెల్‌, సోషల్‌ మీడియా సెల్‌ ద్వారా విజయవంతంగా కార్యకలాపాలు నిర్వహించేందుకు కలెక్టర్‌, జిల్లా ఎన్నికల అధికారి సూచనలను పరిగణలోకి తీసుకొని అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. మీడియా ప్రతినిధులకు పోలింగ్‌, కౌంటింగ్‌ పాస్‌లు జారీ చేసేందుకు ఎన్నికల అధికారులకు నివేదికలు సమర్పించాలని తెలిపారు. కమిషనర్‌ వెంట డీఐపీఆర్‌ఓ యు.సురేంద్రనాథ్‌, డీపీఆర్‌వో మోహన్‌రావు, డివిజనల్‌ పీఆర్వో కె.రవి, ప్రచార సహాయకులు వి.వి.ప్రసాద్‌ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్‌

జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలి

▸ ఏపీ ఫిషర్‌మెన్‌ జేఏసీ చైర్మన్‌ సైకం రాజశేఖర్‌

ధర్నాచౌక్‌, మార్చి 6 : రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 లక్షల జనాభా కలిగిన సాంప్రదాయ మత్స్యకార కులాలకు జనాభా దమాషా ప్రకారం రాజకీయ ప్రాధాన్యత కల్పించడంలేదని ఏపీ ఫిషర్‌మెన్‌ జేఏసీ చైర్మన్‌ సైకం రాజశేఖర్‌ ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీనగర్‌ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రేపల్లె సీటును మత్స్యకారులకు కేటాయించే అంశంలో వైసీపీ తన మొండి వైఖరి విడనాడాలని డిమాండ్‌ చేశారు. టీడీపీ నుంచి విశాఖ దక్షిణం, కాకినాడ సిటీ, శ్రీకాళహస్తి, మంత్రాలయం, అసెంబ్లీ సీట్లను, జనసేన నుంచి నర్సాపురం, శ్రీకాళహస్తి, అవనిగడ్డ, మత్స్యకారులకు కేటాయించాలన్నారు. జనాభా దామాషా ప్రకారం మత్స్యకారులకు తగినన్ని సీట్లు కేటాయించాలని, లేదంటే రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని రాజకీయ పార్టీలను హెచ్చరించారు. జి.రామారావు, ఎం.నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వేతన బకాయిలు చెల్లించండి

▸ సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

ధర్నాచౌక్‌, మార్చి 6 : వాటర్‌ సప్లయ్‌ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్‌.నర్సింగరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఏపీ ఆర్‌డబ్ల్యూఎస్‌ కాంట్రాక్టు ఎంప్లాయిస్‌ అండ్‌ కాంట్రాక్టు వర్కర్స్‌ యూనియన్‌ (సీఐటీయూ) ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో బుధవారం ధర్నా జరిగింది. ఈ ధర్నాను ప్రారంభించిన ఆయన మాట్లాడారు. వాటర్‌ సప్లయ్‌ కార్మికులు చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్నారన్నారు. 6 నుంచి 23 నెలలుగా బకాయిలు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని లేదంటే వారి ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. యూనియన్‌ రాష్ట్ర కన్వీనర్‌ జి.ఓబులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆశా వర్కర్స్‌ యూనియన్‌ రాష్ట్ర నాయకురాలు ధనలక్ష్మి, సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి ముజఫర్‌ అహ్మద్‌, ఐఎఫ్‌టీయూ నేత పోలారి ఈ ధర్నాలో పాల్గొని కార్మికులకు సంఘీభావం తెలిపారు.

గన్నవరంలో ఇస్రో చైర్మన్‌కు ఘనస్వాగతం

గన్నవరం : ఇస్రో చైర్మన్‌ డాక్టర్‌ సోమనాథ్‌కు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. బెంగళూరు నుంచి ఇండిగో విమానంలో గన్నవరం విమానాశ్రయానికి బుధవారం విచ్చేశారు. పలువురు పూలబొకేలు అందజేశారు. అనంతరం రోడ్డు మార్గాన విజయవాడ వెళ్లారు.



నాగ శ్రావణ్‌ దీక్ష భగ్నం

▸ బలవంతంగా ప్రభుత్వాసుపత్రికి తరలింపు

వన్‌టౌన్‌, మార్చి 6 : ఫీజు రీయింబర్స్‌మెంట్‌ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్‌ చేస్తూ గత నాలుగు రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలారు నాగశ్రావణ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో నాగశ్రావణ్‌ నిరవధిక నిరాహార దీక్ష చేపట్టాడు. నాలుగు రోజులుగా దీక్షలో ఆరోగ్యం క్షీణించడంతో బుధవారం రాత్రి 11 గంటల సమయంలో పటమట స్టేషన్‌లోని గురునానక్‌ కాలనీ సెక్టార్‌ ఇన్‌స్పెక్టర్‌ విపద్మ సిబ్బందితో కలిసి దీక్ష విరమించాలని కోరారు. దానికి శ్రావణ్‌ అంగీకరించకపోవడంతో అదుపులోకి తీసుకుని వైద్యం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అరెస్టు సమయంలో పలువురు టీడీపీ కార్యకర్తలు అడ్డుకునేందుకు ప్రయత్నించినా పోలీసులు పట్టించుకోకుండా ఆసుపత్రికి తరలించారు.



నాగశ్రావణ్‌ దీక్ష భగ్నం చేసి బలవంతంగా ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు

చరిత్రలో నిలిచిపోయే దీక్ష

▸ నాగశ్రావణ్‌ను పరామర్శించిన ఎంపీ రామ్మోహన్‌నాయుడు

విద్యాధరపురం: యువతరం ఏకం కావాలని, వైసీపీకి చరమగీతం పాడాలని శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు పిలుపునిచ్చారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో 4 రోజులుగా నిరవధిక నిరాహారదీక్ష చేస్తున్న తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలారు నాగశ్రావణ్‌ను బుధవారం ఆయన పరామర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుతో నష్టపోయిన ప్రతి యువకుడు తిరుగుబాటు చేయాల్సిన సమయం వచ్చిందని, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోరుతూ నాగశ్రావణ్‌ నిరవధిక నిరాహారదీక్ష చరిత్రలో నిలిచిపోతుందన్నారు. శ్రావణ్‌ దీక్ష స్ఫూర్తిగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.



నాగశ్రావణ్‌ను పరామర్శిస్తున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

రానున్నది పసుపు సునామి

▸ బెజవాడలో గెలిచేది కేశినేని చిన్ని..
ఆడియో ఆవిష్కరణలో మాజీ మేయర్‌ కోనేరు శ్రీధర్‌

విద్యాధరపురం, మార్చి6 : ఇచ్చిన మాటకు కట్టుబడి, క్రమశిక్షణ నిబద్ధత, సేవా గుణాలు ఆభరణాలుగా గల కేశినేని శివనాథ్‌ (చిన్ని) విజయవాడ ఎంపీగా ఘన విజయం సాధిస్తారని మాజీ మేయర్‌ కోనేరు శ్రీధర్‌ ఆశాభావం వ్యక్తం చేశారు. గురునానక్‌ కాలనీలోని కేశినేని శివనాథ్‌ కార్యాలయం ఎన్టీఆర్‌ భవన్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో 'బెజవాడలో గెలిచేది కేశినేని చిన్ని' అనే మకుటంతో సాగిన పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'రానున్నది పసుపు సునామి' అని టీడీపీ-జనసేన కూటమి గెలుపును ఎవ్వరూ అడ్డుకోలేరని తెలిపారు. రెండు సంవత్సరాలుగా కేశినేని చిన్ని అనేక సేవా కార్యక్రమాలతో ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. కేశినేని చిన్నిపై రూపొందించిన పాట ప్రజల్లోకి చొచ్చుకుపోయి ప్రతిఇంట వినిపిస్తుందని పేర్కొన్నారు. టీఎన్‌ఎస్‌ఎఫ్‌ జనరల్‌ సెక్రటరీ పి.చరణ్‌సాయియాదవ్‌ ఆధ్వర్యంలో ప్రజాగాయకుడు రంగం రాజేష్‌ రచించి ఆలపించారని తెలిపారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు, ఎన్టీఆర్‌ జిల్లా మైనార్టీ సెల్‌ అధ్యక్షుడు షేక్‌ కరీముల్లా, టీడీపీ మహిళా అధ్యక్షురాలు ఉషారాణి, కార్పొరేటర్‌ గాంధీ, టీఎన్‌టీయూసీ తూర్పు నియోజకవర్గ అధ్యక్షుడు బినాని తదితరులు పాల్గొన్నారు.

74 శాతం ఆర్యవైశ్యుల మద్దతు : చిన్ని

రాష్ట్రంలోని 74 శాతం మంది ఆర్యవైశ్యులు టీడీపీకి మద్దతు పలుకుతున్నారని కేశినేని చిన్ని అన్నారు. బుధవారం ఆర్యవైశ్యులు కేశినేని చిన్ని ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించిన చిన్ని మాట్లాడుతూ, ఆర్యవైశ్యులు కార్యదక్షతకు నిదర్శనమన్నారు. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహాసభ అదనపు ప్రధాన కార్యదర్శి గొంట్లా రామ్‌మోహన్‌రావు, మట్టాసుబ్బారావులతో పాటు అత్యధికసంఖ్యలో పార్టీలో చేరారు. గద్దె రామ్మోహన్‌ను భారీ మెజారిటీతో గెలిపించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్‌ కోనేరు శ్రీధర్‌, బొప్పన భవకుమార్‌, చెన్నుపాటి గాంధీ, గురునాధం నాగేశ్వరరావు, నరసింహచౌదరి, ముమ్మనేని ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.



కేశినేని శివనాథ్‌ ఆడియో ఆవిష్కరణలో మాజీ మేయర్‌ కోనేరు శ్రీధర్‌ తదితరులు

టీడీపీలో చేరిన ఆర్యవైశ్య నాయకులు

వన్‌టౌన్‌ : విజయవాడకు చెందిన పలువురు ఆర్యవైశ్య నాయకులు బుధవారం ఉండవల్లిలోని నారా చంద్రబాబునాయుడు నివాసంలో జరిగిన కార్యక్రమంలో పార్టీలో చేరారు. చంద్రబాబు వారిని సాదరంగా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సెంట్రల్‌ మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకుడు, దుర్గగుడి ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు దరిశి వాసు, విజయవాడ అర్బన్‌ ఆర్యవైశ్య నాయకుడు కందుకూరు గోపి, లక్ష్మయ్య, సుబ్బారావు తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు డూండీ రాకేశ్‌, అయోధ్యనగర్‌ కార్పొరేటర్‌ చెన్నగిరి రామ్‌మోహన్‌, విజయవాడ మార్కెట్‌ యార్డ్‌ మాజీ వైస్‌చైర్మన్‌ తుమ్మలపెంట శ్రీనివాస్‌, ఆర్యవైశ్య నాయకుడు జులూరి నాగేశ్వరరావు, పి.శ్రీనివాస్‌, జే.సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన దరిశి వాసు తదితరులు

రూ.13 లక్షల కోట్లు ఏమయ్యాయి జగన్‌?

▸ మాజీమంత్రి ఉమా సూటి ప్రశ్న

జి.కొండూరు, మార్చి 6 : ఐదేళ్ల పాలనలో సుమారు రూ.13 లక్షల కోట్ల అప్పు చేసి ఆ డబ్బుతో ప్రజల కనీస అవసరాలు సమకూర్చకుండా ఏం చేశావ్‌ జగన్మోహన్‌ రెడ్డి.. అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. కుంటముక్కలలో బుధవారం ఆయన శంఖారావంలో పాల్గొని ఇంటింటికి తిరుగుతూ సూపర్‌ సిక్స్‌ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఉమా మాట్లాడుతూ, పట్టిసీమ ద్వారా సాగునీరు అందించి ఈప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత చంద్రబాబు నాయుడిదే అన్నారు. ఎయిడెడ్‌ స్కూల్స్‌ మూసేయించిన జగన్‌ ఎస్సీ విద్యార్థులకు ప్రాథమిక విద్యను దూరం చేశారన్నారు. బీసీ సబ్‌ప్లాన్‌ నిధులు పక్కదారి పట్టించిన జగన్‌ బీసీలపై కపట ప్రేమ చూపిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జువ్వా రామకృష్ణ, లంక రామకృష్ణ, సుకవాసి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

వన్‌టౌన్‌, మార్చి 6 : జాతీయ మానవ హక్కుల కమిషన్‌ చైర్మన్‌ జస్టిస్‌ అరుణ్‌ మిశ్రా దంపతులు, ఆయన బృందం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మవారిని బుధవారం దర్శించుకున్నారు. ఎన్టీఆర్‌ జిల్లా కలెక్టర్‌ దిల్లీరావు, ఈవో రామరావు, జాయింట్‌ కలెక్టర్‌ సంపత్‌ కుమార్‌ వారికి సాదర స్వాగతం పలికారు. అరుణ్‌మిశ్రా దంపతులు పంచహారతుల కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు..

● దుర్గమ్మవారిని దేవదాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌ కరికాల వలన్‌ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో రామరావు స్వాగతం పలికారు, దుర్గమ్మవారి దర్శనం అనంతరం ఆయనకు ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందచేశారు.

● దుర్గగుడి ట్రస్ట్‌బోర్డుకు సభ్యురాలిగా నియామకమైన అమలాపురపు రామలక్ష్మి, ప్రత్యేక ఆహ్వానితుడిగా నియామకమైన అల్లం భువన్‌కుమార్‌లు బుధవారం దుర్గగుడికివిచ్చేసి ఈవో రామరావు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌ రాంబాబును కలిసారు. దుర్గమ్మవారిని దర్శించుకున్న అనంతరం బాధ్యతలు స్వీకరించారు.



జాతీయ మానవ హక్కుల కమిషన్‌ చైర్మన్‌ అరుణ్‌ మిశ్రాకు స్వాగతం పలికిన కలెక్టర్‌ దిల్లీరావు, ఈవో రామారావు తదితరులు

ధ్వజారోహణం..

మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం సాయంత్రం మల్లేశ్వరాలయంలోని ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక అర్చనలు చేసి ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు వివిధ ఆగమోక్తంగా వివిధ వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఈవో రామరావువైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గురువారం ఉదయం, సాయంత్రం సమయాలలో మండపారాధన, ఔపాసనలు బలిహరణ, మూలమంత్ర హవనాలు, హారతి, మంత్రపుష్పం, తీర్ధ ప్రసాద వినియోగం జరుగుతాయి



ధర్మపథం వేదికపై..

దుర్గగుడిలోని ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన సూర్య ప్రభ సంగీత అకాడమీకి చెందిన లలిత, శ్రీనిత్య, సురేఖ, .జగన్మోహిని, అభిరామ్‌లు వివిధ కీర్తలను పాడి అలరించారు.

మండలితో జనసేన ఆశావహుల భేటీ!

అవనిగడ్డ, మార్చి 6 : తెలుగుదేశం-జనసేన పొత్తు నేపథ్యంలో అవనిగడ్డ నియోజకవర్గం నుంచి జనసేన సీటు ఆశిస్తున్న పలువురు ఆశావహులు బుధవారం మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌ను వేర్వేరుగా కలవటం చర్చనీయాంశంగా మారింది. అవనిగడ్డ సీటును జనసేనకు కేటాయించనున్నట్టు ముమ్మరంగా ప్రచారం జరుగుతోంది. ఆ పార్టీ తరఫున ప్రముఖ వ్యాపారవేత్త విక్కుర్తి శ్రీనివాస్‌, జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, అక్షయ డెవలపర్స్‌ అధినేత మాదివాడ వెంకటకృష్ణ (బ్రదర్‌ క్రిస్టియన్‌), రాష్ట్ర సర్పంచ్‌ల సంక్షేమ సంఘ అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు, ప్రముఖ న్యాయవాది మత్తి వెంకటేశ్వరరావు, సీనియర్‌ రాజకీయవేత్త బచ్చు వెంకటనాథ్‌ తదితరులు జనసేన తరఫున పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం మాదివాడ వెంకటకృష్ణ బుద్ధప్రసాద్‌ను కలిసి గంటన్నర పైగా ఏకాంతంగా చర్చలు జరిపారు. బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, రాష్ట్ర సర్పంచ్‌ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు, న్యాయవాది మత్తి వెంకటేశ్వరరావులు బుద్ధప్రసాద్‌ను వేర్వేరుగా కలిసి చర్చలు జరిపారు. టీడీపీ తరఫున బుద్ధప్రసాద్‌కు టిక్కెట్‌ వస్తే తాము మద్దతుగా ఉంటామని, అలా కానీపక్షంలో తమకు మద్దతునివ్వాలని వారు మండలిని కోరినట్టు సమాచారం. ఒకేరోజు జనసేన పార్టీ తరఫున టిక్కెట్‌ ఆశిస్తున్న ముగ్గురు బుద్ధప్రసాద్‌తో చర్చ జరపటం దివి ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది.

బుద్ధప్రసాద్‌కు అరుదైన గౌరవం

తెలుగు భాషా వికాసం కోసం విశేష కృషిచేస్తున్న మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌కు అరుదైన గౌరవం దక్కింది. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో ఒకటైన న్యూజెర్సీ జనరల్‌ అసెంబ్లీ బుద్ధప్రసాద్‌కు తెలుగు భాషా వికాసంకోసం చేస్తున్న కృషిని అభినందిస్తూ తీర్మానాన్ని చేసి న్యూజెర్సీ మాజీ డిప్యూటీ స్పీకర్‌ చివుకుల ఉపేంద్ర ద్వారా గుంటూరులో విశ్వయోగి విశ్వంజీ సమక్షంలో బుద్ధప్రసాద్‌కు ప్రతిని అందజేశారు. బుద్ధప్రసాద్‌ను ప్రముఖ వ్యక్తిగా గుర్తించి అసెంబ్లీ ఈ తీర్మానం చేసినట్టు చివుకుల ఉపేంద్ర తెలిపారు. ఈ తీర్మానం పట్ల బుద్ధప్రసాద్‌ హర్షం వ్యక్తం చేశారు. ఇది తెలుగు భాషోద్యమకారులకు, తెలుగు ప్రజలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్టు ఆయన అన్నారు.



తీర్మానం ప్రతిని బుద్ధప్రసాద్‌కు ఇస్తున్న ఉపేంద్ర



వధూవరులుగా ముస్తాబైన గంగ, పార్వతి, మల్లేశ్వరుల ఉత్సవ మూర్తులు

శివరాత్రి ఉత్సవాలకు సిద్ధం

▸ ఇంద్రకీలాద్రిపై వధూవరులుగా అలంకృతులైన గంగా, పార్వతీ, మల్లేశ్వరులు

వన్‌టౌన్‌, మార్చి 6 : ఇంద్రకీలాద్రిపై గంగ, పార్వతీ, మల్లేశ్వరుల ఉత్సవ మూర్తులకు బుధవారం మంగళస్నానాలు చేయించి శివరాత్రి మహోత్సవాలకు సిద్ధం చేశారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రాలు, సంప్రదాయం, ఆచారాల మేరకు ఉత్సవ మూర్తులకు మంగళస్నానాలు చేయించారు. అనంతరం పట్టు వస్త్రాలను ధరింపజేసి వధూ వరులుగా సిద్ధం చేశారు. తొలుత శాస్త్రోక్త విధానంలో విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. ఈవో రామారావు దంపతులు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌ రాంబాబు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న లక్ష్మీనారాయణ తదితరులు

ఓటుకు నోటును అడ్డుకోవాలి.. పంచితే పట్టివ్వాలి

▸ ఏపీ యునైటెడ్‌ ఫ్రంట్‌ కన్వీనర్‌ లక్ష్మీనారాయణ

ధర్నాచౌక్‌, మార్చి 6: రాష్ట్రంలో త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఓటుకు నోటును నిరోధించాలని, ఎన్నికల కమిషన్‌ నిఘాకు తోడు తమ లాంటి పార్టీలు సైతం విజిలెన్స్‌ ఏర్పాటు చేయాలని ఏపీ యునైటెడ్‌ ఫ్రంట్‌ కన్వీనర్‌ వీవీ లక్ష్మీనారాయణ తెలిపారు. ఫ్రంట్‌ నేతల సమావేశం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగింది. ఎన్నికల్లో డబ్బు పంచేవారికి చెక్‌ పెట్టాలన్నారు. ఎప్పటికప్పుడు ఫొటోలు, వీడియోలు తీసి ఎన్నికల కమిషన్‌ దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. బీసీ ఐక్య వేదిక, సమతా సైనిక్‌దళ్‌, బీసీ చైతన్య సమితి, బోయి వాల్మీకి, నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సంఘం, ప్రజా సోషలిస్టు కూటమి, శెట్టి, బలిజ హక్కుల పోరాట కమిటీ, క్రిస్టియన్‌, మైనార్టీ హక్కుల పోరాట కమిటీ, ఆలిండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘం తదితర ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొని ఏపీ యూనైటెడ్‌ ఫ్రంట్‌కు మద్దతు తెలిపారు. ఫ్రంట్‌ నేతలు పోతిన వెంకట రామారావు, శివభాగ్యారావు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సెబ్‌ ఏఎస్పీ వెంకటేశ్వరరావు

206 కేజీల గంజాయి స్వాధీనం

గన్నవరం, మార్చి 6 : సెబ్‌ అధికారుల తనిఖీల్లో భాగంగా 206 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు స్పెషల్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ బ్యూరో(సెబ్‌) డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక సెబ్‌ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గంజాయి రవాణపై ప్రత్యేక నిఘా ఉంచి ఉంగుటూరు మండలం పొట్టిపాడు టోల్‌గేటు వద్ద సెబ్‌ అధికారులు తనిఖీలు చేస్తుండగా తమిళనాడు వైపు వెళుతున్న ట్రాలీ లారీలో తరలిస్తున్న 97 ప్యాకెట్లలోని 206 కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా రెడ్‌హిల్స్‌కు చెందిన తాతపూడి దేవయ్య జోష్వజ్ఞానరాజ్‌ను అదుపులోకి తీసుకుని కేసునమోదు చేసినట్టు తెలిపారు. అతడి నుంచి మూడు సెల్‌ఫోన్లు రూ.2వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. సీఐ వరాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాజిల్లాలో 18 కో-ఎడ్యుకేషన్‌ జూనియర్‌ కళాశాలలు

మచిలీపట్నం టౌన్‌, మార్చి 6 : కృష్ణాజిల్లాలో ప్రస్తుతం ఉన్న 18 హైస్కూళ్లను అప్‌గ్రేడ్‌ చేస్తూ నూతనంగా 18 ఇంటర్‌ కో-ఎడ్యుకేషన్‌ జూనియర్‌ కళాశాలలను ప్రభుత్వం మంజూరు చేసిందని డీఈవో తాహెరా సుల్తానా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఇసీ గ్రూపులు నిర్వహిస్తారన్నారు. ఒక్కో గ్రూపులో 40 మంది విద్యార్థులు ఉండేలా చూడాలన్నారు. 2024-25 సంవత్సరంలో ప్రారంభించే ఈ కళాశాలలను డీఈవో వివరించారు. అవనిగడ్డ, బంటుమిల్లి జూనియర్‌ కళాశాలలు, బాపులపాడు మండలం వీరవల్లి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల, చల్లపల్లి, గన్నవరం మండలం దావాజీగూడెం, ఘంటసాల మండలం శ్రీకాకుళం, గుడివాడలోని బేతవోలు మునిసిపల్‌ హైస్కూల్‌, గుడ్లవల్లేరు మండలం కౌతవరం, గూడూరు, కంకిపాడు, కోడూరు మండలం వి.కొత్తపల్లి, కృత్తివెన్ను మండలం సంగమూడి, బందరు రూరల్‌ మండలం చిన్నాపురం, మోపిదేవి మండలం పెదకళ్లేపల్లి, నాగాయలంక మండలం తలగడదీవి, నందివాడ మండలం రుద్రపాక జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలు, పామర్రు, మొవ్వ క్షేత్రయ్య జూనియర్‌ కళాశాలలో కో-ఎడ్యుకేషన్‌ ప్రారంభించినట్టు తెలిపారు. ప్రభుత్వం గతంలో 25 ఉన్నత పాఠశాలలను బాలికల జూనియర్‌ కళాశాలలుగా రూపొందించిన సంగతి తెలిసిందే.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.63

బీసీలకు టీడీపీలోనే ఉన్నత స్థితి: ఎంఎస్ బేగ్

వన్‌టౌన్, మార్చి 6: బీసీలు శాసించే స్థాయికి ఎదిగారంటే అది టీడీపీ వల్లనేనని, బీసీలకు టీడీపీ ఉన్నత స్థాయి కల్పించిందని ఆ పార్టీ పశ్చిమ సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్ అన్నారు. బుధవారం టీడీపీ పశ్చిమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ-జనసేన సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన జయహో బీసీ సభకు డిక్లరేషన్‌కు జనం నుంచి పూర్తి మద్దతు లభిస్తోందన్నారు. 50ఏళ్లకే పెన్షన్, చంద్రన్న బీమా పునరుద్ధరణతో పాటు డిక్లరేషన్‌లో ప్రకటించిన పది అంశాలను టీడీపీ- జనసేన ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. పశ్చిమ బీసీ సెల్ అధ్యక్షుడు నమ్మి భాను ప్రకాష్, జిల్లా తెలుగుయువత అధికార ప్రతినిధి పైలా సతీష్‌లు మాట్లాడుతూ జనసేన-టీడీపీ ఉమ్మడి బీసీ డిక్లరేషన్‌ను ప్రజల్లోకి తీసుకువెళ్లి వైసీపీని గద్దె దించుతామని తెలిపారు.

చంద్రబాబును గెలిపించుకోవడం మనందరి బాధ్యత

తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

మొగల్రాజపురం, మార్చి 6: ప్రజా సంక్షేమం కోసం, రాష్ట్ర, రాజధాని అమరావతి అభివృద్ధి కోసం రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీల అభ్యర్థులను గెలిపించుకుని చంద్రబాబును సీఎం చేసుకోవడం మనందరి బాధ్యత అనితూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హితవు పలికారు. బుధవారం తెల్లవారు జామున మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ కళాశాల మైదానంలో సిద్ధార్థ వాకర్స్ అసోసియేషన్ సభ్యులను ఆయన కలిసి వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా



వాకర్స్‌తో గద్దె రామ్మోహన్

తనని, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేశినేని చిన్నిని సైకిల్ గుర్తుమీద ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు ఉద్యోగాలు రావాలన్నా, కూలీలకు, వ్యాపారులకు ఉపాధి ఉండాలన్నా పరిశ్రమలు రావాలన్నా చంద్రబాబు అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని ప్రతి ఒక్కరు గుర్తించాలని కోరారు. 8వ డివిజన్ కార్పొరేటర్ సిహెచ్ ఉషారాణి, ధూళిపాల రమేష్, కట్టా జనార్ధన్, వల్లూరి నాగార్జున, కాట్రగడ్డ నాగేశ్వరరావు, ఎం మల్లికార్జునరావు, కె. హరినాథ్ ప్రసాద్, వాకర్స్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన మత్స్యకారులు

పటమట: పటమటలంక చిన్న రామాలయం వద్ద మత్స్యకార సంఘం నాయకులు లంకే నారాయణ ప్రసాద్, ఇతర సభ్యులకు బుధవారం సాయంత్రం గద్దె రామ్మోహన్, చెన్నుపాటి గాంధీలు కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ అందరూ టీడీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. మత్స్యకార నాయకులు లంకే నారాయణ ప్రసాద్, వల్లభనేని సుబ్బారావులు మాట్లాడుతూ టీడీపీతోనే మత్స్యకారుల జీవన స్థితిగతులు మెరుగుపడతాయన్నారు. కార్పొరేటర్ చెన్నుపాటి కాంతి శ్రీ, ముమ్మనేని ప్రసాద్, యలమంచిలి దేవేంద్ర, నర్రా కిషోర్, అన్నాబత్తుని బాబిలు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన అభ్యర్థులను గెలిపించాలి

పటమట: వైసీసీ కోలుకోలేని విధంగా వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద జనసేన నాయకులతో కలిసి బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇరుపార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్(చిన్ని)లకు సైకిల్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని కోరారు. నర్రా కిషోర్, ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి ఉషారాణి, యడ్లపల్లి నాగరాజు, కర్ణా కోటేశ్వరరావు, బద్రి, సాంబయ్య పాల్గొన్నారు.

యువత భవిష్యత్తు కోసమే కలయిక

భారతీనగర్: యువత భవిష్యత్తు కోసమే చంద్రబాబు, పవన్‌లు కలిశారని గద్దె క్రాంతి అన్నారు. తూర్పు పరిధిలోని మూడవ డివిజన్ గణేష్ నగర్‌లో బుధవారం గద్దె రామ్మోహన్ తనయుడు గద్దె క్రాంతి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు ప్రజలందరికి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారికి సహాయం చేస్తున్నారని అన్నారు. అలాంటి మంచి వ్యక్తికే తామంతా వచ్చే ఎన్నికల్లో ఓట్లు వేస్తామని డివిజన్‌లోని ప్రజలు చెబుతున్నారన్నారు. రాష్ట్రంలోని యువత భవిష్యత్తు కోసం మనమందరం సైకిల్‌గుర్తుకే ఓటు వేయాలన్నారు. జనసేన నాయకుడు భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వం రావాలన్నారు. డివిజన్ పార్టీ అధ్యక్షులు తాడి బాబురావు, పేరేపి ఈశ్వర్, గద్దె రమేష్, శ్యాంప్రసాద్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షాన నిలబడేది టీడీపీనే

కేశినేని చిన్ని

గుణదల, మార్చి 6: పేదల పక్షాన నిలబడి వారు ఆర్థికంగా బలపడేందుకు కృషి చేయడమే టీడీపీ ప్రధాన లక్ష్యమని విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. స్థానిక హిందీ కళాశాల రోడ్డులో టీడీపీ సీనియర్ నాయకుడు ఎన్‌డీవీ రమణ 10వ వర్ధంతి కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేశినేని శివనాథ్(చిన్ని), బొండా ఉమామహేశ్వరరావు విచ్చేశారు. ముందుగా ఎన్‌డీవీ రమణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. టీడీపీకి విశేషమైన సేవలందించిన ఎన్‌డీవీ రమణ సేవలకు గుర్తుగా 20 మంది రజకులకు ఇస్త్రీ పెట్టెలు పంపిణీ చేసి, 500 మందికి అన్నదానం చేశారు. టీడీపీ జెండా భుజాన వేసుకుని పనిచేసిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని, పార్టీకి కార్యకర్తలే దేవుళ్లని కేశినేని చిన్ని తెలిపారు. వైసీపీ పాలనలో సెంట్రల్‌లో చేసిన అభివృద్ధి శూన్యమని బొండా ఉమా ఎద్దేవా చేశారు. స్థానిక 26వ డివిజన్ కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి, డివిజన్ ఇన్‌చార్జ్ వల్లభనేని సతీష్, డివిజన్ అధ్యక్షుడు తోట పాండు, మాజీ కార్పొరేటర్ చెరుకూరి కృష్ణకుమార్, కారంపూడి సత్య, కాళిదాసు, చిత్తిరెడ్డి రాజు, శ్రీనివాస్‌కుమార్, బాబూ, మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.



రజకులకు ఇస్త్రీ పెట్టెలు పంపిణీ చేసిన బొండా ఉమా, కేశినేని చిన్ని

రోడ్లకు మరమ్మతులు నిర్వహించండి

● సీపీఐ ఆధ్వర్యంలో నిరసన



చిట్టినగర్, మార్చి 6: వైసీపీ పాలకులకు ప్రజల ఇబ్బందులు పట్టవని, ధనార్జనే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని సీపీఐ నగర కార్యదర్శి జీ. కోటేశ్వరరావు దుయ్యబట్టారు. 47 డివిజన్‌లో గోతుల మయంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు నిర్వహించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం టేనర్‌పేట అడ్డరోడ్డులో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 46, 47 డివిజన్లలో పైపులైన్‌ల కోసం గోతులు తవ్వి వాటిని సక్రమంగా పూడ్చకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గోతులకు మరమ్మతులు నిర్వహించాలని నెల రోజుల క్రితం స్పందనలో సీపీఐ మాజీ కార్పొరేటర్ డి.వి.రమణబాబు కమిషర్, మేయర్‌లకు వినతి పత్రం అందజేసినా నేటికి పట్టించుకోలేదన్నారు. అధికారులు వెంటనే స్పందించి తవ్వి వదిలేసిన గోతులకు మరమ్మతులు నిర్వహించాలని కోరారు. నాయకులు కొట్టు రమణారావు, ఆర్. మైకేల్, కె. వెంకటేశ్వరరావు, ఆర్. యాకోబ్, ఎస్వీ రమణ, ఎస్. సాంబశివరావు, అనసూయ, వెంకటేశ్వరరావు, ఎస్.కె నజీర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా టీడీపీని బలపర్చండి

● 23వ డివిజన్‌లో భవిష్యత్తు గ్యారెంటీ

గవర్నర్‌పేట, మార్చి 6: అస్తవ్యస్తంగా తయారైన రాష్ట్రంలో పాలన గాడిలో పెట్టేందుకు, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేసే చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం కోసం టీడీపీని బలపర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని టీడీపీ ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి అన్నారు. బాలస్వామి ఆధ్వర్యంలో బుధవారం 23వ డివిజన్‌లోని, గవర్నర్‌పేట, సూర్యారావుపేట ప్రాంతాల్లో టీడీపీ నేతలు భవిష్యత్తుకు గ్యారెంటీ పాదయాత్రను నిర్వహించారు. టీడీపీ యువనేత బొండా రవితేజ ఇంటింటికీ భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీని గెలిపించాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించారు. తెలుగు యువత జిల్లా కార్యదర్శి కటిక వెంకట కోటేశ్వర రావు, డివిజన్ అధ్యక్షుడు దుర్గారావు పాల్గొన్నారు.

సత్యనారాయణపురం: 31వ డివిజన్ ముత్యాలంపాడు సూపర్‌బజార్ సెంటర్ నుంచి బుధవారం సాయంత్రం బొండా ఉమా అన్న రావాలి-సెంట్రల్ గెలవాలి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు బొండా సిద్ధార్థ ఇంటింటికీ వెళ్లి టీడీపీ వస్తే చేపట్టే పథకాలను వివరించారు. టీడీపీ రాష్ట్రకార్యదర్శి నవనీతం సాంబశివరావు, మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తిరాజు, సంధిరెడ్డి గాయత్రి, డివిజన్ అధ్యక్షుడు పడమటి రామకృష్ణ, దెందుకూరి మురళీకృష్ణంరాజు, దేవరపు మాల్యాద్రి, కె.దుర్గారావు జనసేన, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంచుతున్న బాలస్వామి, బొండా రవితేజ

టీడీపీ కార్యాలయం ప్రారంభం

27వ డివిజన్ టీడీపీ ఆధ్వర్యంలో బుధవారం దుర్గాపురం సాంబమూర్తిరోడ్డు మసీదు సందులో పార్టీ కార్యాలయాన్ని బొండా ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, ఫ్లోర్‌లీడర్ నెలిబండ్ల బాలస్వామి, డివిజన్ అధ్యక్షుడు కె.ఆర్.కుమార్, బి.వెంకటరావు, రుక్మిణి, డి. జయరాజు, రవణమ్మ, కె.బాబు, బి. కొండ, బి. హనుమంతరావు, స్థానికి టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మహిళలు నాయకత్వ పటిమ కలిగి ఉండాలి

విశ్రాంత ఆచార్యులు డాక్టర్ పద్మ

మొగల్రాజపురం, మార్చి 6: మహిళలు నాయకత్వ పటిమ కలిగి ఉండటంతో పాటు ఉద్యోగ, కుటుంబ బాధ్యతలలో సమతుల్యత పాటించాలని విశాఖపట్నం యలమంచలి మహిళా డిగ్రీ కళాశాల విశ్రాంత ఆచార్యులు డాక్టర్ కె. పద్మ చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాలలో బుధవారం మహిళా సాధికారిత, ఉమెన్స్ క్లబ్, స్టెప్ అహెడ్ ఫర్ ఈక్వాలిటీ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలకు అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని వాటన్నింటిని అధిగమించి ముందుకు వెళ్లాలని చెప్పారు. సేఫ్ ప్రెసిడెంట్ గుళ్లపల్లి జ్యోత్స్న సమాజంలో స్త్రీ స్థానం, వివిధ రంగాల్లో ఎదురవుతున్న సవాళ్లను వివరించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ బాబూరావు, డీన్ రాజేష్ జంపాల, సేఫ్ సంస్థ కార్యదర్శి వాణి, ఉపాధ్యాయులు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

జయహో బీసీ సభ సక్సెస్...వైసీపీలో భయాందోళన

జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన మహేశ్



ఏకలవ్యనగర్‌లో ప్రజలతో పోతిన మహేష్, విజయలక్ష్మి

భవానీపురం, మార్చి 6 : టీడీపీ-జనసేన జయహో బీసీ సభ విజయవంతం కావడంతో వైసీపీ నాయకుల్లోను, మంత్రుల్లోను వణుకు మొదలైందని జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన మహేశ్ అన్నారు. 43వ డివిజన్ ఏకలవ్యనగర్‌లో ఇంటింటికీ రాబోయే మన జనసేన ప్రభుత్వం కార్యక్రమంలో బుధవారం మహేశ్, ఆయన సతీమణి విజయలక్ష్మి ఇంటింటికి తిరిగి వైసీపీ అకృత్యాలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ ఈ సభ ద్వారా బీసీల మద్దతు టీడీపీ-జనసేన కూటమికి పెరగడం ఖాయమని జోస్యం చెప్పారు. డివిజన్ల జనసేన అధ్యక్షులు జెల్లి రమేష్, తిరుపతి అనూష, మల్లెపు విజయలక్ష్మిలు,43వ డివిజన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ

చిట్టినగర్, మార్చి 6: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐద్వా ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పూర్తి చేసిన మహిళలకు ఇన్నర్‌వీల్ క్లబ్ సహకారంతో బుధవారం కొత్తపేట శ్రామిక భవనంలో సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. సర్టిఫికెట్లను ఇన్నర్ వీల్ క్లబ్ ప్రెసిడెంట్ సరోజ, ఐద్వా అధ్యక్ష కార్యదర్శులు కె. శేషమణి, గాదె ఆదిలక్ష్మిలు పంపిణీ చేశారు. కె.రాధిక, టీ.జానకి, నందిని, పద్మావతి, కిరణ్మయి, ఉష, కె.శ్రీదేవి పాల్గొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్‌లో ఫ్లాగ్‌మార్చ్

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 6 : స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం నగర పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. స్టేషన్ పరిధిలోని న్యూ రాజరాజేశ్వరిపేట, డాబాకొట్లు సెంటర్ తదితర ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ శ్రీహరిబాబు సిబ్బందితో స్ట్రీట్ వాక్ చేశారు. సుమారు 120 మంది సిబ్బందితో వెళ్లి స్థానికులతో మాట్లాడారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీసీపీ హెచ్చరించారు. నార్త్‌జోన్ ఏసీపీ ప్రసాద్, సీఐలు గురుప్రకాష్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మార్పు కోసం సీపీఎం కరపత్రాల ఆవిష్కరణ

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 6 : రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం. వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మార్పు కోసం సీపీఎం కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం అజిత్‌సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య భవన్‌లో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముందుగా కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ, వైసీపీ ప్రభుత్వాలను గద్దె దింపకపోతే ఆటో కార్మికుల జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కె. దుర్గారావు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార రంగంతోనే దేశాభివృద్ధి

వన్‌టౌన్, మార్చి 6: వ్యాపార రంగంతోనే దేశాభివృద్ధి జరుగుతుందని ఎస్‌బీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఏవీఆర్ సుబ్బారావు అన్నారు. వన్‌టౌన్‌లోని కేబీఎన్ కాలేజీ కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో బుధవారం ఆధునిక కాలంలో వ్యాపార సంస్థ స్థాపన అభివృద్ధి అంశంపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత వ్యాపారాలు, పరిశ్రమలతో పాటుగా వ్యక్తిగత ఉపాధితో దేశాభివృద్ధి జరుగుతుం దన్నారు. విద్యార్థులు వ్యాపారాలు, పరిశ్రమలు స్థాపించేందుకు కృషి చేయాలన్నారు. మరో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ హనుమంతరావు మాట్లాడుతూ మార్కెటింగ్ అంశాలపై దృష్టి పెట్టి పరిశ్రమల స్థాపన, స్టార్టప్‌లకు శ్రీకారం చుట్టాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, విభాగాధిపతి హేమంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీరు సీసాతో దాడి: ఇరువర్గాలపై కేసులు

విద్యాధరపురం, మార్చి 6: భవానీపురం బైపాస్ రోడ్డులో ఓ బార్‌లో బీరుసీసాతో వ్యక్తిపై దాడిచేసిన సంఘటనపై బుధవారం ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు. వివరాల మేరకు విద్యాధరపురం చెరువు సెంటర్‌కు చెందిన రెడ్డిపల్లి చాణక్య (34) మంగళవారం సాయంత్రం స్నేహితుడితో పున్నమిఘాట్ వద్ద మాట్లాడుకుంటున్నారు. ఆ సమయంలో భవానీపురం బ్యాంక్ సెంటర్‌కు చెందిన కుర్రా రమేష్ (36) తన కారులో చాణక్య వద్దకు వచ్చాడు. మంచీ చెడు మాట్లాడుకున్నారు. కొద్దిసేపు రాజకీయాలు మాట్లాడుకున్నారు. మధ్యలో చాణక్యను రమేష్ కించపరచే విధంగా మాట్లాడాడు. అతని తండ్రిని కూడా దూషించి చాణక్యను కొట్టేందుకు కూడా ప్రయత్నించాడు. స్నేహితుడు అడ్డుకోవడంతో రమేష్ వెళ్లిపోయాడు. తన తండ్రిని ఎందుకు దూషించావు? సారీ చెప్పాలంటూ రమేష్‌ను ఫోన్‌లో చాణక్య కోరాడు. తాను దియాస్ బార్‌లో ఉన్నానని, చాణక్యను రమ్మని రమేష్ కోరాడు. చాణక్య బార్‌కు వెళ్లి తన తండ్రికి సారీ చెప్పాలని పట్టు బట్టాడు. దీంతో రమేష్ బీర్ సీసాతో చాణక్య తలపై కొట్టి, పొట్టలో పొడవబోయాడు. చేతులు అడ్డుపెట్టడంతో చాణక్య చేతులకు గాయాలయ్యాయి. ఇదే వ్యవహారంలో కుర్రా రమేష్ కూడా చాణక్య తనపై దాడి చేసినట్లు పోలీసులకు ఎదురు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇరువురిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి పంపించారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు. చాణక్య అధికార పార్టీకి చెందిన వ్యక్తి కావడంతో పోలీసులు ఈ కేసును గోప్యంగా ఉంచారు.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
గురువారం • 7 మార్చి 2024
cinema@andhrajyothy.com

బైక్ రేసర్‌గా శర్వా

పుట్టిన రోజున మూడు చిత్రాలు



యువ కథానాయకుడు శర్వానంద్ ప్రస్తుతం తన 35వ చిత్రం 'మనమే'లో నటిస్తున్నారు, ఆయనతో 'రన్ రాజా రన్', 'ఎక్స్‌ప్రెస్ రాజా', 'మహానుభావుడు' చిత్రాలను నిర్మించిన యూవీ క్రియేషన్స్ అధినేతలు వంశీ, ప్రమోద్ తాజా చిత్ర నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. శర్వా పుట్టినరోజు సందర్భంగా బుధవారం ఈ చిత్రం షూటింగ్‌ను పూజా కార్యక్రమాలతో ప్రారంభిస్తున్నారు. తొలిసారిగా శర్వా స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో చిత్రాన్ని చేస్తున్నారు. ఇందులో ఆయన బైక్ రేసర్‌గా నటిస్తున్నారు.మోటో క్రాస్ రేసింగ్ నేపథ్యంలో మూడు తరాల కుటుంబానికి చెందిన కథతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి అభిలాష్ కంకర దర్శకత్వం వహిస్తున్నారు.

శర్వానంద్, హీరోయిన్ మాళవిక నాయర్‌పై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు చిత్ర సమర్పకుడు విక్రమ్ తొలి క్లాప్ ఇచ్చారు.

ఈ సినిమాకు సంగీతం: జిబ్రాన్, ఫొటోగ్రఫీ: జె.యువరాజ్, ఎడిటర్: అనిల్ కుమార్, రచన, దర్శకత్వం: అభిలాష్ కంకర

'సామజవరగమన' దర్శకుడితో..

అలాగే శర్వానంద్ హీరోగా ఓ సినిమా తీస్తున్నట్లు ఈ పుట్టినరోజు సందర్భంగానే నిర్మాత అనిల్ సుంకర ప్రకటించారు. 'సామజవరగమన' చిత్రానికి దర్శకత్వం వహించిన రామ్ అబ్బరాజు శర్వానంద్ నటించే 37 చిత్రానికి డైరెక్టర్. హిలేరియస్ రైటింగ్‌కు పేరొందిన రామ్ శర్వాను హ్యూమరస్ క్యారెక్టర్‌లో చూపించనున్నారు. హీరోయిన్‌ను ఇంకా ఎంపిక చేయలేదు. ఈ సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో పొడవాటి జుట్టు, గడ్డంతో రగ్గడ్ స్టైల్‌తో సీరియస్ లుక్‌లో కనిపించారు శర్వా. ఈ చిత్రానికి కథ: భాను భోగవరపు, మాటలు: నందు సవరిగాన, సంగీతం: విశాల్ చంద్రశేఖర్.

శ్రీరామ్ ఆదిత్యతో 'మనమే'

శర్వానంద్ నటించే 35వ చిత్రం 'మనమే' ఫస్ట్‌లుక్‌ను ఆయన పుట్టిన రోజు సందర్భంగా విడుదల చేశారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్రీరామ్ ఆదిత్య దర్శకుడు. లండన్ నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న న్యూ ఏజ్ లవ్ స్టోరీ ఇది. కృతి శెట్టి కథానాయిక. వివేక్ కూచిభొట్ల ఈ చిత్రానికి సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్,సహ నిర్మాత. ఏడిద రాజా అసోసియేట్ నిర్మాత.



ఇటలీ వెళ్లిన కల్కి

ప్రభాస్ హీరోగా రూపొందుతున్న ఫ్యూచరిస్టిక్ సైన్స్ ఫిక్షన్ 'కల్కి 2898 ఏడీ' షూటింగ్ ప్రస్తుతం ఇటలీలో జరుగుతోంది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ సంస్థ నిర్మిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణే, దిశా పటాని తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇటలీలోని అద్భుతమైన లొకేషన్స్‌లో ప్రభాస్, దిశా పటానిపై పాట చిత్రీకరిస్తున్నారు. ప్రభాస్, దిశా పటాని, నాగ్ అశ్విన్ ఇతర యూనిట్ సభ్యులతో దిగిన ఫొటోని బుధవారం మేకర్స్ షేర్ చేశారు. ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'కల్కి 2898' చిత్రం మే 9న విడుదల కానుంది.

మొదట ఎన్టీఆర్.. ఇప్పుడు రామ్‌చరణ్



అతిలోకసుందరి శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ నటించే రెండో తెలుగు చిత్రం కూడా కన్‌ఫర్మ్ అయింది. జూనియర్ ఎన్టీఆర్ సరసన 'దేవర' చిత్రంలో నటిస్తున్న ఆమె తాజాగా రామ్‌చరణ్ హీరోగా నటించే 16 సినిమాలో కథానాయికగా నటించనున్నారు. జాన్వీ ఈ చిత్రం చేస్తుందనే వార్తలు చాలా కాలంగా వినిపిస్తున్నాయి. ఆమె తండ్రి బోనీ కపూర్ ఇటీవల ఈ విషయం వెల్లడించారు కూడా. జాన్వీ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం వద్ధి సినిమాస్ అధినేతలు అధికారికంగా ఈ విషయం వెల్లడించారు. దర్శకుడు బుచ్చిబాబు సాన ఈ సినిమా కోసం యూనివర్సల్ అప్పీల్ ఉండే పవర్‌ఫుల్ స్క్రిప్ట్ సిద్ధం చేశారు. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడిస్తామని నిర్మాత వెంకట సతీశ్ కిలారు చెప్పారు.

భీమ పాత్రను ఎంజాయ్ చేస్తారు

దర్శకుడు హర్ష



గోపీచంద్ హీరోగా నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భీమ' ఈ శుక్రవారం విడుదలవుతోంది. కె.కె.రాధామోహన్ నిర్మించిన ఈ చిత్రానికి కన్నడ దర్శకుడు ఎ.హర్ష దర్శకత్వం వహించారు. విడుదల సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటిస్తూ 'నేను బెంగళూరులో పుట్టి పెరిగాను. ఇప్పటివరకూ కన్నడ చిత్రాలే చేశాను. తెలుగులో రాధామోహన్ గారి 'బెంగాల్ టైగర్' చిత్రంలో రెండు పాటలకు కొరియోగ్రఫీ చేశాను. ఆయనే నన్ను తెలుగులో దర్శకుడిగా పరిచయం చేస్తుండడం ఆనందంగా ఉంది. గోపీచంద్‌గారికి మొదట ఒక కథ చెప్పాను. ఆయన కొన్ని మార్పులు చెప్పారు. ఎనిమిది నెలలు గ్యాప్ తీసుకుని 'భీమ' కథ చెప్పాను. అది ఆయనకు నచ్చింది. ఎంటర్‌టైన్‌మెంట్, ఎలివేషన్, ఎమోషన్ కలిగిన మంచి కమర్షియల్ సినిమా ఇది. సోషల్ మెసేజ్ కూడా ఉంది. సెమీ ఫాంటసీ ఎలిమెంట్ కూడా ఉంది. ముఖ్యంగా భీమ పాత్ర చాలా ఎంటర్టైనింగ్‌గా ఉంటుంది' అని చెప్పారు. గోపీచంద్ వండర్‌ఫుల్ ఆర్టిస్ట్ అని చెబుతూ 'ఆయన సినిమాలన్నీ చూశాను. తనకి యూనిక్ బాడీ లాంగ్వేజి ఉంది. మంచి వ్యక్తిత్వం ఉన్న మనిషి. చాలా పాజిటివ్. ఎప్పుడూ నవ్వుతూనే ఉంటారు. భీమ పాత్ర ఆయనకే సూట్ అవుతుందని ఆయనకే చెప్పాను' అన్నారు హర్ష. నిర్మాత రాధామోహన్ చాలా ప్యాషన్ ఉన్న వ్యక్తి అనీ ఈ సినిమాకు కావాల్సిన వన్నీ సమకూర్చడంతో మంచి క్వాలిటీతో సినిమా తీయగలిగినట్లు ఆయన తెలిపారు.

సీతక్క చేతుల మీదుగా ఆకాశమే అందనీ



చైతన్య రావ్, భూమి శెట్టి జంటగా నటించిన చిత్రం 'షరతులు వర్తిస్తాయి' కుమారస్వామి(అక్షర) దర్శకత్వం వహించారు. నాగార్జున సామల, శ్రీష్ కుమార్ గుండా, డాక్టర్ కృష్ణకాంత్ చిత్తజల్లు నిర్మించారు. ఈ నెల 15న థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోందీ సినిమా. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ చిత్రం నుంచి 'ఆకాశం అందనీ' అంటూ సాగే గీతాన్ని మంత్రి సీతక్క చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ "తరతరాలుగా అణిచివేతకు గురవుతున్న మహిళలు పోరాడి గెలుచుకున్న రోజు 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం'. ఈ సందర్భంగా మహిళా గీత రచయిత చైతన్య పింగళి రాసిన 'ఆకాశమే అందనీ' లిరికల్ సాంగ్‌ను నా చేతుల మీదుగా రిలీజ్ చేయటం ఆనందంగా ఉంది. ఈ చిత్రం ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నా" అని అన్నారు. ఈ కార్యక్రమంలో నటుడు చైతన్య రావు, హీరోయిన్ భూమి శెట్టి, తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ మాట్లాడారు.

బుల్లెట్ యాక్షన్



రవి వర్మ, సంజనా సింగ్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'బుల్లెట్'. చౌడప్ప దర్శకత్వం వహించారు. ఈ శుక్రవారం చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ప్రసాద్ ల్యాబ్స్‌లో గ్రాండ్‌గా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. దర్శకులు వి. సముద్ర, ప్రొడ్యూసర్ ఏ ఎం రత్నం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఏ. ఎం. రత్నం మాట్లాడుతూ "ఈ సినిమా టైటిల్‌కు తగ్గట్లే ఆరడుగుల బుల్లెట్‌ను హీరోగా సెలెక్ట్ చేశారు" అని అన్నారు. దర్శకుడు వి. సముద్ర మాట్లాడుతూ "ఈ చిత్ర దర్శకుడు చౌడప్ప నాకు మంచి మిత్రుడు. ఆయన ఎంతో ప్యాషన్‌తో తీసిన ఈ చిత్రం ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నా" అని అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకుడు మాట్లాడుతూ ఇదొక యాక్షన్ మూవీ కర్నూల్‌లోని అద్భుతమైన లొకేషన్స్‌లో షూటింగ్ చేశాం' అని తెలిపారు. ఈ చిత్రానికి నిర్మాతలు: ఎం.సి. రావు, బి గోపాల్, ఎమ్.వి. మల్లికార్జున రావు,కోసూరి సుబ్రమణ్యం, మని.

ధూమ్‌ధామ్‌గా ఫస్ట్ లుక్



చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'ధూమ్‌ధామ్'. సాయి కుమార్, వెన్నెల కిశోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సాయి కుమార్ మచ్చ దర్శకత్వం వహించగా, గోపీ మోహన్ స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. ఎంఎస్ రామ్ కుమార్ నిర్మిస్తున్నారు. బుధవారం ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ విడుదల చేశారు. కలర్‌ఫుల్‌గా ఉన్న ఈ పోస్టర్ ఆకట్టుకుంటోంది. లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా రూపొందిస్తున్నట్లు మేకర్స్ వెల్లడించారు.

ఇన్వెస్టిగేటివ్ విశాలాక్షి



విజయ్ శంకర్, మహేశ్ యడ్లపల్లి, ఆయూషీ పటేల్, అనుశ్రీ లీడ్ రోల్స్‌లో నటిస్తోన్న చిత్రం 'విశాలాక్షి'. పవన్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. పల్లపు ఉదయ్ కుమార్ నిర్మిస్తున్నారు. బుధవారం ప్రసాద్ ల్యాబ్స్‌లో సినీ ప్రముఖుల చేతుల మీదుగా ఈ చిత్రం ప్రారంభమైంది. అతిథులుగా విచ్చేసిన, దర్శక సంఘం అధ్యక్షులు వీరశంకర్ ఫస్ట్ షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించగా, ప్రముఖ నిర్మాత రాజ్ కందుకూరి క్లాప్ ఇచ్చారు. దర్శక, నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "ఇది ఇన్వెస్టిగేషన్ బ్యాక్ డ్రాప్‌లో వచ్చే యాక్షన్ ఎంటర్టైనర్. మంచి సస్పెన్స్‌తో నడుస్తుంది" అని అన్నారు. నిర్మాత పల్లపు ఉదయ్ కుమార్ మాట్లాడుతూ "ఈ చిత్ర కథను దర్శకుడు, నేను కలిపి డెవలప్ చేశాం. యూత్, ఫ్యామిలీని దృష్టిలో పెట్టుకుని ఈ కథను మలిచాం" అని తెలిపారు.





16న 'ఐఐఎఫ్ఐ' అవార్డ్స్ కార్యక్రమం

తెలుగు ఇండస్ట్రీలోని ప్రతిభావంతుల్ని గౌరవించుకునేందుకు తెలుగు ఫిల్మ్ అండ్ వెల్ఫేర్ ఫోరం ఓ అవార్డ్ ప్రదానోత్సవం ఈ నెల 16న నిర్వహిస్తోంది. 'ఐకాన్స్ ఆఫ్ ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీ' (ఐఐఎఫ్ఐ) పేరిట జరిగే ఈ కార్యక్రమానికి సంబంధించిన కర్టెన్ రైజర్ బుధవారం ఫిల్మ్ ఛాంబర్‌లో జరిగింది. ఇందులో దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ "ఈ అవార్డ్ కార్యక్రమం వెనుక గొప్ప లక్ష్యం ఉంది. దీని ద్వారా అన్ని క్రాఫ్ట్‌లోని సీనియర్లను గౌరవించబోతున్నాం. తెలుగు సినిమా 75 ఏళ్ల కార్యక్రమం మనం ఘనంగా నిర్వహించుకున్నాం. వందేళ్ల పండగకు ఇంకా ఎనిమిదేళ్లు ఉంది. అప్పటి వరకూ ఎంతమంది బతికి ఉంటారో తెలీదు. అందుకే అప్పటి వరకూ ఆగేకంటే ఈ లోగా అన్ని విభాగాల్లోని సీనియర్స్‌ను గౌరవించబోతున్నాం. ఈ ప్రయత్నాన్ని దిగ్విజయం చేసేందుకు ఇండస్ట్రీలోని అందరి సహకారం అవసరం" అన్నారు. కార్యక్రమంలో 'ఐఐఎఫ్ఐ' నిర్వాహకులు నాగబాల సురేశ్, స్పాన్సరర్ విజయ్ కుమార్, నటి దివ్యవాణి, జ్యూరీ సభ్యుడు జర్నలిస్ట్ ప్రభు కూడా మాట్లాడారు.

సైన్స్ ఫిక్షన్



వికాస్ జీకే, శాంతి హీరోహీరోయిన్లుగా రూపుదిద్దుకున్న 'దర్శిని' చిత్రం త్వరలో విడుదల కానుంది. డాక్టర్ ప్రదీప్ అల్లు దర్శకత్వంలో డాక్టర్ ఎల్వీ సూర్యం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ చిత్రం టీజర్‌ను పార్లమెంట్ సభ్యుడు ఎం.వి.వి. సత్యనారాయణ విడుదల చేసి సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. చిత్ర దర్శకుడు మాట్లాడుతూ 'థ్రిల్లర్ జానర్‌లో రూపొందిన సైన్స్ ఫిక్షన్ ఇది. సినిమా బాగా వచ్చింది. పాటలు చిత్రానికి ప్లస్ అవుతాయి.' అన్నారు. ఓ ప్రముఖ పంపిణీ సంస్థ ద్వారా త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాత చెప్పారు. టీజర్, పాటలు చూసి ఆశీర్వదించిన ఎంపీ సత్యనారాయణకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.





ప్రత్యేకం ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

అత్తాకోడళ్లే.. కానీ స్నేహితుల్లా ఉంటారు. "మా అత్తమ్మ మా ఉమ్మడి కుటుంబానికి ఇరుసు" అంటుంది కోడలు. "ఈ తరం వాళ్లను చూసి మేము నేర్చుకోవాలి.. ఈ వయస్సులో నన్ను వాణిజ్యవేత్తను చేసింది మా కోడలే" అంటారు ఆ అత్త. ఆ అత్తా కోడళ్లు ఎవరో కాదు... మెగాస్టార్ చిరంజీవి సతీమణి **సురేఖ**, కోడలు **ఉపాసన**. వాళ్లిద్దరి కబుర్లు వింటుంటే గంటలు గడిచిపోతూ ఉంటాయి. తాజాగా వారిద్దరూ కలిసి రెడీ టూ ఈట్ ఫుడ్ ప్రొడక్ట్స్ బిజినెస్ ప్రారంభించారు.

మహిళా దినోత్సవం సందర్భంగా ఆ విశేషాలతో పాటు తమ అనుబంధం గురించి 'నవ్య'తో ప్రత్యేకంగా పంచుకున్నారు.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

తినేవాళ్లకు పెట్టడంలో ఉండే తృప్తే వేరు..!



కొణిదెల ఫ్యామిలీ వారు ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా పెరుగన్నం తింటారు. నేను, చరణ్- ఇంగ్లాండ్‌లో ఒక పెద్ద రెస్టారెంట్‌కు వెళ్లాం. రాత్రి తిరిగి వచ్చేసిన తర్వాత - "పెరుగన్నం ఉందా?" అని అడిగాడు. తనకి రసం అంటే చాలా ఇష్టం.

\- ఉపాసన

రేపు మహిళా దినోత్సవం

"మాది చాలా పెద్ద కిచెన్. ఒక రూమ్‌లో ఫ్రీజర్, మరో రూమ్‌లో ఫ్రిజ్‌లు- ఇలా ఉంటాయి. ఉపాసన దీన్ని 'ఇండస్ట్రియల్ కిచెన్' అంటూ ఉంటుంది. ఎవరికి ఏం కావాలన్నా వండించి పెట్టడం నాకు ఇష్టం. ఇప్పుడు మా ఇంట్లో ముగ్గురు వంటవాళ్లు ఉన్నారు. నాలుగు తరాలవారికి అవసరమైనవన్నీ చేస్తూ ఉంటారు. కానీ వారు ఏం చేయాలో చెప్పేది నేనే! నా చిన్నప్పుడు అమ్మ వాళ్లింట్లో- అందరం ఒకే వంట తినేవాళ్లం. వేర్వేరు వంటలు ఉండేవి కావు. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి. వేర్వేరు వంటలు తప్పనిసరి అయ్యాయి."

\- సురేఖ

మెగాస్టార్ సతీమణిగా మీరు తెలుగు ప్రజలకు సుపరిచితులు. కానీ మీరు ఎప్పుడూ బయటకు రాలేదు. తొలిసారి బయటకు వచ్చి- 'అత్తమ్మాస్ కిచెన్' ప్రారంభించటం ఎలా అనిపిస్తోంది?

సురేఖ: కొత్తగా ఉంది. మా అవసరాలకు తగినంత.. తగినట్లుగా ఆహారాన్ని తయారుచేసుకోవటం.. స్నేహితులకు పంచటం మాత్రమే మాకు తెలుసు. కానీ నాకు తెలిసినవన్నీ అందరికి పంచితే బావుండుననే ఆలోచన చాలాకాలంగా ఉంది. నేను, ఆయన (చిరంజీవి) అనేక దేశాలకు వెళ్తూ ఉంటాం. మాకు హాలిడే అంటే- సైట్ సీయింగ్ కాదు. ఒక చోట ప్రశాంతంగా ఉండటం, వండుకోవటం, తినటం. అయితే వేరే దేశాలకు వెళ్లినప్పుడు ఒకటి రెండు రోజుల కన్నా- ఎక్కువ బయట తినలేం. ఇంట్లో వండిన ఆహారం తినాలనిపిస్తుంది. గతంలో ఒకటి రెండుసార్లు చాలా ఇబ్బంది పడ్డాం. అప్పటి నుంచి... విదేశాలకు వెళ్లాలంటే- ప్రీమిక్స్‌లు తయారుచేసి పట్టుకెళ్లేదాన్ని. వాటిని వండుకొనేవాళ్లం. ఆస్కార్స్ సమయంలో ఉపాసన గర్భవతి. తనకు విదేశాలలో ఆరోగ్యకరమైన ఆహారం దొరకకపోవచ్చు కాబట్టి- ఇక్కడి నుంచి రకరకాల రెడీ మిక్స్‌లు చేసి ఇచ్చాను. ఉపాసన వాటిని బాగా ఎంజాయ్ చేసింది. ఆ సమయంలో తనుకు పుట్టిన ఆలోచనే- ఈ 'అత్తమ్మాస్ కిచెన్'. తన ఉద్దేశంలో ఇది ప్రజలందరికీ మేలు చేసే ఒక మంచి వ్యాపార అవకాశం.



"మా అత్తయ్యగారు అంజనాదేవి గొప్ప కుక్. ఆవిడ దగ్గర నుంచి నేను వంట నేర్చుకున్నా. మామయ్య వెంకటరావు గారికి నాన్‌వెజ్ చాలా ఇష్టం. శనివారం నాన్‌వెజ్ వండేవారు కాదుట. అందువల్ల ఆ ఫ్లేవర్ వచ్చేలా అత్తయ్య వెజిటేరియన్ వంటలు వండేవారు. ఐదారు రకాల ఆకు కూరలతో అత్తయ్య బిర్యానీ చేస్తారు. చాలా అద్భుతంగా ఉంటుంది. అలాంటి బిర్యానీ ఎవరూ చేయటం నేను చూడలేదు."

తను బిజినెస్ ఫ్యామిలీ నుంచి వచ్చింది. దీన్నొక అవకాశంగా భావించింది. ఈ విషయం తను చెప్పినప్పుడు నేను అంగీకరించా. ఎందుకంటే- ఈ తరం బాగా బిజీ అయిపోయింది. అనేక మంది ట్రావెల్ చేస్తూ ఉంటారు. ఉద్యోగాలు చేసి వచ్చి వండుకోలేని వాళ్లు ఉంటారు. అందుకే ఈ వయస్సులో- లేటుగా అయినా- వ్యాపారవేత్త అవ్వాల్సి వచ్చింది.

మీకు చిన్నప్పటి నుంచి బాగా వంట చేయటం వచ్చా?

లేదండి. మా అమ్మ వాళ్లింట్లో నేనే చిన్నదాన్ని. కూరలు తరగటం లాంటి చిన్న చిన్న సాయాలు చేయటం తప్ప వండటం రాదు. పెళ్లి అయిన తర్వాత అన్నీ నేర్చుకున్నా. ఇక్కడ మీకో రహస్యం చెబుతా. వంటలో నాకు గురువు- మా ఆయనే. మామయ్యగారు భోజన ప్రియులు. మా అత్తయ్యగారు చాలా బాగా వండుతారు. దాంతో ఆయన చిన్నప్పుడు రకరకాల వంటలు వండేవారట. మాకు పెళ్లైన కొత్తల్లో- అత్తమ్మలాగ నేను కూడా వంటచేస్తే బావుండునని ఆయనకు ఉండేది. కానీ నాకు రాదు. కాపురానికి వెళ్లిన తర్వాత- ఒక రోజు ఉప్మా చేశా. ఉండలు ఉండలుగా వచ్చింది. అప్పటిదాకా ఉప్మా అలాగే చేస్తారనుకొనేదాన్ని. ఆ తర్వాత ఆయనే నాకు ఉప్మా చేయటం, ఇతర వంటలు వండటం నేర్పారు. మా ఇంట్లో ఉప్మా- ఇప్పుడు చాలా ఫేమస్. చాలా మంది అడిగి మరీ తింటారు.

మరి ఈ ప్రీకుక్డ్ వంటలు ఎప్పుడు మొదలుపెట్టారు?

మా పెళ్లైన రెండు నెలలకు- '47 డేస్' అనే సినిమా షూటింగ్ కోసం పారిస్ వెళ్లాం. అక్కడ సరైన ఆహారం లభించేది కాదు. వంట చేద్దామంటే- వంట సామాను దొరికేది కాదు. అది నాకొక పెద్ద పాఠం. ఆ తర్వాత ఎక్కడికైనా వెళ్లాలంటే- ముందుగానే రకరకాల ప్రీకుక్డ్ వంటలు తయారుచేసుకొని వెళ్లేదాన్ని. ఒక స్టవ్, కొన్ని గిన్నెలు- ఉంటే చాలు. వండుకొని తినే వాళ్లం.

మీది ఉమ్మడి కుటుంబం కదా.. అందరూ భోజన ప్రియులేనా?

ఆయన (చిరంజీవి) ఏది పెట్టినా తినేస్తారు. చివరకు పచ్చడి అన్నమైనా తినేస్తారు. నాగబాబుకు మాత్రం అన్ని రుచులు కావాలి. కళ్యాణ్‌బాబుది వాళ్ల అన్నయ్య వరసే! ఎటువంటి డిమాండ్లూ ఉండవు. ఏది పెట్టినా తినేస్తాడు. ఇక్కడ ఒక విషయం తప్పనిసరిగా చెప్పాలి. మామయ్యగారు చక్కగా తినేవారు. ఆయన తినటం చూస్తే- మిగిలిన వాళ్లకు కూడా తినాలనిపిస్తుంది. అదొక కళ.. అమ్మ నాకు చిన్నప్పటి నుంచి- అందరికీ పెట్టడం నేర్పింది. ఎవరైనా తృప్తిగా తింటుంటే ఇంకా పెట్టాలనిపిస్తూ ఉంటుంది. తినేవాళ్లకు పెట్టడంలో లభించే తృప్తి వేరు!



ఆయన పచ్చడితోనైనా అన్నం తినేస్తారు. రకరకాల వంటలు తినాలని ఉండదు. కానీ ఉప్పు తక్కువైతే మాత్రం చెబుతారు. ఈ సందర్భంలో నాకు ఒక సంఘటన గుర్తుకొస్తోంది. మేము మద్రాసులో కాపురం ఉండే సమయంలో ఆయన షూటింగ్స్‌లో బాగా బిజీగా ఉండేవారు. ప్రసాద్‌బాబు, ఈయన కలిసి ఒక సినిమా చేస్తున్నారు. ఒక రోజు ఇంట్లో కూరలు లేకపోతే- పప్పుచారు పెట్టి, వడియాలు వేయించా. ఈయన అవి తినేసి షూటింగ్‌కు వెళ్లిపోయారు. సాయంత్రం వచ్చిన తర్వాత- "ప్రసాద్‌బాబు షూటింగ్‌కి వచ్చి, వెళ్లిపోయాడు" అని చెప్పారు. దానికి కారణం- ఆ రోజు వాళ్లింట్లో జరిగిన గొడవట. అది కూడా కోడిగుడ్ల గురించి.ప్రసాద్‌బాబు వాళ్లావిడ కోడిగుడ్ల పులుసు పెడితే- అందులో రెండు గుడ్లే వేసిందని గొడవ చేసి ప్లేటు విసిరి షూటింగ్‌కి వచ్చాడట. వచ్చి ఈయనని ఏం తిన్నావని అడిగితే- పప్పుచారు.. వడియాలు అని చెప్పారట. ఈయన ఇంత సింపుల్‌గా ఉండటం చూసి, గిల్టీగా అనిపించి. భార్యకు సారీ చెప్పటానికి షూటింగ్ వదిలి వెళ్లిపోయారట. ఇలాంటి సంఘటనలు ఎన్నో ఉన్నాయి.

ఉపాసన... మీరు వంట చేస్తారా?

ఉపాసన: కొన్నిసార్లు. పెళ్లికాక ముందు వంటలు రావు. పెళ్లి అయిన తర్వాత అత్తమ్మ దగ్గర వంటలు నేర్చుకున్నా!



మీ అత్తయ్య నుంచి మీరు నేర్చుకున్నదేమిటి?

వంటలు నేర్చుకోవటం ఒకటి. కుటుంబ విలువలు నేర్చుకోవటం మరొకటి. అత్తమ్మ- ఈ రోజుకి ఇంట్లో అందరూ తింటే తప్ప తను తినదు. నాకు పెళ్లైన కొత్తల్లో తనని చూస్తే చాలా ఆశ్చర్యంగా ఉండేది. ఆ తర్వాత ఒక పెద్ద ఉమ్మడి కుటుంబానికి తాను ఒక ఇరుసు ఎందుకైందో నాకు అర్థమయింది. అంతే కాదు... తన వడ్డన కూడా చాలా ఆప్యాయంగా ఉంటుంది. నాకు ఒక పద్ధతిగా తినటం తనే నేర్పించింది. ఒకప్పుడు నేను ముందు పెరుగు తిని- ఆ తర్వాత మిగిలినవి తినేదాన్ని. కానీ నాకు అత్తమ్మ- ముందు పప్పు, ఆ తర్వాత కూర, ఆ తర్వాత పచ్చడి, ఆ తర్వాత పెరుగు తినటం నేర్పించింది. ఇది ఎందుకు చెబుతున్నానంటే- మన ముందు తరం వారిలో ఉన్న మంచిని నేర్చుకోవాలి. మొత్తం కుటుంబంలో ఉన్న చిన్నా పెద్ద- అందరూ ఏం తింటారో, ఎవరికి ఏది ఇష్టమో అత్తమ్మకు తెలుసు. మూడు రోజుల క్రితం- కళ్యాణ్‌గారు ఇంటికి వచ్చారు. వస్తారని తెలిసి ఆయనకు ఇష్టమైన బిర్యానీ చేయించారు. ప్రతి రోజు ఏదో ఒక వంట- ఎవరో ఒకరికి వెళ్తూనే ఉంటుంది.

సంక్రాంతికి మొత్తం కుటుంబం అందరం కలిసి బెంగుళూరు వెళ్లాం. అందరూ వచ్చారు. పిల్లలు, పెద్దలు- ఇలా అందరికీ కావాల్సిన వంటలన్నింటినీ ముందే ప్లాన్ చేసి మెనూలు పంపేశాం. పిల్లలందరూ చాలా ఎంజాయ్ చేశారు. నా ఉద్దేశంలో- పిల్లలు పెద్దవాళ్లను చూసి నేర్చుకుంటారు. మనం ఒక మంచి పనిచేస్తే వాళ్లు చేస్తారు. మొన్న పండగ చాలా సంతోషంగా గడిచింది. పిల్లలు ఆ సంతోషాన్ని అనుభవించారు కాబట్టి వాళ్లు పెద్దయిన తర్వాత కూడా దాన్నే కొనసాగిస్తారు. ఆ పండుగ ఫొటోలు బాగా వైరల్ అయ్యాయి. మొన్న అమెరికాకు వెళ్తే చాలా మంది ఆ పండుగ గురించే ప్రస్తావించారు. తాము కూడా స్ఫూర్తి పొందామని చెప్పారు.

సురేఖగారు... మీరు నాలుగు తరాలను దగ్గరగా చూశారు.. చూస్తున్నారు.. మీరు గమనించిన మార్పులేమిటి?

ఒకప్పుడు ఆహారంపై పెద్ద అవగాహన ఉండేది కాదు. పెద్ద వాళ్లు చెప్పిందే పాటించేవారు. కానీ ఇప్పుడు అవగాహన పెరిగింది. ఆరోగ్యంగా ఉండాలనే కోరిక బలంగా ఉంది. ఎంత తినాలి? ఎప్పుడు ఆపేయాలి? అనే విషయంలో స్పష్టత ఉందనిపిస్తోంది. బయట ఎక్కువ తింటున్నారనే కంప్లైంట్ తప్ప- ఆహారం విషయంలో ప్రస్తుత తరమే మేలనిపిస్తోంది.

మా ఇంట్లో పిల్లలకు తృణధాన్యాలతో ఆహారాన్ని నేనే తయారుచేస్తా. సెరిలాక్ వంటివి కూడా వాడం. బయట దొరికే ఆహార పదార్థాలలో ప్రిజర్వేటివ్స్ ఉంటాయి. అవి ఆరోగ్యానికి తీవ్రమైన హాని చేస్తాయి.

మీ సమయంలో ఎక్కువమంది మహిళలు ఉద్యోగాలు చేసేవారు కారు. ఇప్పుడు పరిస్థితులు మారాయి. ఈ నేపథ్యంలో వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ ఎలా?

సురేఖ: ఇప్పటి పిల్లలు చాలా కష్టపడుతున్నారు. కానీ ఏం చేస్తారు? ఇద్దరు పనిచేస్తే తప్ప అన్ని సౌకర్యాలు లభించవు. ఉద్యోగాలు చేసే అమ్మాయిలను చూస్తే జాలనిపిస్తుంది. కానీ వాళ్లు చాలా తెలివైన వాళ్లు. ఇటు పనిచేసుకుంటున్నారు, అటు పిల్లలతో కూడా సమయం గడుపుతున్నారు.

ఉపాసన: పని, ఇల్లు రెండూ ముఖ్యమైనవే! సమయానుకూలంగా ప్రాధమ్యాలు నిర్ణయించుకోవాలి. మార్చి ఎండింగ్ వచ్చేస్తోంది. అకౌంట్స్ క్లోజ్ చేయాలి. ఐదారు రోజులు ఆఫీసులోనే గడపాల్సి వస్తుంది. పిల్లల పరీక్షలు వస్తాయి. స్కూలు డేలు వస్తాయి. అలాంటప్పుడు కుటుంబంపైనే దృష్టి పెట్టాల్సి వస్తుంది. అయితే చాలాసార్లు రెండింటినీ కలిసి చూసి- పరిస్థితులు రివ్యూ చేసుకోకపోతే సమస్యలు వస్తాయి. చాలా మంది తమ బిజినెస్ గోల్స్‌ను రివ్యూ చేసుకుంటారు. కానీ ఫ్యామిలీ గోల్స్‌ను రివ్యూ చేసుకోరు.

జుట్టు ఆరోగ్యానికి కరివేపాకు

వంటల్లో కరివేపాకు వేస్తే రుచితో పాటు ఆరోగ్యం కూడా. యాంటీ ఆక్సిడెంట్స్, యాంటీ ఇన్‌ఫ్లమేషన్ లక్షణాలుండే కరివేపాకులో బి విటమిన్‌తో పాటు మెలనిన్‌ను కూడా ఉత్పత్తి చేస్తుంది. ఇది జుట్టు ఆరోగ్యానికి దోహదపడుతుంది.

- గుప్పెడు కరివేపాకు, గుప్పెడు మందారం ఆకులను కొన్ని నీళ్లు వేసి పేస్ట్‌గా చేయాలి. ఈ పేస్ట్‌ను మాడుకు తగిలేట్లు పట్టించాలి. పట్టించిన తర్వాత అరగంట ఉంచి జుట్టును శుభ్రపరచాలి. ఇలా తరచూ చేస్తుంటే జుట్టు నల్లగా ఉంటుంది.
- ఒక గిన్నెలో ఇరవై కరివేపాకులు వేసి అందులో కప్పు నీళ్లు పోసిన తర్వాత టేబుల్ స్పూన్లు మెంతులు జత చేయాలి. బాగా మరిగించి నీళ్లన్నీ తగ్గిపోయేవరకు ఉంచాలి. చివరగా వచ్చిన చిక్కటి ద్రవంలో టేబుల్ స్పూన్ కొబ్బరినూనె వేసి మిశ్రమాన్ని పేస్ట్ చేసుకోవాలి. దీన్ని పట్టించి ఆరిన తర్వాత కడిగేయాలి. ఇలా చేస్తే తెల్లని జుట్టు రాదు.
- ముప్పయి కరివేపాకులను తీసుకుని పేస్ట్ చేయాలి. ఇందులోకి టేబుల్ స్పూన్ పెరుగు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మాడుకు తగిలేట్లు పట్టించాలి. తల మీద చల్లగా ఉంటుంది. దీంతో పాటు జుట్టు పెరుగుతుంది.
- గుంత ప్యాన్‌లో రెండు టేబుల్ స్పూన్ల నూనె వేయాలి. నూనె మరిగేప్పుడు ఇరవై కరివేపాకుల్ని వేయాలి. మూడు నిముషాల తర్వాత దించేసి చల్లారిన తర్వాత జుట్టుకు పట్టించాలి. ఇలా తరచూ చేస్తే జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది.
- పదిహేను కరివేపాకులను తీసుకుని పేస్ట్ చేసుకోవాలి. బౌల్‌లో ఈ పేస్ట్ వేసి అందులోకి నాలుగు టీస్పూన్ల ఉల్లిపాయ రసం వేయాలి. మిశ్రమాన్ని బాగా కలిపి జుట్టుకు పట్టించాలి. జుట్టును మర్దనం చేశాక ఇరవై నిముషాల పాటు వదిలేయాలి. ఇలా చేస్తుంటే జుట్టులో చుండ్రు సమస్య తగ్గిపోతుంది. జుట్టు ఒత్తుగా పెరుగుతుంది.



విశ్వంభరి స్తుతి

నీతా అంబానీ... 'రిలయన్స్ ఇండస్ట్రీస్' అధినేత ముఖేష్ అంబానీ సహధర్మచారిణిగా... సామాజిక కార్యకర్తగా... 'ముంబయి ఇండియన్స్' ఐపీఎల్ జట్టు సహయజమానిగా ప్రపంచ స్థాయిలో సుపరిచితురాలయ్యారు. అంబానీ ఇంట ఏ వేడుక జరిగినా... క్రికెట్ మైదానంలో ఆటను ఆస్వాదించినా... సందర్భం ఏదైనా ఆమె ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. ఇటీవల తమ తనయుడు అనంత్ ప్రీవెడ్డింగ్ ఈవెంట్‌లో నీతా మరోసారి మెరిశారు. అఖిలాండేశ్వరిని కొలిచే 'విశ్వంభరి స్తుతి' శ్లోకానికి తన అద్భుత నాట్యాభినయం జోడించి అబ్బురపరిచారు.

కాబోయే దంపతులు అనంత్, రాధికా మర్చంట్ 'హస్తాక్షర్' వేడుకలో అంబానీ కుటుంబ సభ్యులు తమ భావాలను, అనుభూతులను పంచుకున్నారు. అతిరథమహారథులు ఆసీనులైన ఆ మెగా ఈవెంట్‌లో చివరగా నీతా అంబానీ ప్రదర్శించిన 'విశ్వంభరి స్తుతి' మనోహరంగా, నయనానందకరంగా సాగింది. భారీ బడ్జెట్ చిత్రానికి ఏమాత్రం తీసిపోని సెట్టింగ్‌ల మధ్య... అమ్మవారిని స్తుతిస్తూ ఆమె అభినయించిన తీరు అతిథులను ఆ కాసేపూ మరో లోకంలోకి తీసుకువెళ్లింది. ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఈ నాట్యాభినయాన్ని తన మనవళ్లకు అంకితమిస్తున్నట్టు నీతా ప్రకటించారు. అనంతరం ప్రదర్శించిన 'మహా హారతి'లో అంబానీ కుటుంబ సభ్యులు అందరూ కలిసి పాల్గొన్నారు. సంప్రదాయ వస్త్రాల్లో భారతీయతను ప్రపంచానికి ఘనంగా చాటిన ఈ కార్యక్రమం మంత్రముగ్ధులను చేసింది.

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై తనకు ఉన్న మక్కువను ఈ సందర్భంగా నీతా అంబానీ ఒక వీడియో ద్వారా పంచుకున్నారు. 'మన వివాహ వేడుకలు భారతదేశ మూలాలు, సంస్కృతిని, కళలను ప్రతిబింబించేలా ఉండాలని చెప్పే ప్రధాన ఉద్దేశంతో ఈ ప్రదర్శన ఇచ్చాను. అలాగే వైవాహిక జీవితంలోకి అడుగిడుతున్న అనంత్, రాధికకు అమ్మవారి ఆశీస్సులు అందజేయడం కూడా మరో కారణం. చిన్నప్పటి నుంచి నేను విశ్వంభరి స్తుతి వింటున్నాను. ముఖ్యంగా నవరాత్రి వేడుకల్లో' అంటూ నీతా చెప్పుకొచ్చారు. నీతా అంబానీ భరతనాట్య కళాకారిణి. ఆమె జీవితం ఆధ్యాత్మికతతో ముడిపడి సాగుతోంది. ఐపీఎల్ మ్యాచ్‌ను వీక్షించడానికి వచ్చిన నీతా... మంత్రాలు చదువుతూ, దేవుణ్ణి ప్రార్థిస్తూ కనిపించారు. అనంత్ అంబానీకి కూడా భక్తి ఎక్కువ. అమ్మమ్మ పూర్ణిమా దలాల్ నుంచి తాను ఎన్నో పురాణాలు, కథలు విన్నాననీ, ఎన్నో ఆధ్యాత్మిక అంశాలు నేర్చుకున్నానని ఓ సందర్భంలో అనంత్ వెల్లడించాడు.





బరువు పెరిగినంత వేగంగా బరువు తగ్గటం కష్టం. తగ్గాలంటే మాత్రం క్రమశిక్షణ అవసరం. కచ్చితంగా ఉదయం పూట నిద్ర లేచి వ్యాయామం లేదా నడక, పరిగెత్తటం చేయాలి. ఇలా చేయటం వల్ల ఒంట్లోని కొవ్వు కరిగిపోతుంది.



బరువు తగ్గాలంటే..

- కండలను కరిగించే పని పెట్టాలంటే మాత్రం శరీరం బద్ధకాన్ని వదిలించుకోవాల్సిందే. దొరికిన ఆహారాన్ని తినకుండా అదుపులో ఉండాలి. అలా అని తినకుండా ఉండటం కూడా మంచిది కాదు. తినాలి..తగినట్లు వ్యాయామం ఉండాలి.
- టీవీలు లేదా ఫోన్లు చూస్తూ తినటం మంచిది కాదు. ఎంత తిన్నారో మీకే తెలియదు. పైగా గంటల పాటు కూర్చుని తినటం వల్ల ఊబకాయం వస్తుంది.
- తాజా ఆకుకూరలు, పండ్లు తినాలి. సోడా, కూల్‌డ్రింక్స్‌కు దూరంగా ఉండటం మంచిది. మంచి నీళ్లు ఎక్కువగా తాగాలి.
- ముఖ్యంగా లైఫ్‌స్టయిల్‌ను మార్పు చేసుకుని బరువు తగ్గటానికి ప్రణాళిక వేసుకుంటేనే తగ్గుతారు.
- ఆహారం, వ్యాయామంతో పాటు మంచి నిద్ర ఉండకుంటే అంతే సంగతులు. అతిగా నిద్రపోయినా బరువు పెరుగుతారు. ముఖ్యంగా ఒత్తిడిని తగ్గించుకోవాలి. దీనివల్ల బరువు తగ్గుతారు.

74,000 పైకి సెన్సెక్స్

22,500 స్థాయికి చేరువలో నిఫ్టీ.. సరికొత్త గరిష్ఠాలకు సూచీలు

ముంబై: స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం ప్రారంభ నష్టాల నుంచి తేరుకుని సరికొత్త రికార్డులకు చేరుకున్నాయి. సెన్సెక్స్ తొలిసారిగా 74,000 మైలురాయిని దాటింది. ప్రైవేట్ బ్యాంకింగ్, ఫార్మా, కొన్ని ఐటీ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. మంగళవారం ముగింపు స్థాయి 73,677తో పోలిస్తే దాదాపు 90 పాయింట్ల నష్టంతో 73,587 వద్ద ప్రారంభమైన సెన్సెక్స్ ఒక దశలో 73,321 స్థాయికి జారుకుంది. అయితే, యూరప్ మార్కెట్ల సానుకూల సంకేతాలు, కొనుగోళ్ల మద్దతుతో మధ్యాహ్నం నుంచి మన మార్కెట్ కూడా అప్‌టర్న్ తీసుకుంది. ఒకదశలో సెన్సెక్స్ 474 పాయింట్లకు పైగా లాభంతో 74,151.27 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 408.86 పాయింట్ల లాభంతో సరికొత్త జీవనకాల గరిష్ఠ ముగింపు స్థాయి 74,085.99 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఒక దశలో 140.9 పాయింట్లు పెరిగి 22,497.20 వద్ద ఇంట్రాడే రికార్డును నమోదు చేసి చివరికి 117.75 పాయింట్ల లాభంతో 22,474.05 వద్ద సరికొత్త గరిష్ఠ ముగింపును నమోదు చేసింది.

1 సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 19 లాభపడగా.. కోటక్ బ్యాంక్ షేరు 2.47 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. యాక్సిస్ బ్యాంక్, ఎయిర్‌టెల్ షేర్లు రెండు శాతానికి పైగా పెరిగాయి.

1 బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ మాత్రం 1.91 శాతం క్షీణించగా.. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.65 శాతం నష్టపోయింది.

1 ఆర్‌బీఐ ఆంక్షల ప్రభావంతో జేఎం ఫైనాన్షియల్ షేరు 11% పతన మవగా.. ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ లిమిటెడ్ షేరు వరుసగా రెండో రోజూ 20 శాతం క్షీణించింది.



ఎస్‌బీఐ @ రూ.7 లక్షల కోట్లు

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ షేరు బీఎస్ఈ ఇంట్రాడే ట్రేడింగ్‌లో 0.79 శాతం పెరిగి రూ.790.15 వద్ద సరికొత్త జీవనకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. దాంతో బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ తొలిసారిగా రూ.7 లక్షల కోట్ల మైలురాయిని దాటింది. చివరికి షేరు 0.02 శాతం లాభంతో రూ.784.05 వద్ద ముగియడంతో మార్కెట్ క్యాప్ రూ.6,99,734 కోట్లుగా నమోదైంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఎస్‌బీఐ షేరు 22 శాతం వృద్ధిని కనబరిచింది. గడిచిన ఏడాది కాలంలో 39 శాతానికి పైగా పుంజుకుంది.

1 ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 7 పైసలు పెరిగి 82.83 వద్ద ముగిసింది.

ఐపీఓ అప్‌డేట్స్

1 కొచ్చికి చెందిన ఆటోమోటివ్ డీలర్‌షిప్, సర్వీసింగ్ సేవల కంపెనీ పాపులర్ వెహికిల్స్ అండ్ సర్వీసెస్ ఐపీఓ వచ్చే మంగళవారం ప్రారంభం కానుంది. ఈ కంపెనీ ఇష్యూ ధరల శ్రేణిని రూ.280-295గా నిర్ణయించింది.

1 క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ ఐపీఓ ఈనెల 14న ప్రారంభమై 18న ముగియనుంది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.175 కోట్ల తాజా ఈక్విటీ జారీతోపాటు ప్రమోటర్లకు చెందిన 17.5 లక్షల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిలో విక్రయించనుంది.

1 ఆర్ కే స్వామి ఐపీఓ చివరిరోజు ముగిసేసరికి ఇష్యూ సైజుకు 25.78 రెట్ల అధిక సబ్‌స్క్రిప్షన్ లభించగా.. జేజీ కెమికల్స్ ఆఫర్ రెండో రోజు నాటికి ఇష్యూ సైజుకు 6.39 రెట్లు, గోపాల్ స్నాక్స్ ఆఫర్ తొలిరోజు పూర్తయ్యేసరికి ఇష్యూ సైజులో 56 శాతం బిడ్లు లభించాయి.

ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్‌కు రూ.1,650 కోట్లు: ఫెయిర్‌ఫాక్స్

న్యూఢిల్లీ: ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ కంపెనీకి పెద్ద ఊరట లభించింది. ఈ కంపెనీకి 20 కోట్ల డాలర్ల (సుమారు రూ.1,650 కోట్లు) నిధులు సమకూర్చనున్నట్టు ఫెయిర్‌ఫాక్స్ ఇండియా హోల్డింగ్స్ కార్పొరేషన్ (ఎఫ్ఐహెచ్‌సీ) ప్రకటించింది. అయితే ఈ రుణ సాయం రెగ్యులేటరీ సంస్థల నిబంధనలకు లోబడి ఉంటుందని స్పష్టం చేసింది. ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ పసిడి రుణాలపై ఆర్‌బీఐ నిషేధం విధించిన కొద్ది రోజులకే ప్రేమ్‌వత్స నాయకత్వంలోని ఎఫ్ఐహెచ్‌సీ ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం.



ఇక కార్డ్ నెట్‌వర్క్ ఎంపిక కస్టమర్ ఇష్టమే : ఆర్‌బీఐ

ముంబై: క్రెడిట్, డెబిట్ కార్డుల జారీకి సంబంధించి ఆర్‌బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. అర్హులైన ఖాతాదారులకు వీటిని జారీ చేసేటపుడు, మాస్టర్ కార్డు, వీసా, రుపేలలో ఏ నెట్‌వర్క్ కార్డు తీసుకోవాలనే విషయాన్ని పూర్తిగా ఖాతాదారుల ఇష్టానికి వదిలేయాలని ఆర్‌బీఐ బ్యాంకులను ఆదేశించింది. ప్రస్తుతం ఈ విషయంలో ఖాతాదారులకు ఎటువంటి స్వేచ్ఛ లేదు. బ్యాంకులు ముందుగానే ఆయా నెట్‌వర్క్‌లతో ఒప్పందాలు కుదుర్చుకుని ఆయా నెట్‌వర్క్‌ల క్రెడిట్ లేదా డెబిట్ కార్డులను మాత్రమే ఖాతాదారులకు అంటగడుతున్నాయి. ఇక ముందు ఇలాంటి ముందస్తు ఒప్పందాలేవీ కుదరవని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఏ నెట్‌వర్క్ క్రెడిట్ కార్డు లేదా డెబిట్ కార్డు తీసుకోవాలనేది ఇక పూర్తిగా ఖాతాదారుల ఇష్టమని తెలిపింది. ఇప్పటికే క్రెడిట్ లేదా డెబిట్ కార్డులున్న ఖాతాదారులు తదుపరి రెన్యూవల్ టైమ్‌లో తమకు ఇష్టమైన నెట్‌వర్క్ కార్డును ఎంచుకోవచ్చని పేర్కొంది. ఈ ఆదేశాలు జారీ అయిన ఆరు నెలల నుంచి అమల్లోకి వస్తాయని ఆర్‌బీఐ తెలిపింది.

ఈ ఏడాది బంగారం 72,000?



న్యూఢిల్లీ: పసిడి వరుసగా రెండో రోజూ కొత్త రికార్డు స్థాయికి ఎగబాకింది. ఢిల్లీ మార్కెట్లో తులం బంగారం.. బుధవారం మరో రూ.150 పెరిగి రూ.65,150 ధర పలికింది. అంతర్జాతీయ మార్కెట్లోనూ ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం రేటు ఒకదశలో 2,145 డాలర్ల స్థాయిలో ట్రేడైంది. బంగారం ధర మరింతగా పెరిగి ఈ ఏడాది చివరికల్లా అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ 2,250 డాలర్లకు, దేశీయంగా తులం దాదాపు రూ.72,000 స్థాయికి చేరుకోవచ్చని బులియన్ మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అమెరికాలో ధరాఘాతం తగ్గుముఖం పట్టడంతో ఫెడరల్ రిజర్వ్ జూన్ సమీక్షలో వడ్డీరేట్ల తగ్గింపునకు శ్రీకారం చుట్టవచ్చన్న అంచనాలు గడిచిన కొన్ని నెలల్లో పసిడి ధరలు వేగంగా పెరగడానికి కారణమయ్యాయని ఎస్ఎస్ వెల్త్‌స్ట్రీట్ వ్యవస్థాపకులు సుగంధ సచ్‌దేవ అన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో భౌగోళిక రాజకీయ అనిశ్చితులతోపాటు సెంట్రల్ బ్యాంక్‌లు బంగారం నిల్వలను పెద్ద ఎత్తున పెంచుకుంటూ పోతుండటం కూడా డిమాండ్ పెరగడానికి కారణమవుతున్నాయని అన్నారు. బంగారం రేట్ల భవిష్యత్ బుల్లిష్‌గానే కన్పిస్తున్నప్పటికీ, మధ్యలో స్వల్ప దిద్దుబాటుకు లోనుకావచ్చని విశ్లేషకులు అంటున్నారు. దిద్దుబాటు దిశలోనూ రూ.61,200, రూ.59,500 స్థాయిల వద్ద మద్దతు లభించవచ్చని వారు భావిస్తున్నారు.

ప్రపంచంలోనే తొలి సీఎన్‌జీ బైక్ వచ్చే త్రైమాసికంలో: బజాజ్ ఆటో

న్యూఢిల్లీ: దేశీయ వాహన తయారీ కంపెనీ బజాజ్ ఆటో ప్రపంచంలో సీఎన్‌జీతో (కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్) నడిచే తొలి బైక్‌ను అందుబాటులోకి తేనుంది. ఈ మోటార్ సైకిల్‌ను ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు కంపెనీ ఎండీ రాజీవ్ బజాజ్ మంగళవారం వెల్లడించారు. సీఎన్‌జీ బైక్‌తో ఇంధన, నిర్వహణ ఖర్చులు సంప్రదాయ ఇంధన మోటార్ సైకిళ్లతో పోలిస్తే 50-65 శాతం మేర తగ్గనున్నాయని ఆయన తెలిపారు. అంతేకాదు, ఈ బైక్ విడుదల చేసే కాలుష్య ఉద్గారాలు కూడా చాలా తక్కువన్నారు. సంప్రదాయ ఇంధన బైక్‌లతో పోలిస్తే, కార్బన్ డై ఆక్సైడ్ విడుదల 50 శాతం, కార్బన్ మోనాక్సైడ్ 75 శాతం, నాన్ మీథేన్ హైడ్రోకార్బన్ దాదాపు 90 శాతం తగ్గనుందన్నారు.

గ్రీన్‌కో చేతికి జీఐ హైడ్రో ప్రాజెక్టు

డీల్ విలువ రూ.1000 కోట్లు

హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన పునరుత్పాదక ఇంధన వనరుల రంగంలోని గ్రీన్‌కో కంపెనీ జీఐ హైడ్రో నుంచి తూర్పు సిక్కింలోని చుజాచెన్ హైడ్రో విద్యుత్ ప్రాజెక్టు కొనుగోలును పూర్తి చేసింది. 110 మెగావాట్ల సామర్థ్యం గల ఈ ప్రాజెక్టు ఎంటర్‌ప్రైజ్ విలువ రూ.1000 కోట్లు కాగా ఈక్విటీ విలువ రూ.300 కోట్లని ఈ డీల్‌తో సన్నిహితంగా పని చేసిన వారు తెలియచేశారు. అయితే అధికారికంగా ధ్రువీకరించడానికి రెండు కంపెనీల ప్రతినిధులు అందుబాటులో లేరు. 2014 మే నెలలో ప్రారంభించిన ఈ హైడ్రో విద్యుత్ ప్రాజెక్టు రంగ్‌పో, రోంగ్లి నదులకు చెదిన అనుసంధానిత రిజర్వాయర్ల నుంచి నీటిని వినియోగించి విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. గ్రీన్‌కో కంపెనీ ఇప్పటికే హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, కర్ణాటక, సిక్కింలలో 1789 మెగావాట్ల సామర్థ్యం గల 25 ప్రాజెక్టులను నిర్వహిస్తోంది. వాటిలో సిక్కింలోని 96 మెగావాట్ల సామర్థ్యం గల దిక్చూ హైడ్రో విద్యుత్ ప్రాజెక్టు కూడా ఉంది.

స్విట్జర్లాండ్‌కు పెరుగుతున్న పర్యాటకులు

హైదరాబాద్: స్విట్జర్లాండ్ పర్యాటక రంగం కొవిడ్ ప్రభావం నుంచి పూర్తిగా కోలుకుంది. 2023లో తమ దేశానికి వచ్చిన పర్యాటకుల సంఖ్య కొవిడ్‌కు ముందున్న 2019 స్థాయిని మించి పోయిందని స్విట్జర్లాండ్ టూరిజం చీఫ్ మార్కెటింగ్ అధికారి (ఈస్ట్ మార్కెట్స్) సైమన్ బొషార్ట్ చెప్పారు. అయితే భారత పర్యాటకుల సంఖ్య మాత్రం ఇంకా 2019 కంటే తక్కువే ఉందన్నారు. 2019లో భారత్ నుంచి ఎనిమిది లక్షల మంది పర్యాటకులు వస్తే, గత ఏడాది అది ఆరు లక్షల స్థాయిలోనే ఉందన్నారు. ఈ సంవత్సరం వీరి సంఖ్య ఎనిమిది లక్షలకు చేరుతుందని భావిస్తున్నట్టు తెలిపారు. ముంబై, ఢిల్లీ, బెంగళూరు తర్వాత హైదరాబాద్ నుంచే ఎక్కువ మంది పర్యాటకులు తమ దేశానికి వస్తున్నట్టు సైమన్ చెప్పారు.

ఫిన్‌టెక్‌లకు మేము వ్యతిరేకం కాదు

మార్చి 15 వరకే పేటీఎంకు గడువు.. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్



న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ కంపెనీలకు తాము వ్యతిరేకం కాదని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించినందునే పేటీఎం పేమెంట్ బ్యాంక్‌పై (పీపీబీఎల్) చర్యలు తీసుకోవాల్సి వచ్చిందన్నారు. నిజానికి ఫైనాన్షియల్ టెక్నాలజీ రంగంలో మరిన్ని నవ కల్పనలు రావాలని ఆర్‌బీఐ కోరుకుంటున్నట్టు తెలిపారు. ఈ రంగంలో కొత్త ఆలోచనల సాధ్యాసాధ్యాలను పరీక్షించేందుకు ఆర్‌బీఐ ఇప్పటికే శాండ్ బాక్స్ విధానాన్ని ప్రవేశ పెట్టిన విషయాన్ని దాస్ గుర్తు చేశారు. దేశంలో ఫిన్‌టెక్‌ల అభివృద్ధికి ఆర్‌బీఐ పూర్తిగా కట్టుబడి ఉందన్నారు.

పేటీఎంకు మార్చి 15 వరకే గడువు: పేటీఎం వ్యాలెట్ వినియోగదారులకు ఈ నెల 15 వరకు ఇచ్చిన గడువును పొడిగించే ప్రసక్తే లేదని దాస్ స్పష్టం చేశారు. పేటీఎం వ్యాలెట్ వినియోగదారుల్లో 80 నుంచి 85 శాతం మంది ఇప్పటికే పీపీబీఎల్‌తో అనుసంధానమైన తమ వ్యాలెట్స్‌ను ఇతర బ్యాంకులతో అనుసంధానం చేసుకున్నట్టు తెలిపారు. కాబట్టి పీపీబీఎల్‌పై ఆర్‌బీఐ తీసుకున్న నియంత్రణ చర్యల ప్రభావం పేటీఎం వ్యాలెట్ వినియోగదారులపై ఏమాత్రం ఉండదన్నారు.

8 శాతానికి చేరువలో వృద్ధి రేటు: ఈ ఆర్థిక సంవత్సరం మన జీడీపీ వృద్ధిరేటు ఎనిమిది శాతానికి చేరువలో ఉంటుందని దాస్ తెలిపారు. మార్చితో ముగిసే నాలుగో త్రైమాసికంలోనూ జీడీపీ వృద్ధిరేటు 5.9 శాతంపైనే ఉంటుందన్నారు. అదే జరిగితే వార్షిక వృద్ధిరేటు ముందు అంచనా వేసిన 7.6 శాతాన్ని మించి పోతుందన్నారు. ఏదేమైనా ఈ ఆర్థిక సంవత్సరం మన జీడీపీ వృద్ధి రేటు ఎనిమిది శాతానికి దగ్గరలో ఉంటుందని దాస్ చెప్పారు. జనవరి నెలలో నమోదైన 5.10 శాతం రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ నిర్దేశిత నాలుగు శాతం లక్ష్యం కంటే 1.10 శాతం ఎక్కువగా ఉందన్నారు. రిటైల్ ద్రవ్యోల్బణాన్ని నాలుగు శాతం వద్ద కట్టడి చేయడమే తమ లక్ష్యమన్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	65,130 ▲	59,700 ▲	78,000 ▼
ముంబై	64,490 ▼	59,080 ▼	71,710 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



6వ తేదీ	
హైదరాబాద్	469
7వ తేదీ	
చిత్తూరు	523
గోదావరి	463
విజయవాడ	463
విశాఖపట్నం	500
వరంగల్	471
డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	116
వరంగల్	116
కరీంనగర్	116
మహబూబ్‌నగర్	116
కర్నూలు	116
విశాఖపట్నం	121
గోదావరి	124
విజయవాడ	124
గుంటూరు	124
ఒంగోలు	124
చిత్తూరు	120

స్పోర్ట్స్


అదరాలి.. ఆఖరాట

వరుసగా నాలుగో విజయంపై భారత్ గురి

- గెలుపుతో ముగించాలని ఇంగ్లండ్
- ఐదో టెస్ట్ నేటి నుంచి

ఉ. 9.30 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో

ధర్మశాల: కఠిన సవాళ్లు ఎదురైనా.. సొంతగడ్డపై తిరుగులేని రికార్డును కొనసాగిస్తున్న భారత్.. ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌ను విజయంతో ముగించాలనుకొంటోంది. ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా ఐదవ, ఆఖరి మ్యాచ్ గురువారం నుంచి జరగనుంది. హైదరాబాద్‌లో జరిగిన తొలి టెస్ట్‌లో అనూహ్యంగా ఓటమిపాలైన రోహిత్ సేన.. ఆ తర్వాత బలంగా పుంజుకొని 3-1తో సిరీస్‌ను సొంతం చేసుకొంది. ఈ మ్యాచ్ స్పిన్నర్ అశ్విన్ కెరీర్‌లో వందో టెస్ట్ కావడంతో.. ఎట్టిపరిస్థితుల్లోనూ గెలిచి అతడికి బహుమతిగా ఇవ్వాలని టీమిండియా పట్టుదలతో ఉంది. కోహ్లీ, రాహుల్ లాంటి సీనియర్ ప్లేయర్లు అందుబాటులో లేకపోయినా.. కుర్రాళ్ల ప్రతిభతో నెగ్గడం ఈ సిరీస్ ప్రత్యేకం. ముఖ్యంగా ధ్రువ్ జురెల్..తానాడిన రెండో టెస్ట్‌లోనే మ్యాచ్ విన్నర్‌గా నిలిచాడు. రాంచీ టెస్ట్‌లో తీవ్ర ఉత్కంఠ పరిస్థితులు ఎదురైనా.. జురెల్ పోరాటం కారణంగా భారత్ సిరీస్‌ను సొంతం చేసుకోగలిగింది. సర్ఫరాజ్ ఖాన్ కూడా అరంగేట్రం టెస్ట్‌లో రెండు అర్ధ శతకాలతో ఆకట్టుకొన్నా.. నాలుగో టెస్ట్‌లో 14, 0 పరుగులతో నిరాశపరిచాడు. వరుసగా విఫలమవుతున్న రజత్ పటీదార్‌కు బహుశా ఇదే చివరి అవకాశం కావచ్చు. ఓపెనర్‌గా జైస్వాల్ అద్భుతంగా రాణిస్తుండగా.. వన్‌డౌన్‌లో గిల్ క్రమంగా నిలదొక్కుకొంటున్నాడు. గత మ్యాచ్‌లో విశ్రాంతి తీసుకొన్న బుమ్రా తిరిగి జట్టులోకి వచ్చాడు. ముగ్గురు పేసర్లతో బరిలోకి దిగే అవకాశాలను కూడా మేనేజ్‌మెంట్ పరిశీలిస్తోంది.



స్టోక్స్

బ్యాటర్లు పుంజుకొనేనా..: 'బజ్‌బాల్' జమానాలో తొలిసారి టెస్ట్ సిరీస్ చేజార్చుకొన్న ఇంగ్లండ్ ఒత్తిడిలో పడింది. దూకుడుగా ఆడాలన్న వారి వ్యూహం భారత పిచ్‌లపై బెడిసికొట్టింది. ఇంగ్లండ్ బ్యాటింగ్ వైఫల్యం ఈ సిరీస్‌లో ఎక్కువగా కనిపిస్తోంది. మొదటి మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో 196 పరుగుల తర్వాత పోప్ ఆ స్థాయి ప్రదర్శన చేయలేక పోయాడు. ఓపెనర్లు క్రాలే, డకెట్ కొంత ఫర్వాలేదనిపించినా.. రూట్, స్టోక్స్ ఆశించి స్థాయిలో ఆడలేక పోవడం మైనస్‌గా మారింది. స్పిన్నర్లు బషీర్, హార్ట్‌లీకి పెద్దగా అనుభవం లేకపోయినా.. మెరుగైన ప్రదర్శన కనబరచినట్టుగానే భావించాలి. పేసర్లు అండర్సన్, మార్క్ ఉడ్‌లతో బరిలోకి దిగే చాన్సులు ఎక్కువగా ఉన్నాయి. వరుసగా విఫలమవుతున్న బ్యాటర్ జానీ బెయిర్‌స్టోకు కూడా ఇది 100వ టెస్ట్ కావడం విశేషం. మరి ఈ మైలురాయి మ్యాచ్‌లోనైనా అతడు ఫామ్‌ను అందుకొంటాడేమో చూడాలి. కాగా, ఇక్కడి వాతావరణం చల్లగా ఉండడం ఇంగ్లండ్‌కు కొంత అనుకూలం. ఈ నేపథ్యంలో ప్రత్యర్థి నుంచి భారత్‌కు గట్టిపోటీ ఎదురయ్యే అవకాశం ఉంది.



అశ్విన్, బెయిర్‌స్టో

100

భారత స్పిన్నర్ అశ్విన్, ఇంగ్లండ్ ఆటగాడు బెయిర్‌స్టోల కెరీర్‌లో ఇది 100వ టెస్ట్. ఈ మ్యాచ్‌తో సెంచరీ మైలురాయిని చేరిన 14వ భారత ఆటగాడిగా అశ్విన్, 17వ ఇంగ్లండ్ ప్లేయగా బెయిర్‌స్టో రికార్డులకెక్కనున్నారు.

2 700 వికెట్ల మైలురాయికి అండర్సన్‌కు కావాల్సిన వికెట్లు. మురళీధరన్ (800), షేన్ వార్న్ (708) అతడి కంటే ముందున్నారు.



రోహిత్

జట్లు (అంచనా)

భారత్: రోహిత్, జైస్వాల్, గిల్, పటీదార్, సర్ఫరాజ్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), జడేజా, అశ్విన్, కుల్దీప్/ఆకాశ్‌దీప్, సిరాజ్, బుమ్రా.

ఇంగ్లండ్: క్రాలే, డకెట్, పోప్, రూట్, బెయిర్‌స్టో, స్టోక్స్ (కెప్టెన్), ఫోక్స్ (వికెట్ కీపర్), హార్ట్‌లీ, మార్క్ ఉడ్, బషీర్, అండర్సన్.

పిచ్/వాతావరణం

చల్లని వాతావరణం, పిచ్‌పై తేమ ఉండడంతో పేసర్లకు అనుకూలించే అవకాశం ఉంది. ఇక్కడ జరిగిన రంజీ మ్యాచ్‌ల్లో ఫాస్ట్ బౌలర్లే ఎక్కువ వికెట్లు పడగొట్టారు. బ్యాటర్లు నిలదొక్కుకొంటే భారీ స్కోర్లు చేసే చాన్సుంది. వర్షం కురిసే అవకాశాలున్నాయి. అయితే, వికెట్ బ్యాటింగ్‌కు అనుకూలమని స్టోక్స్. ఉదయం పేసర్లకు, మ్యాచ్ సాగేకొద్దీ స్పిన్నర్లకు సహకరించే చాన్సుంటుందని రోహిత్ అన్నాడు.

ఆ పరిస్థితుల్లోనూ.. ఎందుకొచ్చావని అడిగింది



రాజ్‌కోట్‌లో జరిగిన మూడో టెస్ట్ మధ్యలో అశ్విన్ తల్లి చిత్రా రామచంద్రన్ తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. దీంతో అశ్విన్ ఇంటి వెళ్లాల్సిన పరిస్థితి. అయితే ఐసీయూలో ఉన్నప్పుడు కూడా అమ్మ తన మ్యాచ్ గురించే అడిగిందని అశ్విన్ చెప్పాడు. 'అమ్మ స్పృహలోకి వస్తూ.. పోతూ ఉంది. ఒకసారి తెలివిలోకి వచ్చిన తర్వాత నన్నుచూసి 'నువ్వెందుకొచ్చావ్ ?' అని అడిగింది. ఆ వెంటనే మళ్లీ స్పృహ కోల్పోయింది. మళ్లీ కళ్లు తెరిచిన తర్వాత 'టెస్ట్ మ్యాచ్ జరుగుతోంది. నువ్వు వెళ్లా'లని చెప్పిందని ఆ భారమైన క్షణాలను గుర్తు చేసుకొన్నాడు.

రామ్‌చరణ్‌తో సచిన్ 'నాటు నాటు'

ముంబై: సచిన్ టెండూల్కర్ మైదానంలో స్టెప్పులేసి అలరించాడు. ఇండియన్ ప్రీమియర్ స్ట్రీట్ లీగ్ (ఐఎస్‌పీఎల్) ప్రారంభ టోర్నీ బుధవారం ఇక్కడి దాదోజీ కొండదేవ్ స్టేడియంలో జరిగింది. ఈ వేడుకకు హాజరైన సచిన్.. లీగ్‌లోని కొన్ని జట్లకు యజమానులైన రామ్‌చరణ్, హీరో సూర్య, అక్షయ్ కుమార్‌లతో కలిసి ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని 'నాటు నాటు...' పాటకు డ్యాన్స్ చేశాడు. 6 జట్లు పోటీపడుతున్న ఐఎస్‌పీఎల్ ఈనెల 15వ తేదీ వరకు జరగనుంది.

గుజరాత్ గెలిచె..

అదరగొట్టిన వోల్వార్ట్, మూనీ

పోరాడి ఓడిన బెంగళూరు



నేటి మ్యాచ్
యూపీ x ముంబై
రాత్రి 7.30 గం. నుంచి

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో చావోరేవో తేల్చుకోవాల్సిన మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ సత్తా చాటింది. వరుసగా నాలుగు ఓటముల తర్వాత లీగ్‌లో తొలి విజయాన్ని నమోదు చేసింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఓపెనర్లు లారా వోల్వార్ట్ (45 బంతుల్లో 13 ఫోర్లతో 76), కెప్టెన్ బెత్ మూనీ (51 బంతుల్లో 12 ఫోర్లు, సిక్సర్‌తో 85 నాటౌట్) అద్భుత అర్ధ సెంచరీలతో విజృంభించడంతో గుజరాత్ 19 పరుగుల తేడాతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)పై గెలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 199 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనింగ్ జోడీ లారా వోల్వార్ట్, బెత్ మూనీ ఆరంభం నుంచే బౌండరీలతో విరుచుకుపడడంతో 5 ఓవర్లలోనే జట్టు స్కోరు హాఫ్ సెంచరీ దాటింది. ఆ తర్వాతా అంతే దూకుడుగా ఆడిన ఇద్దరూ తొలి వికెట్‌కు 78 బంతుల్లో 140 పరుగుల భాగస్వామ్యం అందించడంతో జట్టు స్కోరు జెట్‌స్పీడ్‌తో దూసుకెళ్లింది. ఛేదనలో ఆర్‌సీబీ 20 ఓవర్లలో 180/8 స్కోరుకు పరిమితమై ఓటమిపాలైంది. వారెహామ్ (22 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 48), రిచా ఘోష్ (21 బంతుల్లో 5 ఫోర్లు, సిక్సర్‌తో 30) పోరాడినా ఫలితం లేకపోయింది. కెప్టెన్ స్మృతి మంధాన 24, ఎలిస్ పెర్రీ 24, డివైన్ 23 పరుగులు చేశారు. జట్టులో నాలుగు బ్యాటర్లు రనౌట్‌గా వెనుదిరిగారు. కీలక సమయాల్లో వికెట్లు కోల్పోవడం, సరైన భాగస్వామ్యాలు నిర్మించకపోవడం ఆర్‌సీబీని దెబ్బ తీసింది. గుజరాత్ బౌలర్లలో గార్డ్‌నర్ రెండు వికెట్లు పడగొట్టింది.

సంక్షిప్త స్కోర్లు

గుజరాత్: 199/5 (బెత్ మూనీ 85 నాటౌట్, లారా వోల్వార్ట్ 76; సోఫీ మోలినెక్స్ 1/32, వారెహామ్ 1/36); **బెంగళూరు:** 180/8 (వారెహామ్ 48, రిచా 30, మంధాన 24, పెర్రీ 24, గార్డ్‌నర్ 2/23).

కిడాంబి, సింధు బోణీ

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఆంధ్ర షట్లర్లు కిడాంబి శ్రీకాంత్, పీవీ సింధు శుభారంభం చేశారు. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో కిడాంబి 21-15, 20-22, 21-8తో చౌ టైన్ చెన్ (తైవాన్)పై నెగ్గగా, సింధు 20-22, 22-20, 21-19తో మిచెల్ లి (కెనడా)పై అతి కష్టంగా గెలిచి, రెండో రౌండ్లోకి ప్రవేశించారు. మరో సింగిల్స్ పోరులో హెచ్ఎస్ ప్రణయ్ 17-21, 17-21తో లు గ్వాంగ్జు (చైనా) చేతిలో పోరాడి ఓడాడు.

విదర్భ విజయఢంకా

- రంజీ సెమీస్‌లో ఎంపీపై గెలుపు
- 10నుంచి ముంబైతో ఫైనల్



నాగ్‌పూర్: రంజీ ట్రోఫీ మాజీ చాంపియన్ మధ్యప్రదేశ్ (ఎంపీ)కు సెమీఫైనల్లో భంగపాటు ఎదురైంది. రెండుసార్లు విజేత విదర్భ 62 పరుగుల తేడాతో మధ్యప్రదేశ్‌ను చిత్తుచేసి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఆఖరి రోజు గెలిచేందుకు ఎంపీ జట్టుకు 93 రన్స్ కావాల్సి ఉండగా.. విదర్భకు 4 వికెట్లు అవసరమయ్యాయి. ఈ నేపథ్యంలో ఐదోరోజైన బుధవారం ఓవర్‌నైట్ స్కోరు 228/6తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఎంపీ.. విదర్భ బౌలింగ్ ధాటికి మరో 30 పరుగులు మాత్రమే చేసి 258 పరుగులకు ఆలౌటైంది. ఫలితంగా విదర్భ సూపర్ విజయంతో మూడోసారి రంజీ ఫైనల్లో అడుగుపెట్టింది. తొలి ఇన్నింగ్స్‌లో 170 పరుగులకే పరిమితమైన విదర్భ.. రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం 402 పరుగులతో భారీ స్కోరు చేసింది. మధ్యప్రదేశ్ మొదటి ఇన్నింగ్స్‌లో 252 రన్స్‌కే ఆలౌటైంది. యశ్ రాథోడ్ (141)కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది. ఈనెల 10 నుంచి జరిగే ఫైనల్లో 41సార్లు చాంపియన్ ముంబైతో విదర్భ ట్రోఫీ కోసం తలపడనుంది. కాగా, గతంలో ఫైనల్ చేరిన రెండు పర్యాయాలూ (2017-18, 2018-19) విదర్భ విజేతగా నిలవడం విశేషం.

రిత్విక్‌కు కాంస్యం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ గ్రాండ్ మాస్టర్ రాజా రిత్విక్ కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. నాసిక్‌లో ఈనెల 4వ తేదీ నుంచి జరుగుతున్న ఈ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ టోర్నీలో రుత్విక్ 8.5 పాయింట్లతో తృతీయ స్థానంలో నిలిచాడు. మొత్తం 11 రౌండ్లలో రుత్విక్ ఏడు గేమ్‌ల్లో గెలిచి, మరో మూడింటిని డ్రా చేసుకున్నాడు. ఒక గేమ్‌లో ఓడాడు.

అర్జున్‌కు రెండో డ్రా

షెంజెన్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్ ఆరో రౌండ్‌ను అర్జున్ డ్రాగా ముగించాడు. రష్యా జీఎం ఆర్టెమీవ్‌తో తలపడిన అర్జున్, 30 ఎత్తుల తర్వాత డ్రాకి అంగీకరించాడు. ఇక, ప్రేగ్ చెస్ ఫెస్టివల్ ఏడో రౌండ్‌లో ప్రజ్ఞానంద-గుకేష్ 91 ఎత్తుల తర్వాత డ్రా చేసుకున్నారు.

'ఖేలో ఇండియా' విజేతలు ప్రభుత్వోద్యోగాలకు అర్హులే!

క్రీడా మంత్రి అనురాగ్

న్యూఢిల్లీ: ప్రభుత్వ ఉద్యోగాల్లోని స్పోర్ట్స్ కోటాలో ఇక నుంచి ఖేలో ఇండియా పతక విజేతలను కూడా పరిగణనలోనికి తీసుకుంటామని కేంద్ర క్రీడా మంత్రి అనురాగ్ ఠాకూర్ వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచనలకు అనుగుణంగా ఈ విప్లవాత్మకమైన నిర్ణయాన్ని తీసుకున్నామని చెప్పారు. ఇప్పటివరకు అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర, విశ్వవిద్యాలయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన వారికే క్రీడా కోటా కింద మేలు జరిగేదని, ఇప్పుడు ఈ జాబితాలోకి ఖేలో ఇండియా పతకధారులను కూడా చేర్చామన్నారు.

కివీస్‌తో భారత్ తొలిపోరు

పారిస్ ఒలింపిక్స్ హాకీ షెడ్యూల్

లుసాన్నె: పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనే పురుషుల హాకీ జట్టు షెడ్యూల్‌ను బుధవారం విడుదల చేశారు. పూల్-బిలో ఉన్న భారత్ తన తొలి మ్యాచ్‌ను జులై 27న న్యూజిలాండ్‌తో ఆడనుంది. ఆ తర్వాత 29న అర్జెంటీనా, 30న ఐర్లాండ్, ఆగస్టు 1న డిఫెండింగ్ చాంప్ బెల్జియం, ఆగస్టు 2న ఆస్ట్రేలియా జట్లతో గత క్రీడల కాంస్య విజేత భారత్ తలపడనుంది. పూల్-ఎలో నెదర్లాండ్స్, స్పెయిన్, జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్, దక్షిణాఫ్రికా జట్లు బరిలో ఉన్నాయి.

కూల్చే పాలన కావాలా... రాష్ట్రాన్ని నిర్మించే బాబు కావాలా?

» 'నిజం గెలవాలి' యాత్రలో భువనేశ్వరి


అనంతపురం నగరంలో ప్రజలకు అభివాదం చేస్తున్న నారా భువనేశ్వరి

అనంతపురం మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని కూల్చే ప్రభుత్వం కావాలో, నిర్మాణం చేసే చంద్రబాబు పాలన కావాలో ఆలోచించాలని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి.. మహిళలు, రాష్ట్ర ప్రజలకు సూచించారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా ఆమె బుధవారం అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చారు. అనంతపురం అర్బన్, కల్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక గుండెపోటుతో మరణించిన టీడీపీ కార్యకర్తల కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. ఒక్కో బాధిత కుటుంబానికి రూ.3 లక్షలు చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ముందుగా అనంతపురం నగరంలోని అశోక్‌నగర్‌లో గుండెపోటుతో మృతిచెందిన దేరంగుల వెంకటమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కల్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలోని ఎం.కొండాపురం గ్రామానికి చెందిన దొడ్డి నారాయణప్ప, ముద్దినాయనపల్లికి చెందిన శ్రీరాములు, ఎం.కొత్తూరులో పోతురాజు పాతన్న ఇళ్లకు ఆమె వెళ్లి ఆయా కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆ తర్వాత రాయదుర్గం నియోజకవర్గ పరిధి కణేకల్లు మండలం గోపులాపురానికి చెందిన తలారి వంద్రప్ప కుటుంబ సభ్యులను పరామర్శించారు. కల్యాణదుర్గంలో మహిళలతో భువనేశ్వరి మాట్లాడారు. "జగన్ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది. మంచి నీళ్లు అడిగితే ట్రాక్టర్‌తో గుద్ది చంపడం, కళ్లు పీకేయడం లాంటి దుర్మార్గపు చర్యలకు వైసీపీ రౌడీమూకలు దిగుతున్నాయి. చంద్రబాబు పాలనలో ప్రజలు, మహిళలు ధైర్యంగా బతికారు. చంద్రబాబు పాలనలో ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం జరిపిన నిందితుడు.. తనను ప్రభుత్వం ఎలా శిక్షిస్తుందో అనే భయంతో ఆత్మహత్య చేసుకున్నాడు. మహిళలకు ఏదైనా జరిగితే చంద్రబాబు ఆ స్థాయిలో స్పందించి చర్యలు తీసుకునేవారు. కానీ, జగన్ పాలనలో మహిళలు అని కూడా లేకుండా రాడ్లతో కొట్టి చంపే ప్రయత్నం చేస్తున్నారు. మంచినీళ్లు అడిగిన మహిళను ట్రాక్టరుతో తొక్కించి చంపేశారు" అని భువనేశ్వరి ఆవేదన వ్యక్తంచేశారు. అప్రమత్తంగా లేకపోతే ప్రజల ఆస్తులను అమ్మేస్తారని ఈ పరిస్థితుల్లో ఓటు మాత్రమే మిమ్మల్ని రక్షిస్తుందన్నారు.

మైలవరం వసంతకే!

దేవినేని ఉమతో అచ్చెన్న చర్చలు

» చంద్రబాబు నిర్ణయానికి కట్టుబడతానన్న మాజీ మంత్రి

» పి.గన్నవరంలో పోటీ నుంచి వైదొలగిన మహాసేన రాజేశ్

» ఎచ్చెర్లలో కళాకు వర్గపోరు

» సర్వేపల్లిలో సోమిరెడ్డికి ప్రతికూలత?

» పెదకూరపాడులో శ్రీధర్‌పైనా!

» వెంకటగిరి బరిలో కురుగొండ్ల కుమార్తె

» టీడీపీ అభ్యర్థుల కసరత్తులో కీలక పరిణామాలు


దేవినేని ఉమ


మహాసేన రాజేశ్


సోమిరెడ్డి

అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా మైలవరం టీడీపీ టికెట్ వైసీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కే ఖరారైంది. ఆయన కొద్ది రోజుల కిందట వైసీపీకి రాజీనామా చేసి మాజీ సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన సంగతి తెలిసిందే. ఆయన్ను అక్కడే అభ్యర్థిగా నిలపాలని నాయకత్వం నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం అక్కడ టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుతో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు బుధవారం చర్చించారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయాన్ని ఆయనకు తెలిపారు. 'సర్వేల ఆధారంగా ఈ నిర్ణయం జరిగింది. తప్పనిసరి పరిస్థితుల్లో తీసుకున్న నిర్ణయానికి సహకరించాలని పార్టీ అధినేత తరఫున కోరుతున్నాం' అని చెప్పారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని దేవినేని ఆయనతో అన్నారు. ప్రత్యామ్నాయంగా పెనమలూరు సీటును ఆయన ఆశిస్తున్నారు. దానిపై ఇంకా నిర్ణయం జరగలేదు. కోనసీమ జిల్లాలోని పి.గన్నవరం సీటుకు దళిత నేత మహాసేన రాజేశ్‌ను టీడీపీ అభ్యర్థిగా ప్రకటించిన సంగతి తెలిసిందే. వివిధ వర్గాల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో పోటీ నుంచి వైదొలగాలని ఆయన నిర్ణయించుకున్నారు. ఆయన గతంలో కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ కొన్ని వర్గాలు ఆందోళన చేస్తుండడంతో.. చంద్రబాబు అక్కడి పరిస్థితులపై రాజేశ్‌తో, పార్టీ నేతలతో చర్చించారు. దీంతో తానే వైదొలగాలని భావిస్తున్నానని రాజేశ్ చెప్పారు. ఆయనకు ఎదురైన సమస్యపై చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. ఆయనకు భవిష్యత్‌లో మంచి అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. అమలాపురం అసెంబ్లీ స్థానం పొత్తులో జనసేనకు వెళ్తే.. అక్కడి మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావును పి.గన్నవరంలో నిలపాలని టీడీపీ నాయకత్వం యోచిస్తున్నట్లు సమాచారం. పి.గన్నవరాన్ని జనసేనకు కేటాయించే ప్రతిపాదన కూడా ఉందంటున్నారు. టీడీపీ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు కిమిడి కళా వెంకట్రావు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బుధవారమిక్కడ చంద్రబాబును కలిసి మాట్లాడారు. వీరిద్దరి పేర్లు మొదటి జాబితాలో రాలేదు. ఎచ్చెర్లలో కళావెంకట్రావుతో కొందరు టీడీపీ నేతలు విభేదించి పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారని.. ఈ పరిస్థితుల్లో ఆయన విజయనగరం ఎంపీగా పోటీ చేస్తే బాగుంటుందని చంద్రబాబు ప్రతిపాదించారు. అయితే ఎంపీ సీటుపై ఆసక్తి లేదని, ఎచ్చెర్లలో అందరినీ కలుపుకొని వెళ్తానని.. అవకాశమివ్వాలని కళా కోరారు. ఇక సర్వేపల్లిలో తాను అధికార పార్టీ ఒత్తిళ్లకు ఎదురొడ్డి అనేక సమస్యలపై పోరాటం చేస్తున్నానని, తనకే అవకాశమివ్వాలని సోమిరెడ్డి కోరారు. అయితే సర్వేపల్లిలో సర్వే ఫలితాలు పైకి, కిందకు వస్తుండడంతో ఒక నిర్ణయానికి రాలేకపోతున్నామని, అన్నీ ఆలోచించి నిర్ణయం చెబుతామని బాబు చెప్పారు.

చీపురుపల్లికి గంటా..

కోవూరుకు ప్రశాంతి

మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావును విజయనగరం జిల్లా చీపురుపల్లిలో నిలపడంపైనే టీడీపీ నాయకత్వం మొగ్గుతో ఉన్నట్లు సమాచారం. అశోక్ గజపతిరాజు, కళావెంకట్రావు పెద్దవాళ్లు అవడంతో ఆ జిల్లాలో చురుగ్గా పార్టీని నడిపేవాళ్లు అవసరమని, ఆ కోణంలో గంటా చీపురుపల్లి బరిలో నిలవడం అవసరమని టీడీపీ భావిస్తున్నట్లు చెబుతున్నారు. ఇక నెల్లూరు జిల్లా కోవూరులో వేమిరెడ్డి ప్రశాంతిని నిలపాలనుకుంటునట్లు చెబుతున్నారు. ఇటీవల టీడీపీలో చేరిన వైసీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి ఆమె. వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డిని ఆత్మకూరులో నిలపాలని నిర్ణయించారు. ఆనం మొదట్లో ఆ స్థానంపై అంత ఆసక్తి చూపలేదు. కానీ ఆ తర్వాత ఆ జిల్లాలో చోటు చేసుకున్న పరిణామాలతో అంగీకారం తెలిపినట్లు సమాచారం. వెంకటగిరిలో మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కుమార్తెను నిలిపే అవకాశం కనిపిస్తోంది. పల్నాడు జిల్లా పెదకూరపాడులో మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌కే తిరిగి అవకాశమివ్వాలని లోక్‌సభ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు, జిల్లా పార్టీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు చంద్రబాబును కోరారు. అయితే సర్వే నివేదికలు ఆయనకు అంత అనుకూలంగా రావడం లేదని చంద్రబాబు పేర్కొన్నట్లు సమాచారం. గురజాలలో మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావునే అభ్యర్థిగా కొనసాగించే అవకాశం ఉందంటున్నారు. అన్నమయ్య జిల్లా రాజంపేటలో జిల్లా పార్టీ అధ్యక్షుడు జగన్మోహనరాజుకు టికెట్ లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా గోపాలపురం ఇన్‌చార్జి మద్దిపాటి వెంకటరాజును అచ్చెన్నాయుడు బుధవారం కార్యాలయానికి పిలిపించి మాట్లాడారు.ఆయన టికెట్ విషయంలో గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు. ఇదే జిల్లాలోని కొవ్వూరుకి టీడీపీ అభ్యర్థి ఎంపిక ఆసక్తిగా మారింది. దీన్ని ఎస్సీ మాల వర్గానికి ఇస్తే బాగుంటుందని జిల్లా నేతలు కొందరు పార్టీ అధిష్ఠానానికి ప్రతిపాదించారు. ఆ కోణంలో డాక్టర్ అనిల్, మాజీ మంత్రి పీతల సుజాత పేర్లు వినిపిస్తున్నాయి.

పొత్తు పొడుపు!

(మొదటి పేజీ తరువాయి)

వెళ్లడం గత నెల రోజుల్లో ఇది రెండోసారి. గత నెల 7న కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆహ్వానంతో ఆయన ఢిల్లీ వెళ్లారు. ఎన్డీయేలో చేరాలని షా కోరడంతో ఆయన అంగీకరించారు. కానీ దీనిపై 2 పార్టీలు అధికారిక ప్రకటన చేయలేదు. ఇప్పుడు సీట్ల సర్దుబాటు కుదిరిన తర్వాత ప్రకటిస్తారని అంటున్నారు. గురువారం మధ్యాహ్నం ఢిల్లీ వెళ్తున్న చంద్రబాబు.. రాత్రి బీజేపీ అగ్ర నేతలతో మంతనాలు జరుపుతారు. అవసరమైతే శుక్రవారం కూడా అక్కడే ఉండే అవకాశం ఉంది. ఒకట్రెండు రోజుల్లో సీట్ల సర్దుబాటు పూర్తవుతుందని అంటున్నారు. ఈ భేటీకి జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ను కూడా బీజేపీ పెద్దలు ఆహ్వానించినట్లు తెలిసింది. అయితే ఆయన వెళ్లడం లేదని సమాచారం.

5 ఎంపీ, 13 అసెంబ్లీ సీట్లు కోరుతున్న బీజేపీ?

పొత్తులో భాగంగా బీజేపీకి ఎన్ని సీట్లు లభిస్తాయన్నది ఆసక్తి కలిగిస్తోంది. గత ఎన్నికల్లో ఆంధ్రలో ఆ పార్టీకి ఒక శాతంలోపే ఓట్లు లభించాయి. ఈ నేపథ్యంలో ఆ పార్టీ బలానికి మించి సీట్లు ఇస్తే.. తర్వాత గెలవలేకపోతే వైసీపీ లాభపడుతుందని టీడీపీ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. 2014లో పొత్తులో భాగంగా బీజేపీకి టీడీపీ 13 అసెంబ్లీ సీట్లు ఇవ్వగా.. ఆ పార్టీ 4 చోట్లే గెలిచింది. ఈసారి విజయావకాశాలున్న అభ్యర్థులు ఉన్నచోటే బీజేపీకి సీట్లు ఇవ్వాలని టీడీపీ యోచిస్తోంది. బీజేపీ కోరుతున్న సీట్లలో ఆ పార్టీ అభ్యర్థుల విజయావకాశాలపై టీడీపీ సర్వే కూడా చేయించింది. ఆ ఫలితాలు కొందరికి అనుకూలం, ఇంకొందరికి ప్రతికూలంగా వచ్చాయి. 3 అసెంబ్లీ సీట్లు, 3 లోక్‌సభ సీట్లు బీజేపీకివ్వాలని కొందరు టీడీపీ ముఖ్యనేతలు చంద్రబాబుకు ప్రతిపాదించారు. వారు ప్రతిపాదించిన లోక్‌సభ స్థానాల్లో నరసాపురం, తిరుపతి(ఎస్సీ), అరకు(ఎస్టీ) ఉన్నాయి. అయితే బీజేపీ నేతలు 3 లోక్‌సభ సీట్లు.. నరసాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు, రాజంపేట, తిరుపతి కోరుతున్నారు. ఈ ప్రతిపాదన ప్రకారం.. ఉభయ గోదావరి జిల్లాల్లో 5 ఎంపీ సీట్లుంటే వాటిలో 4 పొత్తులో బీజేపీకి, జనసేన(కాకినాడ)కు వెళ్తాయని, తమకు ఒకటి(అమలాపురం) మాత్రమే దక్కుతుందని.. ఇది తమకు అంగీకారం కాదని టీడీపీ నాయకుడొకరు అన్నారు. రాజంపేట ఎంపీ స్థానం పరిధిలో ముస్లింల సంఖ్యాబలం అధికమని.. అక్కడ బీజేపీకి విజయావకాశాలు తక్కువని.. పైగా తమ అసెంబ్లీ అభ్యర్థులకు కూడా ఇబ్బంది అని సీమ టీడీపీ నేతలు వాదిస్తున్నారు. అలాగే బీజేపీకి 5 అసెంబ్లీ సీట్లు ఇవ్వొచ్చని వినవస్తోంది. అయితే ఆ పార్టీ 11 అసెంబ్లీ స్థానాలు ఆశిస్తున్నట్లు తెలిసింది. ఆయా సీట్లు ఆశిస్తున్న బీజేపీ నేతలు పొత్తు దిశగా తమ అధినాయకత్వం వద్ద గట్టి లాబీయింగ్ చేస్తున్నారు. తమ వాదనకు అనుకూలంగా కొన్ని నివేదికలు సమర్పించారు. ఇక సీట్ల సర్దుబాటు ఖరారయ్యాక ఢిల్లీ పెద్దలు ఎన్డీయేలో టీడీపీ చేరికను లాంఛనంగా ప్రకటిస్తారని తెలుస్తోంది.

ఏపీ బీజేపీ నేతలతో ఢిల్లీ పెద్దల చర్చలు

టీడీపీతో పొత్తుపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా బుధవారం ఢిల్లీలో రాష్ట్ర నాయకత్వంతో చర్చలు జరిపారు. రాష్ట్ర చీఫ్ పురందేశ్వరి కూడా పాల్గొన్నారు. రాష్ట్రంలో బీజేపీ పోటీచేసే అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలపై గురువారం చంద్రబాబుతో జరిపే చర్చల్లో అవగాహనకు వస్తే.. శుక్ర, శనివారాల్లో జరిగే బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశంలో పొత్తుతో పాటు అభ్యర్థులను కూడా ఖరారు చేసే అవకాశముందని బీజేపీ వర్గాలు తెలిపాయి. ఇటీవల పార్టీ జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్‌జీ సమక్షంలో రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు పొత్తుపై చేసిన ప్రతిపాదనలపై షా, నడ్డా చర్చించినట్లు తెలిసింది.

విశాఖ నుంచి పాలనకు ఏం అడ్డొచ్చింది?

మూడేళ్లుగా ప్రజలను మోసగించడమే మీ కమిట్‌మెంట్: షర్మిల

అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో గెలిచాక సీఎంగా విశాఖలోనే ప్రమాణస్వీకారం.. పరిపాలన అంటూ సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల స్పందించారు. బుధవారం 'ఎక్స్'లో నిలదీశారు. ఎన్నికల ముందు పదేళ్ల వ్యూహాలతో నాటకాలు మొదలుపెట్టారని అన్నారు. 'పాలనా రాజధానిలో పాలన మొదలుపెట్టడానికి ఏం అడ్డొచ్చింది? మూడేళ్లుగా విశాఖ ప్రజలను మోసం చేయడమే మీ చేతకాని కమిట్‌మెంట్. ఐటీ హిల్స్ నుంచి దిగ్గజ కంపెనీలు వెళ్లిపోతున్నా చూస్తూ ఉండడమే మీ రోడ్‌మ్యాప్. వైజాగ్ స్టీల్స్‌ను కేంద్రం అమ్మేస్తుంటే ప్రేక్షక పాత్ర వహించడం మీవిజన్. రైల్వే జోన్ పట్టాలు ఎక్కకపోయినా మౌనం వహించడం మీకు ప్రాక్టికల్. గుట్టల్ని కొట్టడం.. పోర్టులను అమ్మడం.. భూముల్ని మింగడం.. ఇదే విశాఖపై వైసీపీ విజన్' అన్నారు.

షర్మిల పోటీ ఎక్కడ?



అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఎక్కడి నుంచి పోటీచేస్తారు.. అసెంబ్లీ బరిలో ఉంటారా.. లేక లోక్‌సభకు నిలబడతారా? కాంగ్రెస్ నేతల్లో ప్రస్తుతం ఈచర్చ నడుస్తోంది. ఆమె గడచిన కొన్ని రోజులుగా అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలకు పోటీ చేసే కాంగ్రెస్ అభ్యర్థుల వడబోత చేపట్టారు. విజయవాడలో బుధవారం కూడా ఈ ప్రక్రియను కొనసాగించారు. 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాలకు పోటీ చేసే కాంగ్రెస్ అభ్యర్థులతో గురువారం మంగళగిరిలో షర్మిల ప్రతిజ్ఞ చేయిస్తారని పీసీసీ వెల్లడించింది. 2014, 19 ఎన్నికలతో పోల్చితే.. 2024 ఎన్నికల్లో పోటీకి ఎక్కువ మంది ఉత్సాహం చూపుతున్నారని అంటున్నారు. కాగా.. పీసీసీ చీఫ్‌గా ఆమె బాధ్యతలు చేపట్టిన వెంటనే పులివెందుల నుంచే అసెంబ్లీకి పోటీ చేస్తారన్న చర్చ సాగింది.

జనసేన సీట్లు ఖరారు!

చంద్రబాబుతో పవన్ భేటీ.. గంటన్నర పాటు చర్చలు


చంద్రబాబు నివాసంలో ఆయనతో పవన్ కల్యాణ్

జనసేనకు కేటాయించిన సీట్లు ఇవీ..
(ఉమ్మడి జిల్లాల వారీగా)..

శ్రీకాకుళం జిల్లా-పాలకొండ (ఎస్టీ); విజయనగరం-నెల్లిమర్ల; విశాఖపట్నం-విశాఖ దక్షిణ, పెందుర్తి/మాడుగుల, అనకాపల్లి, యలమంచిలి; తూర్పుగోదావరి-కాకినాడ రూరల్, రాజోలు(ఎస్సీ), రాజానగరం, అమలాపురం/పి.గన్నవరం, పిఠాపురం; పశ్చిమ గోదావరి-భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, నిడదవోలు, పోలవరం(ఎస్టీ); కృష్ణా-విజయవాడ పశ్చిమ, అవనిగడ్డ; గుంటూరు- తెనాలి; ప్రకాశం-దర్శి; చిత్తూరు-తిరుపతి), అనంతపురం-అనంతపురం; కడప- రైల్వేకోడూరు.

అమరావతి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం, జనసేన నడుమ సీట్ల సర్దుబాటు కొలిక్కి వచ్చేసింది. పొత్తులో భాగంగా జనసేనకు ఇవ్వదలచిన 24 అసెంబ్లీ స్థానాలను పలు దఫాల చర్చల తర్వాత ఖరారు చేశారు. బుధవారం టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మరోసారి భేటీ అయ్యారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో సుమారు గంటన్నరపాటు వారి మధ్య చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా జనసేన తుది జాబితాను ఆమోదించినట్లు సమాచారం. అయితే వీటిలో 2సీట్లపై మాత్రం ఇంకా కసరత్తు జరుగుతున్నట్లు చెబుతున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరిలో 6, తూర్పుగోదావరిలో 5, విశాఖపట్నం జిల్లాలో 4, కృష్ణాజిల్లాలో 2, శ్రీకాకుళం, విజయనగరం, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, కడప, అనంతపురం జిల్లా ల్లో ఒక్కోచోట జనసేన బరిలోకి దిగనుంది.

ఆ రెండు స్థానాలపై..

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పెందుర్తి సీటును జనసేనకు కేటాయించారు. దాని బదులు మాడుగుల సీటు ఇచ్చి పెందుర్తిని టీడీపీకి తీసుకోవాలని ఆ జిల్లా టీడీపీ నేతలు కోరుతున్నారు. దీనిపై శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్‌నాయుడు బుధవారం చంద్రబాబును కలిశారు. దీనిపై కసరత్తు నడుస్తోంది. అలాగే అమలాపురం సీటును జనసేనకు కేటాయించారు. కానీ పి.గన్నవరంలో జనసేనకు మంచి అభ్యర్థి ఉన్నందున దానిని ఆ పార్టీకి ఇచ్చి అమలాపురం సీటు తీసుకోవాలని ఆ జిల్లా టీడీపీ నేతలు అభ్యర్థించారు. దీనిపై కూడా తర్జనభర్జన నడుస్తోంది. ఈ రెండు తప్ప మిగిలిన సీట్లు ఖరారైనట్లేనని రెండు పార్టీల అంతర్గత వర్గాలు తెలిపాయి. టీడీపీ తరఫున తమ పార్టీనేతలతో మాట్లాడి ఒప్పించే బాధ్యత అచ్చెన్నాయుడు, ఇతర నేతలు చేపట్టారు. నెల్లిమర్ల టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజును పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు బుధవారం కేంద్ర కార్యాలయానికి పిలిపించి మాట్లాడారు. రైల్వేకోడూరు నేత రూపానందరెడ్డితో కూడా మాట్లాడారు. కాగా.. తమకు ఖరారైన సీట్లలో అభ్యర్థులను ప్రకటించడానికి జనసేనాని సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. కొద్దిరోజుల్లోనే వారి పేర్లు ప్రకటించే అవకాశం ఉంది. తిరుపతి సీటు జనసేన ఖాతాలోకి వెళ్లడంతో అక్కడ పోటీ పెరిగింది. తాజాగా జనసేనలో చేరిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, వ్యాపారవేత్త గంటా నరహరి, జనసేన సీనియర్ నేత హరిప్రసాద్ పేర్లు వినిపిస్తున్నాయి. ప్రకాశం జిల్లాకు చెందిన దివంగత మాజీమంత్రి గొట్టిపాటి హనుమంతరావు మనవరాలు లక్ష్మి అదే జిల్లాలో దర్శి టికెట్‌ను ఆశిస్తూ జనసేన నేతలను కలిసినట్లు తెలిసింది.

ఎమ్మెల్యేకే దిక్కు లేదు

» రెండేళ్లుగా పెండింగ్‌లో 74 కోట్ల బిల్లులు: ఎమ్మెల్యే ఆరణి

» నేడు జనసేనలో చేరనున్న శీనివాసులు


రాజీనామా లేఖతో ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు సిటీ, మార్చి 6: 'నేను చేసిన కాంట్రాక్టు పనులకు సంబంధించి రూ.74 కోట్ల బిల్లులు రెండేళ్లుగా పెండింగులో ఉన్నాయి. ఎమ్మెల్యే అయిన నా పరిస్థితే ఇలా ఉంటే సామాన్య కాంట్రాక్టర్ల పరిస్థితేంటో అర్థం చేసుకోవచ్చు' అని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరులో తనకు కాకుండా విజయానందరెడ్డికి టికెట్ ఇవ్వడం, రాజ్యసభ ఇస్తానని మోసం చేయడంపై అవమానపడ్డ ఆయన ఇటీవల పవన్‌కల్యాణ్‌ను కలిసిన విషయం తెలిసిందే. బుధవారం ఆయన చిత్తూరులో ప్రెస్‌మీట్ పెట్టి తన ఆవేదనను వెళ్లగక్కారు. గురువారం జనసేనలో చేరనున్నట్లు ప్రకటించారు. 'నియోజకవర్గంలో రహదారులు ఛిద్రమైపోయాయి. రోడ్ల గుంతలు పూడ్చేందుకూ నిధులు ఇవ్వలేదు. టీడీపీ ప్రభుత్వంలో వేసిన రోడ్లు పూర్తి చేయడానికి రూ.20 కోట్లు అవసరమని అడిగినా ఈ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు' అని వివరించారు. సీఎంకు అనుకూలమైన వ్యక్తులకు మాత్రమే బిల్లులు మంజూరు అవుతున్నాయని, తమలాంటి సాధారణ ఎమ్మెల్యేలకు రూ.కోట్లలో బిల్లులు పెండింగులో ఉన్నాయని ఆవేదన చెందారు. ఎమ్మెల్యే టికెట్ తనకి ఇవ్వకుండా ఎర్రచందనం స్మగ్లర్ విజయానందరెడ్డికి ఇచ్చారని ఆరోపించారు. రాజ్యసభకు పంపిస్తానని హామీ ఇచ్చి నిలబెట్టుకోలేదన్నారు. చిరంజీవి కుటుంబంతో సాన్నిహిత్యం దృష్ట్యా జనసేనలో చేరానని, చిత్తూరు టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి విజయం కోసం కృషి చేస్తానని చెప్పారు.

'టీడీపీ' సర్పంచ్‌పై వైసీపీ మూకల దౌర్జన్యం

» శ్రీసత్యసాయి జిల్లాలో చెట్టును నరకొద్దన్నందుకు దాడి..


మంజునాథ్‌పై దాడి చేస్తున్న వైసీపీ మూకలు

రొద్దం, మార్చి 6: శ్రీసత్యసాయి జిల్లా రొద్దం మండలం బీదానిపల్లిలో వైసీపీ మూకలు దౌర్జన్యానికి దిగాయి. గ్రామకంఠం భూమిలో ఉన్న పచ్చని చింతచెట్టును నరికేయవద్దని వేడుకున్న టీడీపీ మద్దతుదారైన గ్రామ పంచాయతీ సర్పంచ్ మంజునాథ్‌పై బుధవారం వైసీపీ నేతలు విరుచుకుపడ్డారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు మోహన్, రామాంజనేయులు ఇళ్ల సమీపంలో గ్రామకంఠం భూమి ఉంది. ఆ భూమిని కబ్జా చేసేందుకు వీరు పన్నాగం పన్నినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే గ్రామకంఠం భూమిలోని చింత చెట్టు తమ ఇళ్లకు అడ్డంగా ఉందంటూ నరికేయడానికి సిద్ధమయ్యారు. గ్రామ పంచాయతీ నుంచి కాకుండా అటవీ అధికారుల అనుమతి తీసుకుని బుధవారం ఉదయం చెట్టును నరికేందుకు ఉపక్రమించారు. సర్పంచ్ మంజునాథ్ అక్కడికెళ్లి పంచాయతీ పరిధిలోని చెట్టును నరకడానికి ఫారెస్ట్ అధికారులు అనుమతి ఎలా ఇచ్చారని నిలదీశారు. దీంతో సర్పంచ్‌పై వైసీపీ వర్గీయులు ప్రభాకర్, రామాంజనేయులు, మోహన్, చలపతి, మంజుల, వెంకమ్మ, అరుణ, శేషప్ప, ఆనందప్ప మూకుమ్మడిగా దాడి చేశారు. దాడిపై మంజునాథ్.. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పనులు పూర్తవకుండానే ప్రారంభోత్సవం

» రంగా వర్సిటీ భవనాలను వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం జగన్

అమరావతి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ వచ్చేస్తుందని.. పనులు పూర్తి కాని భవనాలను కూడా పాలకులు హడావుడిగా ప్రారంభించేస్తున్నారు. గుంటూరు సమీపం లాంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ నూతన పరిపాలన భవనం పనులు పూర్తవక ముందే సీఎం జగన్మోహన్‌రెడ్డి హడావుడిగా ప్రారంభించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో సీఎం జగన్ వర్చువల్‌గా దీన్ని ప్రారంభించారు. రాష్ట్ర విభజన తర్వాత ఎన్జీ రంగా పేరుతో లాంలో ఏర్పాటు చేసిన వర్సిటీ భవనాలకు రూ.110 కోట్లతో 2015లో అప్పటి సీఎం చంద్రబాబు సమక్షంలో అప్పటి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రాధామోహన్ సింగ్ శంకుస్థాపన చేశారు. తర్వాత 2018లో 5.20 ఎకరాల్లో రెండు టవర్లతో కూడిన కొత్త పరిపాలన భవన నిర్మాణానికి అప్పటి వీసీ పనులు ప్రారంభించారు. కానీ భవనాల్లో పనులు ఇంకా పూర్తి కాలేదు. బుధవారం ఈ భవనానికి సీఎం జగన్ ప్రారంభోత్సవం చేశారు.

ఐదేళ్లకే ఒకటో తరగతిలోకి!

» ఆరేళ్లు నిండాలన్న కేంద్రం సూచన పక్కకు

» పాత విధానమే కొనసాగుతుంది: మంత్రి బొత్స

అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ఒకటో తరగతిలో ప్రవేశాలకు పిల్లల వయసును పెంచాలన్న కేంద్రం సూచనను జగన్ ప్రభుత్వం పక్కనపెట్టింది. ప్రస్తుతం ఉన్నట్టుగానే ఐదేళ్లు నిండినవారికి అడ్మిషన్లు తీసుకుంటామని స్పష్టం చేసింది. ఈ విషయాన్ని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ బుధవారం ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో వెల్లడించారు. ప్రస్తుతం ఐదేళ్లు పూర్తయితే ఒకటో తరగతిలో అడ్మిషన్ పొందే విధానం ఉంది. ఇకపై కూడా అదే కొనసాగుతుందని స్పష్టం చేశారు. కొత్తగా ఇచ్చిన మున్సిపల్ సర్వీసు రూల్స్ ప్రకారం బదిలీలు, పదోన్నతులు చేపడతామని మంత్రి హామీ ఇచ్చారు. పాఠశాలకు నిర్వహణ గ్రాంట్లు కనీసం 25 శాతమైనా విడుదల చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. అంతర్ జిల్లాల బదిలీలకు మార్చి 31 తర్వాత ఉత్తర్వులు జారీ చేస్తామని చెప్పారు. ఒంటిపూట బడులపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని బొత్స తెలిపారు. ఈ చర్చల్లో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్పీ మనోహర్, ఎల్. సాయి శ్రీనివాస్, రఘునాథరెడ్డి, సీహెచ్ మంజుల, కె. ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో-1 ఖాళీల భర్తీకి ఆదేశాలు

మండల విద్యాధికారులు-1 ఖాళీల భర్తీకి పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీచేసింది. ఇటీవల పదోన్నతి పొందిన గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల ద్వారా ఈ ఖాళీలను భర్తీచేయాలని తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా 161 ఎంఈవో-1 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఇకపై టీసీల్లో ముస్లిం నూర్‌బాషా

టీసీల్లో నూర్‌బాషా లేదా దూదేకుల సామాజికవర్గం పేరును మార్చాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. ప్రస్తుతం 'ఇండియన్ హిందూ నూర్‌బాషా లేదా దూదేకుల' అని రాస్తున్నారని, దాని స్థానంలో 'ఇండియన్ ముస్లిం నూర్‌బాషా లేదా దూదేకుల' అని టీసీల్లో పేర్కొనాలని స్పష్టం చేసింది.

49 ఉద్యోగాలకు 4 నోటిఫికేషన్లు

పలు శాఖల్లో ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ బుధవారం నాలుగు నోటిఫికేషన్లు జారీ చేసింది. విద్యుత్ శాఖలో అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు 3, అటవీ శాఖలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ 37, ఏపీ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్‌లో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ 5, మత్స్య శాఖలో ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ 4 పోస్టులకు వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీ చేసినట్లు ఏపీపీఎస్సీ వివరించింది.



ఇంటి దారి కోసం...

▸ బాపట్ల నుంచి హైదరాబాద్‌కు చేరిన పోరాటం

వైసీపీకి చెందిన గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే ముస్తాఫా, ఆయన సోదరుడు, నేరేళ్ల వెంకటేశ్వర్లు, మరో ఏడుగురు తన ఇంటికి దారివ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారంటూ గత ఐదేళ్లుగా బాపట్ల జిల్లా బొడ్డువానిపాలెం గ్రామానికి చెందిన దళిత మహిళ, ఎస్‌జీటీ సుధారాణి పోరాటం చేస్తున్నారు. ఏపీలోని ప్రభుత్వ అధికారులు, పోలీసులు స్పందించడం లేదని ఆరోపిస్తూ ఆమె బుధవారం హైదరాబాద్ సీజీవో టవర్స్‌లోని జాతీయ ఎస్సీ ఎస్టీ హక్కుల కమిషన్ డైరెక్టర్ సునీల్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఆమె కార్యాలయం వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.

- హైదరాబాద్, ఆంధ్రజ్యోతి

సస్పెన్షన్ కాలపరిమితి ఏడాదికి కుదింపు

అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సస్పెన్షన్ కాలపరిమితిని ఏడాదికి కుదిస్తూ ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గతంలో సస్పెన్షన్ కాలపరిమితి రెండేళ్లు ఉండేది.

ఆందోళన అవసరం లేదు

▸ భూయాజమాన్య హక్కు చట్టం అమల్లోకి రాలేదు

▸ హైకోర్టుకు నివేదించిన అడ్వకేట్ జనరల్

అమరావతి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): భూ యాజమాన్య హక్కు చట్టం అమల్లోకి రాలేదని, పిటిషనర్ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ (ఏజీ) శ్రీరామ్ హైకోర్టుకు నివేదించారు. చట్టం అమల్లోకి తెచ్చేందుకు సన్నాహకాలు జరుగుతున్నాయని, రాష్ట్ర వ్యాప్తంగా భూ సర్వే జరుగుతోందని వివరించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను నాలుగు వారాలకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందన రావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. ఏపీ భూ యాజమాన్య హక్కు చట్టాన్ని సవాల్ చేస్తూ టీడీపీ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. పిటిషనర్ తరఫున న్యాయవాది బాలాజీ వడేరా వాదనలు వినిపిస్తూ... టైటిలింగ్ యాక్ట్‌ను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్లలో ప్రభుత్వం ఇప్పటికీ కౌంటర్ దాఖలు చేయాలేదన్నారు. ఏజీ చెప్పిన వివరాలు నమోదు చేయాలని కోరారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ ఏజీ చెప్పిన వివరాలను నమోదు చేసినా ఇప్పటికే మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశామని గుర్తు చేసింది.

విచారణ జరపాలని సివిల్ కోర్టులను ఆదేశించాం కదా?

భూయజమాన్య హక్కు చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పలు వ్యాజ్యాలపై ధర్మాసనం విచారణ జరిపింది. స్థిరాస్తికి సంబంధించి దాఖలయ్యే దావాలను విచారణకు స్వీకరించాలని సివిల్ కోర్టులను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చామని ధర్మాసనం గుర్తుచేసింది. ఇంకా న్యాయవాదులు ఎందుకు ఆందోళన చెందుతున్నారో అర్థం కావడంలేదని వ్యాఖ్యానించింది. చట్టం అమల్లోకి తెచ్చేందుకు ఇంకా నిబంధనలు రూపొందించలేదని గుర్తు చేసింది. ఇప్పటికిప్పుడు చట్టం అమల్లోకి వచ్చే పరిస్థితి లేదంది. కౌంటర్ వేసేందుకు ప్రభుత్వానికి మరో నాలుగు వారాలు సమయం ఇస్తూ విచారణను వాయిదా వేసింది. అంతకముందు పిటిషనర్ల తరఫు న్యాయవాదులు సువ్వారి శ్రీనివాస్, ఎస్ఎస్ రామకృష్ణ ప్రసాద్ వాదనలు వినిపించారు.

పంచాయతీరాజ్ అతిథి గృహంలో వైసీపీ కార్యాలయం

▸ పొన్నూరు వైసీపీ నేతల బరితెగింపు

▸ కారుచౌకగా జడ్పీటీసీ బినామీకే అద్దెకు

పొన్నూరు, గుంటూరు సిటీ, మార్చి 6: గుంటూరు జిల్లాలో వైసీపీ నేతల అధికార దుర్వినియోగానికి అవధులు లేకుండా పోతున్నాయి. అధికారం చేతిలో ఉందన్న ధీమాతో చట్టాన్ని, నిబంధనలు తోసిరాజంటున్నారు. ప్రభుత్వ కార్యాలయంలో ఏ పార్టీ మీటింగ్‌లు, కార్యకలాపాలు జరగడానికి నిబంధనలు అంగీకరించవు. అయితే పొన్నూరు వైసీపీ నేతలు వాటన్నింటినీ తుంగలో తొక్కేశారు. స్థానిక పంచాయతీరాజ్ అతిథి గృహంలో సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ వైసీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం తుఫాను నిధులతో పొన్నూరులో పంచాయతీరాజ్ అతిథి గృహాన్ని నిర్మించింది. ఎన్నికల కోడ్‌తో అది ప్రారంభానికి నోచుకోలేదు. రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన అతిథి గృహాన్ని వైసీపీ పాలకులు పాడుబెట్టారు. అయితే వారం క్రితం దాన్ని బాగుచేయించి జడ్పీ చైర్‌పర్సన్ ప్రారంభించినట్లు మీడియాకు వెల్లడించారు.

జడ్పీటీసీ బినామీకే అద్దెకు...?

ఈ అతిథి గృహాన్ని స్థానిక జడ్పీటీసీ బినామీకే రూ.15 వేలు అద్దెకు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆ బినామీ దానిని ఏకంగా పార్టీ నాయకులకే అప్పగించారు. మంగళవారం నుంచి పొన్నూరు నియోజక వర్గ రాజకీయ కార్యక్రమాలు అన్నీ అక్కడి నుంచే జరుగుతున్నాయి. ప్రభుత్వ అతిథి గృహం ముందు పెద్ద టెంట్లు వేశారు. కార్యాలయానికి వచ్చిన నాయకులు కూర్చునేందుకు వీలుగా కుర్చీలు కూడా ఏర్పాటు చేశారు. బయట, లోపల 'సిద్ధం' ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

సబ్‌లీజ్‌కు అవకాశం లేదు...

పంచాయతీరాజ్ అతిథి గృహం అద్దెకు తీసుకున్న వ్యక్తి దాన్ని సబ్ లీజ్‌కి ఇవ్వకూడదన్న నిబంధనలు ఉన్నాయి. జడ్పీ అగ్రిమెంట్‌లో కూడా అదే రాయించినట్లు తెలుస్తోంది. అయితే అద్దెకు తీసుకున్న వ్యక్తి పార్టీ కార్యకలాపాలకు అప్పగించడం వివాదాస్పదంగా మారింది.



పొన్నూరులోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో వైసీపీ నేతలు ఏర్పాటు చేసిన టెంట్లు, కుర్చీలు, ఫ్లెక్సీలు

అన్నదాతలతో ఆటలు!


▸ పంటల బీమా పరిహారం ఎగ్గొట్టే ఎత్తుగడ

▸ జూన్‌లో ఇస్తామంటూ ఓట్ల కోసం ఊరింపులు

అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): సాగు కష్టాలతో సతమతం అవుతున్న అన్నదాతలతో వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ఆటకు తెరదీసింది. రూ.వందల కోట్ల పంటల బీమా పరిహారాన్ని ఈ ఏడాది మేలోనే ఇవ్వాల్సి ఉన్నా.. జూన్ వరకు ఎదురు చూడాల్సిందేనంటూ ఓట్ల కోసం వారిని ఊరిస్తోంది. అదేసమయంలో 2022-23 రబీ సీజన్‌కు సంబంధించి ఇవ్వాల్సిన సుమారు రూ.450 కోట్ల వడ్డీ రాయితీని పూర్తిగా అటకెక్కించింది. దీంతో ఇప్పటికే నిండా మునిగిన రైతన్నలు సర్కారు నుంచి సాయం అందకపోవడంతో మరింతగా కుంగిపోతున్నారు.

ఏం చెప్పారు? ఏం చేశారు?

ఏ సీజన్‌లో పంట నష్టపోయిన రైతులకు ఆ సీజన్ ముగిసే లోపే పంట నష్ట పరిహారం ఇస్తామంటూ సీఎం జగన్ అనేక సందర్భాల్లో చెప్పుకొచ్చారు. అంతేకాదు..తమది రైతు ప్రభుత్వమని, రైతుల కష్టాలకు తమ మనసు కరిగిపోతుందని కూడా ఊదరగొట్టారు. కానీ, మాటలు చెప్పినంత తేలికగా చేతల్లో ఏమాత్రం చేయకలేపోతున్నారనే విమర్శలు రైతాంగం నుంచి వినిపిస్తున్నాయి. గత ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావంతో నష్టపోయిన కరువు మండలాల రైతులకు రబీ సీజన్ ముగిశాకే ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేశారు. అంటే ఏసీజన్‌లో ఇస్తామన్న పరిహారం ఆ సీజన్‌లో ఇవ్వలేదు. ఇక, గత డిసెంబరులో వచ్చిన మిచౌంగ్ తుఫాన్‌కు పంటలు దెబ్బతిని, తీవ్రంగా నష్టపోయిన రైతులు కూడా ఇన్‌పుట్ సబ్సిడీని నాలుగు మాసాల తర్వాత తీరికగా ఇప్పుడు విడుదల చేశారు. అదికూడా 33 శాతం లోపు పంట నష్టపోయిన రైతులకు పైసా సాయం విదిలించకపోవడం గమనార్హం. అదేసమయంలో 2022-23 రబీ సీజన్‌లో రూ.లక్ష లోపు రుణాలు తీసుకుని, వడ్డీతో సహా తిరిగి చెల్లించి ఏడాదైనా, 2023-24 రబీ సీజన్ కూడా ముగిసినా.. ఇంత వరకు వడ్డీ రీయింబర్స్‌మెంట్ చేయలేదు. అలాగే, 2022-23 రబీ సీజన్‌కు సంబంధించిన పంటల బీమా పరిహారం గత అక్టోబరులోనే ఇస్తామని చెప్పి, 2023-24 రబీ సీజన్ ముగిసినా ఇంత వరకు రైతులకు చెల్లించలేదు. పైగా ఈ పరిహారాన్ని మేలో అయినా ఇవ్వాల్సి ఉండగా ఎన్నికలు ముగిశాక వచ్చే జూన్‌లో ఇస్తామని సీఎం జగన్ ప్రకటించడం గమనార్హం.



రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ నిధులను బటన్ నొక్కి విడుదల చేస్తున్న సీఎం

నాటి మాటలు ఏమయ్యాయి?

గతంలో చంద్రబాబు ప్రభుత్వం రైతులకు బకాయిలు పెట్టి వెళ్లిందని విమర్శించిన సీఎం జగన్.. ఇప్పుడు పంటల బీమా సొమ్మును ఎన్నికల తర్వాతే ఇస్తామనడంపై వ్యవసాయ రంగ నిపుణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ తిరిగి అధికారంలోకి వస్తుందన్న గ్యారెంటీ ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. అలాంటప్పుడు జగన్ ప్రభుత్వం కూడా బకాయిలు పెట్టి వెళ్లిపోయినట్టే కదా? అని నిలదీస్తున్నారు. ఇక, సీఎం ప్రకటనతో 2022-23 రబీతో పాటు 2023 ఖరీఫ్, రబీ పంటల బీమా సొమ్ము రైతులకు అందాలంటే మరో నాలుగు నెలలు పట్టే పరిస్థితి కనిపిస్తోంది. ఇలాగే సున్నా వడ్డీ రాయితీ, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా సొమ్ము చెప్పిన సమయానికి ఇవ్వకపోతుండటంపై 'ఇస్తారా.. ఎగ్గొడతారా?' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం వచ్చాక.. 2021-22 రబీ, 2022 ఖరీఫ్‌కు సంబంధించిన సున్నా వడ్డీ రాయితీని, రైతుభరోసా మూడో కిస్తీని చెల్లించిన ప్రభుత్వం.. ఇప్పుడు 2023 కరువు, తుఫాన్ నష్టాలకు ఇన్‌పుట్ సబ్సిడీని విడుదల చేసింది.

ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల

2023 ఖరీఫ్‌లో కరువు, మిచౌంగ్ తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన 11.61 లక్షల మంది(33 శాతానికి పైగా పంటనష్ట పోయిన) రైతులకు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీని అందించింది. ఈ మేరకు రూ.1,294 కోట్ల నిధులను బుధవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం బటన్ నొక్కి సీఎం జగన్ విడుదల చేశారు.

గత ప్రభుత్వం ఏమీ ఇవ్వలేదట!: బుధవారం ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల సమయంలో జగన్ చేసిన వ్యాఖ్యలపై రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ గత ప్రభుత్వంలో అసలు ఇచ్చే పరిస్థితే ఉండేది కాదన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసిన పరిస్థితిని గత ప్రభుత్వంలో ఎప్పుడూ చూడలేదన్నారు. అయితే, గత చంద్రబాబు ప్రభుత్వం ఒక్కో రైతుకు రూ.లక్షకు పైగా రుణమాఫీ చేసి రైతులకు లబ్ధి చేకూర్చింది. ఏ సీజన్‌లోనైనా తక్కువ వర్షాలు పడినా, ఎక్కువ సంఖ్యలో కరువు మండలాలు ప్రకటించి, కేంద్రానికి నివేదికలు పంపి, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీ చేసింది. అలాగే ఈ-క్రాప్ విధానం లేకపోయినా పంటల బీమా పరిహారం ఏటా అందించిన విషయాన్ని రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

జగన్ సర్కారు దగా..!

▸ ధాన్యం రైతులకు రూ.800 కోట్లు బకాయిలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని జగన్ సర్కారు హామీ ఇచ్చింది. రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రోజు నుంచి 21 రోజుల్లోపే రైతుల బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమ చేస్తామని ఊదరగొట్టింది. ఇదంతా నిజమేనని నమ్మిన రాష్ట్ర ప్రభుత్వానికి ధాన్యం అమ్మిన రైతులు నిండా మునిగిపోయారు. 21 రోజుల్లో డబ్బులు చెల్లించేస్తాం అన్న రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలలైనా ఆ ఊసే ఎత్తడం లేదు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 60 వేల మంది రైతులకు రూ.806 కోట్లకు పైగా బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఖరీఫ్ సీజన్ ముగిసిపోయినా డబ్బులు చెల్లించకుండా అదిగో.. ఇదిగో.. అంటూ కాలయాపన చేస్తుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అప్పులు చేస్తూ రోజులు నెట్టుకొస్తోంది. రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ దగ్గర డబ్బుల్లేకపోవడంతో ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి ధాన్యాన్ని పూర్తిస్థాయిలో మద్దతు ధరకు కొనలేక చేతులెత్తేసింది. ఈ సీజన్‌లో దాదాపు 85లక్షల టన్నులకు పైగా ధాన్యం దిగుబడి రాగా.. అందులో 29.77 లక్షల టన్నులు మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసింది. దీంతో మిగిలిన 55 లక్షల టన్నుల ధాన్యాన్ని రైతులు తక్కువ ధరలకే మిల్లర్లు, దళారులు, ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం సాధారణ రకం ధాన్యం క్వింటాలుకు మద్దతు ధర రూ.2,050గా నిర్ణయించగా.. మిల్లర్లు, దళారులు మాత్రం 75 కేజీల బస్తాకు రూ.1,300 చొప్పునమాత్రమే రైతులకు చెల్లించారు. ఈ దోపిడీని ప్రభుత్వం అరికట్టలేకపోయింది.

అప్పులోళ్ల ఒత్తిడి ఎక్కువై...

ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా 5 లక్షల మంది రైతుల నుంచి మొత్తం 29,77,083 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ కొనుగోలు చేసింది. ఈ ధాన్యాన్ని అమ్మిన రైతుల ఖాతాల్లో రూ. 6,505 కోట్లు జమ చేయాలి. ఇప్పటి వరకు 4,36,222 మంది ఖాతాల్లో రూ.5,698 కోట్లు జమ చేశారు. ఇంకా దాదాపు 60 వేల మంది రైతులకు రూ.806 కోట్లకు పైగా చెల్లించాలి. ఖరీఫ్ సాగు కోసం చాలామంది అప్పులు చేసి ముందుగా పెట్టుబడులు పెట్టారు. అప్పులిచ్చినవారు ఒత్తిడి చేస్తుండటంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

జమ చేశామన్న సొమ్మేది?

(మొదటి పేజీ తరువాయి)

నమ్ముతామని, ఈ వ్యవహారంపై ఎలాంటి వ్యాఖ్యలూ చేయదల్చుకోలేదని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ వాటా రూ.45కోట్లకు రాష్ట్ర వాటా రూ.30కోట్లు కలిపి మొత్తం రూ.75 కోట్లను వారం రోజుల్లోగా తన ఆధీనంలో ఉండే సింగిల్ నోడల్ ఏజెన్సీ అకౌంట్‌కు జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను ఈ నెల 13వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందన రావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలు ఇచ్చింది. అయితే అధికారులు చెప్పిన వివరాలనే తాను కోర్టు ముందు ఉంచానని, చెప్పిన విధంగా సొమ్ము జమకానందుకు క్షమాపణలు చెబుతున్నానని అడ్వకేట్ జనరల్(ఏజీ) ఎస్.శ్రీరామ్ ధర్మాసనానికి నివేదించారు. కృష్ణాజిల్లా గన్నవరంలో నూతన కోర్టు భవన నిర్మాణాన్ని చేపట్టడంతోపాటు ఇప్పటికే ఉన్న పాత భవనానికి మరమ్మతులు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ గన్నవరానికి చెందిన దేవిరెడ్డి రాజశేఖరరెడ్డి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా, కోర్టు భవన నిర్మాణాల పురోగతిపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కొన్ని భవనాలు 2018లో ప్రారంభమైనప్పటికీ 10 శాతం కూడా పూర్తికాలేదని ఆందోళన వ్యక్తంచేసింది. గత విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తన వాటా కింద రూ.45కోట్లు విడుదల చేసిందని న్యాయవాది జూపూడి యజ్ఞదత్ ధర్మాసనానికి నివేదించారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద రూ.30కోట్లు ఖాతాలో జమ చేసిందని ఏజీ తరఫు న్యాయవాది సి.సుమన్ చెప్పారు. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు రాగా ధర్మాసనం స్పందిస్తూ... గత విచారణ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జమ చేశామని చెప్పిన సొమ్ము హైకోర్టు ఖాతాకు చేరలేదన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) సి.సుమన్ స్పందిస్తూ...హైకోర్టు బిల్లులు అప్‌లోడ్ చేస్తే సొమ్ము జమ అవుతుందన్నారు. దీంతో ధర్మాసనం విస్మయం వ్యక్తం చేసింది. గత విచారణ సందర్భంగా సొమ్మును హైకోర్టు ఖాతాలో జమచేశామని చెప్పారు కదా? అని ఏజీని ప్రశ్నించింది. అధికారుల నుంచి వివరాలు తెలుసుకొని కోర్టు ముందు ఉంచేందుకు విచారణను మధ్యాహ్నానికి వాయిదా వేయాలని ఏజీ కోరారు. లంచ్ విరామం అనంతరం విచారణ ప్రారంభమైన వెంటనే ఏజీ స్పందిస్తూ... రూ.45 కోట్లు మరో గంటలో ఖాతాలో జమ అవుతాయన్నారు. మరో రూ.30 కోట్లు 15 రోజుల్లో జమ చేస్తామన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. రూ.30 కోట్ల సొమ్ము జమ చేసేశామని గత విచారణ సందర్భంగా ఎలా చెప్పారని ప్రశ్నించింది. కేంద్ర ప్రభుత్వం తరఫున న్యాయవాది జూపూడి యజ్ఞదత్ స్పందిస్తూ....తమ వాటా కింద రూ.45కోట్లను ట్రెజరీలో ఇప్పటికే జమ చేశామన్నారు. నిబంధనల ప్రకారం కేంద్ర ప్రభుత్వ వాటా రూ.45 కోట్లతో రాష్ట్ర వాటా రూ.30 కోట్లను కలిపి మొత్తం సొమ్మును సింగిల్ నోడల్ ఏజెన్సీ అకౌంట్‌కు జమ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ వాటాను మాత్రమే జమ చేయలేరన్నారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, రాష్ట్ర ప్రభుత్వ వాటా జమ చేసేందుకు సమయం కోరడం ఏమిటని ప్రశ్నించింది. వారం రోజుల్లోగా రూ.75 కోట్లను సింగిల్ నోడల్ ఏజెన్సీ అకౌంట్‌కు జమ చేయాల్సిందేనని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు తేల్చిచెప్పింది.

వెలిగొండ నీళ్లకు మళ్లీ ముహూర్తం!



వెలిగొండ టన్నెల్‌ను పరిశీలిస్తున్న సీఎం జగన్, మంత్రులు, ఎమ్మెల్యేలు

▸ జూన్, జూలైలో శ్రీశైలానికి వరదొస్తే ఇస్తారట!

▸ మళ్లీ మాట మార్చిన ముఖ్యమంత్రి జగన్

▸ గెలిచొచ్చి తానే విడుదల చేస్తానని వ్యాఖ్య

మార్కాపురం, మార్చి 6: వెలిగొండ ప్రాజెక్టుకు నీళ్ల విడుదల విషయంలో సీఎం జగన్ మళ్లీ మాట మార్చారు. రిజర్వాయర్‌కు నీటి విడుదలకు మరో ముహూర్తం పెట్టారు. జూన్, జూలై నెలల్లో వర్షాలు కురిసి శ్రీశైలానికి వరద వస్తే అప్పుడు విడుదల చేస్తామని ప్రకటించారు. దీంతో సార్వత్రిక ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే వెలిగొండ ప్రాజెక్ట్‌ను ఒక అంశంగా ఎంచుకున్నట్లు స్పష్టమైంది. పనులు పెండింగ్ ఉన్న ప్రాజెక్టును అంతా సిద్ధమైపోయినట్లు కనికట్టు చేసి రైతులను జగన్ మోసం చేశారు. జాతికి అంకితం పేరిట మరోసారి జగన్నాటకం సాగింది. ఈ మేరకు బుధవారం ప్రకాశం జిల్లా దోర్నాల మండలం కొత్తూరు వద్ద వెలిగొండ పైలాన్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో జగన్ మాట్లాడారు. "వచ్చే జూన్, జూలై నెలల్లో కృష్ణానదికి వరదలొస్తాయి. అప్పుడు శ్రీశైలం వద్ద డ్యామ్‌లో 842 అడుగుల కంటే ఎక్కువగా ఉన్న నీటిని వెలిగొండ జలాశయానికి టన్నెళ్ల ద్వారా సరఫరా చేస్తాం. ఆ కార్యక్రమమూ నా చేతుల మీదుగానే జరిపిస్తాను" అని జగన్ తెలిపారు. ఆయన తీరుకు రైతులు ఆశ్చర్యపోయారు. రాబోయే ఎన్నికలలో విజయం సాధించేయబోతున్నట్టు వెలిగొండకు నీటి విడుదలపై ఇప్పుడే ముహూర్తం పెట్టడం ఏమిటని విస్తుపోయారు.

"2023 సెప్టెంబరు నాటికి వెలిగొండ పనులు పూర్తి చేసి నీటిని ఇస్తాం. నీళ్లిచ్చిన తర్వాతే ఎన్నికలకు వెళతాం" అని చీమకుర్తిలో 2022 ఆగస్టు 23న జగన్ సెలవిచ్చారు. ఆయన చెప్పిన సెప్టెంబరు ఎప్పుడో దాటిపోయి.. 2024 మార్చి కూడా వచ్చేసింది. మూడుసార్లు ఇలాగే గడువులు ప్రకటిస్తూ.. ఐదేళ్లు గడిపేశారు. ఇప్పుడు...వెలిగొండకు నీళ్లు మళ్లీ తాను గెలిచి వచ్చి విడుదల చేస్తానంటూ ఎన్నికల వేళ మరోసారి 'వాయిదా' పాట పాడారు.

రాజకీయవేదికలా ప్రభుత్వ కార్యక్రమం

వెలిగొండ ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేయడమనేది ఒక ప్రభుత్వ కార్యక్రమం. అధికారులు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమం పూర్తిచేసిన అనంతరం, రైతులతో ముఖాముఖి ఏర్పాటుచేశారు. అయితే, జగన్ ఆ వేదికను రాజకీయ సమావేశంగా మార్చారు. రాబోయే ఎన్నికలలో వైపాలెంలో చంద్రను, గిద్దలూరులో రాంబాబును, ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌ను, వైసీపీ అభ్యర్థులు, శివ, నారాయణ, నాగార్జునను గెలిపించాలన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేనిని చూపిస్తూ...కాబోయే మంత్రి అంటూ సంబోధించారు. నీటిపారుదల మంత్రి అంబటి రాంబాబు ఫొటోలకు ఫోజులిస్తూ గడిపేశారు.

దళిత మంత్రి సురేశ్‌కు అవమానం

'నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ..' అంటూ ప్రచారం చేసుకుంటున్న జగన్... దళిత మంత్రి ఆదిమూలం సురేశ్‌ను అవమానించారు. రైతులతో ముఖాముఖి సందర్భంగా జగన్ కుడి వైపు వైసీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్, ఆయన పక్కన మంత్రి సురేశ్ కూర్చున్నారు. సీఎం జగన్ బాబాయ్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ వేదికపైకి రాకుండా ఎదురుగా కింద కూర్చున్నారు. తాటిపర్తి చంద్రశేఖర్‌ను దగ్గరకు పిలిచి తన బాబాయ్ వైవీ, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను పైకి తీసుకురావాలని జగన్ చెప్పారు. వారికి వేదికపై కుర్చీలు లేకపోవడంతో మంత్రి సురేశ్ లేచి వేదికపై నుంచి వెళ్లిపోయారు.



విజయవాడలో గ్రీవెన్స్ నిర్వహిస్తున్న జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ అరుణ్‌మిశ్రా తదితరులు

రాష్ట్రంలో పోలీసు జులుంపై అధిక ఫిర్యాదులు

▸ ఎన్‌హెచ్‌ఆర్సీ చైర్మన్ జస్టిస్ అరుణ్‌మిశ్రా వెల్లడి

విజయవాడ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోలీసుల అతిప్రవర్తన, దమనకాండపైనే ఎక్కువ ఫిర్యాదులు అందుతున్నాయని జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ అరుణ్‌మిశ్రా వెల్లడించారు. విజయవాడలోని పోలీసు ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బుధవారం గ్రీవెన్స్ నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మాన్యువల్ స్కావెంజింగ్, వెట్టిచాకిరీ, లైంగిక వేధింపులు, పింఛన్ల మంజూరులో జాప్యం తదితరాలపైనా ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. గిరిజన ప్రాంతాల నుంచి గిరిజనులను వివిధ ప్రాజెక్టుల కారణంగా తరలించే అంశంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని నివేదిక కోరామని, ఇప్పటి వరకు ప్రభుత్వం నివేదిక ఇవ్వలేదని చెప్పారు. కాకినాడ జిల్లాలో ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్(అనంత బాబు) చేతిలో హత్యకు గురైన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం కేసు ఇంకా లిస్ట్ కాలేదన్నారు. ఎన్‌హెచ్‌ఆర్సీకి ఏడాదికి లక్ష కేసుల వరకు వస్తున్నాయని, వాటిలో 6 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఆయా రాష్ట్రాల నుంచి నివేదికలు రాకపోవడమే దీనికి కారణమని తెలిపారు. విజయవాడలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో 30 కేసులను విచారించామన్నారు. పోక్సో కేసుల్లో బాధితులకు నల్సా చట్టం ప్రకారం పరిహారం అందజేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయా శాఖలను ఆదేశించామన్నారు. వివిధ కేసుల్లో బాధితులకు రూ.80 లక్షలు పరిహారంగా అందజేయాలని కమిషన్ ఆదేశాలు జారీ చేసిందన్నారు.

ప్రజాసంఘాలను అడ్డుకున్న పోలీసులు..: ఎన్‌హెచ్‌ఆర్సీకి వినతిపత్రాలు ఇవ్వడానికి వచ్చిన ప్రజాసంఘాల నేతలను పోలీసులు అడ్డుకున్నారు. గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు ఇవ్వడానికి మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఫారూక్ షుబ్లీ, సమతా సైనిక్‌దళ్ నేత సురేంద్ర రాగా, వారిని ద్వారం వద్దే పోలీసులు అడ్డుకున్నారు. రాష్ట్రంలో మానవ హక్కుల కమిషన్ పూర్తిస్థాయిలో పనిచేయడం లేదని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఎన్‌హెచ్‌ఆర్సీకి ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు కాపీని సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.మాల్యాద్రి మీడియాకు విడుదల చేశారు.

బొక్కుడులో 'గజ'కేసరి



(మొదటి పేజీ తరువాయి)

ఉన్న రైతుల భూములను సైతం విడిచి పెట్టడం లేదు. తాను స్వాధీనం చేసుకున్న భూములకు ఆనుకుని ఉన్న భూములను తనకు అమ్మాలని స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా రాయబేరాలు, ఒత్తిళ్లు, బెదిరింపులకు పాల్పడిన ఘటనలూ ఉన్నాయి. ఇక ఇసుక, క్వారీల దోపిడీతో పాటు కమీషన్లు, వాటాలతో బాగా వెనకేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

సెటిల్మెంట్లతో పండగ

వివాదాస్పద భూముల సెటిల్మెంట్లను గ్రామ, మండల స్థాయి ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే వద్దకు తీసుకు వస్తుంటారు. వివాదం నెలకొన్న రెండు పార్టీలు హాజరు కావాలని ఎమ్మెల్యే ఆదేశిస్తారు. అంతే రొట్టె కథ మొదలవుంది. భూ వివాదాన్ని పరిష్కరించేలా కలరింగ్ ఇస్తారు. ఆ భూమి విషయంలో భవిష్యత్‌లో ఎదురయ్యే సమస్యలను, ఇబ్బందులను వివరిస్తారు. 'మనకెందుకులే ఈ వివాదాలు' అన్న స్థాయికి తెస్తారు. ఆ తర్వాత వివాదాస్పద భూములకు రేటు కట్టి ఎమ్మెల్యే తీసుకుంటామంటున్నారని స్థానిక ప్రజాప్రతినిధులు వారిని ఒప్పిస్తారు. అంతే... మార్కెట్లో ఉన్న ధర కంటే తక్కువ ధరకు ఎమ్మెల్యే కైవసం చేసుకుంటారు. ఆ భూములను తన పేరున కాకుండా నమ్మకస్తులైన బినామీ పేర్లతో రిజిస్ట్రేషన్ చేయించుకుంటారు. నియోజవర్గ పరిధిలో ఏ రిజిస్ట్రేషన్ జరిగినా ఎమ్మెల్యేకు తెలియాల్సిందే. రియల్ ఎస్టేట్ వివాదాలతో పాటు భూముల క్రయ విక్రయాలు జరిగినా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాలి. ఎమ్మెల్యే రంగంలోకి దిగి సంబంధిత అధికారుల ద్వారా ఏదో ఒక లిటిగేషన్ క్రియేట్ చేయించి, ఆ తర్వాత సెటిల్‌మెంట్లు చేస్తుంటారు. ఇలా వందలాది ఎకరాల భూములను బినామీల పేర్లతో చేజిక్కించుకున్నారు.

భూముల ధరలు పెరిగేలా...

సదరు నాయకుడు బినామీ పేర్లతో కొనుగోలు చేసిన భూముల ధరలను పెంచుకునేందుకు రకరకాల స్కెచ్ వేస్తుంటారు. తన భూములకు దగ్గరలో రోడ్లు వేసేలా ప్రణాళికలు రూపొందిస్తారు. తన పలుకుబడి ఉపయోగించి ప్రభుత్వం ద్వారా భూసేకరణ చేయించి రోడ్లు వేయిస్తారు. తద్వారా బినామీ పేర్లతో ఉన్న తన భూముల ధరలు రెట్టింపు పెరిగేలా చూస్తారు. అంతేకాదు ప్రభుత్వం మంజూరు చేసే ప్రఖ్యాత విద్యా సంస్థలను సైతం తన నియోజకవర్గ పరిధిలోకి తీసుకువచ్చేలా ప్లాన్ వేస్తారు. ఇందుకోసం తన రాజకీయ పలుకుబడిని ఉపయోగిస్తారు. ఆయా విద్యా సంస్థలకు భూసేకరణ చేసే ప్రాంతం చుట్టుపక్కల భూములపై ముందుగానే కన్నేస్తారు. బినామీ పేర్లతో తక్కువ ధరకే కొనుగోలు చేస్తారు. ఆయా విద్యా సంస్థలు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందితే వాటి చుట్టుపక్కల భూముల ధరలకు రెక్కలు వచ్చి అనేక రెట్లు పెరుగుతాయన్నది ఆయన ప్లాన్.

అడ్డగోలుగా ఇసుక తరలింపు

ఎమ్మెల్యే కనుసన్నల్లో ఇసుక మాఫియా చెలరేగిపోతోంది. ప్రతిపక్షాలు ఎంతగా గోడు వినిపించినా.. యంత్రాలు, లారీలను అడ్డుకున్నా ఫలితం లేదు. దీనికి కారణం పోలీస్, రెవెన్యూ వ్యవస్థలను ఎమ్మెల్యే తన గుప్పిట్లో పెట్టుకోవటమే. ఇసుకను ముడిసరకుగా వాడే కంపెనీలకు యథేచ్ఛగా సరఫరా చేస్తున్నారు. అనధికారికంగా వారంలో వందలాది ట్రాక్టర్ల ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు పెద్దఎత్తున జరుగుతున్నా పోలీస్, రెవెన్యూ యంత్రాంగాలు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. కళ్లకు గంతలు కట్టుకున్నట్టుగా అధికారులు వ్యవహరిస్తున్నారు. జోక్యం చేసుకుంటే సంబంధిత అధికారులు నియోజకవర్గంలో పనిచేయలేని పరిస్థితి.

కప్పం కడితేనే కాంట్రాక్టులు

నియోజకవర్గంలో కాంట్రాక్టర్లు పనులు చేపట్టాలన్నా ఎమ్మెల్యే వద్ద పంచాయితీ జరగాల్సిందే. ఆ తర్వాతే పనుల్లో కదిలిక వస్తుంది. కాంట్రాక్టు పనులు చేయాలంటే ఆయనకు కప్పం కట్టాల్సిందే.

కొండలను పిండి చేసి...

జిల్లాలోనే ఈ నియోజకవర్గంలో ఎక్కువగా రాళ్ల కొండలు ఉన్నాయి. ఎమ్మెల్యే దోపిడీకి ఇవి ఆదాయ వనరుగా మారాయి. క్వారీలను లీజుకు తీసుకుని అనుమతులకు మించి దోచేస్తున్నారు. ఎన్నో ఆరోపణలు రావటంతో కొన్నింటిని సబ్ లీజుకు ఇచ్చి సదరు నేత మట్టి, ధూళి అంటకుండా ఆదాయం పొందుతున్నారు. నియోజకవర్గంలో ఎన్ని క్వారీలకు లీజులున్నాయి? అనుమతులు, లీజులు లేకుండా ఎన్ని క్వారీలను కొల్లగొడుతున్నారు? అనుమతి ఏ మేరకు తీసుకున్నారు? విచ్చలవిడిగా తవ్వి తరలిస్తున్నది ఎంత? అన్నది ప్రశ్నించేనాథుడే లేడు. ఎమ్మెల్యే, ఆయన కుటుంబం నిర్వహిస్తున్న క్వారీలవైపు మైనింగ్ అధికారులు కన్నెత్తి చూడరు. ఆ క్వారీల గురించి కొత్తగా వచ్చిన అధికారులు ఎవరైనా సమాచారం సేకరించినా జిల్లాలో పనిచేయలేరు. ఈ కొండల్లో ఏం జరుగుతుందో మూడో కంటికి కూడా తెలియదు. ఆ క్వారీల వైపు ఇతరులు ఎవరూ వెళ్లకుండా కట్టుదిట్టమైన ప్రైవేటు సెక్యూరిటీని ఏర్పాటు చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

మహిళల అభివృద్ధికి కృషి చేయాలి

● మహిళా సదస్సులో వక్తలు




సదస్సులో ప్రసంగిస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ మిడ్‌టౌన్ అధ్యక్షుడు సాధు ప్రసాద్, మూలి ఝాన్సీ

గవర్నర్‌పేట, మార్చి 6: చట్టసభల్లో రిజర్వేషన్లు, ఆర్థిక, సామాజిక సమానత్వం, అన్ని రంగాల్లో మహిళల అభివృద్ధి లక్ష్యాలుగా మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని రోటరీ క్లబ్ ఆఫ్ విఎడ్‌టౌన్ అధ్యక్షుడు సాధు వీఆర్ ప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంబీ విజ్ఞాన కేంద్రం, రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ మిడ్‌టౌన్, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ దివాస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఎంజీ రోడ్డులోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ భద్రత, ప్రసూతి సెలవులు, సమాన వేతనాలు, క్రెష్‌లకు ప్రభుత్వం ప్రతి ఏడాది తన బడ్జెట్ కేటాయింపులు తగ్గిచేస్తోందన్నారు. రిటైర్డ్ ఇండియన్ బ్యాంకు మేనేజర్ ఉషారాణి మాట్లాడుతూ మహిళలు రాజ్యాంగంలో ఉన్న అన్ని హక్కులను సాధించుకోవాలని, 33 శాతం రిజర్వేషన్ల కోసం ఉద్యమించాలన్నారు. ఐద్వా నాయకురాలు కె.స్వరూపరాణి మాట్లాడుతూ మహిళల అభివృద్ధితోనే సమాజాభివృద్ధి ముడిపడి ఉందన్నారు. 2024 ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు మూడోవంతు రిజర్వేషన్ అవకాశం ఇవ్వాలని సదస్సు డిమాండ్ చేసింది. మహిళా నేతలు పి. విజయ, హరిత చౌదరి, దివాస్, కె. స్వరూప, సరస్వతీ, శిల్ప, భారతీదేవి పాల్గొన్నారు.

ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో..

వన్‌టౌన్: మహిళలతోనే సమాజాభివృద్ధి జరుగుతుందని మోడరన్ అకాడమీ అధ్యాపకురాలు మూలి ఝాన్సీ అన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) నగర సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వన్‌టౌన్‌లోని ఏఎస్ గ్రాండ్ ఫంక్షన్ హాలులో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం-మనువాద రాజకీయాలను ప్రతిఘటిద్దాం, మహిళల హక్కులను పరిరక్షించుకుందాం అనే అంశాలపై జరిగిన సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోందన్నారు.

78శాతం బాల్య వివాహాలున్నాయని రాబోయే పదేళ్లలో ఇంకా పెరుగుతాయన్నారు. మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి .దుర్గాభవాని మాట్లాడుతూ మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వాహణకు గల పూర్వపరాలను వివరించారు. రాష్ట్రంలో జగన్మోహనరెడ్డి మద్య నిషేధ హామీని తుంగలో తొక్కారన్నారు. మహిళలపై అత్యాచారాలు, దుర్మార్గాలు కొనసాగుతున్నాయని విమర్శించారు. అస్తవ్యస్త పాలన సాగుతోందన్నారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. రావాలి జగన్ కావాలి జగన్ అనే నినాదం జైలుకు రావాలని పిలిచే అవకాశం ఉందని ఎద్దేవా చేశారు. కమ్యూనిస్టుల్లో మాజీ ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారంతా నీతి నిజాయితీలతో కొనసాగారని వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. పంచాదర్ల దుర్గాంబ, ఓర్సు భారతి, సీహెచ్ దుర్గ కోటేశ్వరరావు, నక్కా వీరభద్రరావు పాల్గొన్నారు.



శంఖారావం యాత్ర కోసం పుట్టపర్తి వచ్చిన లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న పరిటాల సునీత, పల్లె రఘునాథ రెడ్డి తదితరులు

నేడు సీమలో లోకేశ్ మలి విడత శంఖారావం

అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ కేడర్‌ను ఎన్నికలకు సంసిద్ధం చేయడమే లక్ష్యంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ చేపట్టిన శంఖారావం మలి విడత యాత్ర ఈసారి రాయలసీమలో జరగనున్నది. గురువారం హిందూపురం నుంచి శంఖారావం యాత్రకు లోకేశ్ శ్రీకారం చుట్టనున్నారు. తొలివిడత ఉత్తరాంధ్రలోని 31 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమం కేడర్‌లో నూతనోత్సాహాన్ని నింపింది. ఈ నేపథ్యంలో మలివిడత యాత్రను నందమూరి బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురం నుంచి ప్రారంభించాలని నిర్ణయించారు. గురువారం ఉదయం హిందూపురం, మధ్యాహ్నం మడకశిర, సాయంత్రం పెనుకొండ నియోజకవర్గాల్లో నిర్వహించే శంఖారావం సభల్లో ఆయన పాల్గొంటారు. ఈనెల 8న ఉదయం పుట్టపర్తి, మధ్యాహ్నం కదిరి సభలకు హాజరుకానున్నారు.

టీడీపీ రాష్ట్ర కమిటీలో మరిన్ని నియామకాలు

అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కమిటీలో పలువురిని నియమిస్తూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ప్రకటన విడుదల చేశారు. రైల్వే కోడూరుకు చెందిన తానా మాజీ అధ్యక్షుడు సతీశ్ వేమనను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో కొన్ని కీలక బాధ్యతలు ఆయనకు అప్పచెప్పారు. ఈ సందర్భంగా సతీష్ వేమన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కాగా, రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధిగా శింగనమల నియోజకవర్గానికి చెందిన ఆలం నరసానాయుడును, కాకినాడ రూరల్‌కు చెందిన పేరాబత్తుల రాజశేఖర్, నగరికి చెందిన పోతుగుంటు విజయ్‌బాబు, కాకినాడ సిటీకి చెందిన గుణ్ణం చంద్రమౌళిని రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శులుగా, శింగనమలకు చెందిన కట్టప్పగారి రామలింగారెడ్డి, కర్నూల్‌కు చెందిన ఎస్ అబ్దుల్ రజాక్‌ను రాష్ట్ర పార్టీ కార్యదర్శులుగా నియమిస్తూ అచ్చెన్న ఆదేశాలిచ్చారు.

ప్రచార పాట ఆవిష్కరణ..

'జగన్ ఇచ్చిన మాట యాడికి పోయింది?' అనే పాట సీడీని ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు జగన్ ప్రజల్ని నమ్మించి ఎన్నికల తర్వాత ఎలా మోసం చేశారనే విషయాలను ఈ పాట ద్వారా వివరించారన్నారు. రచయిత గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ... 'జగన్ ఎన్ని మాటలు తప్పాడో ఈ పాటలో వివరించా. అవి యదార్థాలా? కాదా? అన్నది ప్రజలు ఆలోచించుకోవాలి' అని అన్నారు.

వెంకట్రామిరెడ్డిపై చర్యలు తీసుకోవాలి: టీడీపీ

అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి సచివాలయ ఉద్యోగులతో రాజకీయ సమావేశాలు నిర్వహించి సీసీఏ నిబంధనలు అతిక్రమించారని, ఆయనపై చర్యలకు ఆదేశించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు రాష్ట్ర ఎన్నికల అధికారికి లేఖ రాశారు. దీంతో పాటు రాష్ట్రంలో 3,005 సున్నితమైన పోలింగ్ బూత్‌లకు భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని మరో లేఖలో ఆయన కోరారు. పోలింగ్ బూత్‌ల బయట, లోపల వీడియోగ్రఫీని ఏర్పాటు చేయడంతో పాటు మైక్రో అబ్జర్వర్లను నియమించాలన్నారు. వీటితో పాటు 2021-22 స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను బెదిరించిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఇప్పుడు కూడా అదే నేర ప్రవృతిని పునరావృతం చేశారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అచ్చెన్న ఎన్నికల ప్రధానాధికారికి మరో లేఖ రాశారు. రాజకీయ ప్రచారంలో సచివాలయ వలంటీర్ల ప్రమేయం ఉండకుండా చర్యలు తీసుకోవాలని సీఈసీని మరో లేఖలో కోరారు. పోస్టల్ బ్యాలెట్లు ఎంచుకునే సీనియర్ సిటిజన్లకు దరఖాస్తులను సులభతరం చేయమని వలంటీర్లకు చెప్పిన మంత్రి ధర్మానపై కూడా అచ్చెన్న ఫిర్యాదు చేశారు. రాజకీయ ప్రచారంలో వలంటీర్ల ప్రమేయాన్ని నిషేధించాలని కోరారు.

దాడులకు భయపడేది లేదు!: నారాయణ

నెల్లూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): 'నువ్వు ఎన్నిసార్లు దాడులు చేసినా భయపడేది లేదు. ఇంకా ఎన్ని సార్లు చేయిస్తావో చేయించుకో...' అంటూ సీఎం జగన్మోహన్‌రెడ్డిని ఉద్దేశించి మాజీ మంత్రి, నెల్లూరు సిటీ టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ వ్యాఖ్యానించారు. బుధవారం నెల్లూరులోని 11, 52వ డివిజన్లలో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ... 'నారాయణ గ్రూప్స్‌లో ఎందుకు తనిఖీలు చేశారో ప్రభుత్వానికే తెలియాలి. ఏదైనా నోటీసు ఇస్తే పన్ను చెల్లించాల్సి ఉంటే చెల్లిస్తారు. అలా కాకుండా ఎటువంటి నోటీసులు లేకుండా 150 మంది పోలీసులతో నాకు సన్నిహితంగా ఉండే వారి ఇళ్లపై దాడులు చేయడం మంచి పద్ధతి కాదు' అని హెచ్చరించారు.

సర్టిఫికెట్లపై సీఎం ఫొటో.. నవరత్నాల లోగోపై పిల్

» అవి పొందినవారి హక్కులకెలా భంగం కలుగుతుంది: హైకోర్టు

అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలకు జారీ చేసే కుల, స్థానికత, బర్త్ సర్టిఫికెట్లలో సీఎం జగన్ ఫొటో, నవరత్నాల లోగోను ముద్రించకుండా నిలువరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై కౌంటర్ వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు మరో ఎనిమిది వారాల సమయం ఇచ్చింది. సర్టిఫికెట్లపై సీఎం ఫొటో, లోగోను ముద్రించడంవల్ల అవి పొందినవారి హక్కులకు ఏ విధమైన భంగం కలుగుతుందని పిటిషనర్‌ను ప్రశ్నించింది. రాజకీయ కారణాలతో పిల్ దాఖలు చేసినట్లుందని వ్యాఖ్యానించింది. విచారణను 8 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం ఆదేశాలిచ్చింది. రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీలకు జారీచేసే కుల, స్థానికత, బర్త్ సర్టిఫికెట్లలో సీఎం జగన్, నవరత్నాల లోగోను ముద్రించడాన్ని సవాల్ చేస్తూ అమరావతి బహుజన సొసైటీ అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్, న్యాయవాది ఉమేశ్‌చంద్ర వాదనలు వినిపించారు.

నేడు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం

అమరావతి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో మరోసారి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయనుంది. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు సీఎస్ జవహర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరగనుందని ఉద్యోగ సంఘాలకు ఆహ్వానం పంపింది. ఈ సమావేశంలో పీఆర్సీతోపాటు పెండింగ్ బకాయిలు, డీఏ అరియర్స్, ఆర్థిక, ఆర్థికేతర అంశాలపై చర్చించనున్నట్లు ఉద్యోగ సంఘాల నేతలకు సమాచారం ఇచ్చింది.

ప్రత్తిపాటి శరత్ కస్టడీకి కోర్టు నిరాకరణ

విజయవాడ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ ఎగవేత కేసులో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్‌పై నమోదైన కేసులో పోలీసులకు ఎదురుదెబ్బ తగిలింది. ఆయన్ను పదిరోజులు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ వారు దాఖలుచేసిన పిటిషన్‌ను విజయవాడ మొదటి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు కొట్టేసింది. ఈ మేరకు న్యాయాధికారి కరీముల్లా బుధవారం తీర్పు వెలువరించారు. మాచవరం పోలీసులు శరత్‌పై కేసు నమోదుచేసి.. ఆయన్ను పది రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు పిటిషన్ వేయడం తెలిసిందే. శరత్ తరఫు న్యాయవాది కిలారు బెనర్జీ వాదనల సందర్భంగా అమరావతిలో జరిగిన రహదారుల నిర్మాణంలో నేరం జరిగితే.. ఆ పరిధిలోకి రాని మాచవరం పోలీసులు ఎలా కేసు నమోదు చేస్తారని ప్రశ్నించారు. ఈ వాదనలతో ఏకీభవించిన కోర్టు శరత్‌ను పోలీసు కస్టడీకి ఇవ్వడానికి నిరాకరించింది. కాగా.. శరత్ బెయిల్ పిటిషన్‌పై గురువారం కోర్టు విచారణ జరుపనుంది.

టెట్‌కు 88 శాతం హాజరు

అమరావతి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లు ముగిశాయి. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 9 వరకు పరీక్షలు జరగాలి. అయితే ఎస్జీటీ పోస్టులకు బీఈడీ చేసినవారు అర్హులు కారని హైకోర్టు స్పష్టంచేయడంతో అభ్యర్థుల సంఖ్య తగ్గిపోయింది. దీంతో మూడు రోజులు ముందుగానే పరీక్షలు ముగిసినట్లు పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. మొత్తంగా 2,67,789 మందికి.. 2,35,907 మంది మాత్రమే (88.09శాతం) పరీక్ష రాశారు.

మే 6న ఐసెట్

ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఐసెట్ మే 6న జరుగుతుందని ఉన్నత విద్యామండలి బుధవారం ప్రకటించింది. దరఖాస్తుల స్వీకరణ కూడా బుధవారమే ప్రారంభమైందని, ఏప్రిల్ 7 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ ఐసెట్ నిర్వహిస్తుంది.

స్నేహపూర్వక సేవలకు కృషి

● ప్రిన్సిపల్ కమిషనర్ సునీత బిళ్లా

ధర్నాచౌక్: పన్ను చెల్లింపుదారులకు ఆదాయపు పన్ను శాఖ స్నేహపూర్వక సేవలందించేందుకు కృషి చేస్తుందని ఆ శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ సునీత బి ళ్లా పేర్కొన్నారు. లాగే ప్రతి లావాదేవీని నిఘానేత్రం తో నిశితంగా గమనిస్తుందన్నారు. గాంధీనగర్‌లోని విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కార్యాలయంలో ఆదాయపు పన్నుపై అవగాహన స దస్సు బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పన్ను చెల్లింపుదారులు చట్టంలో వ చ్చిన మార్పులను అవగాహన చేసుకోవాలన్నారు. ని జాయితీగా తాము జరిపిన లావాదేవీలను పొందుపరుస్తూ రిటర్న్ దాఖలు చేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. శాఖ అదనపు కమిషనర్ కె.సంధ్యారాణి మాట్లాడుతూ ఆదాయపు పన్ను శాఖ నుంచి వచ్చే మెయిల్స్ స్పందించాలని పన్ను చెల్లింపుదారులకు సూచించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆదాయపు పన్ను శాఖ డిప్యూటీ కమిషనర్ ఏ తాండవకృష్ణ, ఆడిటర్ ఎం.వి.ఎస్.రామచంద్రరావు, చాంబర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రిమాండ్‌కు నకిలీ ఆదాయ పన్ను శాఖ అధికారి భరత్ భూషణ్

వన్‌టౌన్: దుర్గగుడిలో తాను ఆదాయపుపన్ను శాఖ జాయింట్ కమిషనర్‌ను అంటూ హల్‌చల్ చేసిన వేదాంతంశ్రీనివాస్ భరత్ భూషణ్‌ను కోర్టు రిమాండ్‌కు పంపించింది, దుర్గగుడిలో రాత్రి 10.30 గంటల సమయంలో దుర్గగుడి అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వేదాంతం శ్రీనివాస్ భరత్ భూషణ్ దుర్గగుడిలో అమ్మవారి దర్శనం కోసం తన ఐడీ చూపించి వీఐపీ లైనులో వెళ్ళాడు. అమ్మవారిని దర్శించుకుని బయటకు వస్తుండగా అతని ప్రవర్తనపై అనుమానం రావడంతో దుర్గగుడి సిబ్బంది అతనిని నిలువరించారు, ఆదాయపు పన్ను శాఖలో ప్రొటోకాల్ వి వరాలు సేకరించిన సిబ్బంది అతని వద్ద ఉన్న ఐడీ కార్డు నకిలీదని గుర్తించారు,అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు, ఇన్‌స్పెక్టర్ డి దుర్గాశేఖర్‌రెడ్డి విచారణ జరిపి అతనిని అరెస్టు చేశారు బుధవారం కో ర్టుకు హాజరుపరచగా అతనికి రిమాండ్ విధించారు.

ఎన్‌సీడీఆర్‌సీ బృందం తనిఖీ

భవానీపురం: నేషనల్ కన్స్యూమర్ డిస్‌ప్యూట్స్ రిడ్రెసల్ కమిషన్ (ఎన్‌సీడీఆర్‌సీ) సభ్యులు సుభాష్‌చంద్ర, జె.రాజేంద్రలో నగరంలోని కోర్టుల ప్రాంగణంలోని జిల్లా వినియోగదారుల కమిషన్ పనితీరుపై బుధవారం సమీక్షించారు. ఆయా విభాగాలను తని ఖీ చేశారు. జిల్లా కమిషన్ ఏడాది కాలంలో ఇప్పటి వరకు 400 కేసుల్లో తీర్పు ఇచ్చిందని, ప్రస్తుతం జి ల్లాలో 600 కేసులు పెండింగ్ ఉన్నాయని సభ్యులు తెలిపారు. జిల్లా వినియోగదారుల పరిరక్షణ మండ లి సభ్యులు డాక్టర్ తరుణ్ కాకాని చేపడుతున్న కా ర్యక్రమాలను కమిషన్ సభ్యులు అభినందించారు. వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షుడు చిరంజీవి, సభ్యులు పాల్గొన్నారు.

ముగింపు సభలను జయప్రదం చేయండి

ధర్నాచౌక్: జీవించే హక్కు, పౌరప్రజాస్వామిక హక్కుల కోసం పోరాటం చేస్తున్న పౌరహక్కుల సంఘం 50 వసంతాల సభలను జయప్రదం చేయాల ని సంఘం రాష్ట్ర ప్రధానక్యార్యదర్శి సీహెచ్ చంద్రశేఖర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ నెల 9, 10న హైదరాబాద్‌లో జరిగే ఈ సభల పోస్టర్‌ను గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆవిష్కరించారు. రెండు రో జులపాటు జరిగే ఈ సభల్లో దేశవ్యాప్తంగా పలువు రు మేధావులు వివిధ అంశాలపై ప్రసంగిస్తారన్నా రు. సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.ఆంజనేయు లు, ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి కె.పొలారి, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఐ.రాజేష్, ఐఎఫ్‌టీయూ నేత ఏ రవిచంద్ర, విరసం నేత అరసవిల్లి కృష్ణ పాల్గొన్నారు.

మూడేళ్లుగా సబ్సిడీలివ్వని ప్రభుత్వం

వైఎస్ షర్మిలకు దళిత పారిశ్రామిక వేత్తల వినతి

గన్నవరం: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవే త్తలకు రావాల్సిన రాయితీలు మూడేళ్లుగా విడుదల చేయటం లేదని ఏపీ దళిత ఎంటర్ ప్రెన్యూర్స్ ఎం`పవర్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు పీసీసీ అ ధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు వినతి పత్రాన్ని అందజేశారు. బుధవారం హైదరాబాద్ నుంచి విమానంలో గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన షర్మిలను కాం గ్రెస్ మహిళా నేత సుంకర పద్మశ్రీ ఆధ్వర్యంలో అ సోసియేషన్ బృందం కలిశారు. ఏపీడీఈఈఏ అధ్యక్షుడు పినమాల నాగకుమార్, అన్నవరపు అవినాష్, కలపాల వికాస్, జి.హనోక్, ఎస్. శ్రీరామ్, మాలమహానాడు ఎంఆర్‌పీఎస్, ట్రైబల్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు.

'ధనేకుల'లో ఘనంగా ప్రాజెక్టు ఎక్స్‌పో-2024

పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాజెక్టు ఎక్స్‌పో 2024 ఘనంగా నిర్వహించారు. ఇజ్రాయిల్ ఆస్ట్రానిక్స్ సీఈవో నిర్ జండ్ల ర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసీఈ డిపార్టుమెంటు విద్యార్థులు 92 ప్రాజెక్టులను, సీఎస్ ఈ విభాగం వారు 60 ప్రాజెక్టులను ప్రదర్శించారు. చైర్మన్ ధనేకుల రవీంద్రనాథ్ ఠాగూర్, సెక్రటరీ భవానీ ప్రసాద్, డైరెక్టర్ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ రవి కడియాల, డీన్లు పాల్గొన్నారు.

9న కెనాల్‌రోడ్డులో రథోత్సవం

● కన్యకాపరమేశ్వరి అన్నసత్రం కమిటీ



శివరాత్రి బ్రహ్మోత్సవాలు, రథోత్సవం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన కమిటీ ముఖ్యులు

వన్‌టౌన్,మార్చి 6: వన్‌టౌన్ కెనాల్‌రోడ్డులో ఈ నెల 9న శనివారం రథోత్సవం జరుగుతుందని కన్యకాపరమేశ్వరి అన్నసత్రం కమిటీ అధ్యక్షుడు బచ్చు వెంకట లక్ష్మీ వర ప్రసాద్ తెలిపారు. బుధవారం బ్రాహ్మణవీధిలోని సత్రం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రథోత్సవం, శివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికలను ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 12 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. పాత శివాలయంలో వేంచేసి ఉన్న భ్రమరాంబ మల్లేశ్వరులు, భద్రకాళి సమేత వీరభద్రస్వామి, బుద్ధవారి ఆలయంలో గంగా, పార్వతీ వసంత మల్లికార్జున స్వామి, దుర్గగుడిలో కొలువైన గంగ, పార్వతి, మల్లేశ్వరుల ఉత్సవ మూర్తులతో ఈనెల 9న సాయంత్రం 5.30 గంటల నుంచి రథం సెంటర్ నుంచి కెనాల్‌రోడ్డులో రథోత్సవం జరుగుతుందన్నారు. జిల్లా పోలీసు కమిషనర్ కాంతిరాణా రథోత్సవాన్ని ప్రారంభిస్తారన్నారు. ఆలయాల్లోని ఉత్సవమూర్తులకు బ్రహ్మోత్సవాలు, పుష్పయాగోత్సవాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 8న రాత్రి 12 గంటలకు లింగోద్భవం అనంతరం కల్యాణోత్సవాలు జరుగుతాయన్నారు. మేయర్‌తో పాటు ప్రజా ప్రతినిధులు, దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. విద్యుద్దీపకాంతులు, కోలాటాలు, నృత్యాలతో పాటు భక్తుల శివనామ స్మరణ మధ్య రథోత్సవం జరుగుతుందన్నారు. 153ఏళ్లుగా కన్యకాపరమేశ్వర అన్న సత్రం కమిటీ ఆధ్వర్యంలో రథోత్సవం జరుగుతోందన్నారు. కమిటీ ప్రధాన కార్యదర్శి బయన శ్రీరాజేష్, కార్యదర్శి మట్టా వెంకట సుబ్బారావు, ఉపాధ్యక్షుడు-1 వల్లంకొండ వీరముని బ్రహ్మానందరావు, ఉపాధ్యక్షుడు-2 వల్లంకొండ ప్రసాద్, సహాయ కార్యదర్శులు డోగిపర్తి శంకరరావు, బొలిశెట్టి జగన్మోహనరావు, కోశాధికారి చల్లా హరినారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి!




ఎండీ ద్వారకా తిరుమలరావును కలిసిన ఆర్టీసీ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ

బస్టేషన్, మార్చి 6: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆర్టీసీలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘ నేతలు బుధవారం ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును కలిసి విజ్ఞప్తి చేశారు. ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీకి అనుబంధంగా ఏర్పడిన అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ నూతన కమిటీకి ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షుడు తంగుడు ముత్యాలరావు, ప్రధాన కార్యదర్శి బుక్యా కుమార్ నాయక్‌ను ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జి.వి నరసయ్య ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, చైర్మన్ ఏ మల్లికార్జునరెడ్డికి విజ్ఞప్తి చేస్తూ తమ సమస్యలను విన్నవించారు. 2 దశాబ్దాలుగా 7,300 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కన్నా తమ వేతనాలు తక్కువగా ఉన్నాయన్నారు. థర్డ్‌పార్టీ కాంట్రాక్టర్లు సమయానికి వేతనాలివ్వడంలేదని నైపుణ్యం గల, నైపుణ్యం లేని, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు జీతాలు యథావిధిగా చేరడం లేదన్నారు. వీరికి ఆప్కోస్ ద్వారా వేతనాలు చెల్లించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎండీ, చైర్మన్‌కు లేఖలిచ్చారు. చాలామంది కాంట్రాక్టర్లు ఉద్యోగులు అడ్వాన్స్‌లు ఇస్తేనే కొనసాగిస్తామని లేదంటే కొత్తవారిని పెట్టుకుంటామని చెబుతున్నారన్నారు. ఈ విధానానికి స్వస్తి పలకాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఇన్సూరెన్స్ స్కీంతో పాటు మరిన్ని సమస్యలను వారి దృష్టికి తీసుకుని వచ్చారు. ఇదే సమయంలో ఇటీవల బస్టాండ్‌లో జరిగిన ప్రమాదంలో చనిపోయిన వై.వీరయ్య కుటుంబానికి అసోసియేషన్ ద్వారా రూ.45వేలు విరాళం అందించారు.

జగన్‌రెడ్డిని ఇంటికి పంపాలంటూ సైకో ప్రూఫ్ జాకెట్‌లు

● లోకేష్‌కు వివరించిన గుంటూరు మిర్చి వ్యాపారులు



లోకేష్‌తో గుంటూరు మిర్చి వ్యాపారులు

గన్నవరం, మార్చి 6: జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో పగలు ప్రతీకారాలతో సాగిందని ప్రజలు సైకోను ఇంటికి పంపాలంటూ గుంటూరుకు చెందిన మిర్చి వ్యాపారులు దొడ్డి సీతారామయ్య, మల్లాది హనుమంతురావు వినూత్నంగా జాకెట్లు ధరించి గన్నవరం విమానాశ్రయంలో హల్‌చల్ చేశారు. పుట్టపర్తి వెళ్లేందుకు ఉండవల్లి నివాసం నుంచి రోడ్డుమార్గాన గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను విమానాశ్రయంలో కలిసి వారి వినూత్న ఆలోచనను, జాకెట్లను చూపించి వివరించారు. అనంతరం ప్రత్యేక విమానంలో పుట్టపర్తి లోకేష్ వెళ్లారు. సైకో ప్రూఫ్ జాకెట్‌తో హెచ్చరిక.. నమ్మకం పేరు చెప్పి నాశనం చేస్తాడు. మళ్లీ గెలిస్తే మట్టి కూడా మిగలదు. సూచన కాపాడే కవచం టీడీపీ-జనసేన, తెలివిగా ఆలోచించు తెలుగు బిడ్డ. కర్తవ్యం ఓటేద్దాం-ఓటేద్దాం ఉన్మాదిని ఓడిద్దాం అంటూ ఒక వైపు, ఓటేసిన జనం-కాటేసిన జగన్, రాజధాని లేని రాష్ట్రం చేసి ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టాడు. పాలన చేయమని పదవినిస్తే 10 లక్షల కోట్లు అప్పు చేశాడు. రాక్షస పాలనలో రాష్ట్రం రావణకాష్టంగా మారింది. మనం-జనం కలిసి బలమై సైకోని సాగనంపుదాం జై టీడీపీ సైకిల్ గుర్తుకే ఓటేద్దాం, జై జనసేన గ్లాసు గుర్తుకే ఓటేద్దాం అంటూ రెండో వైపు సైకో ప్రూఫ్ జాకెట్లను ప్రింట్ చేయించినట్లు తెలిపారు. సైకో ప్రూఫ్ జాకెట్‌లతో అవగాహన కల్పించి జగన్‌రెడ్డిని ఇంటికి పంపటమే లక్ష్యమన్నారు.

బీసీలంటే బ్యాక్‌బోన్ క్యాస్ట్: బొండా

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 6: రాష్ట్రంలో బీసీలంటే బ్యాక్‌వార్డ్ క్యాస్ట్ కాదు.. బ్యాక్‌బోన్ క్యాస్ట్ అని తమ అధినేత చంద్రబాబు నిరూపించారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని సెంట్రల్ టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ టీడీపీ బీసీ డిక్లరేషన్‌తో తాడేపల్లి ప్యాలెస్‌లో వణకు మొదలైందన్నారు. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో బీసీలన్ని రకాలుగా ఆర్థికంగా అణగదొక్కబడ్డారన్నారు. బీసీల్లోని 159 కులాలైన యాదవ, రజక, కుమ్మరి, తదితర సామాజిక వర్గాల వారికి ప్రభుత్వం నుంచి సహాయం అందకపోవడం చరిత్రలో ఎక్కడా లేదని దుయ్యబట్టారు. అందుకే విజన్ ఉన్న తమ అధినేత చంద్రబాబు, పవన్ కల్యాణ్ బీసీ డిక్లరేషన్ ప్రవేశపెట్టారన్నారు. ఈ సందర్భంగా బీసీ డిక్లరేషన్‌లో పొందుపరచిన పథకాలను వివరించారు.

బూతుల నానీ.. నోరు అదుపులో పెట్టుకో..!

● బీజేపీ నేతల హెచ్చరిక

గన్నవరం, మార్చి 6: బూతుల నానికి మంత్రి పదవి పోయినా సిగ్గు లేకుండా, గుడివాడలో సీటు ఉందో లేదో తెలుసుకోకుండా తమ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని నిందించటం తగదని, ఆ స్థాయి నానీకి లేదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శేషబాబు అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ పురందేశ్వరి ఇప్పటికే రెండు దఫాలు కేంద్రమంత్రిగా పనిచేశారని ఆమెకు పదవి కొత్త కాదన్నారు. నానీ నాలుక, నోరు, ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని, లేకుంటే గుడివాడ ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు.

నియోజకవర్గంలో అవినీతిపై బీజేపీ చార్జిషీట్

పదేళ్లుగా నియోజకవర్గంలో వల్లభనేని వంశీ చేసిన అవినీతికి అడ్డు లేకుండా పోయిందని బీజేపీ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ మల్లెమూడి సతీష్‌బాబు ఆరోపించారు. నున్నలో వలతిప్పకొండను పదేళ్లలో ఇష్టారాజ్యంగా తవ్వేసి మాయం చేశారన్నారు. గుబ్బలగుంట వంశీ అనుచరులు తవ్వకాలు చేశారని కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేసిన స్పందన లేదన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, జె.రవికుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, నర్నాల విజయదుర్గా, వీరంకి శ్రీనివాస్ నాయుడు, కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన విభాగంలో గ్యాస్‌పైపు పేలుడు

● త్రుటిలో తప్పిన ప్రమాదం

వన్‌టౌన్, మార్చి 6: అర్జున వీధిలో దుర్గగుడికి చెందిన వంటశాలలో గ్యాస్ పైప్ శనివారం తెల్లవారు జామున పేలింది. సూపర్‌వైజర్ అప్రమత్తం కావడంతో సిబ్బందికి తృటిలో ప్రమాదం తప్పింది. అన్నదాన విభాగంలో సుమారు 10 గ్యాస్ స్టవ్‌లున్నాయి. భక్తులకు ఇక్కడి నుంచే పదార్థాలు తయారు చేస్తారు. ఈ పైపులు చాలా ఏళ్లనాటివి కావడంతో పాతబడ్డాయి. అధికారులు, సిబ్బంది, ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్ పర్యవేక్షణ కొరవడింది. పాత పైపులైన్ల గురించి పలుసార్లు సిబ్బంది అధికారులకు, ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లకు చెప్పినా పట్టించుకోలేదు. ఈ క్రమంలో ఈనెల 2న వేకువ జామున వంటవాళ్లు స్టవ్ వెలిగించగా ఒక్కసారిగా పైపులైను పేలింది. పక్కనే ఉన్న సూపర్ వైజర్ మెయిన్ వాల్వ్‌ను కట్టేయడంతో అక్కడున్న ఐదుగురికి ప్రమాదం తప్పింది. దీంతో భక్తులకు సకాలంలో భోజనం అందించలేకపోయారు. అయితే ఈ విషయాన్ని అధికారులు గోప్యంగా ఉంచారు. విషయం తెలుసుకున్న ఈవో పేలుడుకు గల కారణాలను సిబ్బందిని అడిగి తెలుసుకుని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

పాయకాపురం, మార్చి 6: అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతిచెందిన ఘటనపై నున్న రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. నున్న గ్రామం వికాస్ కాలేజీ రోడ్డు ప్రాంతానికి చెందిన ఏ బాబు (54) అప్పడాల కంపెనీ నడుపుతున్నాడు. దీని నిమిత్తం మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి బుధవారం నున్న బైపాస్ రోడ్డులోని పొలాల్లో మృతి చెంది కనిపించాడు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. చెట్టుకు లుంగీ కట్టి ఉండటం, మృతుడు నేలపై పడిపోయి ఉండటాన్ని బట్టి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్థిక ఇబ్బందులతో చెట్టుకి ఉరివేసుకున్నాడా, చనిపోయిన తరువాత లుంగీ ముడి ఊడి కిందపడిపోయి ఉంటాడా అనే కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నారు.

జేఏసీ విచ్ఛిన్నానికే తప్పుడు ఆరోపణలు

ధర్నాచౌక్, మార్చి 6: ఏపీ ఆలయ కేశఖండన నాయీ బ్రాహ్మణ జేఏసీని విచ్ఛిన్నం చేసేందుకు కొందరు వ్యక్తులు ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారని జేఏసీ అధ్యక్షుడు గుంటుపల్లి రామదాసు మండిపడ్డారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. తమ జేఏసీ డబ్బులు వసూళ్లకు పాల్పడుతుందని కొందరు వ్యక్తులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇలాంటి ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. దమ్ముంటే తమపై చేసిన ఆరోపణలను రుజువు చేయాలని సవాల్ విసిరారు. రూ.20 వేల కనీస వేతనంపై జీవో 110ను పోరాడి సాధించామన్నారు. జేఏసీ ఉపాధ్యక్షుడు ఆర్‌వీ రమణ, కోశాధికారి ఏజీఎల్ నారాయణ, ప్రధానకార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు, ప్రచార కార్యదర్శి పి.చెన్నకేశవ, కన్వీనర్ సురేష్, రంగాస్వామి, రమణమూర్తి పాల్గొన్నారు.

స్వల్పకాలిక శిక్షణ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణలంక: పీఎంకేవీవై పథకంలో భాగంగా జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఎలక్ట్రీషియన్ డొమెస్టిక్ సొల్యూషన్స్, ప్లంబింగ్ జనరల్ స్వల్పకాలిక కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.కనకారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45ఏళ్ల వయసు, టెన్త్ ఆపై అర్హత ఉన్నవారు ఆధార్ జిరాక్స్, ఫోన్ నెంబరు, ఈమెయిల్ ఐడీతో కార్యాలయంలో 15లోగా సంప్రదించాలన్నారు.

భారతదేశం కళలకు పుట్టినిల్లు

సంగీత నాటక అకాడమీ అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి

న్యూఢిల్లీ, మార్చి 6 (ప్రత్యేక ప్రతినిధి): భారతదేశం కళలకు పుట్టినిల్లు అని, కళలు సామాజిక ప్రయోజనానికి ఎంతో దోహదపడతాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. బుధవారం డిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఆమె 2022, 23 సంవత్సరాలకు సంబంధించి సంగీత నాటక అకాడమీ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ముర్ము మాట్లాడుతూ.. ఏడు దశాబ్దాలుగా కళలను ప్రోత్సహిస్తున్న అకాడమీని ఆమె అభినందించారు. తెలంగాణకు చెందిన ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారులు రాధా రెడ్డి- రాజారెడ్డి దంపతులకు ప్రతిష్ఠాత్మక సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్‌ను ముర్ము అందజేశారు. ఈఫెలోషిప్‌లో భాగంగా వారికి రూ.3 లక్షల నగదు పురస్కారం అందజేశారు. సంగీతం, నృత్యం, రంగస్థలం, సంప్రదాయ, జానపద, గిరిజన సంగీత, నృత్య కళల్లో మొత్తం 92 మందికి సంగీత నాటక అకాడమీ అవార్డులు వచ్చాయి.

108 కోట్ల విలువైన మాదకద్రవ్యాల స్వాధీనం

చెన్నై, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నాటుపడవలో శ్రీలంకకు అక్రమంగా తరలిస్తున్న రూ.108 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను కేంద్ర రెవెన్యూ దర్యాప్తు విభాగం, సముద్రతీర భద్రతాదళం సభ్యులు స్వాధీనం చేసుకున్నారు. ఆ సంఘటనకు సంబంధించి ముగ్గురిని అరెస్టు చేశారు. రామేశ్వరం సమీపం ధనుష్కోడి వద్ద మాదక ద్రవ్యాలు స్మగ్లింగ్ అవుతున్నట్లు రహస్య సమాచారం అందటంతో కేంద్ర రెవెన్యూ దర్యాప్తు విభాగం అధికారులు, కోస్టుగార్డ్ అధికారులు కోస్టుగార్డ్ గస్తీ నౌకలో వెళ్లి నడి సముద్రంలో వేగంగా వెళుతున్న నాటుపడవను చుట్టుముట్టారు. పడవలో ప్రయాణిస్తున్న రాబిన్‌సన్ (32) సహా మరో ఇద్దరిని అరెస్టు చేశారు.

ఈవీలతోనే ఎక్కువ కాలుష్యం..!

న్యూఢిల్లీ, మార్చి 6: పెట్రోల్, డీజిల్ వాహనాలకంటే ఎలక్ట్రిక్ వాహనాలే (ఈవీ) పర్యావరణానికి ఎక్కువ హాని చేస్తాయని తాజా అధ్యయనంలో గుర్తించారు. ఉద్గారాల డేటాను విశ్లేషించే ఎమిషన్ అనలిటిక్స్ అనే సంస్థ ఇటీవల నిర్వహించిన అధ్యయనంలో.. ఈవీలలోని బ్రేకులు, టైర్లు 1850 రెట్లు ఎక్కువ కణ కాలుష్యాన్ని విడుదల చేస్తున్నట్టు తేలింది. ఎలక్ట్రిక్, శిలాజ ఇంధనాలతో నడిచే వాహనాల బ్రేకులు, టైర్ల నుంచి ఉత్పత్తయ్యే కణ కాలుష్యం సమస్యపై చేసిన ఈ అధ్యయన వివరాలను వాల్‌స్ట్రీట్ జర్నల్‌లో ప్రచురించారు. శిలాజ ఇంధనాలతో నడిచే వాహనాలతో పోలిస్తే.. ఎలక్ట్రిక్ వాహనాలు వాటి అధికబరువు కారణంగా బ్రేకులు, టైర్ల నుంచి ఎక్కువ ధూళి కణాలను గాలిలోకి విడుదలచేస్తాయని పరిశోధకులు కనుగొన్నారు.

జయహో బీసీతో వైసీపీ నేతల్లో భయం: కొల్లు

అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): లక్షలాది మంది సమక్షంలో జయహో సభలో మంగళవారం చంద్రబాబు ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌తో వైసీపీ నేతల గుండెలు గుబేలుమన్నాయని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర బుధవారం అన్నారు. మూడేళ్ల పాటు గ్రామ గ్రామాన అధ్యయనం చేసి, బీసీలతో మాట్లాడి, 140కు పైగా బీసీ కులాల్లోని ప్రతి వర్గాన్ని సంప్రదించి తయారుచేసిన డిక్లరేషన్ నభూతో నభవిష్యత్ అన్నవిధంగా ఉందన్నారు. జగన్ మెప్పు కోసం, పదవులు కోసం పాకులాడే వైసీపీ బీసీ నాయకులకు టీడీపీ బీసీ డిక్లరేషన్ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు.

సాగునీటి ప్రాజెక్టులపై శ్వేతపత్రం ఇవ్వాలి: భూమిరెడ్డి

అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులపై వాస్తవాలతో శ్వేతపత్రం ఇచ్చే దమ్ము జగన్‌కు ఉందా? అని టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి బుధవారం ప్రశ్నించారు. 'వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి చంద్రబాబు రూ.1,450 కోట్లు కేటాయించారు. 90 శాతం వరకు సొరంగాల నిర్మాణం పూర్తి చేయించారు. జగన్ ఐదేళ్లలో రూ.950 కోట్లు కేటాయించి మొత్తం ప్రాజెక్టు తనవల్లే పూర్తయిందని సిగ్గు లేకుండా చెప్పుకుంటున్నారు' అని ఎమ్మెల్సీ విమర్శించారు.

అన్నం పెట్టిన రైతుకు జగన్ సున్నం: ఏలూరి

దేశానికి అన్నం పెట్టిన రైతులకు సున్నం పెట్టడంలో జగన్‌ను మించిన వారు దేశంలో ఉండరని టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆరోపించారు. 'రాష్ట్ర బడ్జెట్ నుంచి వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణానికి రూ.100 కూడా ఖర్చు పెట్టని జగన్ నేడు ప్రారంభోత్సవం పేరుతో పెద్ద డ్రామా నడిపాడు. అసమగ్ర ప్రాజెక్టును జగన్ అట్టహాసంగా ప్రారంభించడం ఎన్నికల్లో లబ్ధి పొందడానికేనని ప్రజలు గ్రహించారు' అని అన్నారు.

దళిత మంత్రిని అవమానించిన జగన్: టీడీపీ

అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం సందర్భంగా జగన్ పక్కన కూర్చున్న దళిత మంత్రి ఆదిమూలం సురేశ్‌ను లేపి ఆయన స్థానంలో వైవీ సుబ్బారెడ్డిని కూర్చోబెట్టడం ద్వారా దళిత మంత్రిని అవమానించారని టీడీపీ అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావు ఆరోపించారు. 'మంత్రి సురేశ్‌కు జరిగిన అవమానం దళితులకు చేసిన అవమానంగా భావించి తప్పు ఒప్పుకుని జగన్ దళిత జాతికి క్షమాపణలు చెప్పాలి. సురేశ్‌కు ఏ మాత్రం ఆత్మగౌరవం ఉన్నా.. జగన్ తీరును నిరసిస్తూ మంత్రి పదవికి రాజీనామా చేయాలి. మంత్రి సురేశ్, యర్రగొండపాలెం ఇన్‌చార్జ్ చంద్రశేఖర్‌లను కిందకు పంపి వారి స్థానంలో వైవీ సుబ్బారెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మను కూర్చోబెట్టడం కులదురహంకార పోకడకు నిదర్శనం' అని విమర్శించారు.

జగన్‌ను విశాఖ ప్రజలు నమ్మడం లేదు: గంటా

విశాఖపట్నం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): 'విశాఖపట్నం ప్రజలు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని నమ్మడం లేదు. ఆయన మళ్లీ గెలిచేదీ లేదు... విశాఖ వచ్చి ప్రమాణ స్వీకారం చేసే అవకాశమూ లేదు' అని గంటా శ్రీనివాసరావు అన్నారు. ఎంవీపీ కాలనీలోని తన నివాసంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. "ఇంకో వారం రోజుల్లో ఎన్నికల ప్రకటన వస్తుందన్న సమయంలో ఇక్కడికి వచ్చి 'విజన్ విశాఖ' అంటూ ప్రకటనలు చేయడం.. ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనం. జగన్ విశాఖపట్నం రావాలని ఇక్కడి వారు ఎవరూ కోరుకోవడం లేదు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ చిత్తుగా ఓడిపోవడం ఖాయం" అని గంటా అన్నారు.

దొంగ ఓట్ల కోసం జగన్ స్కెచ్: రఘురామ

న్యూఢిల్లీ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీకి రెండు, మూడు దశలలో ఎన్నికలను నిర్వహించాలని సీఎం జగన్ ఎన్నికల సంఘాన్ని కోరడం హాస్యాస్పదంగా ఉందని ఎంపీ రఘురామకృష్ణంరాజు అన్నారు. రెండు, మూడు దశల్లో ఎన్నికలను నిర్వహిస్తే, దొంగ ఓట్లు వేయడం సులభతరం అవుతుందని ఆయన భావించి ఉంటారని, తమిళనాడు నుంచి కుప్పంకు అరువు జనాలను, కోస్తాంధ్రకు, నెల్లూరు, ఒంగోలు ప్రాంతానికి రాయలసీమ బ్యాచ్‌ను సులభంగా తరలించాలని జగన్ ఉద్దేశమై ఉంటుందని ఆయన అన్నారు. బుధవారం, రచ్చబండ కార్యక్రమంలో భాగంగా రఘురామరాజు మీడియాతో మాట్లాడుతూ... రాయలసీమలోనూ బై బై వైసీపీ అంటుంటే, టికెట్ ఇస్తే జై టీడీపీ అనేందుకు ఎంతోమంది సిద్ధంగా ఉన్నారని ప్యాలెస్ యాజమాన్యం తెలుసుకుంటే మంచిదన్నారు. టీడీపీ, జనసేన కూటమి అద్భుత విజయం సాధించడం ఖాయమని, బీజేపీ కూడా జట్టు కడితే అత్యద్భుత విజయాన్ని సాధిస్తుందని అన్నారు.

18న గుంటూరులో ఏపీ బీసీ సంక్షేమ సంఘం ప్లీనరీ

గుంటూరు, మార్చి 6: ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర స్థాయి ప్లీనరీ ఈ నెల 18న గుంటూరులో నిర్వహించనున్నట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు.

జనసేన సిబ్బంది ఇళ్లలో పోలీసుల తనిఖీలు

మంగళగిరి, మార్చి 6: మంగళగిరిలో బుధవారం రాత్రి పోలీసులు జనసేన పార్టీకి చెందిన కొందరి ఇళ్లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జనసేన రాష్ట్ర కార్యాలయ సిబ్బంది బైపాస్ రోడ్డు, కొండపనేని టౌన్ షిప్, శ్రీ సాయి అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నారు. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో వచ్చిన పోలీసులు వారి ఫ్లాట్లలోనికి చొరబడి తనిఖీలకు దిగారు. ఈ వ్యవహారాన్ని జనసేన నేత నాదెండ్ల మనోహర్ తీవ్రంగా ఖండించారు.

పి.సుశీలకు పద్మావతి వర్సిటీ గౌరవ డాక్టరేట్



తిరుపతి, మార్చి 6: తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం 21వ స్నాతకోత్సవం సందర్భంగా ప్రఖ్యాత గాయని పి.సుశీలకు గౌరవ డాక్టరేట్‌ను గురువారం అందజేయనుంది. ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో జరిగే స్నాతకోత్సవంలో చాన్స్‌లర్ గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆమెకు గౌరవ డాక్టరేట్‌ను అందజేయనున్నారు. ప్రతిభ కనబరిచిన 57మంది విద్యార్థినులకు బంగారు పతకాలను, 12 మందికి పుస్తక బహుమతులను, నలుగురు నగదు బహుమతులను అందిస్తారు.

పదోన్నతుల వేలం.. లక్షల్లో బేరం!



అమ్మకానికి సివిల్ సప్లయిస్ డీఎం పోస్టులు

ఉమ్మడి కృష్ణా, గోదావరి జిల్లాల కోసం వేలం పాట

50 లక్షలకుపైగా పలుకుతున్న ధర

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో కొంత మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది. కృష్ణా జిల్లా కలెక్టరు కార్యాలయంలో ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్‌లో స్పెషల్ తహసీల్దారుగా పనిచేస్తున్న టి.వి.సతీష్‌కు, నూజివీడు మండల తహసీల్దారు డీవీఎస్ ఎల్లారావు, బంటుమిల్లి మండల తహసీల్దారు ఎం.వి.సత్యనారాయణలకు డిప్యూటీ కలెక్టర్లుగా ప్రమోషన్లు కల్పించి.. ఆ ముగ్గురినీ డిప్యుటేషన్‌పై పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్లుగా పోస్టింగ్‌లు ఇచ్చింది. ఎం.వి.సత్యనారాయణను ప్రకాశం జిల్లాలో, టి.వి.సతీష్‌ను కృష్ణాజిల్లాలో, డీవీఎస్ ఎల్లారావును డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో డీఎంలుగా నియమిస్తూ సివిల్ సప్లయిస్ కమిషనర్, ప్రభుత్వ ఎక్స్-అఫిషియో సెక్రటరీ హెచ్.అరుణ్‌కుమార్ గత నెల 2న ఉత్తర్వులిచ్చారు. ఎన్నికల నేపథ్యంలో ఒకేచోట మూడేళ్ల సర్వీసు పూర్తయిన అధికారులందరినీ ఇతర జిల్లాలకు బదిలీలు చేయాలని ఈసీ ఆదేశిస్తే.. కృష్ణాజిల్లా కలెక్టరు కార్యాలయంలో పనిచేస్తున్న టి.వి.సతీష్ (ల్యాండ్ ప్రొటెక్షన్ స్పెషల్ తహసీల్దారు)కు డిప్యూటీ కలెక్టరుగా పదోన్నతి కల్పించి.. ఇదే జిల్లాలో సివిల్ సప్లయిస్ డీఎంగా డిప్యుటేషన్‌పై నియమించడం నిబంధనలకు విరుద్ధం. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు బదిలీలు నిర్వహిస్తున్న క్రమంలో రెవెన్యూశాఖ నుంచి కొంతమంది డిప్యూటీ కలెక్టర్లను పనిగట్టుకుని తీసుకువచ్చి డిప్యుటేషన్లపై సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్లుగా నియమించారు. ఈ మూడు జిల్లాలకే కాదు.. తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ, భీమవరం, కృష్ణా, ఎన్టీఆర్, ప్రకాశం, బాపట్ల, అనంతపురం జిల్లాల్లో కూడా సివిల్ సప్లయిస్ డీఎంలుగా రెవెన్యూశాఖకు చెందిన డిప్యూటీ కలెక్టర్లనే డిప్యుటేషన్‌పై నియమించడం గమనార్హం. త్వరలో మరికొన్ని జిల్లాల డీఎంలను కూడా మార్చేసి..వారి స్థానాల్లో రెవెన్యూ శాఖ నుంచి డిప్యూటీ కలెక్టర్లను నియమించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని సివిల్ సప్లయిస్ వర్గాలే చెబుతున్నాయి. పౌర సరఫరాలశాఖలో పనిచేస్తున్న సీనియర్‌అధికారులను సైతం పక్కనబెట్టి.. రెవెన్యూ శాఖ నుంచి డిప్యూటీ కలెక్టర్లను తీసుకువచ్చి పౌర సరఫరాల సంస్థ డీఎంలుగా, ఇతర ఫోకల్ పోస్టుల్లో నియమిస్తుండటంతో తమపై పరాయి పెత్తనం, ఆధిపత్యం పెరిగిపోయాయని, తామంతా నాన్ ఫోకల్ పోస్టుల్లో డమ్మీలుగా మిగిలిపోయామంటూ సివిల్ సప్లయిస్ ఉద్యోగులు వాపోతున్నారు.

ఇదీ ఓ అధికారి ఆవేదన

"ప్రభుత్వమే ఎడాపెడా డిప్యుటేషన్ల ఆర్డర్లు ఇచ్చేస్తుండటంతో ఇతర శాఖల నుంచి వస్తున్నవారి చేతుల్లో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ బందీగా మారింది. కార్పొరేషన్‌లోని అన్ని విభాగాలపై వారిదే పెత్తనం. రెగ్యులర్ ఉద్యోగులు డమ్మీలుగా మారిపోయారు. కార్పొరేషన్ నిర్వహణ పూర్తిగా గాడి తప్పింది. అవినీతిపరులు, అక్రమార్కుల నిర్వాకాల వల్ల రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయింది."

ఇదీ కిటుకు!

రాష్ట్రంలో రేషన్ కార్డులు సహా ఇతర ప్రజా పంపిణీ అవసరాల కోసం పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలోనే ధాన్యం కొనుగోళ్లు, కందిపప్పు, పంచదార, ఇతర సరుకులను ఏటా లక్షల టన్నుల్లో ప్రొక్యూర్ చేస్తున్నారు. వీటికోసం ఆ సంస్థ ద్వారా దాదాపు రూ.15వేల కోట్లకు పైగా లావాదేవీలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ప్రతి వ్యవసాయ సీజన్‌లో లక్షల టన్నుల ధాన్యం కొనుగోళ్లు, వాటికోసం చేసే రూ.వేల కోట్ల లావాదేవీల్లో సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్లదే కీలక పాత్ర. ఈ ధాన్యం కొనుగోళ్లు, కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)కు అనుమతులు, శాంపిల్స్, క్వాలిటీ చెకింగ్ వంటి వ్యవహారాల్లో రైసు మిల్లర్ల నుంచి సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్లు, సంబంధిత అధికారులు, సిబ్బందికి కూడా భారీ మొత్తాల్లో ముడుపులు అందుతాయనేది బహిరంగ రహస్యమే. కందిపప్పు, పంచదార, గోధుమ, రాగిపిండి, పామాయిల్ సరఫరా చేసే కాంట్రాక్టర్ల నుంచి కూడా ప్రతినెలా పెద్ద మొత్తాల్లో కమీషన్లు తప్పనిసరి. ఇలా ఎక్కడా, ఎవరినీ డిమాండ్ చేయకుండానే వస్తున్న ఆదాయం రూ.కోట్లలో ఉంటుందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ల పోస్టులకు ఎక్కడ లేని డిమాండ్ ఏర్పడింది. ఈ పోస్టుల కోసం ఇతర శాఖల అధికారులు పోటీ పడుతున్నారు. ఈ పోటీలో రెవెన్యూ అధికారులే ముందు వరుసలో ఉంటున్నారు. పౌరసరఫరాలశాఖ మంత్రి పేషీతో పాటు ఆ శాఖ ఉన్నతాధికారి చక్రం తిప్పుతూ డీఎం పోస్టులను అమ్మకానికి పెట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఆ జిల్లాల్లోనే పోటీ ఎక్కువ!

ధాన్యం కొనుగోళ్లు ఎక్కువగా జరిగే ఉమ్మడి కృష్ణా, ఉభయగోదావరి జిల్లాల్లో సివిల్ సప్లయిస్ డీఎం పోస్టులకు విపరీతమైన పోటీ ఉండటంతో ఆయా పోస్టులకు పోటీ పడుతున్న డిప్యూటీ కలెక్టర్ల మధ్యనే వేలం పాట నిర్వహిస్తున్నారని, ఈ వేలంలో ఒక్కొక్క పోస్టు రూ.50 లక్షలకు పైగా పలుకుతోందని చెబుతున్నారు. మిగిలిన జిల్లాల్లో రూ.25 నుంచి 30లక్షల వరకు పలుకుతున్నట్లు సమాచారం. ఈ విధంగా రూ. పోస్టులు కొనుక్కుంటున్న డిప్యూటీ కలెక్టర్లు.. డిప్యుటేషన్ ఆర్డర్లు జారీ చేయించుకుంటున్నారు. బాపట్ల జిల్లాలో డీఎంగా పని చేస్తున్న పౌరసరఫరాల సంస్థ అధికారిని ఉన్నట్టుండి విజయవాడలోని ఆ సంస్థ ప్రధాన కార్యాలయానికి బదిలీ చేసి.. ఆ స్థానంలో రెవెన్యూ శాఖకు చెందిన డిప్యూటీ కలెక్టరును డిప్యుటేషన్‌పై డీఎంగా నియమించారు. ఇలా డిప్యుటేషన్లపై వస్తున్న డిప్యూటీ కలెక్టర్లు తమ గడువు ముగిసిపోతుందనగానే మళ్లీ ముడుపులు చెల్లించుకుని డిప్యుటేషన్‌ను పొడిగించుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలతోపాటు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ప్రస్తుతం డీఎంలుగా ఉన్నవారెవరూ సివిల్ సప్లయిస్‌కు చెందిన అధికారులు కాదు. ప్రకాశం, బాపట్ల, అనంతపురం జిల్లాలకూ ఇతర శాఖల ఉద్యోగులనే డీఎంలుగా నియమించారు. రాష్ట్రంలోని 250కి పైగా ఎంఎల్ఎస్ పాయింట్లలో మూడొంతులకు పైగా అధికారులు రెవెన్యూశాఖ నుంచి వచ్చిన డీటీలే ఇన్‌చార్జిలుగా ఉన్నారని చెబుతున్నారు.



రైతాంగానికే నష్టం!

రూ.లక్షలు ధారపోసి.. ఈ పోస్టులు కొనుక్కుంటున్న డీఎంలు.. ఆయా జిల్లాలో మిల్లర్లు, కాంట్రాక్టర్లతో కుమ్మక్కై దోపిడీకి పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. ప్రతి పనిలోనూ చేతివాటాన్ని ప్రదర్శిస్తూ.. నిబంధనలకు విరుద్ధంగా రైసు మిల్లర్లకు, కాంట్రాక్టర్లకు అడ్డగోలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారు. వ్యవసాయ సీజన్‌లో రైతులకు అన్యాయం చేస్తూ ఆఫ్‌లైన్‌లో కొనుగోళ్లకు అనుమతించడం, సీఎంఆర్ కింద రేషన్ బియ్యాన్నే రీసైక్లింగ్ చేయడం తదితర అక్రమాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. సివిల్ సప్లయిస్ ప్రధాన కార్యాలయంలో ప్రొక్యూర్‌మెంట్ వ్యవహారాలను చూసే అధికారులకూ పర్సంటేజీలు అందుతుండటంతో కళ్ల ముందు జరుగుతున్న అక్రమాలను వారు కూడా ప్రశ్నించడం లేదనే ఆరోపణలున్నాయి. మొత్తంగా.. దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లుగా... అక్రమార్జనకు అలవాటుపడిన అధికారులు జిల్లాలను పంచేసుకుని సివిల్ సప్లయిస్ సంస్థను నిండా ముంచేస్తున్నారని వాపోతున్నారు.

బహిరంగ సభల్లో మాటలు జాగ్రత్త

రాహుల్ గాంధీకి సూచించిన ఈసీ



న్యూఢిల్లీ, మార్చి 6: బహిరంగ సభల్లో మాటలను చాలా జాగ్రత్తగా ఉపయోగించాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి ఎన్నికల సంఘం సూచించింది. ప్రధాని మోదీని 'పనౌతి' (దుశ్శకునం), 'జేబ్ కత్రా' (జేబు దొంగ) అంటూ విమర్శించిన నేపథ్యంలో ఈ సూచన చేసింది. స్టార్ కాంపెయినర్లు, రాజకీయ నాయకులు ఎన్నికల ప్రచార సభల్లో ఎలా మాట్లాడాలో సలహాలు ఇస్తూ ఈ నెల ఒకటో తేదీన ఇచ్చిన మార్గదర్శకాలను పాటించాలని కోరింది. వీటిని ఉల్లంఘిస్తే కేవలం మందలింపుతో సరిపెట్టకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. గత ఏడాది నవంబరులో చేసిన ఈ వ్యాఖ్యలు సరైనవి కావంటూ ఆయనకు అంతకు ముందు నోటీసు జారీ చేసింది కూడా. కాగా లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీ తన సిటింగ్ స్థానమైన వయనాడ్‌తో పాటు ఉత్తర్‌ప్రదేశ్‌లోని అమేథి నుంచి కూడా మళ్లీ బరిలో నిలవబోతున్నారు. అలాగే ప్రియాంకా గాంధీ పార్టీకి కంచుకోట అయిన యూపీలోని రాయబరేలి నుంచి తొలిసారి పోటీకి దిగుతున్నారు. ఈ విషయాన్ని యూపీ కాంగ్రెస్ నేత ప్రదీప్ సింఘాల్ బుధవారం వెల్లడించారు.

అమెరికా అధ్యక్ష రేసులోంచి నిక్కీ హేలి ఔట్!



వాషింగ్టన్, మార్చి 6: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున బరిలో దిగేందుకు పోటీపడుతున్న భారత సంతతికి చెందిన నిక్కీ హేలి మంగళవారం జరిగిన 15 రాష్ట్రాల ప్రైమరీల్లో బాగా వెనుకబడ్డారు. దీంతో.. అధ్యక్ష అభ్యర్థిత్వం, ప్రచారం నుంచి వైదొలగుతున్నట్లు బుధవారం ప్రకటించారు. ఆదివారం కొలంబియాలో జరిగిన ప్రైమరీ ఎన్నికల్లో ఆమె విజయం సాధించిన విషయం తెలిసిందే. మంగళవారం 15 రాష్ట్రాల్లో ప్రైమరీ ఎన్నికలు నిర్వహించగా.. ఆమె కేవలం వెర్మాంట్‌లో విజయం సాధించారు. మిగతా చోట్ల ట్రంప్ పైచేయి సాధించారు.

పెన్షనర్ల పోరాటాలకు పూర్తి మద్దతు: ఏపీ ఎన్జీవో

విజయవాడ(ధర్నాచౌక్), మార్చి 6: పెన్షనర్ల హక్కుల కోసం చేసే పోరాటానికి అన్ని విధాల సహాయ, సహకారాలు అందిస్తామని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వి.శివారెడ్డి, పురుషోత్తమనాయుడు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా పెన్షనర్ల సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించామని త్వరలో సఫలమవుతాయని ఏపీ ఎన్జీవో మాజీ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు తెలిపారు. పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కె.దాలినాయుడు అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో ఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరి ప్రోద్బలంతో సమ్మెకు దిగారు?

గుంటూరు, విశాఖ, కడప న్యాయవాద సంఘాలకు హైకోర్టు నోటీసులు



అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కోర్టు విధులు బహిష్కరించి న్యాయవాదులు సమ్మె చేయడంపై వివరణ ఇవ్వాలని కోరుతూ గుంటూరు, విశాఖ, కడప న్యాయవాద సంఘాల అధ్యక్షులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఎవరి ప్రోద్బలంతో న్యాయవాదులు సమ్మెను ఇంకా కొనసాగిస్తున్నారు? సమ్మె చేయడం వెనుక ఎవరున్నారు? తదితర వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని ఆయా బార్ అసోసియేషన్ల అధ్యక్షులను ఆదేశించింది. విచారణను రెండువారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా కోర్టు విధులు బహిష్కరించేందుకు రాష్ట్రంలోని పలు బార్ కౌన్సిళ్లు తీర్మానాలు చేయడాన్ని చట్టవిరుద్ధమైన, కోర్టుధిక్కరణ చర్యగా ప్రకటించాలని కోరుతూ న్యాయవాది తాండవ యోగేష్ పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా ఏపీ బార్ కౌన్సిల్ తరఫున న్యాయవాది జి.వెంకటరెడ్డి వాదనలు వినిపిస్తూ.. గుంటూరు న్యాయవాదుల సంఘం సమ్మె విరమించలేదని తెలిపారు. సమ్మె విరమణ విషయంలో నిర్ణయం తీసుకొనేందుకు విశాఖ, కడప సంఘాలు బుధవారం సమావేశమవుతున్నాయన్నారు. రాష్ట్రంలోని మిగతా సంఘాలు సమ్మె విరమించాయని పేర్కొన్నారు.

ట్రైపార్టీ అగ్రిమెంట్‌పై త్వరగా తేల్చండి

నిబంధనలకు అనుగుణంగా నడుచుకోండి

ఏపీఈఆర్‌సీకి హైకోర్టు ఆదేశం.. విచారణ ఏప్రిల్ 18కి వాయిదా

అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ) నుంచి రాష్ట్ర ప్రభుత్వం సౌర విద్యుత్ కొనుగోలుకు సంబంధించి సెకీ, విద్యుదుత్పత్తి కంపెనీలు, విద్యుత్ పంపిణీ సంస్థల మధ్య జరిగిన ట్రైపార్టీ అగ్రిమెంట్‌ను ఆమోదించాలని కోరుతూ డిస్కమ్‌లు దాఖలు చేసిన పిటిషన్(విచారణార్హతతో సహా)పై సాధ్యమైనంత త్వరగా విచారణ జరిపి నిర్ణయాన్ని వెల్లడించాలని ఏపీ విద్యుత్ నియంత్రణ మండలిని హైకోర్టు ఆదేశించింది. చట్టనిబంధనలు అనుసరించాలని, పబ్లిక్ నోటీసు జారీ చేయాలని స్పష్టం చేసింది. ప్రజాహిత వ్యాజ్యాల్లో ఇప్పటివరకు ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేదని, ఏపీఈఆర్సీ నిర్ణయం వెల్లడించిన అనంతరం వాటిపై విచారణ జరుపుతామని తెలిపింది. విచారణను ఏప్రిల్ 18కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. సెకీ నుంచి యూనిట్ రూ. 2.49 చొప్పున 7వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి (సీఈఆర్‌సీ) నిర్ధారించడాన్ని సవాల్ చేస్తూ టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ హైకోర్టులో వేర్వేరుగా ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. తాత్కాలిక పద్ధతిలో సౌర విద్యుత్‌ను సమకూర్చుకొనేందుకు అనుమతినిస్తూ ఏపీఈఆర్‌సీ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని, సెకీ నుంచి సౌరవిద్యుత్ కొనుగోలుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదించడాన్ని చట్టవిరుద్ధమైన చర్యగా ప్రకటించాలని కోరారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ... సెకీ వద్ద విద్యుత్ కొనుగోలు చేసేందుకు ఏపీఈఆర్‌సీ ఆమోదం ఉందని తెలిపారు. ట్రైపార్టీ అగ్రిమెంట్ ఆమోదం కోసం డిస్కమ్‌లు ఏపీఈఆర్‌సీని ఆశ్రయించాయని, ప్రస్తుత వ్యాజ్యాలకు విచారించేందుకు ఏపీఈఆర్‌సీ వద్ద ఉన్న పిటిషన్ అడ్డంకి కాబోదని పేర్కొన్నారు. ప్రజాహిత వ్యాజ్యాలు పెండింగ్‌లో ఉన్న కారణంగా విద్యుత్ పంపిణీ చేసేందుకు కంపెనీలు వెనకాడుతున్నాయని వివరించారు. సెకీ తరఫున సీనియర్ న్యాయవాది ఎంఆర్ రామచంద్రన్ వాదనలు వినిపిస్తూ... అంతర్ రాష్ట్రాల మధ్య విద్యుత్ సరఫరా ఒప్పందం(పీఎస్ఏ) విషయంలో సీఈఆర్‌సీ నిర్ణయమే అంతిమమని చెప్పారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది బి. ఆదినారాయణరావు వాదనలు వినిపించారు. సెకీ నుంచి యూనిట్‌కు రూ.2.49 చొప్పున విద్యుత్ కొనుగోలుకు ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని, అయితే బయట మార్కెట్‌లో యూనిట్ రూ1.99కే దొరుకుతోందని వివరించారు. పవర్ సప్లై అగ్రిమెంట్(ట్రైపార్టీ)ను ఏపీఈఆర్‌సీ తిరస్కరిస్తే వ్యాజ్యాలపై విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని, ఈఆర్సీ నిర్ణయం ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలిగించేదిగా ఉంటే విచారణ చేయాలని కోరారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... ఈ వ్యవహారంపై ముందుగా ఏపీఈఆర్‌సీ నిర్ణయం వెల్లడించడమే ఉత్తమమని పేర్కొంది.

గొంతెండుతున్న బెంగళూరు

రిజర్వాయర్లలో అడుగంటిన నీరు.. అధిక ధర వసూలు చేస్తున్న ట్యాంకర్ల నిర్వాహకులు

మా ఇంటి బోర్‌వెల్ కూడా ఎండిపోయింది: డీకే



బెంగళూరు, మార్చి 6: కర్ణాటక రాజధాని బెంగళూరులో నీటి కొరత తీవ్రస్థాయికి చేరింది. రిజర్వాయర్లలో నీరు అడుగంటడమే దీనికి కారణం. బోర్‌వెల్‌లు కూడా ఎండిపోతున్నాయి. మరోవైపు నీటి ట్యాంకర్ల నిర్వాహకులు ఇష్టానుసారంగా అధిక ధరలు వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నగర వ్యాప్తంగా ఉన్న నివాసితుల సంక్షేమ సంఘాలు వాహనాలను కడగడంపైనా, స్విమ్మింగ్‌పూల్ కార్యకలాపాలపైనా పూర్తిస్థాయి నిషేధం విధించాయి. చేతులు, ముఖం శుభ్రం చేసుకోడానికి డిస్పోజబుల్ వస్తువులు, తడి గుడ్డలు వినియోగించే అంశాన్ని పరిశీలించాలని దక్షిణ బెంగళూరులోని ఒక ప్రముఖ అపార్ట్‌మెంట్‌లోని నివాసితుల సంక్షేమ సంఘం ప్రతిపాదించింది. వాటర్ ట్యాంకర్లపై ఆర్టీవో, బీడబ్ల్యూఎస్ఎస్‌బీ(బెంగళూరు నీటి సరఫరా-సీవేజ్ బోర్డు) దాడులు నిర్వహించిన అనంతరం నీటి సరఫరాలో ఏర్పడిన అవాంతరాల గురించి అపార్ట్‌మెంట్లలోని నివాసితుల సంక్షేమసంఘాలు కొద్ది రోజుల క్రితమే నివాసితులకు తెలియజేశాయి. పరిస్థితి దిగజారడంతో నీటి వృథాను నివారించేందుకు డిస్పోజబుల్ ప్లేట్లు, ఐటమ్స్ వినియోగాన్ని పరిశీలించాలని నివాసితులకు సూచించామని ప్రెస్టీజ్ ఫాల్కన్ సిటీ(పీఎఫ్‌సీ) అపార్ట్‌మెంట్స్ నివాసితుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వసంత్ కుమార్ తెలిపారు. నీటి వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించేందుకే ఈ ఆలోచన చేశామన్నారు. నీళ్ల ట్యాంకర్లకూ కొరత ఏర్పడినందున ప్రత్యామ్నాయాలు పరిశీలిస్తున్నామని చెప్పారు. వైట్‌ఫీల్డ్ ప్రాంతంలోని నివాసితుల సంక్షేమ సంఘం నీటి దుర్వినియోగాన్ని నివారించేందుకు భద్రతా సిబ్బందిని కూడా నియమించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. కొన్ని రోజులుగా బీడబ్ల్యూఎస్‌ఎస్‌బీ నీటిని సరఫరా చేయకపోవడంతో ప్రజలు చేతిపంపులపై ఆధారపడుతున్నారు. చేతిపంపుల్లోనూ నీరు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. నీటి వినియోగాన్ని 20శాతం తగ్గించని కుటుంబాల నుంచి అదనంగా రూ.5 వేలు వసూలు చేస్తామని ఓ ప్రాంతంలోని నివాసితుల సంక్షేమ సంఘం హెచ్చరించింది. బెంగళూరులోని అనేక ప్రాంతాలు నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని, తన ఇంటి వద్ద ఉన్న బోర్‌వెల్ కూడా ఎండిపోయిందని కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. మేకదాటు రిజర్వాయర్ ప్రాజెక్టుకు ఇప్పటికైనా కేంద్రం ఆమోదం తెలపాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బెంగళూరుకు తగినంత నీటిని ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. 'కొన్ని ట్యాంకర్ల నిర్వాహకులు రూ.600, మరికొందరు రూ.3,000 వసూలు చేస్తున్నారు. ధరను ప్రామాణీకరించేందుకు ట్యాంకర్ల నిర్వాహకులంతా అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని ఆదేశించాం. ట్యాంకర్లు ప్రయాణించిన దూరాన్ని బట్టి అధికారులే ధర నిర్ణయిస్తారు' అని డీకే తెలిపారు. రామనగర, హోసకోట, చెన్నపట్న, మగడి తదితర పట్టణాల నుంచి ట్యాంకర్ల ద్వారా బెంగళూరుకు నీటిని తరలించాలని నిర్ణయించామన్నారు.

ఓటు మార్చి ప్యాకేజీకి చేటు

తమను ఏమార్చారంటూ ఈసీకి పోలవరం నిర్వాసితుల ఫిర్యాదు

పునరావాసం లేదు..పరిహారం లేదు

ఇప్పుడు ఊళ్లో ఓటు తీసి ఎక్కడికో బదిలీ

దేవీపట్నం,తొయ్యేరు వాసుల ఆవేదన

అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): గంపగుత్తగా తమ అనుమతి లేకుండా రంపచోడవరం నియోజకవర్గం నుంచి జగ్గంపేట నియోజకవర్గానికి తమ ఓట్లను బదిలీ చేయడంపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి పోలవరం నిర్వాసిత గ్రామాల ప్రజలు ఫిర్యాదు చేశారు. సోమవారం రంపచోడవరం నియోజకవర్గం దేవిపట్నం, తొయ్యేరు గ్రామాలకు చెందినవారు అమరావతి సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల అదనపు అధికారి హరేంధిర ప్రసాద్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తమ ఓట్లను యథావిధిగా కొనసాగించాలని కోరారు. "దేవిపట్నం మండలంలో 25 గ్రామాలు ముప్పును ఎదుర్కొంటున్నాయి. అందువల్ల మేం 2013 నుంచి జగ్గంపేట నియోజకవర్గం గోకవరంలో ఉంటున్నాం. ముంపు కారణంగానే తొయ్యేరుకు చెందిన 600 కుటుంబాలు, కృష్ణునిపాలెంలోని (గోకవరం మండలం) ఆర్‌అండ్ ఆర్ కాలనీకి వచ్చేశాయి. అయితే, పునరావాస కాలనీ పూర్తి కాని దేవీపట్నం వాసులు గోకవరం మండలంలో చెట్టుకొకరు పుట్టకొకరుగా ఉన్నారు. దేవీపట్నం, తొయ్యేరు గ్రామాల్లో ఇప్పటికీ పునరావాసానికి సంబంధించి పరిహారాలు, ఇళ్ల నిర్మాణాలవంటి సమస్యలు ఉన్నాయి. ముంపు కారణంగా బయట ప్రాంతాలకు వస్తే అధికారులు మా రెండు గ్రామాల ప్రజల ఓట్లను జగ్గంపేట నియోజకవర్గానికి మార్చారు" అని తెలిపారు. దీనివల్ల తమకు అందాల్సిన పునరావాస పరిహారం అందదేమోనన్న ఆందోళన వ్యక్తంచేశారు. దేవీపట్నంలో 1125, తొయ్యేరులో 1350 ఓట్లు..మొత్తం 2475 ఓట్లను బదిలీ చేశారని ఫిర్యాదు చేశారు. అనంతరం సచివాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. 'ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రావాలంటే ఓటరు కార్డు ఉండటం తప్పనిసరి అని తొయ్యేరు నిర్వాసితుడు సత్యనారాయణ పేర్కొన్నారు. తమ ఓట్లు ఎందుకు మార్చారని అడిగితే అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. పంచాయతీ అనుమతి లేకుండా, తాము దరఖాస్తు చేసుకుండా, కనీసం సమాచారం ఇవ్వకుండానే తమ ఓట్లు వేరే నియోజకవర్గానికి మార్చేశారని వాపోయారు. పునరావాస ప్యాకేజీ ఎగవేయడానికే అధికారులు ఇలా చేస్తున్నారని ఆగ్రహించారు. తొయ్యేరులో 80మందికి, దేవిపట్నంలో 150 మందికి ఇంకా ప్యాకేజీ రావాల్సి ఉందన్నారు. ఓట్లు బదిలీ చేయడం వల్ల ప్యాకేజీ రాదేమోననే ఆందోళనను దేవీపట్నం నిర్వాసితుడు సింహాద్రి వ్యక్తం చేశారు. పునరావాస కాలనీల్లో పూర్తిసౌకర్యాలు కల్పించి, పరిహారం ప్యాకేజీ ఇచ్చి...ఓట్లు మార్చితే అభ్యంతరం లేదని తొయ్యేరు నిర్వాసితులు శివరామకృష్ణ నాయుడు అన్నారు.

డోర్ నంబరు మార్చకుండా ఓటు బదిలీ!

"నాకు దేవిపట్నంలో ఓటు ఉంది. పోలవరం ముంపు భయంతో మేమంతా కృష్ణునిపాలెంలో ఉంటున్నాం. నా ఓటు అక్కడ నుంచి ఇక్కడకు మార్చారు. దేవిపట్నంలోని మా ఇంటి డోరు నంబరుతోనే కృష్ణునిపాలేనికి నా ఓటును మార్చారు. కనీసం డోర్ నంబర్ కూడా మార్చకుండా అదే నంబర్‌తో ఓటును ఎలా బదిలీ చేస్తారు? మూడు సంవత్సరాల క్రితమే మీ ఓట్లు మార్చామని అధికారులు చెబుతున్నారు"

\- వీరబాబు, తొయ్యేరుకు చెందిన నిర్వాసితుడు

ఆంధ్రజ్యోతి దిక్సూచి

విజయవాడ ● గురువారం 7 మార్చి 2024

diksuchi@andhrajyothy.com

ఏపీ ఐసెట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(ఏపీఎస్‌సీహెచ్‌ఈ)-ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీ ఐసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, అనుబంధ కళాశాలల్లో ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ పరీక్షని అనంతపురంలోని శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ నిర్వహిస్తోంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.



అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడేళ్లు/నాలుగేళ్ల డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంసీఏలో ప్రవేశానికి మాత్రం ఇంటర్/డిగ్రీ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. డిగ్రీ స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు; డిస్టెన్స్/ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్ విధానాల్లో డిగ్రీ చదివినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వన్ సిట్టింగ్ విధానంలో డిగ్రీ పూర్తిచేసినవారు దరఖాస్తుకు అనర్హులు.

ఏపీ ఐసెట్ వివరాలు: ఇది ఆన్‌లైన్ ఆబ్జెక్టివ్ టెస్ట్. ఇందులో మొత్తం 200 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. పరీక్షలో అనలిటికల్ ఎబిలిటీ, కమ్యూనికేషన్ ఎబిలిటీ, మేథమెటికల్ ఎబిలిటీ అనే మూడు సెక్షన్‌లు ఉంటాయి. మొదటి సెక్షన్‌లో డేటా సఫిషియెన్సీ నుంచి 20 ప్రశ్నలు, ప్రాబ్లమ్ సాల్వింగ్ నుంచి 55 ప్రశ్నలు ఇస్తారు. రెండో సెక్షన్‌లో ఒకాబులరీ నుంచి 15, ఫంక్షనల్ గ్రామర్ నుంచి 20, బిజినెస్ అండ్ కంప్యూటర్ టర్మినాలజీ నుంచి 15, రీడింగ్ కాంప్రహెన్షన్ నుంచి 20 ప్రశ్నలు ఇస్తారు. మూడో సెక్షన్‌లో అర్థమెటికల్ ఎబిలిటీ నుంచి 35, ఆల్జీబ్రికల్ అండ్ జామెట్రికల్ ఎబిలిటీ నుంచి 10, స్టాటిస్టికల్ ఎబిలిటీ నుంచి 10 ప్రశ్నలు ఇస్తారు. రెండో సెక్షన్ ప్రశ్నలను ఆంగ్ల మాధ్యమంలో; మొదటి సెక్షన్, మూడో సెక్షన్ ప్రశ్నలను ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 200. పరీక్ష వ్యవధి రెండున్నర గంటలు. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే కనీసం 25 శాతం(50 మార్కులు) రావాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.650; బీసీ అభ్యర్థులకు రూ.600; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.550
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 7
- **కరెక్షన్ విండో ఓపెన్:** ఏప్రిల్ 28 నుంచి 29 వరకు
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 2 నుంచి
- **ఏపీ ఐసెట్ 2024 తేదీలు:** మే 6, 7
- **ఫలితాలు విడుదల:** జూన్ 20
- **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in

తెలంగాణ ఎడ్‌సెట్

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(టీఎస్‌సీహెచ్‌ఈ)- ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(టీఎస్ ఎడ్‌సెట్)2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా రెండేళ్ల బీఈడీ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ పరీక్షని నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ నిర్వహిస్తోంది. మేథమెటిక్స్, ఫిజికల్ సైన్సెస్, బయలాజికల్ సైన్సెస్, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్, ఓరియంటల్ లాంగ్వేజెస్ సబ్జెక్టుల్లో ఒకటి ఎంచుకోవాలి. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన కాలేజీ నుంచి కనీసం 50 శాతం మార్కులతో బీఏ/బీకాం/బీఎస్సీ/బీఎస్సీ హోంసైన్స్/బీఏ(ఓరియంటల్ లాంగ్వేజెస్/లిటరేచర్)/బీసీఏ/బీబీఎం/బీబీఏ ఉత్తీర్ణులై ఉండాలి. సైన్స్, మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా బ్యాచిలర్స్ డిగ్రీ(ఇంజనీరింగ్/టెక్నాలజీ) ఉత్తీర్ణులు; మాస్టర్స్ డిగ్రీ/తత్సమాన అర్హత ఉన్నవారు; ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. ఎంబీబీఎస్/బీఎస్సీ ఏజీ/బీవీఎస్సీ/బీహెచ్‌ఎంటీ/బీఫార్మసీ/ఎల్ఎల్‌బీ తదితర ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసినవారు; డిగ్రీ చదవకుండా పీజీ చేసినవారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి 19 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

టీఎస్ ఎడ్‌సెట్ వివరాలు: దీనిని సీబీటీ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 150 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మేథమెటిక్స్, సైన్స్, సోషల్ స్టడీస్, టీచింగ్ ఆప్టిట్యూడ్, జనరల్ ఇంగ్లీష్, కంప్యూటర్ అవేర్‌నెస్ అంశాల నుంచి ఒక్కోదానిలో 20 ప్రశ్నలు; జనరల్ నాలెడ్జ్ అండ్ ఎడ్యుకేషనల్ అంశాల నుంచి 30 ప్రశ్నలు ఇస్తారు. మేథ్స్, సైన్స్, సోషల్ ప్రశ్నలు పదోతరగతి తెలంగాణ సిలబస్ ఆధారంగా ఉంటాయి. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 150. పరీక్ష సమయం రెండు గంటలు. ప్రశ్నపత్రం ఇంగ్లీష్-తెలుగు, ఇంగ్లీష్-ఉర్దు మాధ్యమాల్లో ఉంటుంది. ఇందులో అర్హత సాధించాలంటే కనీసం 25 శాతం మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఇది వర్తించదు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.750; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.550
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 6
- **కరెక్షన్ విండో ఓపెన్:** మే 13 నుంచి 15 వరకు
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 20 నుంచి
- **టీఎస్ ఎడ్‌సెట్ 2024 తేదీ:** మే 23
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, నల్లగొండ, కోదాడ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సత్తుపల్లి, కరీంనగర్, మహబూబ్‌నగర్, సిద్దిపేట్, నిజామాబాద్, వరంగల్, నర్సంపేట్, సంగారెడ్డి, ఆదిలాబాద్, కర్నూలు, విజయవాడ.
- **వెబ్‌సైట్:** https://edcet.tsche.ac.in

నోటిఫికేషన్స్

నిట్ ఎంసీఏలో ప్రవేశానికి నిమ్‌సెట్

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) సంస్థలు అందిస్తున్న మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(ఎంసీఏ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఉద్దేశించిన 'నిట్ ఎంసీఏ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (నిమ్‌సెట్) 2024' నోటిఫికేషన్ వెలువడింది. దీనిని నిట్ జంషెడ్‌పూర్ నిర్వహిస్తోంది. ఇందులో ఐఐఐటీ భోపాల్ సహా వరంగల్, రాయ్‌పూర్, సూరత్కల్, తిరుచిరాపల్లి, కురుక్షేత్ర, అగర్తల, జంషెడ్‌పూర్, భోపాల్, అలహాబాద్, పట్నా నిట్‌లు పార్టిసిపేట్ చేస్తున్నాయి. నిమ్‌సెట్ 2024లో సాధించిన ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. వరంగల్, జంషెడ్‌పూర్ నిట్‌లలో రెండేళ్ల కోర్సు పూర్తయ్యాక ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. వీరికి పోస్ట్ గ్రాడ్యుయేట్ అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్(పీజీఏడీసీఏ)ని ప్రదానం చేస్తారు. కురుక్షేత్ర, పట్నా నిట్‌లలో సెల్ఫ్ ఫైనాన్సింగ్ స్కీమ్ అందుబాటులో ఉంది.



సీట్ల వివరాలు: మొత్తం 1033 సీట్లు ఉన్నాయి. వరంగల్ నిట్‌లో 58, తిరుచిరాపల్లి నిట్‌లో 115, సూరత్కల్ నిట్‌లో 58, రాయ్‌పూర్ నిట్‌లో 110, కురుక్షేత్ర నిట్‌లో 96(వీటిలో సెల్ఫ్ ఫైనాన్సింగ్ స్కీమ్ సీట్లు 32), జంషెడ్‌పూర్ నిట్‌లో 115, భోపాల్ ఎంఏఎన్‌ఐటీలో 115, అలహాబాద్ ఎంఏఎన్‌ఐటీలో 116, అగర్తల నిట్‌లో 30 సీట్లు ఉన్నాయి. పట్నా నిట్‌లో డేటా సైన్స్&ఇన్ఫర్మాటిక్స్ 80, ఏఐ&ఐఓటీ 80 సీట్లు ఉన్నాయి. సెల్ఫ్ ఫైనాన్సింగ్ స్కీమ్ కింద ప్రతి స్పెషలైజేషన్‌లో సగం సీట్లు కేటాయించారు. భోపాల్ ఐఐఐటీలో 60 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్ట్‌గా ప్రథమ శ్రేణి మార్కులతో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినవారు; బీఈ/ బీటెక్ ఉత్తీర్ణులు; ఓపెన్ యూనివర్సిటీల నుంచి దూరవిద్య విధానంలో డిగ్రీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 సెప్టెంబరు 30 నాటికి డిగ్రీ సర్టిఫికెట్, మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.

నిమ్‌సెట్ 2024 వివరాలు: ఈ పరీక్షని సీబీటీ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో మూడు పార్ట్‌లు ఉంటాయి. మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మొదటి పార్ట్‌లో మేథమెటిక్స్ నుంచి 50 ప్రశ్నలు ఇస్తారు. దీనికి 70 నిమిషాల పరీక్ష సమయం ఉంటుంది. రెండో పార్ట్‌లో అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 40 ప్రశ్నలు ఇస్తారు. దీనికి 30 నిమిషాల సమయం ఇస్తారు. మూడో పార్ట్‌లో కంప్యూటర్ అవేర్‌నెస్ నుంచి 20, జనరల్ ఇంగ్లీష్ నుంచి 10 ప్రశ్నలు అడుగుతారు. దీనికి 20 నిమిషాల సమయం ఇస్తారు. మేథమెటిక్స్ ప్రశ్నలకు ఒక్కోదానికి 12 మార్కులు; అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్, కంప్యూటర్ అవేర్‌నెస్ ప్రశ్నలకు ఒక్కోదానికి 6 మార్కులు; జనరల్ ఇంగ్లీష్ ప్రశ్నలకు ఒక్కోదానికి 4 మార్కులు కేటాయించారు. సమాధానం తప్పుగా గుర్తిస్తే పావు వంతు మార్కు కోత విధిస్తారు. మొత్తం మార్కులు 1000. ప్రశ్నలన్నీ ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే ఉంటాయి. పరీక్ష సమయం రెండు గంటలు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.2,500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1,250
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 20
- **ఎడిట్ విండో ఓపెన్:** ఏప్రిల్ 24 నుంచి 26 వరకు
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** మే 28 నుంచి
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్
- **నిమ్‌సెట్ 2024 తేదీ:** జూన్ 8
- **ఫలితాలు విడుదల:** జూన్ 25
- **కౌన్సెలింగ్ ఫీజు:** రూ.1000
- **రిజిస్ట్రేషన్, చాయిస్ ఫిల్లింగ్:** జూన్ 29 నుంచి జూలై 5 వరకు
- **మొదటి రౌండ్ సీట్ల కేటాయింపు:** జూలై 8
- **రెండో రౌండ్ సీట్ల కేటాయింపు:** జూలై 13
- **మూడో రౌండ్ సీట్ల కేటాయింపు:** జూలై 18
- **మిగిలిన సీట్ల వివరాలు ప్రకటన:** జూలై 23
- **స్పెషల్ రౌండ్ సీట్ల కేటాయింపు:** జూలై 27
- **వెబ్‌సైట్:** www.nimcet.in, www.nimcet.admissions.nic.in

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ జాగ్రఫీ

జల సంరక్షణ విధానాలు



దేశంలో ఉమ్మడి ప్రాజెక్టులు

- **గండక్ ప్రాజెక్ట్:** బిహార్+ఉత్తరప్రదేశ్
- **దామోదర్ వ్యాలీ ప్రాజెక్ట్:** జార్ఖండ్+వెస్ట్ బెంగాల్
- **రామ్ గంగా:** ఉత్తరాఖండ్+ఉత్తరప్రదేశ్
- **చంబల్ ప్రాజెక్ట్:** మధ్యప్రదేశ్+రాజస్థాన్
- **ఇందిరాసాగర్ ప్రాజెక్ట్:** మధ్యప్రదేశ్+గుజరాత్
- **సర్దార్ సరోవర్ ప్రాజెక్ట్:** గుజరాత్+రాజస్థాన్+మధ్యప్రదేశ్+మహారాష్ట్ర

అంతర్జాతీయ ఉమ్మడి ప్రాజెక్టులు

- **గండక్ ప్రాజెక్ట్:** ఇండియా+నేపాల్
- **మహంకాళి ప్రాజెక్ట్:** ఇండియా+నేపాల్
- **కోసి ప్రాజెక్ట్:** ఇండియా+నేపాల్
- **సంకోష్ ప్రాజెక్ట్:** ఇండియా+భూటాన్
- **తనక్‌పూర్ ప్రాజెక్ట్:** ఇండియా+ నేపాల్

భారతదేశంలో సంప్రదాయ నీటిపారుదల, జల సంరక్షణ విధానాలు

- **జింగ్:** కరిగిన హిమనీ నదాల నీటిని సేకరించడానికి నిర్మించిన ట్యాంక్‌లు. ఇవి లడక్‌లో ఉన్నాయి.
- **నౌల:** ఉత్తరాఖండ్‌లో చుట్టుపక్కల ప్రవాహాల నుంచి నీటిని సేకరించడానికి నిర్మించిన చిన్న చిన్న బావులు
- **ఖుల్స్:** హిమాచల్ ప్రదేశ్‌లో కొండవాలుల వెంబడి ప్రవహించే నీటి ప్రవాహాలను మళ్లించడానికి ఏర్పాటు చేసిన కాలువలు
- **గుల్స్:** హిమాచల్ ప్రదేశ్‌లో కొండవాలుల వెంబడి ప్రవహించే నీటి ప్రవాహాలను నేరుగా వ్యవసాయ క్షేత్రాలకు మళ్లించే కాలువలు
- **బౌడి:** హిమాచల్ ప్రదేశ్‌లోని హమీర్పూర్, కాంగ్రా, మండి జిల్లాల్లో కొండవాలుల వెంబడి ప్రవహించే నీటి ప్రవాహాలను సేకరించడానికి ప్రత్యేకంగా నిర్మించిన బావులు.
- **నాన్స్:** హిమాచల్ ప్రదేశ్‌లో తాగునీటి కోసం, ఇంటి అవసరాల కోసం నిర్మించిన బావులు.
- **ఖత్రి:** హిమాచల్ ప్రదేశ్‌లో కొండవాలుల వెంబడి ప్రవహించే వర్షపు నీటిని సేకరించడానికి రాళ్లతో నిర్మించిన బావులు
- **డిఘీ:** ఢిల్లీ ప్రాంతంలో నిర్మించిన చిన్న చిన్న బావులు లేదా కుంటలు
- **అహర్-పైన్స్:** అహర్- బిహార్‌లో వర్షపు నీటిని మళ్లించి నిల్వచేసేందుకు నిర్మించిన జలాశయాలు. పైన్స్-అహర్...జలాశయాల నుంచి నీటిని వ్యవసాయ క్షేత్రాలకు మళ్లించడానికి నిర్మించిన చిన్న చిన్న నీటిపారుదల కాలువలు.
- **అపతాని:** అరుణాచల్ ప్రదేశ్‌లో ఉపరితల, భూగర్భ జలాలను ఉపయోగించి వరి, చేపల పెంపకం చేపట్టడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక వసతులు
- **జబో/రుజా:** నాగాలాండ్‌లో వరద ప్రవాహాన్ని మళ్లించేందుకు ఏర్పాటు చేసిన కాలువలు.
- **చీవ్-ఓజిహి:** నాగాలాండ్‌లో కొండ వాలుల వెంబడి ప్రవహించే నీటి ప్రవాహాలను మళ్లించడానికి ఏర్పాటు చేసిన అతి పొడవైన వెదురు పైపుల కాలువలు.
- **తుయ్ ఖుర్:** మణిపూర్, మిజోరాంలలో ఉన్న నీటి బుగ్గలు
- **వెదురు డ్రిప్:** మేఘాలయాలో వాలుల వెంబడి ప్రవహించే నీటిని సేకరించి అత్యధిక దూరంలో ఉన్న వ్యవసాయ క్షేత్రాలకు నీటిని తీసుకెళ్లే వెదురు పైపులు.
- **డాంగ్స్:** అసోంలోని బోడో తెగలు ఉపయోగించే నీటి కుంటలు
- **గర్-దారా:** చుట్టుపక్కల ఉండే నీటి ప్రవాహాల నుంచి నీటిని సేకరించి నిల్వ ఉంచే అతిపెద్ద బావులు
- **డంగ్స్/జంపోయిస్:** పశ్చిమ బెంగాల్‌లోని జల్పాయిగురిలో వరి పొలాల కోసం ఏర్పాటు చేసిన నీటి కాలువలు
- **ఇనుండేషన్ ఛానెల్స్:** పశ్చిమ బెంగాల్‌లో వరద ప్రవాహాన్ని వ్యవసాయ క్షేత్రాలకు మళ్లించే కాలువలు.
- **పాట్:** మధ్యప్రదేశ్‌లోని బాబువ ప్రాంతంలో నీటి ప్రవాహాలను మళ్లించడానికి నిర్మించిన కట్టలు.
- **కటాస్/బందాస్:** ఒడిశాలో నిర్మించిన మట్టి ఆనకట్టలు
- **హవేలి:** మధ్యప్రదేశ్‌లోని వ్యవసాయ క్షేత్రాలలో నిర్మించిన మట్టి ఆనకట్టలు
- **కుయిస్/బెరీస్:** రాజస్థాన్‌లో వర్షపు నీటిని సేకరించేందుకు ఏర్పాటు చేసిన లోతైన గుంతలు
- **బావోరీస్/బెర్స్:** రాజస్థాన్‌లో ప్రధానంగా తాగునీటి కోసం ఏర్పాటు చేసిన బావులు
- **పార్:** రాజస్థాన్‌లో లోతైన గుంతలలో(బెరీస్) నిల్వ చేసిన నీటిని వాడుకునే ప్రాంతం
- **కుండ్స్/కుండీస్:** రాజస్థాన్‌లోని షాఖీ ప్రాంతంలో సాసర్ ఆకారపు పరివాహపు ప్రాంతాన్ని కలిగిన వలయాకారపు భూగర్భ బావులు
- **తలాబ్/నాడి:** రాజస్థాన్‌లోని జోద్‌పూర్ ప్రాంతంలోని గ్రామాలలో నిర్మించిన నీటి కుంటలు.
- **టంకాలు:** బికనీర్ ప్రాంతంలో గృహాలలో తాగునీటి కోసం సున్నపురాయితో నిర్మించే బావులు
- **బావోళి/బావడి:** రాజస్థాన్‌లో దిగుడు మెట్ల బావిని పోలిన నిర్మాణాలు. వీటినే 'వావ్' లేదా 'వారది' అని గుజరాత్‌లో పిలుస్తారు.
- **జోహాడ్స్:** రాజస్థాన్‌లో వాలుకు అనుగుణంగా మూడు వైపులా కట్టలు నిర్మించి ఒక వైపున నీరు ప్రవహించడానికి అనువుగా నిర్మించిన నిర్మాణాలు. వర్షపు నీరు భూమిలోనికి ఇంకడానికి ఈ నిర్మాణాలు ఉపయోగపడతాయి.
- **పాడ్, భాండారాలు:** మహారాష్ట్రలోని తపతి నది పరివాహక ప్రాంతంలో ఉన్నాయి. బందారా అంటే చిన్న వాగుల మీద అడ్డంగా కట్టిన కట్టలు. వాటి నుంచి కాలువలు తవ్వి, నీటిని వ్యవసాయ భూములకు తరలిస్తారు. ఈ వ్యవసాయ భూములను పాహాడ్స్ అంటారు.

నోట్: తమిళనాడు రాష్ట్రం మొట్ట మొదటి సారిగా వర్షపు నీటిని నిల్వ చేయటాన్ని చట్టంగా చేసింది.



వి.వెంకటరెడ్డి,
సీనియర్ ఫ్యాకల్టీ




పోటా పోటీ

ఒక ఊరి విదుర్ అనే గురువు ఉండేవాడు. అతడు జ్ఞానంలో దిట్ట. వందల మంది తన దగ్గర చదువుకుని ప్రయోజకులు అయ్యారు. ఎంతో మంది మెప్పు పొందారు. బిరుదులూ పొందారు. అయితే అతను సంపాదించుకున్న సొమ్ము తక్కువ. పొగడటం వల్ల అతను పడిపోయాడు. దీంతో తన రక్తసంబంధీకులే అతన్ని పొగిడి మెల్ల మెల్లగా డబ్బులు కాజేశారు. ఉన్న డబ్బులు పోవటంతో సన్యాసిగా మారాడు విదుర్.


సన్యాసిగా మారాడు. పైగా వయసు వచ్చింది. తన వాలకం చూసి ఇంట్లో వాళ్లు పట్టించుకోలేదు. దీంతో అడవికి వెళ్లాడు. తపస్సు చేసుకునేవాడు. ఒక రోజు తన చెంతకు ఇద్దరు మూర్ఖులు వచ్చారు. 'మీరే రక్ష' అనటంతో వారిరువురినీ తన శిష్యులుగా నియమించుకున్నాడు. జ్ఞానం బోధించేవాడు. అయినా వారికి ఎక్కేది కాదు. దీంతో వారిని తిట్టేవాడు గురువు. అయినా మూర్ఖులు పట్టించుకునేవారు కాదు. గురువే గొప్ప అనేవారు. దీంతో పొంగిపోయి విదుర్ తన శిష్యులను ఏమీ అనేవాడు కాదు.

గురువుకు మెల్లమెల్లగా కాళ్ల నొప్పులు మొదలయ్యాయి. నేను కాళ్లు పడతానంటూ ఇద్దరూ కొట్లాడుకున్నారు. మూర్ఖులు కాబట్టి తల బద్దలు కొట్టుకున్నారు. ఇది చూసిన గురువు 'ఇలా గొడవ పడవద్దు' అంటూ హితబోధ చేశాడు. ఒకడికి కుడికాలు, రెండోవాడికి ఎడమకాలు పట్టమని చెప్పాడు. ఇద్దరూ పోటాపోటీగా గురువు కాళ్లను పట్టేవారు. నొప్పులు పోయి హాయిగా విశ్రాంతి తీసుకునేవాడు గురువు. ఒక రోజు ఎడమకాలు పట్టేవాడు పనిమీద ఓ గ్రామానికి వెళ్లిపోయాడు. రెండోవాడు మాత్రం తన కుడికాలిని పట్టాడు. ఇంటికి వెళ్లిపోతున్న సమయంలో.. 'నాయనా.. ఎడమ కాలు కూడా పట్టు' అన్నాడు. మూర్ఖుడు కాబట్టి.. 'నేను వాడి కాలినెందుకు పట్టాలి?' అనడిగాడు. 'నీకు పుణ్యం ఉంటుంది నాయనా' అన్నాడు. ఎడమ కాలిమీద కోపంతో ఒక రాయి తీసుకుని వచ్చి గురువుగారి కాలిమీద వేశాడు. కాలు నొప్పితో విలవిల్లాడిపోయాడు. మరుసటి రోజు ఎడమకాలు పట్టే వ్యక్తి వచ్చాడు. ఆ రోజు కుడికాలు పట్టినవాడు రాలేదు. విషయం తెలుసుకున్న ఎడమ కాలు పట్టేవాడు ఇలా అన్నాడు. 'నేను అంత చేతకాని వాణ్ని అవుతానా? నేను తక్కువేం కాదు. వాడితో సమాన పోటీ ఉంటాను కదా' అని రాయితో కాలిమీద వేశాడు. కుడికాలి నొప్పితో విలవిల్లాడిపోయాడు. 'మీ పోటీ నా చావుకు వచ్చింది కదరా..' అని వారిని తరిమేశాడు అక్కడనుంచి. మూర్ఖులు పోటాపోటీగా పరిగెత్తుతూ వెళ్లిపోయారు. 'ఎవడిపాణం పోతుందో వీళ్ల వల్ల ' అనుకున్నాడు గురువు తన మనసులో!

ఎన్ని జంతువులు ఉన్నాయి



6 తేడాలను గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 248

9			5				8	3
6	5		3					
				4	1			
		6		1	2			
	4						6	
			6	9		1		
			9	3				
					4		1	7
3	2				6			8

సుడోకు - 247 సమాధానం

2	5	4	7	6	1	3	8	9
1	3	9	5	8	2	6	4	7
7	6	8	3	9	4	1	5	2
9	4	1	8	7	3	2	6	5
3	8	5	4	2	6	9	7	1
6	7	2	1	5	9	4	3	8
5	9	3	2	4	8	7	1	6
4	2	7	6	1	5	8	9	3
8	1	6	9	3	7	5	2	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.